www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆసీస్‌ను దంచికొట్టి..
దర్జాగా సెమీస్‌కు భారత్

11

రోహిత్ విధ్వంసక ఇన్నింగ్స్.. పడగొట్టిన అర్ష్‌దీప్, కుల్దీప్

టీ20 ప్రపంచకప్ సూపర్ 8లో కంగారూలపై భారత్ గెలుపు

జైత్రయాత్ర కొనసాగిస్తున్న భారత్.. టీ20 వరల్డ్‌కప్ సెమీఫైనల్స్‌కు దూసుకెళ్లింది. రోహిత్ శర్మ (41 బంతుల్లో 7 ఫోర్లు, 8 సిక్స్‌లతో 92) ఊచకోత, బౌలర్లు రాణించడంతో.. సూపర్ 8 చివరి మ్యాచ్‌లో ఆసీస్‌పై విజయం సాధించింది. సెమీస్‌లో ఇంగ్లండ్‌తో తలపడనుంది.



మంగళవారం | 25-6-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 70

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, కృష్ణపక్షం; తిథి: చవితి రా. 11.11 తదుపరి పంచమి; నక్షత్రం: శ్రవణం మ. 2.32 తదుపరి ధనిష్ఠ; వర్జ్యం: సా.6.17-7.47; దుర్ముహూర్తం: ఉ.8.23-9.15, రా.10.23 తదుపరి 11.06; అమృతఘడియలు: తె.3.18-4.48; రాహుకాలం: మ.3.00-4.30; సూర్యోదయం: 5.46; సూర్యాస్తమయం: 6.48

హైదరాబాద్ సిటీ *

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఎమర్జెన్సీ ఓ మచ్చ


ఆ చీకటి రోజులను మరోసారి చూడొద్దనే మా ప్రయత్నం

బాధ్యతాయుతమైన ప్రతిపక్షం అవసరం 2

ప్రమాణ స్వీకారానికి ముందు ప్రధాని మోదీ వ్యాఖ్య

దేశంలో గత పదేళ్లుగా అప్రకటిత అత్యవసర పరిస్థితి

కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ధ్వజం



ప్రమాణం అనంతరం సంతకం చేస్తున్న మోదీ

కొలువుదీరిన లోక్‌సభ

1. కొత్త పార్లమెంటు భవనంలో వేడుకగా కార్యక్రమం
1. తొలి రోజు 280 మంది సభ్యుల ప్రమాణం పూర్తి
1. విపక్షాల నిరసన సెగ.. నీట్‌పై నినాదాల హోరు
1. మోదీ ప్రమాణం వేళ రాజ్యాంగం చూపిన రాహుల్
1. ప్రొటెం స్పీకర్ ప్యానల్‌లోని ముగ్గురి వాకౌట్
1. భర్తృహరి నియామకాన్ని నిరసిస్తూ నిర్ణయం

అచ్చ తెలుగులో..

కిషన్‌రెడ్డి, సంజయ్, రామ్మోహన్, పెమ్మసాని సహా మాతృభాషలో 17 మంది ఎంపీల ప్రమాణం

పంచెకట్టుతో పార్లమెంటుకు హాజరైన కిషన్‌రెడ్డి

నేడు 15మంది తెలంగాణ ఎంపీల ప్రమాణం

న్యూఢిల్లీ, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ కొత్త భవనంలో 18వ లోక్‌సభ కొలువుదీరింది. ఈ భవనంలో లోక్‌సభ సభ్యుల ప్రమాణ స్వీకారం జరగడం ఇదే తొలిసారి. తొలుత ప్రొటెం స్పీకర్ భర్తృహరి మెహతాబ్‌తో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రమాణ స్వీకారం చేయించారు. సోమవారం ఉదయం 11 గంటలకు లోక్‌సభ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ప్రధాని నరేంద్ర మోదీ లోక్‌సభ లోపలికి వచ్చేటప్పుడు సభ్యులు నిలబడి కరతాళ ధ్వనులతో ఆహ్వానించారు. మోదీ అందరికీ అభివాదం చేస్తూ లోనికి చేరుకున్నారు. ఆ తర్వాత లోక్‌సభ సభ్యులతో ప్రొటెం స్పీకర్ ప్రమాణం చేయించారు. తొలుత లోక్‌సభ ప్యానెల్ చైర్‌పర్సన్లుగా రాధామోహన్ సింగ్, ఫగ్గన్ సింగ్ కులస్తే ప్రమాణం చేశారు. ఉదయం 11.07 నిమిషాలకు నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకారం జరిగింది. ఆ తర్వాత వరుసగా రాజ్‌నాథ్ సింగ్, అమిత్‌షా, నితిన్ గడ్కరీ, శివరాజ్ సింగ్ చౌహాన్, మనోహర్ లాల్, హెచ్‌డీ కుమారస్వామి, పీయూష్ గోయల్, ధర్మేంద్రప్రధాన్, జితిన్ రామ్ మాంఝీతోపాటు మిగిలిన

మిగతా 2వ పేజీలో...

భారీగా బదిలీలు

ఒకేసారి 40 మంది ఐఏఎస్‌లకు స్థానచలనం

ఇద్దరు ఐపీఎస్‌లు, ఒక ఐఎఫ్ఎస్, మరో నాన్‌క్యాడర్ కూడా!

ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శిగా సందీప్‌కుమార్ సుల్తానియా

ఆయనకే ప్లానింగ్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు

సాధారణ పరిపాలన శాఖ పూర్తిస్థాయి కార్యదర్శిగా సుదర్శన్‌రెడ్డి

జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఆమ్రపాలికి అదనపు బాధ్యతలు

అశోక్‌రెడ్డి, ఈవీ నర్సింహారెడ్డికి మళ్లీ కీలక బాధ్యతల అప్పగింత



ఆమ్రపాలి

హరిచందన

రోనాల్డ్‌రోస్

హైదరాబాద్, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం సోమవారం భారీస్థాయిలో 40 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేసింది. మరో ఇద్దరు ఐపీఎస్ అధికారులు, ఒక ఐఎఫ్ఎస్ అధికారి, ఒక నాన్-కేడర్ అధికారిని బదిలీ చేసి పోస్టింగులు ఇచ్చింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సోమవారం జీవో (నంబర్ 876) జారీ చేశారు. 1998 బ్యాచ్ సీనియర్ ఐఏఎస్, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిచ్చింది. ఆయనను ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శిగా నియమించింది. ప్రణాళిక శాఖ అదనపు బాధ్యతలు అప్పగించింది. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు మరో ముఖ్యకార్యదర్శిని నియమించే వరకూ ఆ బాధ్యతల్లో కొనసాగాలని ఆదేశించింది. హెచ్ఎండీఏ మెట్రోపాలిటన్ జాయింట్ కమిషనర్ ఆమ్రపాలికి.. జీహెచ్ఎంసీ కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించింది. కీలకమైన సాధారణ పరిపాలన(జీఏడీ) శాఖకు పూర్తిస్థాయి కార్యదర్శిగా సి.సుదర్శన్ రెడ్డిని నియమించింది. ఉద్యానవన శాఖ డైరెక్టర్‌గా ఉన్న కె.అశోక్‌రెడ్డిని బదిలీ చేసి, కీలకమైన వాటర్ బోర్డు ఎండీగా నియమించింది. గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా ఉన్న ఈవీ నర్సింహారెడ్డిని పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్‌గా నియమించింది. నాన్‌క్యాడర్ అధికారి, జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ పి.ఉపేందర్‌రెడ్డిని బదిలీ చేసి, జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్‌గా నియమించింది. అవినీతి నిరోధక సంస్థ జాయింట్ డైరెక్టర్-2 వైవీఎస్ సుధీంద్రను.. హైదరాబాద్ సిటీ టాస్క్‌ఫోర్స్ డీసీపీ పోస్టులో నియమించింది. వెయిటింగ్‌లో ఉన్న పి.సీతారామ్‌ను తెలంగాణ యాంటీ నార్కొటిక్ బ్యూరోలో ఎస్పీగా నియమించింది. వీరికి సంబంధించి హోంశాఖ ముఖ్యకార్యదర్శి జితేందర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

సమీకృత గురుకులాలు
కార్పొరేట్ తరహాలో!

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ.. అన్నీ ఒకేచోట

20-25 ఎకరాల్లో.. రూ.22 కోట్లతో నిర్మాణం

బోధన, బోధనేతర సిబ్బందికి క్వార్టర్లు

క్రీడా స్థలం, ఓపెన్ ఎయిర్ థియేటర్ 3

సీఎం పరిశీలనలో 2 డిజైన్లు.. త్వరలో ఆమోదం

పైలట్ ప్రాజెక్టు కింద కొడంగల్, మధిరలో ఏర్పాటు



రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. చిత్రంలో రాష్ట్ర ఎంపీలు

రక్షణ భూములివ్వండి!

రోడ్లు, ఫ్లైఓవర్లు, ఇతర మౌలిక వసతులకు అవసరం

మా 2,462 ఎకరాలను ఆర్‌సీఐ వాడుకుంటోంది

బదులుగా 2450 ఎకరాల భూములను ఇవ్వండి

వరంగల్ సైనిక్ స్కూల్ అనుమతి పునరుద్ధరించండి

రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌కు సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి

2.70 లక్షల ఇళ్లను మంజూరు చేయండి

కేంద్ర గృహనిర్మాణ శాఖ మంత్రి ఖట్టర్‌కు వినతి

నేడు కాంగ్రెస్ అగ్రనేతలతో రేవంత్ భేటీ

పీసీసీ అధ్యక్షుడు, నామినేటెడ్ పదవుల భర్తీ, మంత్రివర్గ విస్తరణపై చర్చించే అవకాశం

న్యూఢిల్లీ, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ తోపాటు నగరం చుట్టుపక్కల ప్రాంతాల్లో రహదారుల విస్తరణ, ఫ్లైఓవర్లు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకుగాను రక్షణశాఖ భూములను రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించాలని కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. రావిర్యాల గ్రామంలో తెలంగాణ ప్రభుత్వానికి చెందిన 2,462 ఎకరాల భూములను ఇమారత్ పరిశోధన కేంద్రం (ఆర్‌సీఐ) ఉపయోగించుకుంటున్నందున రక్షణశాఖ భూములు 2,450 ఎకరాలను తమకు బదలాయించాలని కోరారు. దీంతోపాటు వరంగల్ సైనిక్ స్కూల్‌కు అనుమతులు పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం రాజ్‌నాథ్‌తో 17 అశోకా రోడ్‌లోని ఆయన నివాసంలో సీఎం రేవంత్

మిగతా 13వ పేజీలో...

మారుమూల ప్రాంతాల్లో రోడ్లకు నిధులివ్వండి

కేంద్రమంత్రి చౌహాన్‌కు మంత్రి సీతక్క విజ్ఞప్తి

ఉప్పల్ ఫ్లై ఓవర్ టెండర్లు రద్దు

మంత్రి కోమటిరెడ్డికి వెల్లడించిన కేంద్ర మంత్రి గడ్కరీ

నీట్‌పై సిటింగ్ జడ్జి విచారణ జరపాలి: రేవంత్

1న రుణమాఫీకి శ్రీకారం!

ఆగస్టు 15లోపు పూర్తి చేసేలా నిర్ణయం

అగ్రికల్చర్ గోల్డ్ రుణాలు కూడా మాఫీ

పట్టణాల్లో తీసుకుంటే వర్తించదు 13

దాదాపుగా పాత మార్గదర్శకాలే అమలు

ఫిరాయింపులకు
కళ్లెం వేద్దాం!

అత్యంత సన్నిహితులూ పార్టీని వీడుతుండటంతో అప్రమత్తమైన బీఆర్ఎస్

ఎమ్మెల్యేల్లో భరోసా నింపేందుకు ఈ వారంలోనే అధినేత కేసీఆర్ సమావేశం

విదేశీ పర్యటన రద్దు చేసుకుని ముందుగానే రాష్ట్రానికి వస్తున్న ప్రశాంత్ రెడ్డి, పల్లా

ఫిరాయింపులపై సుప్రీంకు వెళ్లాలనే యోచన

పార్టీ మారేవారిని ప్రోత్సహించడం తగదు

అధికారం ఉందని విర్రవీగితే.. ప్రజల చేతిలో గుణపాఠం తప్పదు: కేటీఆర్

నేతన్నలవి ప్రభుత్వ హత్యలే..!

ఉపాధి లేక 6 నెలల్లో 10 మంది ఆత్మహత్య

అయినా ఆదుకోరా? సీఎంకు కేటీఆర్ లేఖ



హైదరాబాద్, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): అనూహ్యంగా అత్యంత సన్నిహితులు కూడా పార్టీని వీడుతున్నారు! మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ కాంగ్రెస్ కండువా కప్పుకొన్నారు! ఇప్పటికే ఐదుగురు పార్టీని వీడగా.. మరికొందరు కూడా పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరతారనే ప్రచారం జోరుగా సాగుతోంది! దాదాపు 20 మందికిపైగా పేర్లు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి! అసెంబ్లీ ఎన్నికల్లో అధికారాన్ని కోల్పోవడంతోపాటు లోక్‌సభ ఎన్నికల్లో

మిగతా 12వ పేజీలో...



ఏపీ మంత్రివర్గ సమావేశానికి వెళ్తున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్

ఏపీలో హామీల అమలు

'తొలి సంతకం' చేసిన 5 అంశాల అమలు

పెంచిన పింఛన్ జూలై 1 నుంచి

సచివాలయ ఉద్యోగుల ద్వారా ఇంటి వద్దకే

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుకు ఆమోదం

తొలి దశలో 203 అన్న క్యాంటీన్లు

ఇక ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీనే

గంజాయిపై ఉక్కుపాదం

ఐదుగురు మంత్రులతో కమిటీ

ఏడు అంశాలపై శ్వేత పత్రాల విడుదల

అమరావతి, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): ఏపీలో కొలువు దీరిన కూటమి ప్రభుత్వం హామీల అమలుకు శ్రీకారం చుట్టింది. మెగా డీఎస్సీ, సామాజిక పింఛను రూ.4వేలకు పెంపు, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, నైపుణ్య గణన ఇలా ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు స్వీకరించిన వెంటనే పెట్టిన 'ఐదు తొలి సంతకాల' అమలుకు రంగం సిద్ధమైంది. సోమవారం చంద్రబాబు అధ్యక్షన కూటమి సర్కారు తొలి క్యాబినెట్ సమావేశం జరిగింది. ఈ భేటీలోనే కీలక నిర్ణయాలపై ఆమోదముద్ర పడింది. జగన్ హయాంలో

మిగతా 14వ పేజీలో...

అయోధ్య రామాలయం
పైకప్పు లీక్

సీజన్‌లో తొలి భారీవర్షానికే గర్భగుడిలోకి నీరు

రామ్ లల్లా ఎదుట.. పూజారి కూర్చునే చోట లీక్

ఆలయ ప్రాంగణంలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేదు


అందుకే నీరు నిలుస్తోంది..: ప్రధాన పూజారి

గుడికి వెళ్లే పదమూడు రోడ్లూ జలదిగ్బంధంలోనే

ఆ రహదారుల్లోని ఇళ్లలోకి చేరిన మురుగునీరు

అయోధ్యను 'అవినీతిహబ్'గా మార్చిన బీజేపీ

అధికార పార్టీపై మండిపడ్డ యూపీ కాంగ్రెస్



అయోధ్య, జూన్ 24: అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన అయోధ్య రామాలయం గర్భగుడి పైకప్పు.. ఆర్నెల్లయినా కాకముందే.. కురిసిన తొలి భారీ వర్షానికే లీక్ అవుతోంది! శనివారం అర్ధరాత్రి అయోధ్యలో కురిసిన కుండపోత కారణంగా నీరు కారుతోందని ఆలయ ప్రధాన పూజారి ఆచార్య సత్యేంద్ర దాస్ సోమవారం తెలిపారు. రామ్‌లల్లా ముందు పూజారి కూర్చునే స్థలంలో, వీఐపీలు దర్శనం చేసుకునే స్థలంలో నీరు లీక్ అవుతున్నట్టు ఆయన వివరించారు. వానలు ఇలాగే భారీగా కురుస్తుంటే లోపల కూర్చుని పూజ చేయడం కూడా కష్టమేనని ఆందోళన వ్యక్తం చేశారు. "ఇది చాలా ఆశ్చర్యంగా ఉంది. దేశం నలుమూలల నుంచీ ఇంజనీర్లు వచ్చి రామాలయాన్ని

మిగతా 2వ పేజీలో...

నీట్‌ను రద్దుచేయండి

మెడిసిన్ ప్రవేశాలను రాష్ట్రాలకివ్వండి

ప్రధాని మోదీకి మమత లేఖ 2

నీట్ షేమ్.. నీట్ షేమ్

ప్రధాని ప్రమాణంలో విపక్షాల నినాదాలు

నీట్‌పై కేంద్రానిది అసమర్థత: కేటీఆర్

ప్రెస్ నుంచే యూపీ ఆర్వో పేపర్ లీక్



జీవన్‌రెడ్డి కినుక

సంజయ్‌కుమార్ చేరికపై అలక

రాజీనామాకు సిద్ధమంటూ ప్రచారం

ఆయన నివాసానికి మంత్రి దుద్దిళ్ల 12

చేరికల వేళ కొంత సమన్వయ లోపం

మీ ప్రాధాన్యం తగ్గదని మంత్రి హామీ

పార్టీ నిర్ణయానికి కట్టుబడతా: జీవన్‌రెడ్డి

గంజాయి బ్యాచ్..
బాలికపై గ్యాంగ్ రేప్

కూలీ పనులకు తల్లి.. ఇంట్లో ఆమె ఒక్కతే

ఫోన్ ద్వారా పరిచయమైన ఓ యువకుడు

తర్వాత నలుగురు.. వీరి ద్వారా మత్తులోకి

సామూహిక అత్యాచారం.. బాలికకు గర్భం

కాచిగూడలో ఘటన.. ఐదుగురిపై పోక్సోకేసు



మా సమస్యలపై సర్కారు
ఆటలాడుతోంది

సమ్మె కొనసాగిస్తాం: జూడాలు

సీఎం రేవంత్ స్పందించాలి

సమస్యలను పరిష్కరించాలి

లేదంటే అత్యవసర సేవలూ నిలిపేస్తామని హెచ్చరిక 13

ఇంటర్ సప్లిమెంటరీలో
63% ఉత్తీర్ణత!

29 వరకు రీకౌంటింగ్ దరఖాస్తుల స్వీకరణ

13

కొలువుదీరిన లోక్‌సభ

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర మంత్రులతో ప్రమాణ స్వీకారం చేయించారు. 12.02 నిమిషాల వరకు కేంద్ర మంత్రులు, ఆ తర్వాత సహాయ మంత్రులు ప్రమాణ స్వీకారం చేశారు.

నేడు 264 మంది ప్రమాణం

లోక్‌సభలో 543 మంది సభ్యులుండగా తొలిరోజు 280 మంది ప్రమాణం చేశారు. మిగతా సభ్యులు మంగళవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 25 మంది ఎంపీలు మొదటిరోజే ప్రమాణ స్వీకారం చేయగా, తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ మినహా.. మిగతా వారు, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్, ఆ పార్టీ కీలక నాయకుల ప్రమాణ స్వీకార కార్యక్రమం మంగళవారం జరగనుంది. అదేవిధంగా.. కేరళలోని వయనాడ్ లోక్‌సభకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రాజీనామాను ఆమోదిస్తున్నట్లు భర్తృహరి మహతాబ్ ప్రకటించారు. దీంతో లోక్‌సభలో కాంగ్రెస్ పార్టీ బలం 99కి తగ్గింది.

తొలిరోజే నిరసన సెగ

విపక్ష కూటమి 'ఇండియా' నేతలు తొలిరోజే తమ ఐకమత్యాన్ని చాటుకునే ప్రయత్నం చేశారు. లోక్‌సభలో తమకు కేటాయించిన చోట ముందు వరసలోనూ కూటమి పార్టీల నేతలు కూర్చున్నారు. తొలుత వారంతా పార్లమెంట్ ఆవరణలోని గాంధీ విగ్రహం వద్దకు చేరుకున్నారు. రాజ్యాంగ ప్రతులను చేతబట్టుకుని, లోక్‌సభకు కలిసి వెళ్లారు. ప్రధాని మోదీ ప్రమాణ స్వీకారం సమయంలో రాహుల్‌గాంధీ సహా.. ఇండియా కూటమి నేతలు రాజ్యాంగ ప్రతులను గాల్లోకి ఊపారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రమాణ స్వీకార సమయంలో.. "నీట్.. నెట్".. "నీట్ షేమ్" అంటూ నినాదాలు చేశారు. నీట్ అక్రమాలపై చర్చించాలని ప్రతిపక్ష సభ్యులు పట్టుపట్టారు. మరోవైపు.. ప్రొటెం స్పీకర్‌గా పార్లమెంట్‌కు ఎక్కువ సార్లు ఎన్నికైన వారికి అవకాశమివ్వాలి. అయితే.. సీనియర్ ఎంపీలున్నా.. బీజేపీ ఉద్దేశపూర్వకంగా భర్తృహరి మెహతాబ్‌ను నియమించడంపై ముందు నుంచి ఇండియా కూటమి అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. ఈ క్రమంలో.. ప్రొటెం స్పీకర్ ప్యానెల్‌లో నియమితులైన కాంగ్రెస్ సభ్యుడు కొడికున్నిల్ సురేశ్, డీఎంకే సభ్యుడు టీఆర్ బాలు, తృణమూల్ ఎంపీ సుదీప్ బంధోపాధ్యాయ్.. భర్తృహరి నియామకాన్ని నిరసిస్తూ వాకౌట్ చేశారు. ఇండియా కూటమి నేతలు ప్రొటెం స్పీకర్ నియామక తీరు రాజ్యాంగ ఉల్లంఘనే నంటూ నిరసన తెలిపారు. భర్తృహరి కంటే.. కాంగ్రెస్ ఎంపీ కె.సురేశ్ సీనియర్ అని వివరించారు. దళితుడైనందువల్లే సురేశ్‌కు అవకాశమివ్వలేదని ఆరోపించారు.

విభిన్న భాషలు.. సంప్రదాయ దుస్తులు

లోక్‌సభ సభ్యులు ఇంగ్లిష్‌తోపాటు.. సంస్కృతం, హిందీ, డోగ్రీ, తెలుగు, బెంగాలీ, అస్సామీ, ఒడియా భాషల్లో ప్రమాణ స్వీకారం చేశారు. కేంద్ర మంత్రులు అమిత్‌షా, రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరీ, అన్నపూర్ణాదేవి, జ్యోతిరాదిత్య సింధియాలు హిందీలో.. రామ్మోహన్‌నాయుడు, కిషన్‌రెడ్డి తెలుగులో, సురేశ్‌గోపీ మలయాళంలో, మురళీధర్ మహోల్ మరాఠీలో.. హెచ్‌డీ కుమారస్వామి కన్నడలో.. ఇలా వేర్వేరు భాషల్లో ప్రమాణం చేశారు. నటుడు, ఎంపీ రవికిషన్ ధోవతి, కుర్తాలో లోక్‌సభకు రాగా.. నటి కంగనా రనౌత్ తెల్ల చీరకట్టులో, మధ్యప్రదేశ్‌లోని రత్లాం నుంచి ఎన్నికైన అనితాచౌహాన్ సంప్రదాయ దుస్తుల్లో హాజరయ్యారు.

రేపు లోక్‌సభ స్పీకర్ ఎన్నిక

లోక్‌సభ స్పీకర్ ఎన్నిక బుధవారం జరగనుంది. సహజంగా అధికార పక్షానికి చెందిన ఎంపీకి స్పీకర్ పదవి, ప్రతిపక్షాలకు చెందిన అభ్యర్థికి ఉపాధ్యక్ష పదవి(డిప్యూటీ స్పీకర్) పదవి ఇవ్వాలనే ఆనవాయితీ కొనసాగుతోంది. అందుకే.. ఈ సారి ప్రతిపక్షాలకు ఇచ్చే ఉపసభాపతి పదవి తమకు ఇవ్వాలని ఇండియా కూటమి డిమాండ్ చేస్తోంది. అదే విధంగా ఈనెల 27న ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగించనున్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ప్రతిస్పందనగా ప్రధాని మోదీ జూలై 2న లోక్‌సభలో, 3న రాజ్యసభలో ప్రసంగిస్తారు.

లోకం తీరు





వీర నారులం మళ్లొచ్చాం

పార్లమెంటు సమావేశాల సందర్భంగా ఇండియా కూటమికి చెందిన మహిళా ఎంపీలు ఇలా ఓ ఫొటోకు పోజిచ్చారు. వీరిలో టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా, సమాజ్‌వాదీ ఎంపీ డింపుల్ యాదవ్, ఎన్సీపీ ఎంపీ సుప్రియా సూలే, డీఎంకే ఎంపీలు కనిమొళి, థామీజచీ, కాంగ్రెస్ ఎంపీ జ్యోతి మణి ఉన్నారు. ది వారియర్స్ ఆర్ బ్యాక్ అంటూ మహువా ఈ చిత్రాన్ని ట్వీట్ చేశారు.

15 రోజుల్లో 10 వైఫల్యాలు

» మోదీ సర్కారుపై రాహుల్ ధ్వజం

న్యూఢిల్లీ, జూన్ 24: అధికారం చేపట్టిన మొదటి 15 రోజుల్లోనే మోదీ సర్కారు వైఫల్యాలను చవిచూసిందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విమర్శించారు. ఉగ్రవాదుల దాడుల నుంచి ఘోర రైలు ప్రమాదాల వరకు పది వైఫల్యాలు చోటు చేసుకున్నాయని తెలిపారు. 18వ లోక్‌సభ మొదటి సమావేశం, మొదటి రోజు సందర్భంగా వీటన్నింటినీ పేర్కొంటూ ట్వీట్ చేశారు. "1.ఘోర రైలు ప్రమాదం, 2. కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడి, 3. రైళ్లలో ప్రయాణికుల దుస్థితి, 4. నీట్ కుంభకోణం, 5, నీట్-పీజీ రద్దు, 6. యూజీసీ నెట్ పేపర్ లీక్, 7. ప్రియంగా మారిన పాలు, పప్పులు, గ్యాస్, టోల్ ట్యాక్సుల రేట్లు, 8. అడవుల్లో కార్చిచ్చు, 9. నీటి సమస్య, 10. తగిన ఏర్పాట్లు చేయని కారణంగా వడదెబ్బతో మరణాలు" అంటూ వైఫల్యాలు, సమస్యలను ప్రస్తావించారు. ప్రస్తుతం మానసికంగా వెనకడుగు వేసిన మోదీ.. ప్రభుత్వాన్ని కాపాడుకోవడంలో బిజీగా ఉన్నారని విమర్శించారు.

సరోగసీ చేయించుకున్నా మాతృత్వ సెలవులు

న్యూఢిల్లీ, జూన్ 24: మహిళా ఉద్యోగులకు మేలు కలిగించేలా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకొంది. సరోగసీ విధానం ద్వారా సంతానం పొందే మహిళలకు కూడా ఆరు నెలల మాతృత్వ సెలవులు మంజూరు చేసింది. వారు 180 రోజుల పాటు మెటర్నిటీ లీవ్ తీసుకోవచ్చని ప్రకటించింది. వేరే వారి తరఫున అద్దె గర్భం దాల్చే మహిళ('సరోగేట్ మదర్')కు, తన పిండాన్ని ఆ మహిళకు ఇచ్చి సంతానాన్ని పొందాలనే ప్రయత్నించే మహిళ ('కమిషనింగ్ మదర్')కు కూడా ఈ సౌకర్యం వర్తిస్తుంది. ఒకవేళ సంతానం పొందాలనుకునే మహిళ భర్త ప్రభుత్వ ఉద్యోగి అయితే ఆయనకు కూడా 15 రోజుల పాటు పితృత్వ సెలవు ఇస్తుంది. బిడ్డ జన్మించిన నాటి నుంచి ఆరు నెలల్లోగా ఆయన ఈ పెటర్నిటీ లీవ్‌ను ఉపయోగించుకోవచ్చు. అయితే ఇద్దరు పిల్లలకన్నా తక్కువ మంది సంతానం ఉన్నప్పుడు మాత్రమే వీరిందరికీ ఈ సెలవులు వర్తిస్తాయి. ఈ మేరకు సెంట్రల్ సివిల్ సర్వీసెస్ (లీవ్) రూల్స్-1972ను సవరిస్తూ ఈ నెల 18న నోటిఫికేషన్ జారీ చేసింది. సరోగసీ విషయమై ఇంతవరకు ఎలాంటి నిబంధనలు లేకపోవడంతో కేంద్ర ప్రభుత్వం కొత్తగా వీటిని రూపొందించింది.

కేరళ కాదు 'కేరళం'

» పేరు మార్చాలంటూ అసెంబ్లీలో తీర్మానం

తిరువనంతపురం, జూన్ 24: కేరళ పేరును 'కేరళం'గా మార్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ సోమవారం అసెంబ్లీ ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని అధికారపక్ష యూడీఎఫ్‌తో పాటు ప్రతిపక్ష కాంగ్రెస్ మద్దతు తెలిపాయి. మలయాళం భాషలో కేరళను 'కేరళం' అని పిలుస్తారని, దాన్నే ఖరారు చేస్తూ రాజ్యాంగ సవరణ చేయాలని కోరుతూ ఈ తీర్మానాన్ని ఆమోదించారు. రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూలులో పేర్కొన్న అన్ని భాషల్లోనూ ఈ పేరే రాసేవిధంగా సవరణలు చేయాలని కోరారు.

కులగణనకు అసెంబ్లీలో తీర్మానం చేస్తాం: స్టాలిన్

చెన్నై, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం కులాల వారీగా జనగణన చేపట్టాలని కోరుతూ అసెంబ్లీలో తీర్మానం చేస్తామని తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా సోమవారం ప్రశ్నోత్తరాల సమయంలో విపక్ష సభ్యుడు జీకే మణి మాట్లాడుతూ, రాష్ట్రంలో కులాల వారీగా జనాభా లెక్కలను చేపట్టాలని కోరారు. దీనికి ముఖ్యమంత్రి స్పందిస్తూ.. ఇప్పటికే బీహార్ వంటి రాష్ట్రాల్లో ఈ తరహా కులగణన చేపట్టగా, దాన్ని సుప్రీంకోర్టు కొట్టివేసిందని గుర్తుచేశారు. ఈ సమస్యకు పరిష్కారం లభించాలంటే కేంద్ర ప్రభుత్వమే తక్షణం కులగణన చేపట్టాలని కోరారు.

కేజ్రీవాల్‌కు సుప్రీం కోర్టులో నిరాశ

న్యూఢిల్లీ, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టయి తిహాడ్ జైలులో ఉన్న సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టులో నిరాశ ఎదురయింది. ఆయన బెయిల్‌పై ఎలాంటి నిర్ణయాన్ని వెలువరించలేదు. ఈ కేసులో ట్రయల్ కోర్టు తనకు ఇచ్చిన బెయిల్‌పై ఢిల్లీ హైకోర్టు మధ్యంతర స్టే విధించడాన్ని సవాల్ చేస్తూ ఆయన సుప్రీంకోర్టులో అప్పీలు చేశారు. ఈ పిటిషన్‌పై మంగళవారం జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ ఎస్వీఎన్ భట్టిలతో కూడిన వెకేషన్ బెంచ్ విచారణ చేపట్టింది. హైకోర్టు స్టే విధించిన తీరు అసాధారణంగా ఉందని అయితే, ఈ దశలో ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేమని ధర్మాసనం పేర్కొంది. హైకోర్టు తీర్పు కోసం మరో రోజు వేచి చూద్దామని తెలిపింది. విచారణను బుధవారానికి వాయిదా వేసింది. మరోవైపు కేజ్రీవాల్‌కు బెయిల్ ఇవ్వకుండా స్టే ఇవ్వాలంటూ ఈడీ చేసిన వినతిపై మంగళవారం హైకోర్టు నిర్ణయాన్ని వెలువరించనుంది.

1,300 దాటిన హజ్ మృతుల సంఖ్య

కైరో, జూన్ 24: ఈ ఏడాది హజ్ యాత్రలో మృతిచెందిన వారి సంఖ్య 1,300 దాటినట్లు సౌదీ అధికార వర్గాలు ఆదివారం ప్రకటించాయి. అధిక ఉష్ణోగ్రతలు, వడగాలుల వల్లే ఈ మరణాలు సంభవించినట్లు పేర్కొన్నాయి. చనిపోయిన వారికి సంప్రదాయం ప్రకారం మక్కాలో అంత్యక్రియలు నిర్వహించామని సౌదీ ఆరోగ్య మంత్రి ఫహద్ బిన్ అబ్దురహ్మాన్ అల్ జలజిల్ పేర్కొన్నారు. కొంతమంది భక్తులు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని చెప్పారు. ఎలాంటి పత్రాలు లేకపోవడం వల్ల మృతుల గుర్తింపు ప్రక్రియ ఆలస్యమవుతోందని వివరించారు.

ఇక బీజేపీకి మద్దతివ్వం: బీజేడీ

భువనేశ్వర్, జూన్ 24: బీజేపీకి ఇక మద్దతిచ్చే ప్రసక్తే లేదని బిజూ జనతాదళ్ (బీజేడీ) అధ్యక్షుడు, మాజీ సీఎం నవీన్ పట్నాయక్ స్పష్టంచేశారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో బీజేడీ పరాజయం పాలైన సంగతి తెలిసిందే. అలాగే రాష్ట్రంలోని 21 ఎంపీ స్థానాలకు గాను ఒక్కటీ గెలవలేకపోయింది. అయితే రాజ్యసభలో మాత్రం ఆ పార్టీకి 9 మంది ఎంపీలు ఉన్నారు. వీరితో నవీన్ సోమవారమిక్కడ సమావేశమయ్యారు. ఎగువ సభలో గట్టి ప్రతిపక్షంగా మారాలని వారిని ఆదేశించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం గళమెత్తాలని సూచించారు. భేటీ తర్వాత రాజ్యసభలో బీజేడీ నేత సస్మిత్ పాత్రా విలేకరులతో మాట్లాడారు. గతంలో బీజేపీకి అంశాలవారీగా మద్దతిచ్చామని.. ఈసారి మాత్రమే పూర్తిగా వ్యతిరేకిస్తామని స్పష్టం చేశారు.

ఎమర్జెన్సీ ఓ మచ్చ

ఆ చీకటి రోజులను మళ్లీ చూడకూడదనేదే మా ప్రయత్నం

» ప్రమాణానికి ముందు ప్రధాని మోదీ

» గత పదేళ్లూ అప్రకటిత ఎమర్జెన్సీనే: ఖర్గే

న్యూఢిల్లీ, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): "ఇందిరా గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం దేశంలో ఎమర్జెన్సీని విధించి మంగళవారంతో 50 ఏళ్లు పూర్తవుతుంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎమర్జెన్సీ ఓ మచ్చ. అప్పట్లో ఎంతోమందిని అన్యాయంగా జైళ్లలో వేశారు. అలాంటి చీకటి రోజులను మళ్లీ చూడకూడదనేది మా ప్రయత్నం" అని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. 18వ లోక్‌సభ సమావేశాల ప్రారంభం సందర్భంగా సోమవారం ఉదయం పార్లమెంట్‌కు చేరుకున్న మోదీకి కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మోదీ మీడియాతో మాట్లాడారు. ప్రజలు తమ విధానాలను విశ్వసించారని, దేశానికి మూడోసారి సేవ చేసే అదృష్టాన్ని కల్పించారని అంటూనే అందుకు ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. సరికొత్త విశ్వాసంతో తాజాగా సమావేశాలను ప్రారంభిస్తున్నామని, ఈ ఐదేళ్లపాటు రాజ్యాంగాన్ని గౌరవిస్తూ నిర్ణయాలు తీసుకుంటామని స్పష్టం చేశారు. స్వాతంత్ర్యానంతరం వరుసగా మూడోసారి ప్రజలకు సేవ చేసే అవకాశం దక్కడం గొప్ప విషయమని, దేశ చరిత్రలో ఇది రెండోసారి మాత్రమేనని, 60 ఏళ్ల తర్వాత మళ్లీ అటువంటి అవకాశం దక్కిందని సంతోషం వ్యక్తం చేశారు. ఇది చాలా పవిత్రమైన రోజని, కొత్త ఆశలు, కొత్త ఉత్సాహంతో ముందుకు సాగాలని సభ్యులకు సూచించారు. కొత్తగా ఎన్నికైన సభ్యులకు ఆయన స్వాగతం పలికారు.

బాధ్యతాయుతమైన విపక్షం అవసరం

ప్రజల తీర్పుతో తమ బాధ్యతలు మూడు రెట్లు పెరిగాయని, మూడోసారి మూడు రెట్లు ఎక్కువగా పని చేస్తామని ప్రజలకు హామీ ఇస్తున్నానని మోదీ తెలిపారు. ప్రజలు మంచి, బాధ్యతాయుతమైన ప్రతిపక్షాన్ని కోరుకుంటున్నారని అన్నారు. గతంలో ప్రతిపక్షాల తీరు నిరాశపరిచిందని, ఈసారి ప్రజాస్వామ్య మర్యాదను కాపాడేలా, సామాన్య పౌరుల ఆకాంక్షలకు అనుగుణంగా అవి నడుచుకుంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు. సభ్యులందరినీ కలుపుకొని 2047 వికసిత భారత్ సంకల్పంతో ముందుకెళతామని, ఆ లక్ష్యాన్ని నెరవేర్చే దిశగా ముందుకు సాగుతామని తెలిపారు. కొత్త లక్ష్యాలు నిర్దేశించుకుని ముందుకెళదామని సభ్యులకు సూచించారు. 18వ లోక్‌సభ తీర్మానాల సభగా మారుతుందని, సామాన్య పౌరుల కలలను సాకారం చేస్తుందని అన్నారు.



పార్లమెంటు ఆవరణలో మీడియాతో మాట్లాడుతున్న ప్రధాని మోదీ

గత పదేళ్లుగా అప్రకటిత ఎమర్జెన్సీ:ఖర్గే

ప్రధాని మోదీ 50 ఏళ్ల కిందటి ఎమర్జెన్సీ గురించి ఇప్పుడు మాట్లాడుతున్నారని, కానీ, గత పదేళ్లలో అప్రకటిత ఎమర్జెన్సీ గురించి ఆయన మర్చిపోయారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే మండిపడ్డారు. నీట్ ఆందోళనలు, పశ్చిమ బెంగాల్లో రైలు ప్రమాదం, మణిపూర్‌లో కొనసాగుతున్న అశాంతిపై ఆయన మాట్లాడాలని దేశం కోరుకుంటోందని వ్యాఖ్యానించారు. మోదీకి వ్యతిరేకంగా ప్రజలు తీర్పు ఇచ్చారని అన్నారు. పార్లమెంటు లోపల, బయట ప్రజల గళాన్ని వినిపిస్తూనే ఉంటామన్నారు.

రాజ్యసభ సభా నాయకుడిగా నడ్డా

బీజేపీ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర ఆరోగ్య మంత్రి జగత్‌ప్రకాశ్ నడ్డా రాజ్యసభలో సభానాయకుడిగా నియమితులయ్యారు. ఇప్పటివరకు కొనసాగిన కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ స్థానంలో ఆయన్ను నియమించారు. 2020లో అమిత్‌షా నుంచి పార్టీ పగ్గాలు స్వీకరించిన నడ్డాను.. ప్రధాని మోదీ తన కేబినెట్‌లోకి తీసుకోవడంతో బీజేపీ అధ్యక్ష పదవికి ఆయన రాజీనామా చేస్తారని అంతా భావించారు. అయితే ఇప్పుడప్పుడే ఆయన వైదొలిగే అవకాశాలు కనిపించడం లేదు. పార్టీ అధ్యక్ష పదవికి ఎన్నిక జరగాలంటే.. కనీసం నగం రాష్ట్రాల్లో సంస్థాగత ఎన్నికలు పూర్తికావలసి ఉంటుంది. సంస్థాగత ఎన్నికలు పూర్తికావడానికి ఎంతలేదన్నా ఆరు నెలలు పట్టే అవకాశం ఉంది. అప్పటిదాకా నడ్డానే కొనసాగిస్తారని తెలుస్తోంది.

రష్యాలో ఉగ్రదాడి

» 20 మంది దుర్మరణం

» ఐదుగురు దుండగులు కాల్చివేత

మాస్కో, జూన్ 24: రష్యాలో ఉగ్రవాదులు అధునాతన ఆయుధాలతో విరుచుకుపడ్డారు. ముసుగులు ధరించిన దుండగులు ఆదివారం రాత్రి ఉత్తర కాకసస్ రీజియన్‌లోని డాగెస్థాన్ నగరంలో రెండు చర్చిలు, యూదులకు చెందిన ఐదు ప్రార్థన మందిరాలు, ఒక పోలీసు పోస్టు లక్ష్యంగా కాల్పులకు తెగబడ్డారు. ఈ కాల్పుల్లో 15 మంది పోలీసులు, ఒక చర్చి ఫాదర్ సహా.. 20 మంది మృతి చెందారు. చర్చిలోకి చొరబడ్డ దుండగులు ఫాదర్ నికోలేని గొంతు కోసి చంపారని, మరో నలుగురిని కాల్చివేశారని పోలీసులు వివరించారు. మృతుల్లో డాగెస్థాన్ నగర అంతర్గత భద్రత విభాగం చీఫ్ మాష్లదిన్ ఖిదిర్నాబియేవ్ కూడా ఉన్నట్లు తెలిపారు. 20 మంది పోలీసులు సహా 40 మంది గాయపడ్డట్లు వివరించారు. భద్రతా బలగాలు వెంటనే కౌంటర్ ఆపరేషన్‌ను ప్రారంభించి, ఐదుగురు ఉగ్రవాదులను మట్టుబెట్టినట్లు వెల్లడించారు.

నిందితుల్లో అధికారి కుటుంబం

ఉగ్రవాదుల్లో డాగెస్థాన్ మునిసిపల్ అధికారి మాగొమెడ్ ఒమరోవ్ కుటుంబ సభ్యులు ముగ్గురు ఉన్నట్లు నిర్ధారించారు. వారిలో మాగొమెడ్ కుమారులు ఉస్మాన్ ఒమరోవ్, ఆదిల్ ఒమరోవ్, మేనల్లుడు ఉన్నట్లు గుర్తించారు. మాగొమెడ్ ఇంట్లో సోదాలు నిర్వహించామని, అతణ్ని అరెస్టు చేశామని చెప్పారు.

దాడిలో పోలీసు అధికారి కారు?

ఉగ్రవాదులు వినియోగించిన కారు(ఎన్‌వో75 యూటీ05)షామిల్ ఇబ్రాగిమోవ్ అనే పోలీసు అధికారిపేరిట రిజిస్టరై ఉందని, అతను సెంటర్ ఫర్ కాంబాటింగ్ టెర్రరిజంలో పనిచేస్తారని గుర్తించారు.

అయోధ్య ఆలయం పైకప్పు లీక్

(మొదటి పేజీ తరువాయి)

నిర్మిస్తున్నారు. జనవరి 22న ఆలయాన్ని ప్రారంభించేశారు. కానీ.. భారీ వర్షం కురిస్తే పైకప్పు కారుతుందని ఎవరికీ తెలియదు. ప్రపంచప్రఖ్యాతి గాంచిన ఒక ఆలయం పైకప్పు లీక్ అవడం చాలా ఆశ్చర్యకరం. ఇలా ఎందుకు జరుగుతోంది?" అని ఆయన ఆవేదన వెలిబుచ్చారు. అంతమంది పెద్ద ఇంజనీర్ల సమక్షంలో ఇలా జరగడమేంటని నిలదీశారు. ఆలయ నిర్మాణంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని.. గుడి ప్రాంగణంలోకి చేరిన నీరు బయటకు వెళ్లే మార్గం కూడా లేకుండా నిర్మించారని సత్యేంద్రదాస్ ఆరోపించారు. ఈ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆలయ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ విషయం తెలియగానే.. అయోధ్య రామాలయ నిర్మాణ కమిటీ చైర్మన్ నృపేంద్ర మిశ్రా అక్కడికి చేరుకున్నారు. కారుతున్న పైకప్పును పరిశీలించి.. వెంటనే మరమ్మతులు చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. "మొదటి అంతస్తు నుంచి నీరు కారుతోంది. పైనున్న గురుమండపానికి ఎలాంటి ఆచ్ఛాదనా లేకపోవడమే దీనికి కారణం. రెండో అంతస్తు, శిఖర నిర్మాణం పూర్తయితే గురు మండపంలోకి వర్షపు నీరు రాదు" అని ఆయన వివరించారు. ఆలయ నిర్మాణం ఇంకా పూర్తి కాలేదని, మొదటి అంతస్తు నిర్మాణం కొనసాగుతోందని.. జూలై నాటికి మొదటి అంతస్తు, డిసెంబరు నాటికి మొత్తం నిర్మాణం పూర్తవుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా.. ఆలయంలోనే కాదు, శనివారం రాత్రి కురిసిన భారీ వానతో.. రామాలయానికి వెళ్లే 13 రహదారుల్లో నీరు నిలిచిపోయింది. దీంతో ఆ ప్రాంతంలోని ఇళ్లల్లోకి మురుగునీరు ప్రవేశించింది. మోదీ సర్కారు ఎంతో గొప్పగా చెప్పుకొంటున్న అయోధ్య రామాలయం ఒక్క వర్షానికే లీక్ కావడంపై కాంగ్రెస్ స్పందించింది. అధికారంలో ఉన్న బీజేపీ.. ఆలయ నిర్మాణంలో అవినీతికి పాల్పడడమే ఇందుకు కారణమని ఆరోపించింది. ఎన్నికల్లో ప్రయోజనం కోసం నాసిరకంగా కట్టిన కట్టడాలతో అయోధ్యను బీజేపీ 'అవినీతి హబ్'గా మార్చిందని యూపీ కాంగ్రెస్ చీఫ్ అజయ్‌రాయ్ మండిపడ్డారు.

నీట్ దర్యాప్తులో సీబీఐ జోరు

మూడు రాష్ట్రాల్లో నమోదైన ఐదు కేసుల స్వీకరణ.. పట్నా, గోధ్రాల్లో వివరాలు సేకరిస్తున్న ప్రత్యేక బృందాలు


పట్నా, గోధ్రా, న్యూఢిల్లీ, జూన్ 24: నీట్ అక్రమాలపై దర్యాప్తు బాధ్యతలను స్వీకరించిన సీబీఐ జోరు పెంచింది. బిహార్, గుజరాత్ రాష్ట్రాల్లో నీట్ అవకతవకలకు సంబంధించి నమోదైన ఒక్కో కేసును రీ-రిజిస్టర్ చేసింది. రాజస్థాన్‌లో మూడు కేసుల దర్యాప్తును స్వీకరించింది. మహారాష్ట్రలోని లాతూరులో యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (ఏటీఎస్) నమోదు చేసిన మరో కేసును కూడా సీబీఐ స్వాధీనం చేసుకునే అవకాశం ఉంది. కాగా.. నీట్ అక్రమాలపై బిహార్, గుజరాత్‌లో నమోదైన కేసుల దర్యాప్తునకు ఆదివారానికే పట్నా, గోధ్రాకు చేరుకున్న సీబీఐ ప్రత్యేక బృందాలు దర్యాప్తును ముమ్మరం చేశాయి. పట్నాకు చేరుకున్న సీబీఐ బృందం.. కొద్దిరోజులుగా అక్కడ పేపర్ లీక్ కేసును అత్యంత సమర్థంగా దర్యాప్తు చేస్తున్న ఆర్థిక నేరాల విభాగం (ఈవోయు) కార్యాలయానికి సోమవారం ఉదయం వెళ్లి కీలక వివరాలు సేకరించింది. ముమ్మర దర్యాప్తు చేసి ఇప్పటికే 18 మందిని అరెస్టు చేసిన ఈవోయు.. వారి మొబైల్ ఫోన్లను, సిమ్‌కార్డులను, ల్యాప్‌టా‌ప్‌లను, పోస్ట్‌డేటెడ్ చెక్కులను, కాల్చేసిన నీట్ ప్రశ్నపత్రం అవశేషాలను స్వాధీనం చేసుకుంది. నీట్ అక్రమాలపై దర్యాప్తు బాధ్యతను సీబీఐకి బదిలీ చేస్తూ బిహార్ సర్కారు ఆదివారం సాయంత్రం నోటిఫికేషన్ జారీ చేసిన నేపథ్యంలో.. ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న నిందితులందరినీ విచారణ నిమిత్తం సీబీఐ బృందం ట్రాన్సిట్ రిమాండ్‌పై ఢిల్లీకి తీసుకెళ్లే అవకాశం ఉందని ఈవోయు అధికారి ఒకరు తెలిపారు. ఈ కేసులో కీలక నిందితుడైన దానాపూర్ మునిసిపల్ కార్పొరేషన్ జూనియర్ ఇంజనీర్ సికందర్ ప్రసాద్ యాదవేందుపై ఆదాయానికి మించి ఆస్తుల కేసు కూడా సీబీఐ నమోదు చేసే అవకాశం ఉందని వెల్లడించారు. యాదవేందును ఈ కేసులో ప్రధాన నిందితుడిగా గుర్తించినట్టు ఆ అధికారి వెల్లడించారు. "అతడికి క్రిమినల్ కార్యకలాపాల్లో పాల్గొన్న చరిత్ర ఉంది. 2012లో జూనియర్ ఇంజనీర్ కాక ముందు అతడు రాంచీలో కాంట్రాక్టర్‌గా పనిచేసేవాడు. గతంలో జరిగిన రూ.3 కోట్ల విలువైన ఎల్‌ఈడీ స్కామ్‌లో అతడికి జైలు శిక్ష పడింది" అని ఆ అధికారి వివరించారు. మరోవైపు.. గోధ్రాకు చేరుకున్న సీబీఐ బృందం స్థానిక పోలీసు అధికారులను కలిసి, నీట్ పేపర్ లీక్‌కు సంబంధించి వివరాలు సేకరించినట్టు పంచమహల్ జిల్లా ఎస్పీ హిమాన్షు సోలంకి తెలిపారు. సీబీఐ దర్యాప్తునకు తాము అన్ని విధాలుగా సహకరిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కేసులో గుజరాత్ పోలీసులు ఇప్పటిదాకా ఐదుగురిని అరెస్ట్ చేశారు. అక్కడి ఒక కేంద్రంలో పరీక్ష రాసే 27 మంది అభ్యర్థులతో వారు ఒప్పందం చేసుకున్నారు. దాని ప్రకారం.. వారు ప్రశ్నపత్రంలో తమకు తెలిసిన సమాధానాలు రాసి మిగతావాటిని వదిలిపెడితే, వాటికి వీరు సమాధానాలు రాస్తారు. ఇందుకోసం ఒక్కొక్క అభ్యర్థి నుంచి రూ.10 లక్షలు తీసుకున్నారు. ఈ మేరకు వారిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. వారు సహకరించినప్పటికీ.. ఆ 27 మందిలో ముగ్గురు మాత్రమే నీట్‌ను క్లియర్ చేసినట్టు సమాచారం. ఇక.. మహారాష్ట్రలోనూ నీట్ అక్రమాలకు పాల్పడ్డ ఆరోపణలపై నాందేడ్ యాంటీ టెర్రరిజమ్ స్క్వాడ్ (ఏటీఎస్) అధికారులు లాతూర్‌కు చెందిన జలీల్ ఖాన్ ఉమర్ ఖాన్ పఠాన్ అనే జిల్లా పరిషత్ స్కూల్ టీచర్‌ను అరెస్ట్ చేశారు. అతడితో పాటు లాతూరుకే చెందిన సంజయ్ తుకారామ్ జాధవ్ అనే టీచర్‌పైన, నాందేడ్‌కు చెందిన ఇరాన్నా మషన్రీ కొంగల్వావ్, ఢిల్లీకి చెందిన గంగాధర్ అనే ఇద్దరు వ్యక్తులపైన కేసు నమోదు చేశారు. జలీల్‌ఖాన్‌ను అరెస్ట్ చేసిన ఏటీఎస్ అధికారులు.. పరారీలో ఉన్న మిగతా ముగ్గురి కోసం గాలిస్తున్నారు. కాగా.. నీట్ పరీక్షను రద్దు చేసి, మళ్లీ పరీక్ష నిర్వహించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను విచారించిన రాజస్థాన్ హైకోర్టు.. ఆ పిటిషన్లపై స్పందన తెలపాలంటూ జాతీయ టెస్టింగ్ ఏజెన్సీకి, కేంద్రానికి నోటీసులు జారీ చేసింది.నియమించేందుకు ఇంటర్వ్యూలు చేస్తున్నారని కాంగ్రెస్ నేత పవన్ ఖేడా ఆరోపించారు.



నీట్‌ను రద్దుచేయండి

» ప్రధాని మోదీకి మమతాబెనర్జీ లేఖ

» భారత్, బంగ్లాదేశ్‌ల మధ్య నీటి పంపకాల చర్చలపై అభ్యంతరం



న్యూఢిల్లీ, జూన్ 24: నీట్‌ను పూర్తిగా రద్దుచేయాలని బెంగాల్ సీఎం మమతా బెనర్జీ కోరారు. ప్రశ్నపత్రం లీకేజీపై సమగ్ర, నిష్పాక్షిక దర్యాప్తు జరిపించాలని ప్రధాని మోదీకి సోమవారం లేఖ రాశారు. నీట్‌ను తొలగించి, ఉమ్మడి ప్రవేశ పరీక్ష ద్వారా మెడికల్ కోర్సుల్లో చేరేందుకు విద్యార్థులను ఎంపిక చేసే స్వేచ్ఛను రాష్ట్రాలను అప్పగించే అంశాన్ని పరిశీలించాలని ప్రధానిని కోరారు. తక్షణమే పాత పద్ధతిని పునరుద్ధరించాలని ప్రధానమంత్రిని కోరారు. కాగా, కోల్‌కతా, జూన్ 24: భారత్, బంగ్లాదేశ్ మధ్య నీటి పంపకాలకు సంబంధించి ఇరు దేశాల ప్రధానులు నరేంద్ర మోదీ, షేక్ హసీనా మధ్య జరిగిన చర్చలకు కేంద్రం తనను ఆహ్వానించకపోవడంపై పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ మండిపడ్డారు. పశ్చిమబెంగాల్ ప్రమేయం లేకుండా ఇరు దేశాలు నీటి పంపకాలపై చర్చలు జరపడంపై ఆమె అభ్యంతరం వ్యక్తం చేస్తూ సోమవారం మోదీకి లేఖ రాశారు. 'పశ్చిమబెంగాల్ రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదించకుండా, అభిప్రాయం తీసుకోకుండా ఏకపక్షంగా చర్చలు, సంప్రదింపులు జరపడం ఆమోదయోగ్యం కాదు' అని మమత పేర్కొన్నారు. తీస్తా నదీ జలాల పరిరక్షణ-నిర్వహణ, 1996 నాటి గంగా జలాల ఒప్పందం పునరుద్ధణ అంశాలపై ఇటీవల మోదీ, హసీనా చర్చలు జరిపారు. అనంతరం మోదీ మీడియాతో మాట్లాడుతూ.. త్వరలో సాంకేతిక బృందాన్ని బంగ్లాదేశ్‌కు పంపనున్నట్టు తెలిపారు. ఒప్పందం ప్రకారం తీస్తా జలాల పరిరక్షణ, నిర్వహణకు తగిన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు పెద్ద రిజర్వాయర్‌ను నిర్మించడానికి భారత్ సిద్ధంగా ఉంది. అయితే భారత్, బంగ్లాదేశ్‌ల మధ్య నీటి పంపకాల ఒప్పందాన్ని చాలాకాలంగా మమత వ్యతిరేకిస్తున్నారు.

ప్రింటింగ్ ప్రెస్ నుంచే పేపర్ లీక్

యూపీలో ఆర్‌వో ప్రశ్నపత్రం లీకులో మరో ఆరుగురు నిందితులు అరెస్టు

» నీట్ ప్రధాన నిందితుడు రవికి కూడా చేరవేత

లఖ్‌నవూ, జూన్ 24: ఓవైపు నీట్, నెట్ ప్రశ్నపత్రాల లీకేజీపై దేశవ్యాప్తంగా రగడ జరుగుతుండగానే, మరోవైపు యూపీలో రివ్యూ ఆఫీసర్/ అసిస్టెంట్ రివ్యూ ఆఫీసర్ పరీక్ష పేపర్ లీకేజీ దర్యాప్తులో విస్మయకర విషయాలు బయటపడ్డాయి. ఫిబ్రవరి 11న ఉత్తరప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన ఈ నియామక పరీక్షకు పది లక్షలమందిపైగా అభ్యర్థులు హాజరయ్యారు. అయితే, లీకేజీ ఆరోపణలతో ప్రభుత్వం మార్చి 2న రద్దు చేసింది. ఆపై టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసి విచారణ జరిపింది. ఈ బృందం ఆదివారం యూపీలోని ప్రయాగ్‌రాజ్‌కు చెందిన విశాల్ దూబె, సందీప్ పాండేతో పాటు వివేక్ ఉపాధ్యాయ్(బలియా), అమర్జీత్ శర్మ(గయ-బిహార్), సుభాష్ ప్రకాష్(మధుబని- బిహార్), సునీల్ రఘువంశీ(భోపాల్-మధ్యప్రదేశ్)లను అరెస్టు చూపించింది. వీరిలో సునీల్ ప్రింటింగ్ ప్రెస్‌లో పనిచేస్తుంటాడు. గతంలోనే ఈ కేసులో ప్రధాన నిందితుడు రాజీవ్ నారాయణ్ సహా 10 మందిని అరెస్టు చేశారు. విచారణ సందర్భంగా.. రెండు మార్గాల్లో పేపర్ లీక్ అయిందని తేలిందని పోలీసులు తెలిపారు. ఫిబ్రవరి 11న ఉదయం 6.30 సమయంలో ప్రయాగ్‌రాజ్‌లోని బిషప్ జాన్సన్ బాలికల పాఠశాల/కళాశాల సెంటర్‌లో పరీక్ష బాధ్యతల్లో ఉన్న కమలేష్‌కుమార్ పాల్ అలియాస్ కేకే, డాక్టర్ శరద్‌సింగ్ పటేల్, సౌరభ్ శుక్లా, అరుణ్‌సింగ్, అర్పిత్ వినీత్ యశ్వంత్‌లు తమ ఫోన్ల ద్వారా పేపర్‌ను స్కాన్ చేశారు. కొందరు అభ్యర్థులకు పంపారు. దీనికిముందే ఫిబ్రవరి 3న సునీల్ రఘువంశీ తాను పనిచేస్తున్న ప్రింటింగ్ ప్రెస్ నుంచి పేపర్‌ను బయటకు తీసుకొచ్చి విశాల్ దూబెకు సమాచారం ఇచ్చాడు. దూబె.. రాజీవ్ నయన్ మిశ్రా అలియాస్ రాహుల్, సుభాష్ ప్రకాష్‌కు విషయం చేరవేశాడు. అనంతరం రాజీవ్ నయన్ గ్యాంగ్ ఒక్కో పేపర్‌కు రూ.12 లక్షల ధర నిర్ణయించింది. కాగా, మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌కు 950 కి.మీ. దూరంలోని ప్రింటింగ్ ప్రెస్‌లో ఆర్వో పేపర్ ముద్రణ అవుతున్నట్లు తెలిసిన రాజీవ్.. విశాల్ దూబెతో కలిసి పథకం వేశాడు. సునీల్, విశాల్ గతంలో సహధ్యాయులు కూడా. మరోవైపు కన్సల్టెంట్‌గా పనిచేసే విశాల్, సుభాష్‌తో కలిసి విద్యార్థులను ఇంజనీరింగ్ కళాశాల్లో చేర్పేవాడు. దీంతో ఈ నలుగురూ కలిసి పథకం పన్నారు. ప్రశ్నపత్రం చేతికి దొరికాక సునీల్.. ఇతరులకు సమాచారం ఇచ్చాడు. వివేక్, బిహార్‌కు చెందిన అమర్జీత్‌లు ఆర్వో/అసిస్టెంట్ ఆర్వో పరీక్షలకు దరఖాస్తు చేసిన అభ్యర్థులను గుర్తించి వారి నుంచి రూ.12 లక్షలు వసూలు చేశారు. కాగా, రాజీవ్ నారాయణ్.. నీట్ పేపర్ లీకేజీ ప్రధాన సూత్రధారి రవి అత్రికి కూడా ఫోన్ ద్వారా చేరవేశాడు. అతడు ఇంకొందరికి వాటిని పంపడంతో సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

అరుదైన వ్యాధి బారిన పేద యువకుడు

- స్కోలిసిస్‌తో 85% వంగిపోయిన వెన్నెముక
- రెండు నెలల్లోగా శస్త్ర చికిత్స చేయకుంటే ప్రాణానికే ప్రమాదం
- 9లక్షల దాకా ఖర్చయ్యే అవకాశం.. ఆపన్నహస్తం కోసం వినతి



కృష్ణంరాజు

పోచమ్మమైదాన్, జూన్ 24: నిరుపేద కుటుంబానికి చెందిన ఆ యువకుడు స్కోలిసిస్ (వెన్నెముక సంబంధిత) వ్యాధి బారిన పడ్డాడు. రెండు నెలలలోపు ఆపరేషన్ చేయకపోతే ప్రాణాలకే ప్రమాదమని వైద్యులు చెప్పడంతో ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నాడు. వరంగల్‌లోని మూడో డివిజన్ పైడిపెల్లి ఆర్‌ఎస్‌ఆర్ నగర్‌కు చెందిన జన్ను రమేశ్, అరుణ దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు. రమేష్ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తుండగా.. రమేశ్ కుమారుడు కృష్ణం రాజు(18) హన్మకొండలోని ప్రభుత్వ ఒకేషనల్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. కృష్ణంరాజుకు చిన్న వయస్సులోనే స్పైనల్ మస్క్యులర్ అట్రిఫీ (ఎస్ఎంఎ) వ్యాధి సోకింది. వైద్యానికి భారీగా ఖర్చయ్యే అవకాశం ఉండడంతో తాత్కాలికంగా ఫిజియోథెరపీ చేయించుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల కృష్ణంరాజుకు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు తలెత్తడంతో ఆస్పత్రికి వెళ్లాడు. వైద్యులు పరీక్షలు నిర్వహించి.. అతడికి ఉన్న ఎస్ఎంఎ వ్యాధి స్కోలిసిస్‌గా మారిందని, వెన్నెముక 85% వంగిపోయిదని గుర్తించారు. ఊపిరితిత్తులు ఒక పక్కకు వచ్చి 30శాతం పాడయ్యాయని తేల్చారు. రెండు నెలల్లోపు వెన్నెముకకు శస్త్రచికిత్స చేయాలని, లేదంటే ఊపిరితిత్తులు పూర్తిగా చెడిపోయి ప్రాణాలు పోయే ప్రమాదం ఉందని స్పష్టం చేశారు. ఇందుకు రూ.9లక్షలు ఖర్చవుతుందని వెల్లడించారు. అంత మొత్తం భరించే స్థితిలో లేని ఆ కుటుంబం ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తోంది. సాయం చేయాలనుకునే వారు 99854 90558, 91778 88018 నంబర్లలో సంప్రదించాలని కోరుతోంది.

కార్పొరేట్ తరహాలో..

సమీకృత గురుకులాలు!

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ.. అన్నీ ఒకేచోట.. 20-25 ఎకరాల్లో దాదాపు 22 కోట్లతో నిర్మాణం

- గ్రౌండ్+3 అంతస్తుల్లో తరగతి గదులు
- వేర్వేరుగా జీ+8 అంతస్థుల్లో హాస్టళ్లు
- బోధన, బోధనేతర సిబ్బందికి క్వార్టర్లు
- క్రీడా స్థలం, ఓపెన్ ఎయిర్ థియేటర్
- సీఎం పరిశీలనలో 2 డిజైన్లు.. త్వరలో ఆమోదం
- పైలట్ ప్రాజెక్టు కింద కొడంగల్, మధిరలో ఏర్పాటు



సమీకృత గురుకుల నమూనా

హైదరాబాద్, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా గురుకులాలు కొత్త శోభను సంతరించుకోనున్నాయి. అరకొర వసతులు, అద్దె భవనాలు, శిథిలావస్థలో కొనసాగుతున్న గురుకులాల స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం 'సమీకృత గురుకులాల (ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్)' విధానాన్ని తీసుకురానుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, సాధారణ గురుకులాలన్నింటినీ ఒకే చోట ఏర్పాటు చేయనుంది. నియోజకవర్గానికి ఒకటి చొప్పున సమీకృత గురుకులాలను ఏర్పాటు చేయనుంది. ఒక్కోటి సుమారు 20-25 ఎకరాల్లో, దాదాపు రూ.22 కోట్లతో.. కార్పొరేట్ తరహాలో భవనాలను నిర్మించనుంది. వీటి ఏర్పాటు కోసం ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టితో కలిసి అధికారులతో సమీక్షించారు. సమీకృత గురుకులాలకు సంబంధించిన రెండు డిజైన్లను అధికారులు సీఎంకు అందించారు. వాటిలో ఒకదాన్ని ఆయన ఆమోదించనున్నారు. ఈ గురుకులాలను పైలట్ ప్రాజెక్టు కింద రేవంత్ సొంత నియోజకవర్గం కొడంగల్, భట్టి నియోజకవర్గం మధిరలో ప్రారంభించనున్నారు. జీ+3 అంతస్తుల్లో తరగతి గదులు, జీ+3 అంతస్తులతో మరో భవనంలో కల్చరల్ సెంటర్, జీ+8 అంతస్తుల్లో హాస్టల్, మెస్; క్రీడా మైదానం సహా విద్యార్థులకు మానసిక ఉల్లాసం కలిగేలా ఈ భవన సముదాయాలను నిర్మించనున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో మొత్తం 1022 గురుకులాలు ఉన్నాయి. వీటిలో 394 మాత్రమే సొంత భవనాల్లో ఉండగా.. 628 అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. ప్రభుత్వ భవనాల్లో కొనసాగుతున్న వాటిలోనూ కొన్ని భవనాలు వినియోగానికి అనువుగా లేవు. దీంతో గురుకులాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలన్న ఆలోచనతో సీఎం వీటిపై దృష్టి సారించారు. సమీకృత గురుకులాల నిర్మాణాలకు బ్యాంకుల నుంచి రుణాలను సేకరించనున్నట్లు తెలిసింది. మరోవైపు కేంద్ర సాయం అందుతుందా అనేదానిపైనా అధికారులు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. మరోవైపు సమీకృత గురుకులాల ఏర్పాటుకు అనువైన ప్రాంతాలు, 20-25 ఎకరాల స్థలాన్ని చూడాలని, ఈ ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా పూర్తిచేయాలని అన్ని జిల్లాల కలెక్టర్లకు సీఎం సూచించారు.

కేంద్రం సాయం కూడా పొందేలా..

సమీకృత గురుకులాల ఏర్పాటుకు అవసరమయ్యే నిధుల్లో కొంత మేర కేంద్రం నుంచి కూడా తీసుకోవాలని భావిస్తున్నట్లు సమాచారం. ఈ గురుకుల భవనాలను కేంద్రం నిర్ణయించిన నమూనాలో నిర్మిస్తే, గ్రాంట్ల రూపంలో కొంత మేరకు నిధులు అందించేందుకు అవకాశం ఉన్నట్లు సమాచారం. భవనాలను నిర్మించే ప్రాంతాలు, నిర్మాణ నమూనాలు సహా పలు వివరాలను కేంద్రానికి సమర్పించాల్సి ఉంటుంది. కేంద్రం నుంచి సాయం అందకపోతే.. బ్యాంకుల నుంచి రుణం తీసుకుని నిర్మాణం చేపట్టనున్నారు.

నూతన భవనాలు ఇలా..

ఈ గురుకుల భవనాలు కార్పొరేట్ తరహాలో రూపుదిద్దుకోనున్నాయి. క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాట్లను కూడా ఈ నిర్మాణాల్లో భాగం చేస్తున్నారు. ప్రస్తుతం ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలోని లచ్చగూడెం దగ్గర నిర్మించాలని భావిస్తున్న గురుకులం డిజైన్‌ను సీఎం పరిశీలించారు. ఈ సమీకృత గురుకులం బ్లాకుల వారీగా నిర్మాణం కానుంది. వీటిలో అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, తరగతి గదులు, ఉద్యోగుల గదులు, ప్రయోగశాల, అథ్లెటిక్ ట్రాక్, ఫుట్‌బాల్ , టెన్నిస్, బాస్కెట్‌బాల్ కోర్టులతో పాటు ఓపెన్ ఎయిర్ థియేటర్ కూడా ఏర్పాటు చేయనున్నారు. తరగతి గదుల్లో విద్యార్థులకు అవసరమైన మేర వెలుతురు ఉండేలా డిజైన్ చేశారు. జీ+8 అంతస్తుల్లో బాలికలు, బాలుర హాస్టళ్లను వేర్వేరుగా ఏర్పాటు చేయనుండగా, ఈ రెండు హాస్టళ్ల మధ్యలో జీ+3 అంతస్తులతో బోధన, బోధనేతర సిబ్బందికి నివాస సముదాయాన్ని నిర్మించనున్నారు.

ఇదీ ప్రస్తుత పరిస్థితి..

ప్రస్తుతం తెలంగాణ రెసిడెన్షియల్ ఇన్‌స్టిట్యూట్ (ట్రైస్)కు మాత్రమే 35 సొంత భవనాలున్నాయి. ఎస్సీ గురుకులాలు 163 సొంత భవనాల్లో ఉండ గా.. 105 అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. గిరిజన గురుకులాలు 145 సొంత, 43 అద్దె భవనాల్లో ఉన్నాయి. బీసీ గురుకులాలు 21 సొంత, 306 అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. మైనారిటీ గురుకులాలు 30 సొంత, 174 అద్దె భవనాల్లో ఉన్నాయి.



హతుడు మహేశ్ (ఫైల్) నిందితులు శ్రీనివాస్, ప్రవీణ్

ప్లాట్ల వివాదం.. మాజీ ఎంపీటీసీ హత్య!

- ఘట్‌కేసర్‌లో కళ్లలో కారం చల్లి, కర్రలతో దాడి
- మృతదేహం కొండాపూర్ డంప్‌యార్డ్‌లో పూడ్చివేత
- నలుగురు నిందితుల అరెస్టు.. పరారీలో ఇద్దరు

ఘట్‌కేసర్ రూరల్/ఘట్‌కేసర్, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): ప్లాట్లకు సంబంధించిన ఓ వివాదం ఒకరి హత్యకు దారితీసింది. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ అంబేడ్కర్ నగర్‌కు చెందిన మాజీ ఎంపీటీసీ గడ్డం మహేశ్‌ను ఇద్దరు వ్యక్తులు దారుణంగా హత్య చేశారు. అనంతరం మృతదేహాన్ని డంప్‌యార్డులో పాతిపెట్టారు. ఈ ఘటనలో ఇద్దరు ప్రధాన నిందితులున్నారని, వీరికి మరో నలుగురు సహకరించారని పోలీసులు వెల్లడించారు. మల్కాజిగిరి ఏసీపీ చక్రపాణి వెల్లడించిన వివరాల ప్రకారం.. గడ్డం మహేశ్‌కు ఆయన ఉంటున్న కాలనీకే చెందిన శ్రీనివాస్ (36) అలియాస్ చిన్నతో ప్లాట్లకు సంబంధించి వివాదం నెలకొంది. 2019లో శ్రీనివాస్‌పై మహేశ్ పలు కేసులు పెట్టాడు. కోర్టు విచారణలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న శ్రీనివాస్, మహేశ్ పట్ల కక్ష పెంచుకొని అతడి హత్యకు పథకం వేశాడు. ఈ విషయంలో తనకు సహకరించాలని తన కాలనీకే చెందిన కడుపోల్ల ప్రవీణ్ (24)ను సంప్రదించాడు. తన సమీప బంధువుతో మహేశ్ వివాహేతర సంబంధం పెట్టుకోవడంతో అప్పటికే ఆయనపై కక్ష పెంచుకున్న ప్రవీణ్ సహకరించేందుకు అంగీకరించాడు. ఈ నెల 14న పథకం ప్రకారం ఇద్దరూ కలిసి మహేశ్‌కు ఫోన్‌చేశారు. ఘట్‌కేసర్ బైపాస్ సమీపంలోని ఆయన రియల్ ఎస్టేట్ కార్యాలయానికి తాము వస్తామని, అక్కడ ప్లాట్ల వివాదంపై చర్చించుకుందామని చెప్పారు. తాను ఆఫీసులో లేనని, హైదరాబాద్‌లో ఉన్నానని మహేశ్ చెప్పడంతో మరునటి రోజు వస్తామని చెప్పారు. 15న ఉదయం మహేశ్ ఆఫీస్‌కొచ్చారు. మహేశ్‌ను మాటల్లో పెట్టి వెంట తెచ్చుకున్న కారం పొడిని ఆయన కళ్లలో చల్లి కర్రలతో తీవ్రంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తర్వాత ఆఫీస్ షెటర్‌ను ఇద్దరూ కిందకు లాగి అక్కడి నుంచి వెళ్లిపోయారు. అదేరోజు రాత్రి మరో ఇద్దరితో కలిసి శ్రీనివాస్, ప్రవీణ్.. ఆఫీసుకొచ్చారు. మృతదేహాన్ని అక్కడి నుంచి తీసుకెళ్లి కొండాపూర్ సమీపంలోని డంపింగ్ యార్డు వద్ద ఎక్స్‌కవేటర్‌తో గుంతతీసి పాతిపెట్టారు. అప్పటికే మహేశ్ కోసం వెతుకుతున్న ఆయన తమ్ముడు గడ్డం విఠల్, ఈనెల 21న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మహేశ్ ఫోన్లోని కాల్ డేటాను పరిశీలించి.. ఆయన చివరిసారిగా ఎవరితో మాట్లాడారు? అనే కోణంలో దర్యాప్తు చేశారు. పోలీసుల దర్యాప్తు విషయాన్ని తెలుసుకున్న శ్రీనివాస్, ప్రవీణ్.. ఆదివారం రాత్రి మల్కాజ్‌గిరి డీసీపీ పద్మజారెడ్డి వద్ద లొంగిపోయి నేరాన్ని అంగీకరించారు. శ్రీనివాస్, ప్రవీణ్‌తో పాటు వీరికి సహకరించిన మరో ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. సోమవారం పోలీసులు మృతదేహాన్ని వెలికితీయించి, గాంధీ ఆస్పత్రిలో పోస్టుమార్టం చేయించి కుటుంబసభ్యులకు అప్పగించారు. కాగా, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ప్రవీణ్ ఇంటి వద్ద మహేశ్ కుటుంబీకులు ఆందోళన నిర్వహించారు. కొన్నేళ్లుగా మహేశ్, తన భార్యాపిల్లలకు దూరంగా ఉంటున్నాడు. వారు అంత్యక్రియలకు రాకపోవడంతో ఆయన సోదరుడి కుమారుడు కౌషిక్ చితికి నిప్పంటించాడు.

ఆర్ఐపై ఎమ్మెల్యే అనుచిత వ్యాఖ్యలు సరికాదు

- బాలానగర్ ఆర్ఐ సస్పెన్షన్‌ను రద్దు చేయాలి: ట్రెసా

హైదరాబాద్, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండల గిర్దావర్(ఆర్ఐ) వెంకట్‌రెడ్డిపై జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి దుర్భాషలాడటం బాధాకరమని ట్రెసా(తెలంగాణ రెవిన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్) ఆక్షేపించింది. సెలవు రోజుల్లో ఎలా పనిచేస్తారని రెవెన్యూ ఉద్యోగులను ప్రశ్నించడం గర్హనీయమని సంఘం అభిప్రాయపడింది. ఎమ్మెల్యే దూషణపై సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేసింది. నేడు రెవెన్యూ మంత్రి కలిసి ఓ నిర్ణయం తీసుకుంటామని ప్రకటించింది. ఎమ్మెల్యే తన వ్యాఖ్యలను వెనక్కితీసుకోవాలని, ఆర్ఐపై సస్పెన్షన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేసింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

కొత్త లోక్‌సభ

పద్దెనిమిదవ లోక్‌సభ సమావేశాల ఆరంభం నాటి దృశ్యాలు చూసినప్పుడు రాబోయే రోజులు ఎలా ఉండబోతున్నాయన్నది ఇప్పుడే కళ్ళకు కడుతున్నది. లోక్‌సభ కొలువుతీరడానికి ముందే ప్రధానిమోదీ 1975లో ఇందిర విధించిన ఎమర్జెన్సీని గుర్తుచేస్తూ, దానిని రాజ్యాంగం మీద ఎన్నటికీ చెరగని మచ్చగా అభివర్ణిస్తూ, దేశానికి అటువంటి కళంకాలు రాకుండా నడుచుకుంటామంటూ రాజ్యాంగంపై చర్చనీ, మళ్ళీ ఓ రచ్చనీ లేవదీశారు. మోదీ ఏలుబడిలో దేశం ఓ వందసార్లు అప్రకటిత అత్యయికస్థితి ఎదుర్కొందని విమర్శించిన కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, విపక్షానికి అందివచ్చిన నీట్ ఆయుధాన్ని ప్రయోగించారు. విపక్షాలమీద విరుచుకుపడటమే తప్ప లక్షలాదిమందిని ఇబ్బందుల పాల్జేసిన నీట్, నెట్ ఇత్యాది వైఫల్యాలమీద మోదీ నోరువిప్పరన్నది ఆయన వ్యాఖ్యల సారాంశం. సభలోపల విద్యామంత్రి ధర్మేంద్రప్రధాన్ ప్రమాణం చేస్తున్నప్పుడు నీట్ పేపర్ లీక్‌మీద విపక్షసభ్యులు నినాదాలు చేయడం, మోదీ, అమిత్‌షాలు ప్రమాణం చేస్తున్నప్పుడు రాహుల్‌గాంధీ తదితర విపక్ష నేతలు రాజ్యాంగం ప్రతిని చూపించడం, పార్లమెంట్ వెలుపల వీరంతా సంఘటితంగా ఆ ప్రతులను చూపుతూ నినాదాలు చేయడం వంటివి ఈ సమావేశాలు ఏ అంశాల చుట్టూ తిరుగుతాయో సూచిస్తున్నాయి. తన ఏలుబడిలో కాంగ్రెస్ రాజ్యాంగాన్ని ఎంతగా బలహీనపరిచిందో ప్రజలకు తెలియచెప్పడానికి బీజేపీ దేశవ్యాప్త కార్యక్రమాలు చేపట్టబోతున్నదట.

ఎన్నడూ మొదటివరుసలో కూర్చోవడానికి ఇష్టపడని రాహుల్‌గాంధీ ఇప్పుడు ముందుకు రావడంతోపాటు అఖిలేశ్ ఆయన పక్కనే ఉండటం విపక్షం సమధికోత్సాహానికి నిదర్శనం కావచ్చు. మంగళవారం రాహుల్ ప్రమాణస్వీకారం సందర్భంగా ఎటువంటి దృశ్యాలు చూస్తామో తెలియదు కానీ, ప్రొటెమ్ స్పీకర్ విషయంలో బీజేపీ అనవసరపు పట్టుదలకు పోయి ఆదిలోనే అగ్గిరాజేసినమాట వాస్తవం. అత్యంత సీనియర్ సభ్యుడిని ప్రొటెం స్పీకర్‌గా నియమించే సంప్రదాయానికి భిన్నంగా బీజేపీ సభ్యుడు భర్తృహరి మెహతాబ్‌ను ఎంపికచేయడం ద్వారా బీజేపీ ఘర్షణకు పునాదులు వేసింది. ఈ నిర్ణయాన్ని రాజ్యాంగంమీద దాడిగా విపక్షం అభివర్ణిస్తోంది. ఎనిమిదిసార్లు గెలిచివచ్చిన తమ ఎంపీ కొడికున్నిల్ సురేష్‌ను కాదనడం ద్వారా అధికారపక్షం దళితసమాజాన్ని అవమానించిందని కాంగ్రెస్ విమర్శిస్తే, మధ్యలో ఓడిన సురేష్‌కంటే ఏడుసార్లు వరుసగా నెగ్గుకొచ్చిన తమ భర్తృహరి గొప్పవాడని బీజేపీ సమర్థించుకుంది. ఎన్నికైన సభ్యులతో ప్రమాణం చేయించి, మహా అయితే ఓ రెండు రోజుల్లో ముగిసిపోయే ఓ పాత్ర విషయంలో బీజేపీ ఇంత మొండిగా వ్యవహరించనక్కరలేదు. తమ చర్యను సమర్థించుకోవడానికి తమకు అనుకూలంగా ఉన్న గతకాలపు నిర్ణయాలను కొన్నింటిని అది గుర్తుచేస్తున్నది. తాత్కాలిక స్పీకర్‌నే శాశ్వతం చేయబోతున్నారన్న ప్రచారాన్ని అటుంచితే, స్పీకర్‌గా మోదీ ఎవరిని నిర్ణయించినా గెలిపించుకోగలిగే సంఖ్యాబలం ఆ కూటమికి ఉన్నందున కనీసం ఈ ముందుదశలో బీజేపీ ఇచ్చిపుచ్చుకొనే ధోరణితో వ్యవహరిస్తే సరిపోయేది. ఒడిశా విజయం అధికారపక్షాన్ని నేలమీద నిలబడనివ్వడం లేదు. ఇప్పుడున్నవారో, వేరెవరో మోదీ మనసులో ఉన్నందున భర్తృహరిని ఇలా తాత్కాలికంగా సంతృప్తి పరుస్తున్నారని మరొకవాదన.

సుదీర్ఘకాలంగా సభలో ఉంటున్న సీనియర్ సభ్యుడిని ఆ కుర్చీలో కూచోబెట్టి, మిగతా తంతుని పూర్తిచేయించే గౌరవసంప్రదాయాల విషయంలో బీజేపీ భిన్నంగా వ్యవహరించడం వెనుక ఒక విస్పష్టమైన సందేశం ఉంది. విపక్షాలతో ఏమాత్రం రాజీపడబోవడంలేదని, సయోధ్య సాధ్యపడదని చెప్పదల్చుకున్నట్టు కనిపిస్తోంది. సంఖ్యరీత్యా తాము తగ్గినా, విపక్షం పెరిగి తమతో కాస్తంత సమమైనా తమలో ఏ మార్పూ ఉండబోదని ఇస్తున్న సందేశం కావచ్చు. విపక్షంతోనే కాదు, అసమ్మతి గొంతులతో, విమర్శకులతో కూడా గతంలో మాదిరిగానే వ్యవహరిస్తానని ఇటీవల అరుంధతీరాయ్‌పై ఊపా కేసు ద్వారా బీజేపీ తెలియచేసింది. కేజ్రీవాల్‌కు బెయిల్ రాకుండా చేయడానికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ న్యాయవ్యవస్థ మెట్లన్నీ ఎక్కుతోంది, శక్తిమేర పోరాడుతోంది.

పదిహేడవ లోక్‌సభనుంచి దేశం అత్యంత భయానకమైన దృశ్యాలు చూసింది. విపక్షసభ్యులను తీవ్రంగా అవమానించడం, అనుచితంగా ప్రవర్తిస్తూ, హేయమైన భాషవాడటం, సుదీర్ఘకాలం సస్పెండ్ చేయడం, సభలో తమను ప్రశ్నిస్తున్నవారినీ, తమకు నచ్చనివారినీ ఎంచుకొని మరీ తప్పుడు మార్గాల్లో అనర్హత వేటువేయడం ప్రజలు చూశారు. అత్యంత కీలకమైన బిల్లులను కూడా ప్రభుత్వం చర్చలేకుండా ఏకపక్షంగా నెగ్గించుకోవడం, అధికారపక్షానిదే పైచేయికావడమూ జరిగింది. రాజ్యాంగం ప్రకారం ఉండాల్సిన డిప్యూటీ స్పీకర్ కూడా ఇంతకాలమూ లేకపోయారు. కొత్త లోక్‌సభ గతానికి భిన్నంగా ప్రజలపక్షాన మరింత సమర్థంగా పని చేయాలని అందరూ ఆశిస్తున్న తరుణంలో, ఆరంభంలోనూ అడుగులు ఆ దిశగాపడకపోవడం, ఆ సూచనలేవీ లేకపోవడం విచారకరం.

మోదీ పాలనలో గుణాత్మక మార్పు వచ్చేనా?

ముగిసిన లోక్‌సభ ఎన్నికల్లో దేశ ప్రజలు ప్రధాని నరేంద్రమోదీ బలాన్ని సగానికి ఒక పిసరు తగ్గించినందుకు అభ్యుదయవాదులు, ప్రగతిశీలురు సంతోషిస్తున్నారు. ఆయన గొంతు చించుకొని దేశమంతా ప్రచారం చేసినా బీజేపీకి సాధారణ మెజారిటీ రానందుకు, ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు అనే ఊతకర్రల మీద ఆధారపడి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినందుకు మురిసిపోతున్నారు. మోదీ పూర్వంలా దూకుడుగా కాకుండా ఈసారి పరిపాలనలో ఆగి, ఆలోచించి అడుగు వేయక తప్పదని భావిస్తున్నారు. కాని ఆయన వ్యవహార శైలి చూస్తుంటే ప్రజాస్వామికవాదుల ఆకాంక్షలు బూడిదపాలు కాక తప్పదనే సంకేతాలు కనిపిస్తున్నాయి.



బీజేపీ ఏకచ్ఛత్రాధిపత్యం అయితే ప్రధాని మాటకు తిరుగుండదు. ఇతరుల మద్దతు అనివార్యమైనప్పుడు, ప్రధాన నిర్ణయాలు తీసుకునేటప్పుడు వారి విధానాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. 2004లో కేంద్రంలో ఐక్య ప్రగతిశీల కూటమి (యూపీఏ) ప్రభుత్వం ఏర్పాటైనప్పుడు మద్దతు ఇచ్చిన వామపక్షాలతో కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి కనీస కార్యక్రమాన్ని (సీఎంపీ) కుదుర్చుకున్నది. ప్రభుత్వం మితిమించి కుడి వైపు ఒరిగిపోకుండా అది కొంతకాలం అడ్డుకట్ట వేయగలిగింది. ఇప్పుడు బీజేపీ ప్రభుత్వానికి లోపలి నుంచి మద్దతు ఇస్తున్న టీడీపీ, జేడీ (యూ) పార్టీలు అటువంటి ఒప్పందాన్ని కోరలేదు. అందుచేత ఎప్పటి మాదిరిగానే ప్రధాని మోదీ ఏకపక్ష నిర్ణయాలతో సెక్యులరిజాన్ని, ఫెడరలిజాన్ని చెరోచేత పట్టుకొని కొరుక్కుతినడానికి అవకాశాలున్నట్టు భావించక తప్పడం లేదు.

మంత్రివర్గ కూర్పులో రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, నిర్మలా సీతారామన్, జై శంకర్‌లకు అవే శాఖలు అప్పగించడం మోదీ పాలన కొనసాగింపునే సూచిస్తున్నది. ముఖ్యంగా అమిత్ షాకు తిరిగి హోమ్ శాఖ కట్టబెట్టడం ఆయన పాత శైలికి పచ్చ జెండా ఊపడంగానే భావించాలి. గత బీజేపీ ప్రభుత్వ హయాంలో కేంద్ర హోం మంత్రిగా అమిత్ షా మణిపూర్‌ను ఎలా మండించి జాతుల విద్వేష కాష్టంగా మార్చారో చూస్తూనే ఉన్నాం. అలాగే భీమా కోరెగావ్ వంటి కృత్రిమ కేసులను సృష్టించి వామపక్ష మేధావులపైన బెయిలుకు వీలు లేని 'ఊపా'ను ఉసిగొల్పడం మాదిరి చర్యలు ప్రజాస్వామిక వాదులను తీవ్రంగా కలచి వేశాయి. ప్రధాని మోదీ ఎన్నికల ప్రచార ఘట్టంలో చేసిన ప్రసంగాలు ప్రజలను అమితంగా భీతిల్లజేశాయి. ఎన్నికల ఫలితాలు వెలువడి తన పార్టీ మెజారిటీకి ఆమడ దూరంలోనే ఆగిపోయిన తర్వాత ఆయన చేసిన ప్రసంగాల్లో ఎక్కడా గత విధానాల పట్ల పశ్చాత్తాపం వ్యక్తం కాలేదు. అవినీతి అంతు చూస్తామని ప్రధాని మోదీ మళ్ళీ తాజాగా ప్రకటించారు. బీజేపీ అవినీతి వ్యతిరేక విధానమంటే ప్రతిపక్షాలను రాచి రంపాన పెట్టడమూ, స్వపక్షంలోని అవినీతిని కప్పి పెట్టడమేనని రుజువైపోయింది. ఆ క్రమంలో కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేయడం మోదీ – షా లకు అలవాటైన విద్యే. ప్రతిపక్ష ముక్త భారత్‌ను రూపొందించాలని శతవిధాలా ప్రయత్నించారు. మోదీ గత పాలన రీతులను యథాతథంగా కొనసాగించడమే అయితే ఈ ఎన్నికల ద్వారా వచ్చిన మార్పు ఆదిలోనే అదృశ్యమైనట్టు భావించాలి.

> 18వ సార్వత్రిక ఎన్నికల తీర్పు ఉద్దేశం స్పష్టంగా కనిపిస్తూనే ఉంది. దేశ సెక్యులర్ నీతి చెక్కుచెదరకూడదని, మైనారిటీలను ద్వేషించడం మానుకోవాలని ప్రజలు ఆదేశించారు. నిరుద్యోగం, అధిక ధరలు, అగ్నివీర్ వంటి సమస్యల విషయంలో స్పష్టమైన వ్యతిరేకతను వ్యక్తం చేశారు. ఈ సందేశాన్ని నిర్లక్ష్యం చేస్తే ప్రజలు గమనించకుండా ఉండరు.

గతంలో వాజపేయి హయాంలో బీజేపీకి మెజారిటీ లోపించినందున కశ్మీర్, రామ మందిరం అంశాలను వివాదాస్పదమైనవిగా పరిగణించి పక్కన బెట్టారు. గత ఐదేళ్లలో బీజేపీ పార్లమెంటులో ఎదురు లేని, తిరుగులేని ఆధిక్యతను అనుభవించినందున ఈ అంశాలను ఇష్టపూర్వక రీతిలో ఒక కొలిక్కి తెచ్చుకున్నది. అలా జరిపించుకోడంలో దేశ మౌలిక నీతి అయిన శాంతియుత సహజీవన సిద్ధాంతాన్ని బలి తీసుకున్నది.

"మన ఎన్నికల వ్యవస్థ ప్రతి భారతీయుణ్ణి గర్వంతో తల ఎత్తుకునేలా చేసింది. సామర్థ్యంలో దానికి ప్రపంచంలోనే సాటి లేదు" అని ఈ ఎన్నికల తర్వాత మోదీ ప్రకటించారు. కాని ఎన్నికల సంఘం నిష్పాక్షిక గొంతును ఆయన నులిమేసిన చేదు వాస్తవాన్ని ఎవరూ కాదనలేరు. కమిషన్ సభ్యుల నియామక కమిటీలో భారత ప్రధాన న్యాయమూర్తికి చోటు లేకుండా చేశారు. సొంత మనుషులతో నింపుకునేందుకు వీలుగా పార్లమెంటు చేత చట్టం చేయించుకున్నారు. ఎన్నికల ప్రచారంలో ప్రధాని ఎంతగా నియమోల్లంఘనకు పాల్పడినా ఎలక్షన్ కమిషన్ నోరు విప్పని దృశ్యం నిన్న మొన్నటిదే. ఎన్నికల ప్రచారంలో భాగంగా ముస్లింలపై ద్వేష భావజాలాన్ని రెచ్చగొట్టారు. కాంగ్రెస్ పార్టీని ముస్లిం లీగ్‌తో పోల్చారు. అణగారిన వర్గాలకు భారత రాజ్యాంగం ఇస్తున్న సౌకర్యాలను ముస్లింలకు కాంగ్రెస్ ధారాదత్తం చేస్తుందని ఆరోపించారు. దేశ సంపద మీద మొట్టమొదటి హక్కు ముస్లిమ్‌లదేనని కాంగ్రెస్ చెప్పినట్టు ప్రచారం చేశారు. దేశంలోని మైనారిటీలకు సాధికారత కల్పించవలసిన అవసరమున్నదని మన్మోహన్ సింగ్ 2006లో ఒక ప్రసంగంలో అన్న దానిని వక్రీకరించారు. కాంగ్రెస్ పార్టీ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల నిధులను ముస్లింలకు దోచిపెడుతున్నట్టు చూపే ఒక వీడియోను కాషాయ శక్తులు ప్రచారంలో పెట్టాయి. ఇంత తీవ్రంగా సాగిన ముస్లిం వ్యతిరేక ప్రచారాన్ని ప్రజలు తిరస్కరించారు. అందుకే బీజేపీకి మెజారిటీని నిరాకరించి అతి పెద్ద పార్టీ స్థాయిని మాత్రమే ఇచ్చారు.

అదే సమయంలో రాజ్యాంగం, రిజర్వేషన్లు, కుల గణనను ప్రచారాంశాలు చేసుకున్న కాంగ్రెస్‌కు 99 స్థానాలు కట్టబెట్టి పదేళ్ల తర్వాత మొదటిసారిగా లోక్‌సభలో అధికారిక ప్రతిపక్ష హోదాను దానికి ప్రసాదించారు. బీజేపీకి కంచుకోటగా గతంలో నిరూపించుకున్న ఉత్తరప్రదేశ్ లోని 80 స్థానాల్లో సమాజ్‌వాది పార్టీకి 37 స్థానాల్లో విజయ కిరీటాన్ని తొడిగారు. గత లోక్‌సభలో దానికి ఉన్నవి 5 స్థానాలే. ఈ తీర్పు ఉద్దేశం స్పష్టంగా కనిపిస్తూనే ఉంది. దేశ సెక్యులర్ నీతి చెక్కుచెదరకూడదని, మైనారిటీలను ద్వేషించడం మానుకోవాలని ప్రజలు ఆదేశించారు. అలాగే ప్రజలు నిరుద్యోగం, అధిక ధరలు, అగ్నివీర్ వంటి సమస్యల విషయంలో స్పష్టమైన వ్యతిరేకతను తెలియజేశారు. అధికారం చేతికి వచ్చింది కదా అని ఈ సందేశాన్ని నిర్లక్ష్యం చేస్తే ప్రజలు గమనించకుండా ఉండరు.

మోదీ తన పాలన ప్రాధాన్యాలను తప్పనిసరిగా మార్చుకోవలసి ఉంది. పర మత విద్వేషానికి స్వస్తి చెప్పి ప్రజల బతుకులు బాగుపరచడంపై దృష్టి పెట్టాలి, ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలతో సంప్రదించి నిర్ణయాలు తీసుకొనే కొత్త అధ్యాయానికి తెర లేపాలి. జవహర్ లాల్ నెహ్రూ మాదిరిగా వరుసగా మూడోసారి అధికారంలోకి రావడం కాదు; దేశ సర్వతోముఖ అభివృద్ధికి, సహజీవన శాంతికి ఎవరు ఎంత చేశారనేది ముఖ్యం. ప్రధాని మోదీ మూడోసారి అధికారానికి వచ్చిన మహదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. దేశంలోని ముస్లింలను ప్రతి హిందువూ ద్వేషించేలా చేసి ఎన్డీఏకి లోక్‌సభలో 400 స్థానాలు లభించేలా చూడాలన్న బీజేపీ వ్యూహం విఫలమయ్యిందంటే ప్రజలు ఏక జాతి దేశాన్ని కోరుకోవడం లేదని రూఢీ అయిపోయింది. జనాభాలో కేవలం 15శాతంగా ఉన్న ముస్లింలను హిందువులు పరాయివారుగా చూడడం లేదు. వారితో అన్ని రకాలుగా పెనవేసుకుపోయారు. వారు కూడా ఈ భూమి పుత్రులే. రాజ్యాంగం వారికి కల్పించిన ప్రత్యేక సౌకర్యాలను హరిస్తే ఇతరులకు ఒరిగేది ఏమీ ఉండదు. అందుచేత మూడోసారి మోదీ పాలనలో గణనీయమైన మార్పు రావాలని అందరూ ఆశిస్తున్నారు.

■ జి. శ్రీరామమూర్తి
సీనియర్ జర్నలిస్ట్

విద్య వ్యాపారీకరణ విష ఫలితమే 'నీట్' కుంభకోణం!

ఎన్నికల ఫలితాలు వెలువడిన జూన్ 4వ తేదీనే నీట్–యూజీ ఫలితాలు కూడా వెలువడ్డాయి. ఇలా జరగడం యాదృచ్ఛికం కావచ్చు. లేదా ఏదో మతలబు ఉందని సందేహించవచ్చు. ఎన్నికల ఫలితాల సంబ్రమంలో దీన్ని గురించి ఎవరూ ఆలోచించే అవకాశం ఉండదనే ఎత్తుగడేమో అన్న అనుమానం కూడా తలెత్తవచ్చు. ఏది ఏమైనా చివరకు అందరినీ దిగ్భ్రాంతికి గురిచేసే విధంగా వందల కోట్ల రూపాయలు చేతులు మారిన నీట్ కుంభకోణం బట్టబయలైంది. ఒకవైపు మూడోసారి మోదీ ప్రభుత్వ ప్రమాణ స్వీకారోత్సవం, మంత్రి పదవుల పంపకాలు జరుగుతుంటే, మరోవైపు నీట్ అవినీతి దుమారం మీడియాను ముంచెత్తింది. ఈ పరిణామం లక్షలాది విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఎంతో క్షోభకు గురి చేసింది. సుప్రీంకోర్టు సైతం 'నీట్ పవిత్రత దెబ్బ తింది' అని తీవ్రంగా వ్యాఖ్యానించింది. ఇంత జరిగినా, లక్షలాది విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారినా, దేశవ్యాప్త నిరసనలు చెలరేగుతున్నా ప్రధానమంత్రి మాత్రం పెదవి విప్పలేదు. ఇది మోదీ మార్కు పాలనకు మరొక ఉదాహరణ.



> అకడమిక్ వ్యవహారాలతో ఏమాత్రం సంబంధం లేని ఎన్టీఏ లాంటి ఒక బ్యూరోక్రటిక్ సంస్థను కేంద్ర ప్రభుత్వం ఎందుకు ఏర్పాటు చేసింది? ఆ సంస్థకు నీట్, జేఈఈ వంటి అత్యంత ప్రతిష్ఠాత్మక ప్రవేశ పరీక్షలతో సహా అన్ని రకాల పోటీ పరీక్షల నిర్వహణను ఎందుకు అప్పగించింది? ఈ కీలక ప్రశ్నలపై చర్చ జరగాలి.

తమ ప్రభుత్వంపై పడిన అవినీతి మరకను కప్పిపుచ్చుకోవడానికి ఎన్టీఏ అధికారులను బలి పశువులను చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఎన్టీఏను సంస్కరించే పేరిట ఏవో చర్యలు, ప్రకటనలు వెలువడుతున్నాయి. అసలు కేంద్ర ప్రభుత్వం అకడమిక్ వ్యవహారాలతో ఏమాత్రం సంబంధంలేని ఎన్టీఏ లాంటి ఒక బ్యూరోక్రటిక్ సంస్థను ఎందుకు ఏర్పాటు చేసింది? ఆ సంస్థకు నీట్, జేఈఈ వంటి అత్యంత ప్రతిష్ఠాత్మక ప్రవేశ పరీక్షలతో సహా అన్ని రకాల పోటీ పరీక్షల నిర్వహణను ఎందుకు అప్పగించింది? ఇలాంటి కీలక ప్రశ్నలు చర్చకు రావడం లేదు.

నీట్ కుంభకోణం నేపథ్యంలో మన దేశ విద్యారంగంలో అమలవుతున్న విధానపరమైన మార్పులను నిశితంగా పరిశీలించాలి. ఎందుకంటే ప్రశ్నపత్రాల లీకేజీ, పరీక్షలలో అక్రమాలు, ఫలితాలలో అవకతవకలు తదితర సమస్యలన్నీ ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్య వ్యాపారీకరణ, ప్రైవేటీకరణ అనే ప్రధాన విధానంతో ముడిపడి ఉన్నాయి. ప్రస్తుతం అమలవుతున్న జాతీయ విద్యావిధానం–2020లో యావత్తు విద్యను, ప్రత్యేకించి ఉన్నత విద్యను గంపగుత్తగా కార్పొరేట్ సంస్థలకు అప్పగించడానికి అవసరమైన సిఫార్సులు చాలా ఉన్నాయి. ఈ విధానం నిరాటంకంగా, వేగంగా అమలు కావడానికి విద్యా రంగంలోని అన్ని అధికారాలను కేంద్ర ప్రభుత్వ పరిధిలోకి బదలాయించే చర్యలు వరుసగా చేపడుతున్నారు. రాజ్యాంగంలో విద్యారంగం ఉమ్మడి జాబితాలో ఉన్నప్పటికీ, రాష్ట్రాల అభిప్రాయాలతో నిమిత్తం లేకుండా అన్ని వ్యవహారాలను కేంద్రమే నిర్దేశించడం ఫెడరల్ సూత్రాలకు పూర్తి విరుద్ధం. ఈ విధమైన అధికారాల కేంద్రీకరణలో భాగంగానే గతంలో రాష్ట్రాల పరిధిలో ఉన్న మెడికల్ ప్రవేశాలు, అడ్మిషన్ల మొత్తం ప్రక్రియను కేంద్రం నియమించే వ్యక్తులతో కూడిన ఎన్టీఏకు అప్పగించారు. దీనితో యూనివర్శిటీలు ఉత్సవ విగ్రహాలుగా మారిపోయాయి.

నీట్‌ను ప్రవేశపెట్టిన తరువాత మెడికల్ విద్యలో చోటుచేసుకున్న మార్పుల గురించి అమృత్‌సర్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎమిరిటస్ ప్రొఫెసర్‌గా పనిచేసిన డాక్టర్ శ్యామ్ సుందర్ దీప్తి వెలిబుచ్చిన అభిప్రాయాలు గమనార్హమైనవి. ఆల్ ఇండియా సేవ్ ఎడ్యుకేషన్ కమిటి 2021 అక్టోబర్ 31న జాతీయ విద్యావిధానం–2020పై నిర్వహించిన ఒక జాతీయ స్థాయి సెమినార్‌లో ఆయన మాట్లాడుతూ ఇలా చెప్పారు: "నీట్‌కు ముందు, ఆ తర్వాత విద్యార్థులకు కల్పించబడిన ప్రవేశాలలో చాలా వ్యత్యాసం ఉంది. అంతకు ముందు సంవత్సరాల్లో గ్రామీణ, పట్టణ ప్రాంతాల నుంచి, వివిధ రకాల ఆర్థిక-సాంస్కృతిక నేపథ్యాల నుంచి వచ్చిన విద్యార్థులందరూ ప్రవేశాలు పొందారు. అయితే నేడు కేవలం నగరాలు, మహానగరాల నుండి వచ్చిన విద్యార్థులు మాత్రమే ప్రవేశాలు పొందారు. ఈ తేడా కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. మధ్య, దిగువ మధ్య తరగతి నుండి ప్రవేశాలు పొందిన విద్యార్థులను వేళ్లపై లెక్కించవచ్చు. దీనికి కారణం సుస్పష్టం. నీట్ ప్రవేశ పరీక్షకు సన్నద్ధమవడానికి కోచింగ్ సెంటర్లకు, అదేవిధంగా కోర్సులో చేరిన తరువాత మెడికల్ కళాశాలలకు చెల్లించవలసిన ఫీజులు అత్యధికంగా ఉండటమే. ఈ ఫీజులు కనీసం 25 లక్షల నుండి 30 లక్షల వరకు ఉంటున్నాయి. ఇంత పెద్ద మొత్తాన్ని మధ్యతరగతి కుటుంబాలు భరించడం చాలా కష్టం. ఈ భారీ ఫీజులకు కారణం మొత్తం మెడికల్ కళాశాలల్లో 50 శాతానికి పైగా ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోనూ, కార్పొరేట్ వ్యక్తుల చేతుల్లోనూ ఉండటమే. వారి చేతుల్లో కేవలం కళాశాలలను ఉంచడమేగాక, వారికి అనుకూలంగా విద్యాప్రణాళిక రచించబడింది కూడా! కార్పొరేట్ వ్యవస్థను నడిపే పనిముట్లుగా శిక్షణ పొందిన సిబ్బందిని ఉత్పత్తి చేయడమే ఈ విద్యా ప్రణాళిక ముఖ్య ఉద్దేశ్యం." ఈ అభిప్రాయాలు ఎంత వాస్తవికంగా ఉన్నాయో మన కళ్ళ ముందు స్పష్టంగా కనిపిస్తోంది.

ఈ పరిస్థితులు ఇలాగే కొనసాగితే ప్రస్తుతం జరిగిన నీట్ కుంభకోణం వంటివి భవిష్యత్తులో మరిన్ని పెద్ద స్థాయిలో జరిగే అవకాశాలు లేకపోలేదు. కావున నీట్‌ను తిరిగి నిర్వహించాలనే డిమాండ్‌తో పాటుగా ఎన్టీఏను తక్షణం రద్దు చేయాలని, విద్యలో అన్ని చెడులకు మూలమైన విద్య కార్పొరేటీకరణ, అధికారాల కేంద్రీకరణ విధానాన్ని ఉపసంహరించాలని కోరుతూ ఒక సమరశీల ఉద్యమాన్ని నిర్మించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.


○ ఎస్. గోవింద రాజులు
ఆల్ ఇండియా సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ

ప్రజా చైతన్యంపై 'ఊపా' దాడి

అరుంధతి రాయ్, షేక్ షౌకత్ హుస్సేన్ (కశ్మీర్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్) పైన పద్నాలుగేళ్ళ క్రితంనాటి ఆరోపణలను సాకుగా చూపిస్తూ ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వికె. సక్సేనా ఊపా అనే అనాగరిక చట్ట ప్రయోగానికి అనుమతిచ్చారు. అంతర్జాతీయంగా పేరు ప్రఖ్యాతులున్న, ప్రజాస్వామ్య సంస్కృతి కోసం ఆరాటపడే గొప్ప మానవీయ రచయిత్రి అరుంధతి రాయ్ పైన ఊపా కేసు ప్రయోగంతో కేంద్రంలోని ప్రభుత్వం తన అంతిమ ఫాసిస్టు రూపాన్ని ప్రదర్శిస్తున్నది.

2010లో ఢిల్లీలో జరిగిన ఒక సదస్సులో వక్తలు చేసిన ఉపన్యాసాలు ప్రజలను రెచ్చగొట్టే విధంగానూ, వేర్పాటువాదాన్ని ప్రోత్సహించేవిగానూ ఉన్నాయని ఒక కశ్మీరీ పండిట్ ఆనాడు ఫిర్యాదు నమోదు చేశారు. ఆనాటి కేసును తిరగదోడి గత సంవత్సరం ఐపీసీ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి, ఇవాళ వాటినే ఊపా కేసు పరిధిలోకి తెచ్చారు. ఊపా ఎంత అనాగరిక చట్టమైనా దాని ఉద్దేశం కొంతమంది వ్యక్తులు లేదా సంస్థల వల్ల భవిష్యత్తులో హింస లేదా నేరాలు జరగకుండా నివారించటమే. నిజంగా ఈ ప్రముఖుల ఉపన్యాసాల వల్ల కశ్మీరీ ప్రజలు రెచ్చిపోయి ఉంటే, వేర్పాటువాదం మరింత పెరిగిపోయి ఉంటే ఆ పర్యవసానాలు వారి ఉపన్యాసాలనంతరం కనిపించేవి. ఫలితంగా జరిగిన పరిణామాలకు వీరి ఉపన్యాసాలను లింక్ చేసి ఉంటే అదొక చట్టబద్ధ వ్యవహారమై ఉండేది. నిజానికి, అటువంటి ఉపన్యాసాలు వారేమీ ఇవ్వకపోయినా, ఇచ్చిన ఉపన్యాసాలతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకపోయినా, వీరిపై ఆరోపణలు చేసిన వ్యక్తి దురుద్దేశంతో ఫిర్యాదు చేశాడని ఆ కేసును అంతటితో మూసివేయవచ్చు.

అరుంధతీ రాయ్ లాంటి వ్యక్తులు కశ్మీర్ ప్రజల సామాజిక, రాజకీయ, రాజ్యాంగ హక్కుల విశ్లేషణ తప్ప మతోన్మాదుల లాగా మాబ్‌ని రెచ్చగొట్టే చవకబారు ఉద్రేకపూరిత ఉపన్యాసాలు ఇచ్చే బాపతు కాదు. ఆ విషయాలు తెలిసి కూడా నిత్యం ప్రజల మనోభావాలతో ఆడుకుంటూ, వారిలో భావోద్రేకాలను రెచ్చగొట్టి, చట్ట బాహ్య హింసకు కారణమైన చరిత్ర గల రాజకీయ పార్టీ ఇవాళ అధికార పీఠంపై కూర్చుని శాంతి కోసం తపిస్తున్నట్టు నిజమైన శాంతికాముకులైన ప్రజాస్వామ్యవాదులపై ఇటువంటి కేసులకు దిగుతున్నది.



ఫాసిస్ట్ స్వభావం గల అధికార పార్టీ, వారి సోదర, మాతృ సంస్థల బండారాన్ని బట్టబయలు చేస్తూ అరుంధతి రాయ్, ఇంకా అనేకమంది జాతీయ స్థాయి ప్రజాస్వామిక వాదులు ప్రజలను చైతన్యం చేయటాన్ని సహించలేని ప్రభుత్వం రాజకీయంగా, సైద్ధాంతికంగా వారిని ఎదుర్కోలేక ఇటువంటి నిరంకుశ అణచివేతకు దిగుతున్నది. ప్రజలు క్రమంగా పాలకుల ప్రజావ్యతిరేక, ఫాసిస్టు స్వభావాన్ని అర్థం చేసుకుంటున్నారు. వారు మరింత చైతన్యం కాకుండా నిరోధించటానికే అరుంధతీ రాయ్ పైన ఈ ఊపా కేసు.

ఫాసిజం స్వభావసిద్ధమైన లక్షణం సమాజంలోని చైతన్యాన్నీ వివేకాన్నీ చంపివేయటం. అందుకే వాళ్లు ప్రజలను చైతన్యం చేసే రచయితలనూ, మేధావులనూ, కమ్యూనిస్టులనూ, చైతన్యానికి వేదికలుగా ఉండగల విశ్వవిద్యాలయాలనూ లక్ష్యంగా చేసుకొని మొట్టమొదట దాడి చేస్తారు. గత పదేళ్ళుగా దేశంలో అదే జరుగుతున్నది. అదే క్రమంగా ఉధృతమవుతున్నది. ఆధునిక నాగరికతకూ, ప్రజాస్వామ్యానికీ, మానవాళి గౌరవప్రద జీవనానికీ గొడ్డలి పెట్టులాగా మారిన ఫాసిస్ట్ పరిపాలనా ధోరణి భారతదేశంలో జడలు విప్పుతున్నది. అందరం ఒక్కటై ప్రజాస్వామ్యాన్నీ, భావప్రకటనా స్వేచ్ఛనూ కాపాడుకుందాం. అరుంధతి రాయ్, షేక్ షౌకత్ హుస్సేన్ లపై ఊపా ప్రయోగాన్ని తీవ్రంగా వ్యతిరేకిద్దాం.

– డాక్టర్ ఎస్. తిరుపతయ్య
(మానవ హక్కుల వేదిక)

బాధితులమీద బండలేయడమే దళితత్వమా?

'హక్కులు ఒకరిని అడుక్కుంటే వచ్చే భిక్షకాదు, పోరాడి సాధించుకోవాలి' అని బాబా సాహెబ్ అంబేద్కర్ చెప్పిన విషయం మామిడి నారాయణ చెవికెక్కినట్లు లేదు ('మాలలపై ఎందుకీ అకారణ ద్వేషం?' 24.05.2024). అసలు మాదిగ జాతి పట్ల ఇంత విషం చిమ్ముతున్న నారాయణకు సామాజిక న్యాయం పట్ల గాని, ప్రజాస్వామ్య దృక్పథం పట్ల గాని సదభిప్రాయమే లేదు. అగ్రకులాల దొరల ఇండ్ల వద్ద కావలి కుక్కల్లా కాపలా కాసి, మాదిగలు టిక్కెట్లు అడగాలనడం కంటే దిగజారుడుతనం మరొకటి ఉండదు. కడుపు చించుకుంటే కాళ్లమీద పడుతుందనే మాట ప్రస్తుత సందర్భానికి సరిగ్గా సరిపోతుంది.

కులవ్యవస్థలో ప్రతీ కులం తన కంటే కింది కులం పట్ల చులకనభావంతో ఉంటుంది. అది దళితుల్లో కూడా తోటి దళితుల పట్ల ఉంటుందని మరోసారి మామిడి నారాయణ వాదన వల్ల నిరూపితమైంది. సాధారణంగా ఈ దేశంలో అగ్రకులాలు చేసే వాదనే నారాయణ చేస్తున్నారు. మేం ప్రతిభావంతులం అందుకే మాకు అన్నీ దక్కుతున్నాయి. మీకు లాబీయింగ్ (చెంచాగిరి) చేసే తెలివి లేదు, అందుకే మీకు దక్కడం లేదని చెప్పకనే చెప్పుకొచ్చారు. ఇది సిగ్గుచేటైన విషయం. టిక్కెట్లు ఇవ్వని పార్టీలకు మాదిగలు ఎందుకు ఓట్లెయ్యాలి అని రాస్తే, నారాయణ ఈ వంకతో మాదిగ జాతిపై అక్కసు వెళ్లగక్కాడు. నన్ను అడ్డం పెట్టుకొని మరోసారి మాదిగ జాతి మీద, నాయకుల మీద విషం చిమ్మి తాత్కాలిక ఆనందాన్ని పొందుతున్నాడు.

మొదటి నుండి మాల, మాదిగల మధ్య ఈ తేడా స్పష్టంగా ఉంది. విద్యా ఉద్యోగాల్లో ముందంజలో ఉన్న మాలలకు రాజకీయ అధికారపు రుచి తెలుసు. బీఎస్ వెంకట్రావు నుండి ఇవాల్టి యువ నాయకత్వం దాకా ఎట్లా ఏ పదవి ఏ పావులు కదిపి సంపాదించాలో తెలుసు. మరి మాదిగలది నిత్యం ఆకలి పోరాటం. అందుకే వాళ్లకు లాబీయింగులు తెలియవు. రోడ్డెక్కి దక్కాల్సిన హక్కుకోసం డప్పుకొట్టడం ఒక్కటే తెలుసు. స్వాతంత్ర్యం అనంతరం తెలుగు నేల మీద మాదిగలు మాత్రమే పోరాటాలు చేశారు.

తెలంగాణ ఉద్యమంలో మాదిగలు కేసీఆర్‌తో లేరని, కోదండరాంను వ్యతిరేకించారని విమర్శ చేశాడు నారాయణ. అసలు తెలంగాణ ఉద్యమమే కాదు రెండు తెలుగు రాష్ట్రాల్లో ఏ ఉద్యమం వచ్చినా మాదిగల మద్దతు లేకుండా, మాదిగల భాగస్వామ్యం లేకుండా నడిచిన దాఖలాలు ఉన్నాయా? నక్సలైట్ ఉద్యమం వస్తే ప్రాణాలిచ్చింది మాదిగలు, 1969 ఉద్యమంలో మంత్రి పదవిని త్యాగం చేసింది సదాలక్ష్మమ్మ మాదిగ, మూడు దశాబ్దాల పాటు ఎస్సీ వర్గీకరణ ఉద్యమం కోసం పదుల సంఖ్యలో ప్రాణలిచ్చింది మాదిగలు, విద్యార్థి జేఏసీని నడిపింది మాదిగలు, పల్లెపల్లెన ధూంధాం అయి పోటెత్తి డప్పు కొట్టింది మాదిగలు, కవులు రచయితలను కూడగట్టి మలిదశ ఉద్యమానికి ముగ్గులు పోసింది మాదిగలు, కేసీఆర్ దీక్ష విరమింపజేసి నిమ్మరసం ఇచ్చి ప్రాణాలు కాపాడింది మాదిగలు. ఇన్ని చేసినా కేసీఆర్ వెంట లేరు, కోదండరాం వెంట నడువలేదు కాబట్టి వాళ్లకు టిక్కెట్లు రాకపోవడం సబబే అని నారాయణ వాదించడం ఈ దశాబ్దపు విషాదం.

1985లో కారంచేడు మారణహోమంలో హోరాహోరి పోరాడి, ప్రాణాలు కోల్పోయింది మాదిగలు. దానికి సంఘీభావంగా దళిత మహాసభ పెట్టి వచ్చి చేరింది మాలలు. మాదిగలకు న్యాయం దక్కకపోగా మాలలు నాయకులుగా అవతరించారు. పోరాడి ప్రాణాలు పోగొట్టుకుంది మాదిగలు. ఆ ఘటన మీద ఇప్పటికీ పేరు మోసుకుంటూ అధికారంలోకి వచ్చే ప్రతీ సర్కార్ దగ్గర చెప్పుకుంటున్నది మాలలు. బాధితులు, వెనుకపడినవారు, దగాపడినవారు మాదిగలు.

> ఎంతోమంది ప్రగతిశీల మేధావులున్న మాల సామాజిక వర్గానికి మామిడి నారాయణ లాంటి వారు చేస్తున్న నష్టం అంతా ఇంతా కాదు. ఏ సామాజిక వర్గమైనా ఎంత అభివృద్ధి చెందింది అనేది ఏదో ఒక గ్రామాన్ని తీసుకొని కాదు పరిశీలించాల్సింది. మొత్తం జనాభా ఎంత? విద్యా ఉద్యోగ అవకాశాలను గద్దల్లా తన్నుకుపోతున్నది ఎవరు? నిజాం కాలం నుండి ఇప్పటి దాకా ఎవరు ఎక్కువగా లాభపడ్డారు అన్న అంశాలను, ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ నివేదికలు చెప్పినవి గమనించాలి.



వారు చేసే ఏ పోరాటంలో మీరు కలిసి వచ్చారు? దళితులకు మూడెకరాల భూమి పథకం పెట్టింది భూమిలేని నిరుపేదల కోసం. మరి సూర్యాపేటలో మాలలకు భూమి ఉన్నాక కూడా ఇవ్వాలా?! ఎమ్మార్పీఎస్‌కు పోటీగా తెలంగాణ ఎమ్మార్పీఎస్ పెట్టించింది కేసీఆర్ అయితే, కేసీఆర్‌ను వ్యతిరేకించే మాదిగలు దానికి ఎట్లా మద్దతిస్తారు?

తోటి దళిత కులమైన మాదిగలకు గానీ, దళిత ఉప కులాలకు గానీ అన్యాయం జరిగితే మాట్లాడలేని మామిడి నారాయణ బీసీలకు అన్యాయం జరుగుతుందని మాట్లాడడం అతిశయోక్తి. అగ్రకులాలు రెండు మూడు సీట్లు పొందితే మాదిగలు అడగరు, మాలలు పొందితే అడుగుతారంటున్న నారాయణకు రాజకీయాల పట్ల కనీస అవగాహన లేదు. అగ్రవర్ణాలు పొందుతున్నది ఎస్సీ రిజర్వేషన్‌లోనా అన్నది ఆలోచించాలి.

ఇక అద్దంకి దయాకరే కాంగ్రెస్ పార్టీని బతికించాడని అతనికి అన్యాయం జరిగిందని మొసలి కన్నీరు కారుస్తూ, మామిడి నారాయణ మరుస్తున్న విషయం ఒకటి ఉంది. అసలు అద్దంకి దయాకర్ కాంగ్రెస్‌లోకి ఎప్పుడు వచ్చాడు, ఎందుకు అతనికి రెండుసార్లు తుంగతుర్తి టిక్కెట్ ఇచ్చినా గెలవలేదు. అసలు తుంగతుర్తిలోనే కాదు, తెలంగాణలో ఏ ఎస్సీ నియోజకవర్గం తీసుకున్నా అందులో మాదిగల జనాభా సింహభాగం ఉంటుందని ప్రభుత్వ లెక్కలే చెబుతున్నాయి. చాలా గ్రామాల్లో ఒక్క మాల కుటుంబం కూడా లేని ఊర్లు వందలు వేలు. మరి అవకాశాల పరంగా మాత్రం ఏ ఆఫీసు మెట్లెక్కినా, ఏ రాజకీయ పదవులు చూసినా, టిక్కెట్లు చూసినా మాలలే దక్కించుకున్నారు. ఏ సామాజిక వర్గమైనా ఎంత అభివృద్ధి చెందింది అనేది ఏదో ఒక గ్రామాన్ని తీసుకొని కాదు పరిశీలించాల్సింది. సమగ్రంగా మొత్తం జనాభా ఎంత? విద్యా ఉద్యోగ అవకాశాల్లో గద్దల్లా తన్నుకుపోతున్నది ఎవరు? నిజాం కాలం నుండి ఇప్పటి దాకా ఎవరు ఎక్కువగా లాభపడ్డారూ అన్నవి ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ నివేదికలు చెప్పినవి గమనించాలి.

ఇటీవల నా మీద హిందుత్వ వాదులు దాడి చేశారు. అది కేవలం భౌతిక దాడి మాత్రమే. అంతకంటే దారుణమైన దాడి ఆ మాలత్వ దాడి. దళిత ఐక్యతకు, సాధికారతకు గండికొడుతూ తోటి సోదర కులం నుండే దాడి చేయడం హిందుత్వకంటే తక్కువేం కాదు. ఇవాళ దళితులకు హిందుత్వ ఎంత ప్రమాదకరమైందో, ఈ రకమైన మాలత్వ దాడులు అంతకు మించిన ప్రమాదకరం. మాదిగ నాయకులు సమాజానికి మంచి పనులు చేస్తే పలకని గొంతులు, వారు పార్టీలు మారితే మాత్రం నిందలు మోపడంలో ముందుండడం అవకాశవాదం కాదా? ఇప్పుడే కాదు 1990వ దశకంలో కూడా కాన్షీరాం తెలుగు నేల మీద బహుజన రాజ్యాన్ని నిర్మించడానికి కావాల్సిన అన్ని అవకాశాలకు గండికొట్టింది కొద్దిమంది ఆంధ్రాప్రాంత మాల నాయకులే అనేది బహిరంగ రహస్యం.

నారాయణ లాంటివారు చేస్తున్న ఈరకమైన వాదనల వల్ల మాల కులానికే చెడ్డపేరు వస్తున్నది. పాతికేళ్ల నా ఉద్యమ జీవితంలో మాలలతో నాకున్న అనుబంధాన్ని తెంచడం నారాయణ లాంటి వారి వల్ల కాదని తేల్చి చెప్పదలుచుకున్నాను. అస్తిత్వవాదాల పట్ల ప్రజాస్వామిక దృక్పథంతో ఉన్న నా కార్యాచరణ విశాలత చాలా మంది బహుజన మేధావులకు తెలుసు. ఎంతోమంది ప్రగతిశీల మేధావులున్న మాల సామాజిక వర్గానికి మామిడి నారాయణ లాంటి వారు చేస్తున్న నష్టం అంతా ఇంతా కాదు.

● డాక్టర్ పసునూరి రవీందర్
కేంద్ర సాహిత్య అకాడెమి యువ పురస్కార గ్రహీత

తెలుగు రాష్ట్రాలలో బలపడిన బీజేపీ

ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఉత్తర భారతదేశంలో తమ సీట్లను కోల్పోయింది కానీ దక్షిణ భారతదేశంలో తన బలాన్ని పెంచుకుంది. ముఖ్యంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో రెట్టింపు సీట్లను సాధించి, ఓటింగ్ శాతాన్ని గణనీయంగా పెంచుకుంది. తెలంగాణలో గత కొన్ని సంవత్సరాలుగా బీజేపీ తన బలాన్ని పెంచుకుంటూ వస్తోంది. 2019లో నాలుగు ఎంపీ సీట్లను సాధించడంతో పాటు హైదరాబాద్ మహానగర ఎన్నికల్లో ఎక్కువ కార్పొరేటర్ సీట్లను గెలిచింది. రెండు ఉప ఎన్నికలలో గెలవడంతో పాటు పార్టీ తన బలాన్ని తెలంగాణ గ్రామీణ ప్రాంతాలలో విస్తరించుకుంటూ వస్తోంది. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో గతంలో ఉన్న ఒక్క సీటు నుంచి ఎనిమిది సీట్ల వరకు గెలుచుకుంది. దాదాపు 20 చోట్ల రెండవ స్థానంలో ఉండి గట్టి పోటీ ఇచ్చింది. గతంలో ఉన్న ఆరు శాతం నుంచి 14 శాతం వరకు ఓట్లను సాధించింది. బీజేపీ అంటే పట్టణ పార్టీ అన్న ముద్రను పూర్తిగా చెరిపివేసి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ వంటి జిల్లాల్లో ఎక్కువ అసెంబ్లీ స్థానాలను గెలుచుకుంది. ఇటీవల లోకసభ ఎన్నికలలో బిసి సామాజికవర్గానికి చెందిన అభ్యర్థులకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడం, మాదిగ సామాజికవర్గ ప్రజలను తమ వైపు తిప్పుకోవడంలో బీజేపీ విజయం సాధించింది, మోదీ, అమిత్ షా, వివిధ రాష్ట్ర ముఖ్యమంత్రులు, ఉధృతంగా ప్రచారం చేయగా, రాష్ట్ర బీజేపీ నాయకత్వం సమిష్టిగా పనిచేసి ఉత్తమ ఫలితాలను సాధించింది. మొత్తం ఎనిమిది స్థానాలు గెలిచి అధికార కాంగ్రెస్ పార్టీకి ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా తెలంగాణలో అవతరించింది. గత లోక్‌సభ ఎన్నికల్లో 18 శాతం ఓట్లను సాధించిన బీజేపీ, ఇటీవల దానిని 35 శాతానికి పెంచుకొంది. దేశంలో అతిపెద్ద లోక్‌సభ నియోజక వర్గమైన మల్కాజిగిరిని అత్యధిక మెజార్టీతో బీజేపీ గెలవడం ఒక చారిత్రకాత్మక విజయం. కేంద్ర మంత్రివర్గంలో కిషన్‌రెడ్డికి, బండి సంజయ్‌కి అవకాశం దక్కడం సామాన్య కార్యకర్తలకు ఒక ఉత్సాహం నింపే అంశం.

ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి రావటంతో పాటు, బీజేపీ ఎనిమిది ఎమ్మెల్యే స్థానాలు, మూడు ఎంపీ స్థానాలు గెలిచింది. ఇది ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ ప్రాధాన్యతను పెంచే అంశం. దీంతోపాటు పార్టీ కోసం దశాబ్దాలుగా పదవి ఉన్నా లేకున్నా పని చేస్తున్న శ్రీనివాస్ వర్మకి కేంద్ర మంత్రి పదవి, సత్యకుమార్ యాదవ్‌కి రాష్ట్ర మంత్రిమండలిలో స్థానం కల్పించడం పార్టీ అధిష్ఠానం తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయం. ఇది సామాన్య కార్యకర్తలకు కష్టపడి పనిచేయాలనే ఉత్సాహాన్ని ఇవ్వడంతోపాటు భవిష్యత్తులో అందరికీ అవకాశాలు వస్తాయనే ఆలోచనతో పని చేయడానికి వీలుకల్పిస్తుంది. తెలంగాణలో బీజేపీ అధినాయకత్వం రాబోయే గ్రామీణ మున్సిపాలిటీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలోపేతంపై దృష్టి సారించాలి.

– చింత ఎల్లస్వామి
(ఉస్మానియా యూనివర్సిటీ)





ప్రజావాణిలో వినతిపత్రాలు అందిస్తున్న నగరవాసులు

ప్రజావాణి.. మమ..!

- **హాజరు కాని ఉన్నతాధికారులు**

హైదరాబాద్ సిటీ, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిని జీహెచ్ఎంసీలో తూతూమంత్రంగా నిర్వహిస్తున్నారు. ఉన్నతాధికారులు అందుబాటులో ఉండడం లేదు. సోమవారం జరిగిన కార్యక్రమానికి ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించిన కీలక అధికారులు రాలేదు. దీంతో నాలాల పూడికతీత, రహదారుల నిర్మాణం, మరమ్మతు తదితర సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు వచ్చిన వారికి సమాధానం చెప్పే పరిస్థితి లేకుండా పోయింది. మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా రెడ్డి, ఢిల్లీ పర్యటనలో ఉన్నందున కమిషనర్ ఆమ్రపాలి ప్రజావాణికి రాలేదు. ఉన్నతాధికారులూ గైర్హాజరయ్యారు. నేరుగా కార్యాలయానికి వచ్చి 137 మంది ఫిర్యాదు చేయగా.. ఇందులో ఇళ్లకు సంబంధించి 53, పట్టణ

మిగతా 6వ పేజీలో..



హెచ్ఎండీఏ కమిషనర్‌గా సర్ఫరాజ్

- **ఐదేళ్ల తర్వాత పూర్తిస్థాయి కమిషనర్**
- **అసెంబ్లీ ఎన్నికల నిర్వహణలో సర్ఫరాజ్‌కు ప్రత్యేక అవార్డు**



హైదరాబాద్ సిటీ, జూన్24 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) కమిషనర్‌గా సర్ఫరాజ్ అహ్మద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. హెచ్ఎండీఏ కమిషనర్‌గా అదనపు బాధ్యతల్లో ఉన్న దానకిశోర్ నుంచి సర్ఫరాజ్ అహ్మద్ స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు దానకిశోర్ అభినందనలు తెలిపారు. అనంతరం సోమవారం మధ్యాహ్నం అమీర్‌పేటలోని స్వర్ణ జయంతి కాంప్లెక్స్‌లోని హెచ్ఎండీఏ కార్యాలయానికి విచ్చేసిన ఆయన్ను వివిధ విభాగాల అధికారులు పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా హెచ్ఎండీఏలో ఉన్న హెచ్‌జీసీఎల్, బీపీపీఏ, ఉమ్డాలతో పాటు వివిధ విభాగాలైన ప్లానింగ్, డెవలప్‌మెంట్, అర్బన్ ఫారెస్టు తదితర విభాగాల గురించి తెలుసుకున్నారు.

ఐదేళ్ల తర్వాత పూర్తిస్థాయి కమిషనర్

హెచ్ఎండీఏకు ఐదేళ్ల తర్వాత పూర్తిస్థాయి కమిషనర్‌గా వచ్చిన అధికారి సర్ఫరాజ్ అహ్మద్. హెచ్ఎండీఏ కమిషనర్‌గా టీ.జనార్దన్‌రెడ్డి 2019 జనవరి 14 వరకు కొనసాగారు. ఆయన అప్పట్లో నోబుల్‌ప్రైజ్ గ్రహీతల సమావేశానికి అమెరికా వెళ్లడంతో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఐజీగా ఉన్న చిరంజీవులును ఇన్‌చార్జి కమిషనర్‌గా నియమించారు. కేవలం మూడు రోజుల వ్యవధిలోనే చిరంజీవులును తప్పించి అప్పట్లో మున్సిపల్, పురపాలక శాఖ

మిగతా 8వ పేజీలో..

'మహా' మార్పులు..!

- ఆమ్రపాలికి జీహెచ్ఎంసీ కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు
- ఈవీడీఎం డైరెక్టర్‌గా రంగనాథ్
- నాలుగు జోన్లకు నయా కమిషనర్లు
- ఆ రెండు స్థానాల్లో యథాతథం

> బల్దియా యంత్రాంగంలో మహా మార్పులు జరిగాయి. గ్రేటర్‌లో పాలనను గాడిన పెట్టేలా.. పారదర్శక పౌర సేవలందించేలా కొత్త టీం ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఎన్నికల నేపథ్యంలో ఇన్నాళ్లూ జీహెచ్ఎంసీలో అధికారుల మార్పుపై దృష్టి సారించని సర్కారు.. తాజాగా కీలక ఉత్తర్వులు జారీ చేసింది. సోమవారం జరిగిన ఐఏఎస్‌ల బదిలీల్లో జీహెచ్ఎంసీలోని ఆరు స్థానాల్లో మార్పులు చోటు చేసుకున్నాయి.

కీలక స్థానాల్లో కొత్త అధికారులు



రోనాల్డ్ రోస్



ఏవీ రంగనాథ్



పి. ఉపేందర్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్‌ను బదిలీ చేస్తూ, ఆమ్రపాలికి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అసెంబ్లీ ఎన్నికల ముందు జరిగిన బదిలీల్లో గ్రేటర్‌కు వచ్చిన రోనాల్డ్‌రోస్ హయాంలోనే పార్లమెంట్ ఎన్నికలూ జరిగాయి. రోనాల్డ్ సెలవులో ఉండగానే బదిలీ ఉత్తర్వులు వెలువడ్డాయి. పారదర్శక పౌర సేవలందించడంపై రోనాల్డ్ ప్రత్యేక దృష్టి సారించారు. సంస్థలో అక్రమాలకు చెక్ పెట్టేలా కీలక నిర్ణయాలు తీసుకున్నారు. పారిశుధ్య కార్మికులకు సింథటిక్ వేలిముద్రలతో బోగస్ హాజరు వేస్తూ.. రూ.కోట్లు కాజేస్తున్నట్లు గుర్తించిన ఆయన అధునాతన సాంకేతిక పరిజ్ఞానం ద్వారా అవకతవకలు నియంత్రించే ప్రయత్నం చేశారు.

ఈవీడీఎం డైరెక్టర్‌గా ఎన్.ప్రకాష్

ఎన్‌ఫోర్స్‌మెంట్ విజిలెన్స్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ (ఈవీడీఎం) డైరెక్టర్ ఎన్.ప్రకాష్‌రెడ్డి స్థానంలో ఏవీ రంగనాథ్ డైరెక్టర్‌గా బదిలీపై వచ్చారు. నాలుగు జోన్లకు కొత్త కమిషనర్లు వచ్చారు. ఐటీ, రెవెన్యూ విభాగాల అదనపు కమిషనర్, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్‌గా ఉన్న స్నేహ శబరీష్‌ను అదనపు కమిషనర్ బాధ్యతలకు పరిమితం చేశారు. ఈ జోన్‌కు కేంద్ర కార్యాలయంలో పారిశుధ్య నిర్వహణ

మిగతా 8వ పేజీలో..

వాటర్‌బోర్డు ఎండీగా అశోక్‌రెడ్డి

- **15 ఏళ్ల క్రితం ఈడీగా వచ్చి నేడు ఎండీగా..**



వాటర్‌బోర్డు మేనేజింగ్ డైరెక్టర్‌గా కె.అశోక్‌రెడ్డి నియామకమయ్యారు. ఎండీగా కొనసాగుతున్న సుదర్శన్‌రెడ్డిని జీఏడీ కార్యదర్శిగా నియమించారు. గతేడాది కె.అశోక్‌రెడ్డికి కన్ఫర్డ్ ఐఏఎస్ అధికారిగా యూపీపీఎస్సీ నుంచి ఉత్తర్వులు రాగానే ఆయన్ను సమాచార ప్రత్యేక కమిషనర్‌గా అప్పటి ప్రభుత్వం నియమించింది. అయితే గతేడాది డిసెంబర్‌లో హార్టికల్చర్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్‌గా అశోక్‌రెడ్డిని కొత్తగా వచ్చిన ప్రభుత్వం

మిగతా 8వ పేజీలో..

బల్దియాకు కొత్త బాస్ వస్తారా..?

- ఆమ్రపాలికి పూర్తి అదనపు బాధ్యతలు మాత్రమే
- త్వరలో మరోసారి ఐఏఎస్‌ల బదిలీలు!
- ఆ ఉత్తర్వుల్లో కమిషనర్ నియామకంపై స్పష్టత

8

అదనపు నైపుణ్యాలు పొందాల్సిందే

- **ప్రొఫెషనల్స్‌లో మారుతున్న తీరు**
- **ఉద్యోగంపై నమ్మకం సన్నగిల్లుతుండటమే కారణం**



హైదరాబాద్ సిటీ, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): కెరీర్‌కు ఇబ్బంది లేకుండా ఉండాలంటే అదనపు నైపుణ్యాలను పొందాల్సిందేనని 79% మంది ప్రొఫెషనల్స్ భావిస్తున్నారు. టెక్ కంపెనీ, గ్రేట్ లెర్నింగ్ తమ అప్‌స్కిల్లింగ్ ట్రెండ్స్ రిపోర్ట్ 2024-25 మూడవ ఎడిషన్‌లో ఈ విషయాన్ని వెల్లడించాయి. ఇంజనీరింగ్ డిగ్రీలు కలిగి, ఐటీ, టెలికామ్, టెక్ రంగంలో ఉద్యోగం చేసే వారు నైపుణ్యం తప్పనిసరంటున్నారు. నౌకరీ.కామ్ విడుదల చేసిన తాజా నివేదిక ప్రకారం ఉద్యోగ నియామకాలు గత సంవత్సరంతో పోలిస్తే 16%కు పైగా తగ్గడానికి కారణం నైపుణ్యాలు లేకపోవడమేనని చెబుతున్నారు. దేశ వ్యాప్తంగా ప్రధాన నగరాలలో 1000 మంది నిపుణులపై చేసిన ఈ అధ్యయనంలో ప్రస్తుతం తమకున్న నైపుణ్యాలతో ఉద్యోగ జీవితంలో నెట్టుకురావడం కష్టమేనని భావిస్తున్నట్లు తేలింది. మారిన పరిస్థితుల్లో తాము బయటకు పోతామంటే ఉద్యోగులను ఆపేది అనుమానమే అని 38% మంది అంటున్నారు. అనుభవజ్ఞుల సంగతి ఇలాగుంటే ఎంట్రీ లెవల్ ప్రొఫెషనల్స్‌లో కేవలం 29% మందికి మాత్రమే తమ ప్రతిభపై నమ్మకం ఉందని అధ్యయనంలో తేలింది. డాటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్‌లెర్నింగ్ వంటి అంశాలలో నైపుణ్యం పెంచుకోవాలనుకునే వారే అధికంగా కనిపిస్తున్నారు.

రాత్రి 12 వరకు దుకాణాలను తెరిచేలా చూడండి

- **డీజీపీ, సీపీలకు ఎంపీ అసదుద్దీన్ ట్వీట్**

హైదరాబాద్ సిటీ, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): రాత్రి 11 గంటలకు దుకాణాలు బంద్ చేయాలన్న హైదరాబాద్ సీపీ నిర్ణయంపై ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ట్విట్టర్ (ఎక్స్) వేదికగా స్పందించారు. దుకాణాలు బంద్ చేయాలన్న నిబంధనలు ఇరానీచాయ్ హోటల్, పాన్ షాపులకేనా లేక జూబ్లీహిల్స్‌లోని వ్యాపార సముదాయాలకు కూడా వర్తింపజేస్తారా అని ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా అన్ని మెట్రోనగరాల్లో రాత్రి 12 గంటల వరకు వ్యాపార సముదాయాలు తెరిచే ఉంచుతారని, అదే తరహాలో నగరంలో కూడా దుకాణాలు తెరిచేలా చూడాలన్నారు.

బేగంపేట ఎయిర్‌పోర్టుకు బాంబు బెదిరింపు

- **పోలీసుల విస్తృత తనిఖీలు**

బేగంపేట, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): ఎయిర్‌పోర్టులోని పైపులైన్‌లో బాంబులు పెట్టినట్లు బెదిరింపు మెయిల్స్ రావడంతో సోమవారం బేగంపేట విమానాశ్రయంలో పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. డాగ్‌స్క్వాడ్, బాంబుస్క్వాడ్‌లతో విమానాశ్రయం లోపల, వెలుపల తనిఖీలు చేసి ఎలాంటి బాంబు లేదని, ఉత్తుత్తి బెదిరింపులేనని నిర్ధారించారు. తనిఖీల్లో బేగంపేట ఏసీపీ గోపాల కృష్ణమూర్తి, ఇన్‌స్పెక్టర్ రామయ్యతో పాటు పోలీసులు పాల్గొన్నారు. రెండు రోజుల క్రితం దేశంలోని పలు విమానాశ్రయాలకు బాంబు బెదిరింపుల మెయిల్స్ వచ్చిన విషయం విదితమే.



బేగంపేట విమానాశ్రయంలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

బాలికలదే పైచేయి

- **ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల**
- **ఫస్టియర్, సెకండియర్‌లో అధికశాతం మంది ఉత్తీర్ణత**

హైదరాబాద్ సిటీ, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో మరోసారి బాలికలు సత్తాచాటారు. ఏప్రిల్‌లో విడుదలైన వార్షిక ఫలితాల్లో గ్రేటర్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో విజయకేతనం ఎగురవేసిన అమ్మాయిలు.. తాజాగా సప్లిమెంటరీలో కూడా అధిక మొత్తంలో ఉత్తీర్ణత సాధించారు. జిల్లాలో ఫస్టియర్‌కు సంబంధించి మొత్తం 42,390 మంది పరీక్షకు హాజరుకాగా, 23,557 మంది (55.57 శాతం) పాసయ్యారు. 24,589 మంది బాలురు పరీక్ష రాయగా, 12,377 మంది (50.83 శాతం) ఉత్తీర్ణత చెందారు. బాలికలు 17,801 మంది పరీక్ష రాయగా 11,180 మంది (62.80శాతం) పాసయ్యారు. అలాగే సెకండియర్‌లో మొత్తం 32,672 మంది పరీక్షకు హాజరుకాగా.. 10,682 మంది ఉత్తీర్ణత చెందారు. ఇందులో బాలురు 20,685 మందికి గాను 6,105 మంది (29.47 శాతం) పాసయ్యారు. బాలికలు 11,987 మందికి గాను.. 4,577 మంది (38.18 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు.



(ఫైల్)

డిగ్రీ ప్రవేశాలకు..

ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన వారిలో ఎక్కువశాతం మంది ప్రైవేట్ కాలేజీలకు చెందిన విద్యార్థులే ఉన్నట్లు తెలిసింది. అయితే వార్షిక పరీక్షల్లో రెండు, మూడు మార్కుల తేడాతో ఫెయిలైన వారు.. తాజాగా పాస్‌కావడంతో డిగ్రీ ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరేందుకు సిద్ధమవుతున్నారు. దోస్త్ వెబ్‌సైట్ ద్వారా డిగ్రీలో చేరేందుకు కొంతమంది ఆసక్తి చూపిస్తున్నారు.

గ్రేటర్‌లో ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు (జనరల్ విభాగంలో)..

జిల్లా	ఫస్టియర్ (హాజరు)	ఉత్తీర్ణత	శాతం	సెకండియర్ (హాజరు)	ఉత్తీర్ణత	శాతం
హైదరాబాద్	42,390	23,557	55.57	32,672	10,682	32.69
రంగారెడ్డి	39,864	28,899	72.49	16,377	6,954	42.46
మేడ్చల్	36,793	26,857	72.99	14,358	6,141	42.77

ఫెయిల్ అయ్యానని..
ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

అంబర్‌పేట, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ సప్లిమెంటరీలో ఫెయిల్ అయిన ఓ విద్యార్థిని ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కాచిగూడ అడ్మిన్ ఎస్ఐ సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. రత్నానగర్‌లో నివాసముంటున్న ఎల్లయ్య కుమార్తె రిషిక(18) ఇంటర్ రెండో సంవత్సరం చదువుతోంది. మొదటి సంవత్సరంలో మూడు సబ్జెక్టులు ఫెయిల్ అయింది. సప్లిమెంటరీ రాసింది. సోమవారం పరీక్ష ఫలితాలు వచ్చాయి. రిషిక రెండు సబ్జెక్టులు పాసై ఒక సబ్జెక్టు ఫెయిల్ అవడంతో తీవ్ర మనస్తాపానికి గురైంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో సోమవారం రాత్రి ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు రిషిక మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆసుపత్రి మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాఫిక్ వలయంలో అంబులెన్స్‌లు

- సకాలంలో ఆస్పత్రికి వెళ్లలేని పరిస్థితులు
- స్కూల్ స్థాయి నుంచే పిల్లలకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన అవసరం
- ఎన్ఎస్ఎస్ శిక్షణా కార్యక్రమంలో డీజీపీ రవి గుప్తా



ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, అధికారులతో డీజీపీ రవిగుప్తా

హైదరాబాద్ సిటీ, జూన్ 24(ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో 11 శాతం ప్రమాదాలు ఇండియాలోనే జరుగుతున్నాయని, రోడ్ నెట్‌వర్కింగ్ సరిగా లేకపోవడం, రహదారి నిబంధనలను పాటించకపోవడమే కారణాలని తెలంగాణ డీజీపీ రవిగుప్తా తెలిపారు. బషీర్‌బాగ్‌లోని సీసీఎస్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ఎన్ఎస్ఎస్ వలంటీర్ల శిక్షణా కార్యక్రమానికి డీజీపీ, ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. 'మహానగరంలో అతిపెద్ద సమస్య ట్రాఫిక్. మన కుటుంబసభ్యులకో, స్నేహితులకో, తెలిసిన వారికో మెడికల్ ఎమర్జెన్సీ ఏర్పడినపుడు, సకాలంలో అంబులెన్స్ ఆస్పత్రికి చేరుకోలేక పోతుందంటే ట్రాఫిక్ ఇబ్బందులు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు' అని వివరించారు. జపాన్‌లో మాదిరిగా స్కూల్ స్థాయి నుంచే పిల్లలకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ దిశగా ప్రజలకు, వాహనదారులకు అవగాహన కల్పించడానికి, ఎన్ఎస్ఎస్ (నేషనల్ స్టూడెంట్స్ సర్వీస్) వలంటీర్ బృందాలను రంగంలోకి దింపి, శిక్షణ ఇవ్వడం శుభపరిణామం అని అన్నారు. అనంతరం బుర్రా వెంకటేశం మాట్లాడుతూ.. రాష్ట్రంలోని సుమారు 1.50 లక్షల మంది ఎన్ఎస్ఎస్ విద్యార్థుల సర్వీస్‌ను ట్రాఫిక్‌లో వినియోగించుకోవడం మంచి నిర్ణయమన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి, ట్రాఫిక్ అడిషనల్ సీపీ విశ్వప్రసాద్ మాట్లాడుతూ.. పోలీసులు రోజుకు 15 వేల ఉల్లంఘన కేసులు నమోదు చేస్తున్నా, కొంత మంది వాహనదారుల్లో మార్పు రావడం లేదన్నారు. ఇష్టానుసారంగా వాహనాలు నడుపుతూ తోటి వాహనదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. శిక్షణ తీసుకున్న విద్యార్థులు స్కూళ్లు, కళాశాలల్లో విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్‌పై శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని నిర్వహిస్తుంటారని అడిషనల్ సీపీ తెలిపారు. ఒక రోజు మినహాయించి ఒక రోజు ఒక్కో బ్యాచ్‌కు 100 మంది చొప్పున శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. 20 వేల మంది ఎన్ఎస్ఎస్ మహిళా స్టూడెంట్లకు, పది వేల మంది పురుషులకు, విడతల వారీగా మొత్తం 30 వేల మందికి శిక్షణ ఇచ్చి వారి సేవలను ట్రాఫిక్‌లో వినియోగిస్తామన్నారు.

అరాచకశక్తులపై తుపాకీ గురి

- మఫ్టీలో ప్రత్యేక పోలీసు బృందాల ఏర్పాటు
- దొంగల ముఠాలు, స్నాచర్ల భరతం పట్టేందుకు డెకాయ్ ఆపరేషన్స్
- వారం రోజుల్లోనే 9 ముఠాల ఆటకట్టించిన పోలీసులు
- నాలుగు చోట్ల గాల్లోకి కాల్పులు

హైదరాబాద్ సిటీ, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): దొంగల ముఠాలు, చైన్‌స్నాచర్లు, అర్ధరాత్రి దారిదోపిడీలకు పాల్పడే అల్లరి మూకలు, రౌడీగ్యాంగ్‌ల ఆటకట్టించడమే లక్ష్యంగా ప్రత్యేక డెకాయ్ ఆపరేషన్ టీమ్‌లను సిటీ పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి రంగంలోకి దింపారు. నగరంలో అరాచక శక్తుల ఆగడాలను అరికట్టేందుకు చర్యలు చేపట్టారు. ఇటీవల కాలంలో ఎప్పుడూ లేనంతగా చైన్‌స్నాచర్లు పంజా విసురుతున్నారు. ఈ నేపథ్యంలో సీపీ ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేశారు.

డెకాయ్ ఆపరేషన్ ఇలా..

లా అండ్ ఆర్డర్ పోలీసులతో పాటు.. ఇద్దరు ఏఆర్ కానిస్టేబుళ్లను జతచేసి యాంటీ స్నాచింగ్ టీమ్‌గా ఏర్పాటు చేశారు. ఏఆర్ పోలీసుల వద్ద తుపాకులు ఉంటాయి. లా అండ్ ఆర్డర్ కానిస్టేబుల్స్ బస్టాప్‌లు, ఫుట్‌పాత్‌లు, పలు కాలనీల్లోని హాట్‌స్పాట్స్ తదితర ప్రాంతాల్లో రాత్రిపూట మఫ్టీలో సాధారణ పౌరుల్లా



మిగతా 6వ పేజీలో..

నగరంలో 4 చోట్ల కాల్పులు..

ఇటీవల రంగంలోకి దిగిన ప్రత్యేక డెకాయ్ టీమ్‌లు వారం రోజుల వ్యవధిలోనే 9 చైన్ స్నాచింగ్ ముఠాలను పట్టుకున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో నగరంలో నాలుగు చోట్ల కాల్పులు జరిపారు. ఇటీవల చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో అర్ధరాత్రి యాంటీ స్నాచింగ్ టీమ్ పోలీసులు డెకాయ్ ఆపరేషన్‌ను నిర్వహించారు. అర్ధరాత్రి దాటిన తర్వాత 2.40 నిమిషాలకు ఆలుగడ్డబావి బస్టాప్ వద్ద పోకిరీలను పట్టుకునే క్రమంలో వారు పోలీసులతో వాగ్వాదానికి దిగి పెనుగులాడారు. దాంతో ఏఆర్ పోలీసులు గాల్లోకి కాల్పులు జరిపి పోకిరీల ముఠాను పట్టుకున్నారు. అదేరోజు రాత్రి ఆసిఫ్‌నగర్ పరిధిలో స్నాచింగ్ ముఠాను పట్టుకునే క్రమంలో పోలీసులకు చిక్కకుండా పారిపోతున్న ముఠాపై పోలీసులు కాల్పులు జరిపారు. మరోఘటనలో ఇద్దరు ఘరానా దొంగలను పట్టుకునే క్రమంలో డెకాయ్ పోలీసులు సికింద్రాబాద్ పరిధిలో మరోసారి కాల్పులు జరిపారు. ఆదివారం రాత్రి సైదాబాద్ పరిధిలో చైన్ స్నాచింగ్ ముఠాను పట్టుకునే క్రమంలో డెకాయ్ పోలీసులు గాల్లోకి కాల్పులు జరిపినట్లు తెలిసింది. ఇలా ఒక్క వారం రోజుల్లోనే 9 ముఠాల ఆటకట్టించిన పోలీసులు.. నాలుగు చోట్ల పోలీసులు కాల్పులు జరిపారు.

127 కె రూట్‌లో ఎలక్ట్రికల్ ఏసీ మెట్రో లగ్జరీ బస్సులు

హైదరాబాద్ సిటీ, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్, హైటెక్‌సిటీలో పనిచేస్తున్న ఐటీ, ఇతర ఉద్యోగుల కోసం 127కె కోఠి-కొండాపూర్ రూట్‌లో కొత్తగా ఎలక్ట్రిక్ ఏసీ మెట్రో లగ్జరీ బస్సులను సోమవారం నుంచి అందుబాటులోకి తేనున్నట్లు గ్రేటర్ ఆర్టీసీ ఈడీ వెంకటేశ్వర్లు తెలిపారు. 127కె రూట్ కోఠి నుంచి కొండాపూర్‌కు వయా కొత్తగూడ ఎక్స్‌రోడ్, హైటెక్ సిటీ, మాదాపూర్, పెద్దమ్మగుడి, మాసబ్‌ట్యాంక్, లక్డీకాపూల్ మీదుగా ఈ బస్సులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. కొండాపూర్‌లో మొదటి బస్ ఉదయం 5.06 నిమిషాలకు, చివరి బస్సు రాత్రి 10.17 నిమిషాలకు ఉంటుందని, కోఠి నుంచి మొదటి బస్సు ఉదయం 6.16 నిమిషాలకు, చివరి బస్సు రాత్రి 11.27 నిమిషాలకు ఉంటుందని పేర్కొన్నారు. ప్రతీ 24 నిమిషాలకు ఓ బస్సు ఈ రూట్‌లో ప్రయాణికులకు అందుబాటులో ఉంటుందని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



మాట్లాడుతున్న జస్టిస్ లక్ష్మీనారాయణ

డీఆర్టీలో లైబ్రరీ ప్రారంభం

హైదరాబాద్, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ రుణ వసూళ్ల ట్రిబ్యునల్ (డీఆర్టీ) అడ్వకేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అనిల్‌కుమార్ మెమోరియల్ లైబ్రరీ, మహిళా న్యాయవాదుల హాల్‌ను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అలిశెట్టి లక్ష్మీనారాయణ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూనియర్ లాయర్లకు లైబ్రరీ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్టీ ప్రిసైడింగ్ ఆఫీసర్లు గుమ్మడి గోపీచంద్, రామేశ్వర్ గంగారాం, అసోసియేషన్ అధ్యక్షుడు జీకే దేశ్‌పాండే, వైస్ ప్రెసిడెంట్ సుబ్బరాజు, జనరల్ సెక్రటరీ డీ రాఘవులు పాల్గొన్నారు.

ప్రజావాణి.. మమ..!

(5వ పేజీ తరువాయి)

ప్రణాళికా విభాగం- 42, ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి 15 ఉన్నాయి. ఎస్టేట్, వీధి దీపాలు, దోమలు, ఆస్తి పన్ను చెల్లింపునకు సంబంధించి పలువురు ఫిర్యాదు చేశారు. ఫోన్ ద్వారా 15 మంది తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. జోనల్ కార్యాలయాల్లో జరిగిన ప్రజావాణిలో 105 ఫిర్యాదులు వచ్చాయని జీహెచ్‌ఎంసీ పేర్కొంది. నాలాల పూడిక తీత పనులపై గతంలో ఫిర్యాదు చేసిన మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్.. ప్రజావాణికి వచ్చారు. మేయర్, కమిషనర్‌తోపాటు ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి ఉన్నతాధికారులు లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల దృష్టికి తీసుకువచ్చినా పనులు జరగకపోవడాన్ని నిరసిస్తూ, కమిషనర్ కార్యాలయం వద్ద వినతిపత్రం అంటించారు.

అరాచకశక్తులపై తుపాకీ గురి

(5వ పేజీ తరువాయి)

ఒంటరిగా కూర్చొని డెకాయ్ ఆపరేషన్ నిర్వహిస్తుంటారు. ఒంటరిగా ఉన్న వారి వద్దకు దొంగలు, పోకిరీలు, అల్లరిమూకలు, ఇతర నేరస్తులు వచ్చి.. సెల్‌ఫోన్, డబ్బులు, లేదా ఇతర విలువైన వస్తువులను దోచుకునే ప్రయత్నం చేస్తుంటారు. ఈ క్రమంలో మఫ్టీలో కూర్చున్న కానిస్టేబుల్ ఒక్కసారిగా అప్రమత్తమై వారిని పట్టుకునే ప్రయత్నం చేస్తారు. ఆ పక్కనే మాటువేసిన ఏఆర్ కానిస్టేబుల్స్ తుపాకులతో రెడీగా ఉండి రంగంలోకి దిగుతారు. అంతా కలిసి దొంగల ముఠాను పట్టుకునే ప్రయత్నం చేస్తారు. ఈ క్రమంలో దొంగలు, నేరస్తులు వారి వద్ద ఉన్న మారణాయుధాలతో ఎదురు తిరిగితే ఏఆర్ పోలీసులు తుపాకులతో కాల్పులు జరుపుతారు. అలా ఆ ముఠాలను వెంటాడి, వేటాడి మరీ అదుపులోకి తీసుకుంటారు. ఒక వేళ అంతర్రాష్ట్ర ముఠాలు, ఘరానా దొంగలు చిక్కినట్లే చిక్కి పారిపోయే ప్రయత్నం చేస్తే స్థానిక పోలీసుల సహకారంతో పట్టుకుంటారు.

కోకాపేటలో రూ.498 కోట్లతో జీఐఎస్ సబ్‌స్టేషన్

హైదరాబాద్ సిటీ, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విస్తరణ.. పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా కోకాపేటలో 220/132/33 కేవీ గ్యాస్ ఇన్సులేటెడ్ సబ్‌స్టేషన్(జీఐఎస్) నిర్మాణానికి ట్రాన్స్‌కో గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రూ.498 కోట్లతో సవరించిన అంచనాలకు పరిపాలన అనుమతినిస్తూ ట్రాన్స్‌కో సీఎండీ రిజ్వీ సోమవారం ఉత్తర్వు జారీచేశారు. 2023 ఏప్రిల్ 6న రూ.519.77కోట్ల అంచనా వ్యయంతో గతంలో ఉత్తర్వులు ఇవ్వగా, దాన్ని తాజాగా సవరించారు. అంచనా వ్యయం సుమారు రూ.20 కోట్లు తగ్గించారు. కోకాపేట ఉపకేంద్రం నిర్మాణానికి రూ.171.85 కోట్లు, కేతిరెడ్డిపల్లి- శంకర్‌పల్లి 220కేవీ నుంచి కోకాపేట వరకు 14 కిలోమీటర్ల దూరం ఓవర్‌హెడ్ విద్యుత్ లైన్లను మోనోపోల్స్‌తో నిర్మించేందుకు రూ.136.03 కోట్లు అవుతుందని అంచనా వేశారు. గచ్చిబౌలి- రాయదుర్గం 220 కేవీ నుంచి 10.5 కిలోమీటర్లు కోకాపేట వరకు మోనోపోల్స్‌తో ఓవర్ హెడ్‌లైన్లు వేసేందుకు రూ. 109.55 కోట్లు అవుతుందని అంచనాలు రూపొందించారు.

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

మదీన, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రమంలో తమకు అందిన ఫిర్యాదులను పరిశీలించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని జోనల్ కమిషనర్ టి.వెంకన్న తెలిపారు. సోమవారం చాంద్రాయణగుట్ట నర్కిపూల్‌బాగ్‌లోని జోనల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో కమిషనర్ దరఖాస్తులను స్వీకరించారు. ఇందులో సంతోష్‌నగర్ సర్కిల్‌కు చెందిన ఆస్తి పన్ను సమస్యలపై రెండు, పారిశుధ్యం, విద్యుత్ స్తంభం సమస్యలవి నాలుగు ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ టి.వెంకన్న మాట్లాడుతూ ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ జాయింట్ కమిషనర్ శైలజ, డిప్యూటీ డైరెక్టర్ (యూబీడీ) అమినాబీ, వెటర్నరీ విభాగం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, టౌన్‌ప్లానింగ్ జోనల్ సిటీ ప్లానర్ శ్యామ్‌కుమార్, ఎలక్ట్రికల్ ఇన్‌చార్జి ఈఈ రామారావు, బిల్ కలెక్టర్ రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ కాలేజీల ర్యాంక్‌ల విడుదల

నార్సింగ్, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): వీక్‌మ్యాగజైన్ 2024 ఎడిషన్ ఇంజనీరింగ్ కాలేజీల ర్యాంక్‌లను సోమవారం విడుదల చేశారు. హైదరాబాద్‌లో గల ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాల సీబీఐటీ ఆల్ ఇండియా బెస్ట్ కాలేజీలలో 41వ ర్యాంక్, ఆల్ ఇండియా ప్రైవేట్ కాలేజీల కేటగిరిలో 16వ ర్యాంక్, ప్రైవేట్ ఇంజీరింగ్ కాలేజీలలో తెలంగాణ రాష్ట్రంలో 2వ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సీవీ.నరసింహులు మాట్లాడుతూ సీబీఐటీ 45 ఏళ్లుగా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తోందని తెలిపారు. కళాశాలలో కోర్స్ పూర్తిచేసిన విద్యార్థులు వివిధ బహుళ జాతీయ కంపెనీలలో ఉద్యోగాలు లభిస్తున్నాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సీడీసీ, సీబీఐటీ సలహాదారు డాక్టర్ ఎన్ఎల్ఎన్‌రెడ్డి, కళాశాల పీఆర్వో డాక్టర్ జీఎస్ఆర్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సేవల మరింత డిజిటలైజేషన్: డీఈ

నార్సింగ్, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరా మెరుగుపరిచి ప్రజలకు మరింత అత్యాధునిక సమాచారం డిజిటలైజేసన్ చేస్తున్నామని ఇబ్రహీంబాగ్ విద్యుత్ డివిజన్ ఇంజనీర్ ఎం.శివశంకర్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ వ్యవస్థను ఆధునికీకరించి ప్రతి సమాచారం డిజిటలైజేషన్ చేయాలని సంకల్పంతో ముందుకెళుతున్నామన్నారు. ప్రభుత్వం విద్యుత్ వినియోగదారులకు నిరంతర, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందిస్తోందని చెప్పారు. క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది పనిచేస్తున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ జ్ఞానేశ్వర్, సబ్ ఇంజనీర్ చెన్నారెడ్డి, ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మాన్లు పాల్గొన్నారు.

బాధితులకు మొబైల్ ఫోన్లు అందజేత

మదీన, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): వివిధ సందర్భాల్లో మొబైల్‌ఫోన్లు పోగొట్టుకున్న సంఘటనల్లో దర్యాప్తు చేపట్టిన చాంద్రాయణగుట్ట డిటెక్టివ్ పోలీసులు సోమవారం ఎనిమిది ఫోన్లను తిరిగి స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ కె.సత్యనారాయణ స్వాధీనం చేసుకున్న మొబైల్ ఫోన్లను బాధితులను స్టేషన్‌కు పిలిపించి అందజేశారు.

టీడీపీ ఎమ్మెల్యే బాలకృష్ణకు సత్కారం


బాలకృష్ణను సన్మానిస్తున్న గోషామహల్ టీడీపీ సీనియర్ నాయకులు టి.అనిల్

గోషామహల్, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ హిందూపురం నియోజకవర్గంలో రెండోసారి ఎమ్మెల్యేగా విజయకేతనం ఎగరవేసిన బాలకృష్ణను సోమవారం ఆయన నివాసంలో గోషామహల్ నియోజకవర్గం టీడీపీ సీనియర్ నాయకులు అనిల్ కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ... త్వరలో తెలంగాణ రాష్ట్రంలో కూడా టీడీపీకి పూర్వవైభవం వస్తుందని ఆ దిశగా పార్టీ నాయకులు, కార్యకర్తలు సంసిద్ధమవుతున్నారని తెలిపారు.


రోడ్డుపై బైఠాయించిన నిరుద్యోగులు

ఉద్యోగ నోటిఫికేషన్‌ను విడుదల చేయాలి

అఫ్జల్‌గంజ్, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్న 2 లక్షల ఖాళీ ఉద్యోగాల భర్తీకి వెంటనే ఉద్యోగ నోటిఫికేషన్‌ను విడుదలచేయాలని విద్యార్థి, నిరుద్యోగ సమాఖ్య ఆధ్వర్యంలో నాయకులు, పలు సంఘాల ప్రతినిధులు సోమవారం నాంపల్లిలోని తెలంగాణ పబ్లిక్ సర్వీసు కమిషన్ కార్యాలయాన్ని ముట్టడించారు. ప్లకార్డులతో రోడ్డుపై బైఠాయించి కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విద్యార్థి నిరుద్యోగ సమాఖ్య రాష్ట్ర గౌరవాధ్యక్షులు రాజారాంయాదవ్ మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కేవలం ఓట్ల కోసమే కాంగ్రెస్ పార్టీ మోసపూరిత వాగ్దానాలు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.రాజు, దత్తాత్రేయ, అశోక్ యాదవ్, జి.మధు తదితరులు పాల్గొన్నారు.

పోలీసులపై చర్యలు తీసుకోవాలి : బీజేవైఎం

మంగళ్‌హట్, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు అండగా నిలిచేందుకు ప్రజాస్వామ్య పద్ధతిలో తెలంగాణ పబ్లిక్ కమిషన్ కార్యాలయం వద్ద ధర్నా చేసిన పలువురు బీజేవైఎం నాయకులపైన పోలీసులు దాడులకు పాల్పడి అక్రమ కేసులు బనాయించిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు సెవెళ్ల మహేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం నాంపల్లిలోని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులతో తెలంగాణ నిరుద్యోగుల గొంతు నొక్కుతోందన్నారు. పోలీసులు యువ మోర్చా నాయకులను టార్గెట్ చేసి వారిపై దాడి చేస్తున్నారని ఆరోపించారు. పోలీసుల దాడిలో గాయపడిన పలువురు బీజేవైఎం నాయకులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని... దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

పాతకక్షలతో కత్తులతో దాడి

రాజేంద్రనగర్, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): పాతకక్షలతో ఒకిరిపై మరొకరు కత్తులతో దాడి చేసుకున్నారు. ఈ సంఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జలాల్‌బాబానగర్ లో ఆదివారం అర్ధరాత్రి జరిగింది. అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ వెంకట్రామిరెడ్డి వివరాలను వెల్లడించారు. జలాల్‌బాబానగర్‌కు చెందిన జిలానీ, షహబాజ్ స్నేహితులు. వీరికి పాత కక్షలు ఉన్నాయి. ఆదివారం ఇద్దరూ మద్యం తాగారు. ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడానికి ప్రయత్నించగా షహబాజ్ జిలానీపై కత్తితో దాడిచేశాడు. జిలానీ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చేతి బ్యాగులోంచి 8 తులాల బంగారం చోరీ

రాజేంద్రనగర్, జూన్24(ఆంధ్రజ్యోతి): శుభకార్యానికి అమ్మగారింటికి వచ్చిన ఓ మహిళ 8 తులాల బంగారం, రూ.15వేల నగదును పోగొట్టుకుంది. వివరాలను అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ వెంకట్రామిరెడ్డి వెల్లడించారు. కర్ణాటక రాష్ట్రం బసవ కళ్యాణ్ ప్రాంతానికి చెందిన పర్వీనాబేగం తన పుట్టింట్లో శుభకార్యం ఉండగా నాలుగు రోజుల క్రితం హసన్‌నగర్‌కు వచ్చింది. శనివారం తిరిగి బసవకళ్యాణ్ వెళ్లడానికి ముందు హసన్‌నగర్‌లో షాపింగ్‌కు వెళ్లింది. అదే రోజు హసన్‌నగర్‌లో కూరగాయల సంత సాగుతోంది. షాపింగ్ చేస్తున్న పర్వీనా బేగం హ్యాండ్‌బ్యాగ్‌లో ఉంచిన 8 తులాల బంగారం, రూ. 15వేలు కనిపించకుండ పోయాయి. దీంతో ఆమె అత్తాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పులి కలకలం.. జనం బెంబేలు!

- ఆనవాళ్లను గుర్తించిన అటవీశాఖ అధికారులు
- పాదముద్రలు పులివా? లేక హైనావా?
- ల్యాబ్‌కు పంపిన ఫారెస్ట్ అధికారులు
- రెండు బోన్లు, పది కెమెరాల ఏర్పాటు


ఘన్సిమియాగూడ చెరువు వద్ద పులి పాదముద్రల ఆనవాళ్లను గుర్తిస్తున్న ఆటవీశాఖ అధికారులు

శంషాబాద్ రూరల్, జూన్ 24(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండల పరిధిలోని ఘన్సిమియాగూడలో ఆదివారం పులి కలకలంతో ప్రజలు బెంబేలెత్తిపోయారు. దాంతో సోమవారం జిల్లా ఫారెస్ట్ అధికారి సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది మండల పరిధిలోని ఘన్సిమియాగూడ, శంకరపురం పరిసరాల్లో పులి ఆనవాళ్ల(పాద ముద్రలు)ను గుర్తించారు. ఈమేరకు రెండు బోన్లు, పది సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఘన్సిమియాగూడ చెరువు వద్దకు పులి వచ్చిందని, పాదముద్రలు గుర్తించామని అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా, ఆదివారం రాత్రి రెండు లేగదూడలను చంపిందని ఆయా గ్రామాల రైతులు తెలిపారు. అయితే, అసలు అది పులినా? లేక హైనానా అనేది అధికారులకు అంతుచిక్కడం లేదు. ఘన్సిమియాగూడ చెరువు వద్ద గుర్తించిన పాదముద్రల శాంపిళ్లను ల్యాబ్‌కు పంపించనున్నట్లు అధికారులు తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో చిన్న వయస్సుగల చిరుత పులి పాదముద్రలు ఉన్నాయని, మరికొన్ని ప్రాంతాల్లో హైనా పాద ముద్రలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. ఏదేమైనా శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపితే ఆ గుర్తులు పులివా? లేదా హైనావా? లేక అడవి పిల్లివా? అనేది గుర్తించనున్నట్లు ఆటవీ శాఖఅధికారులు తెలిపారు. ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని వారు సూచించారు. రైతులు ఒంటరిగా పొలాల వద్దకు వెళ్ల వద్దని, గుంపులు, గుంపులుగా వెళ్లాలని సూచించారు. త్వరలోనే మరిన్ని సీసీకెమెరాలు, బోన్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. గతంలో ఎయిర్ పోర్టులో చిరుత పులిని పట్టుకున్నామని, ఒకవేళ ఇక్కడ కూడా పులి సంచరిస్తున్నట్లయితే త్వరలోనే బంధిస్తామని, సిబ్బంది గస్తీ తిరుగుతున్నారని, ఎవరికి పులి కనిపించినా వెంటనే ఆటవీ శాఖ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. మంగళవారం మరిన్ని బోన్లు ఏర్పాటు చేస్తామని వారు చెప్పారు.

మహిళా వైద్యురాలిని బెదిరించి రూ.5.05 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

హైదరాబాద్‌సిటీ, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): 'మీ బ్యాంకు ఖాతాల నుంచి ఉగ్రవాదులకు డబ్బులు వెళ్లాయని, వెంటనే అరెస్ట్ చేయడంతోపాటు ఆస్పత్రి లైసెన్స్ కూడా కేన్సిల్ చేయిస్తాం' అని మహిళా వైద్యురాలిని సైబర్ నేరగాళ్లు బెదిరించి, ఆమె నుంచి డబ్బును కాజేశారు. మహిళా వైద్యురాలికి(31) కొత్త నెంబర్ నుంచి ఫోన్ వచ్చింది. ఫెడెక్స్ కొరియర్ నుంచి ఫోన్ చేస్తున్నామని పరిచయం చేసుకున్న వ్యక్తి 'మీ పేరుతో ముంబై నుంచి ఇరాన్‌కు పంపిన పార్సిల్‌ను క్రైం బ్యూరో అధికారులు స్వాధీనం చేసుకున్నారు' అని చెప్పాడు. ముంబై క్రైం బ్రాంచ్ పోలీసులు కేసు కూడా నమోదు చేశారని, కేసుకు సంబంధించిన ఇతర వివరాల గురించి అధికారులతో సంప్రదించమని ఇంకో వ్యక్తికి కాల్ కనెక్ట్ చేశాడు. ముంబై సైబర్ క్రైం బ్రాంచ్ అధికారిగా పరిచయం చేసుకున్న అతడు 'మీ ఆధార్ కార్డుతో మరో కొన్ని బ్యాంకు ఖాతాలున్నాయి. వాటి నుంచి ఉగ్రవాదులకు డబ్బు వెళ్లింది. మీ ఆధార్ కార్డు వివరాలు, సీవీవీ నెంబర్ క్లాక్‌చేసి, క్రెడిట్, డెబిట్ కార్డు, వివరాలు ఇవ్వాలి' అని సూచించాడు. ఐ మొబైల్ యాప్ ద్వారా లోన్ కోసం దరఖాస్తు చేయాలని సూచించాడు. అనుమానం వచ్చిన బాధితురాలు పోలీస్‌స్టేషన్‌కు వెళతాను అని చెప్పగా, ఆగ్రహం వ్యక్తం చేసిన సైబర్ నేరగాడు. మరో 10 నిమిషాల్లో అరెస్ట్ చేయిస్తానని చెప్పి బెదిరించాడు. ఈ కేసులో మూడేళ్లపాటు జైలులో ఉంచుతామని, ఉగ్రవాదులకు సాయం చేసినందుకు మెడికల్ లైసెన్స్ కూడా రద్దు చేయిస్తామని హెచ్చరించాడు. కేసు నుంచి తప్పించాలంటే రూ.5.80 లక్షలు చెల్లించాలని డిమాండ్‌చేసి, తన ఖాతాలోకి డబ్బు బదిలీ చేయించుకున్నాడు. డబ్బు బదిలీ సందర్భంగా బ్యాంకు నుంచి రావాల్సిన కన్‌ఫర్మేషన్ కాల్ రాకపోవడం, ఖాతాలో డబ్బులు మాయం కావడంతో మోసపోయానని గ్రహించిన బాధితురాలు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారి సూచనల మేరకు సైబర్ క్రైం ఠాణాలో ఫిర్యాదు చేసింది. గుర్తు తెలియన వ్యక్తులు ఫోన్‌చేసి, కేసుల పేరుతో బెదిరిస్తే వెంటనే ఫోన్‌ను కట్ చేసి, పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

బోనాల ఉత్సవాలపై సమీక్షా సమావేశం


మహిళకు చెక్కును పంపిణీచేస్తున్న ఎమ్మెల్యే టి.రాజాసింగ్, కార్పొరేటర్లు

గోషామహల్, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టి పడేలా బోనాల ఉత్సవాలు నిర్వహించాలని గోషామహల్ ఎమ్మెల్యే టి.రాజాసింగ్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం గోషామహల్ నియోజకవర్గంలోని పలు అమ్మవారి ఆలయాల్లో బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు హిందీనగర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ప్రభుత్వ అన్ని విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే రాజాసింగ్, గోల్కొండ జిల్లా అధ్యక్షులు వి.పాండుయాదవ్, కార్పొరేటర్లు రాకేశ్ జైస్వాల్, లాల్‌సింగ్, డాక్టర్ సురేశ్ ఓంప్రకాశ్, నాంపల్లి ఎమ్మార్వో ఎం.ప్రేమ్‌కుమార్, జీహెచ్ఎంసీ డీసీ విద్యాధర్, ఆబిడ్స్ ఏసీపీ చంద్రశేఖర్‌లతో కలిసి బోనాల ఉత్సవాలపై కీలక ఆదేశాలను అధికారులకు ఎమ్మెల్యే జారీచేశారు. ఈ సందర్భంగా గోషామహల్ నియోజకవర్గంలో అర్హులైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే రాజాసింగ్ పంపిణీ చేశారు.

● మదీన: రానున్న బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని వివిధ దేవాలయాల కమిటీల ప్రతినిధులతో సోమవారం బహదూర్‌పురా మండల తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఫలక్‌నుమా సర్కిల్-10 డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, బండ్లగూడ తహసీల్దార్ కె.చంద్రశేఖర్‌లు మాట్లాడుతూ, ఉత్సవాల సందర్భంగా గతేడాది ఆలయాల వద్ద కలిగిన ఇబ్బందులు, అసౌకర్యాలపై చర్చించారు. సమస్యలను జీహెచ్ఎంసీ, దేవాదాయ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తహసీల్దార్ తెలిపారు.

నవ్యతలోనూ ముందంజలో ఆధునిక కవులు


కవి ముకుంద రామారావును సత్కరిస్తున్న ఎల్లూరి శివారెడ్డి, చెన్నయ్య

అఫ్జల్‌గంజ్, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): ఆధునిక కవులు అనుకరణలోనే కాదు తమదైన నవ్య కల్పనలో ముందంజలో ఉంటున్నారని ప్రముఖ కవి, అనువాదకులు వై.ముకుంద రామారావు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్తు ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో పరిణతవాణి ప్రసంగంలో ఆయన మాట్లాడుతూ... వలసపోయిన మందహాసం అనే కవిత సంపుటి నుంచి మొదలుకొని ఇప్పటి వరకు 8 కవితా సంపుటాలను వెలువరించామని ఆయన తెలిపారు. 1911 నుంచి నోబెల్ బహుమతి గ్రహీతల కవిత్వాన్ని, కవుల పరిచయాన్ని తెలుగులో అందించానని ముకుంద రామారావు తెలిపారు. కార్యక్రమంలో పరిషత్తు అధ్యక్షులు ఎల్లూరి శివారెడ్డి, ప్రాచ్య కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ సి.సిల్మానాయక్, పరిషత్ ప్రధానకార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

భూదాన్ భూముల అన్యాక్రాంతంపై

హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారించాలి : సీపీఐ


తెలంగాణ సర్వోదయ మండలి నూతన అధ్యక్షుడు శంకర్‌నాయక్‌ను అభినందిస్తున్న మాజీ ఎంపీ అజీజ్‌పాషా

బర్కత్‌పుర, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): భూదాన్ భూముల అన్యాక్రాంతంపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయవిచారణ జరిపించాలని సీపీఐ మాజీ ఎంపీ అజీజ్‌పాషా డిమాండ్ చేశారు. పేదలకు చెందాల్సిన భూదాన్ భూములను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ సర్వోదయ మండలి 3వ రాష్ట్ర మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.శంకర్‌నాయక్ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన అజీజ్‌పాషా మాట్లాడుతూ భూదాన్ భూములు గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల అక్రమాలకు గురయ్యాయని ఆరోపించారు. అఖిల భారత సర్వసేవా సంఘ్ మేనేజింగ్ ట్రస్టీ షేక్‌హుస్సేన్, దక్షిణ భారత సమన్వయకర్త మోటూరి కృష్ణప్రసాద్‌లు మాట్లాడుతూ భూదాన్ కుంభకోణం అతిపెద్దదని, మాజీ చైర్మన్ గున్నా రాజేందర్‌రెడ్డి అక్రమాలపై సీబీఐతో విచారణ జరిపించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర నూతన అధ్యక్షుడు ఆర్.శంకర్‌నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో మండలి నాయకులు గిరిప్రసాద్, మునీరుద్దీన్, షేక్ మహమూద్, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి హైదరాబాద్ రియలైజేషన్ టూర్


సహజ యోగా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు గౌరు కృష్ణ

బర్కత్‌పుర, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ప్రతి మనిషికీ సహజ యోగా ద్వారా వచ్చే ప్రశాంతత, ఆనందాన్ని అందించడానికి ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు హైదరాబాద్ రియలైజేషన్ టూర్ నిర్వహిస్తున్నట్లు సహజయోగా తెలంగాణ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు గౌరుకృష్ణ తెలిపారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 500 మంది ప్రతినిధులు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి హాజరవుతారని, నాలుగు రోజుల పాటు సహజయోగా పరిచయ కార్యక్రమాలను వివిధ కళాశాలలు, పాఠశాలల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 28న సాయంత్రం 5 గంటలకు, నిజాం కళాశాల మైదానంలో ఈ నెల 29న సాయంత్రం 5 గంటలకు, చందానగర్ సీజేఆర్ స్టేడియంలో 30 సాయంత్రం 5 గంటలకు సహజయోగా పరిచయ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సహజయోగా 170 దేశాలలో వ్యాపించి ఉందని మాతాజీ నిర్మలదేవి దీనిని స్థాపించారని తెలిపారు. ఈ నెల 26న కాచిగూడ నుంచి బషీర్‌బాగ్ వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కె.సుబ్బిరెడ్డి, రామ్మోహన్‌రావు, మల్లారెడ్డి, సుప్రజ, సునీల్ ఆగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.


ఖిల్వత్‌లో జూనియర్ కళాశాల విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలను వివరిస్తున్న బేగంపేట్ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ శంకర్‌రాజు

రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన

చార్మినార్ జూన్ 24 (ఆంధ్రజ్యోతి): వేగంగా ప్రయాణించడం కన్నా సురక్షితంగా గమ్యం చేరుకోవడం చాలా ముఖ్యమని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ జి.శంకర్‌రాజు అన్నారు. సోమవారం పాతబస్తీ ఖిల్వత్‌లోని తపస్యా జూనియర్ కళాశాలలో రోడ్డు ప్రమాదాలు.. నివారణ అనే అంశంపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు అయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ నగరంలో రాంగ్ సైడ్ డ్రైవింగ్, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే జరిమానా, మూడు నెలల జైలుశిక్షను విధిస్తారన్నారు. ప్రతి ఒక్కరూ వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలన్నారు. యువత అతివేగంతో వాహనాలను నడుపుతూ ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, వైస్‌ప్రిన్సిపాల్ ఫలక్‌నుమ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్, టీటీఐ బేగంపేట, హీరోమోటార్, సిబంది పాల్గొ

మద్యం మత్తులో హెయిర్ సెలూన్ ధ్వంసం

ముగ్గురిపై కేసు నమోదు


ధ్వంసమైన హెయిర్ సెలూన్

రాజేంద్రనగర్, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ సర్కిల్ దానమ్మ జోపిడీ, ఓవైసీ హిల్స్, ఇడ్లీ హోటల్ వద్ద ఉన్న ఓ హెయిర్ సెలూన్‌ను మద్యంమత్తులో ముగ్గురు యువకులు ధ్వంసం చేశారు. ఈ సంఘటన ఆదివారం రాత్రి 10:30 గంటలకు జరిగింది. వివరాలు ఈ విధంగా ఉన్నాయి.... దానమ్మ జోపిడీ ప్రాంతంలో బిహార్ కు చెందిన షౌకీన్‌కు హెయిర్ సెలూన్ ఉంది. అక్కడికి ఆదివారం రాత్రి 10:30 గంటల సమయంలో మద్యం తాగి ఓవైసీహిల్స్‌కు చెందిన ఆయాన్, నదీమ్, సర్వర్‌లు వచ్చారు. తమకు మసాజ్‌చేయాలని నిర్వాహకులు షౌకీన్‌ను కోరారు. ఆయన ఒకరికి చేశాడు. మిగతా ఇద్దరికి కూడా మసాజ్‌చేయాలని ఒత్తిడితెచ్చారు. డబ్బులివ్వకుండా మసాజ్ చేయమంటే ఎలా అని ప్రశ్నించడంతో అయాన్, నదీమ్, సర్వర్‌లు సెలూన్‌ను పూర్తిగా ధ్వంసం చేశారు. దుకాణంలో పనిచేస్తున్న ఇద్దరిని గాయపరిచి పారిపోయారు. స్థానికులు ఈ గొడవను చూసి అక్కడికి చేరుకుని ఓవైసీ హిల్స్‌కు చెందిన కొందరు యువకులు గంజాయితాగి తరచూ ఈ ప్రాంతంలో గొడవలకు పాల్పడుతుంటారని అన్నారు. సెలూన్ బిహార్‌కు చెందిన యువకులది కావడంతో వారిని కొట్టి డబ్బులు లాక్కుంటారని, ఫ్రీగా కటింగ్‌చేయాలని ఒత్తిడిచేస్తారన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

కేసు నమోదు చేశాం

దానమ్మ జోపిడీ ప్రాంతంలో హెయిర్ సెలూన్‌ను ధ్వంసం చేసిన కేసులో 20 నుంచి 25 సంవత్సరాల వయస్సు ఉన్న అయాన్, నదీమ్, సర్వర్‌లపై ఫిర్యాదు అందిందని, వారిపై కేసులు నమోదు చేశామని మైలార్‌దేవుపల్లి ఇన్‌స్పెక్టర్ పి.మధు తెలిపారు. తాగి ఈ గొడవకు దిగారని తెలిసిందన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో కుళ్లిన కోడిగుడ్ల పంపిణీ


కుళ్లిపోయిన కోడిగుడ్డు

చాంద్రాయణగుట్ట, జూన్ 24(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు పంపిణీ చేసిన కోడిగుడ్లు కుళ్లిపోయిన ఘటన హైదరాబాద్ పాతబస్తీలో కలకలం రేపింది. ఉప్పుగూడ డివిజన్‌లోని భానోదయ సంఘం, సిక్‌వాడి కేంద్రంలో సోమవారం పిల్లలకు గుడ్లు పంపిణీ చేశారు. తీరా ఇంటికి తీసుకెళ్లి పగులగొట్టేసరికి పూర్తిగా కుళ్లిపోయి కనిపించాయి. దీంతో పిల్లల తల్లిదండ్రులు అంగన్‌వాడీ టీచర్లకు ఫిర్యాదు చేశారు. "గుడ్లను ఇంటికి తీసుకెళ్లడం వల్ల పెద్దలు చూశారు కాబట్టి సరిపోయింది కానీ పిల్లలైతే తెలియక తినేసే వారు కదా" అని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని అంగన్‌వాడీ టీచర్లు తెలిపారు. సోమవారం రెండు కేంద్రాల్లో సుమారు 20 గుడ్లు కుళ్లిపోయి కనిపించాయి. రెడ్, బ్లూకలర్ స్టాంప్ వేసిన గుడ్లు బాగుండడం లేదని తల్లిదండ్రులు వాపోతున్నారు.

నీటి సంపులో పడి రెండేళ్ల బాలుడి మృతి


అబ్దుల్ కరీం మృతదేహం

మదీన, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పక్కింట్లో ఆడుకోవడానికి వెళ్లిన రెండేళ్ల బాలుడు ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి మృతిచెందాడు. బండ్లగూడ ఇన్‌స్పెక్టర్ కె.సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం... బండ్లగూడ సాదత్‌నగర్‌కు చెందిన షాజహాన్, ఖాతూన్‌ల కుమారుడు అబ్దుల్‌కరీం(2) సోమవారం సాయంత్రం పక్కింట్లో ఆడుకోవడానికి వెళ్లాడు. ఆ సమయంలో ఇంట్లోవారు పనిలో ఉన్నారు. ఆ బాలుడు ప్రమాదవశాత్తు ఇంటి ఆవరణలోని సంపులో పడిపోయాడు. కొద్దిసేపటి తర్వాత గమనించిన వారు వెంటనే అతన్ని బయటికి తీసి ఒవైసీ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే బాలుడు మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ మేరకు కేసును బండ్లగూడ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సంగారెడ్డి పీఎస్‌లో తప్పిపోయిన బాలుడు


పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఉన్న తప్పిపోయిన బాలుడు

సంగారెడ్డిక్రైం, జూన్ 24: తప్పిపోయిన ఓ బాలుడు సంగారెడ్డి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఉన్నాడు. పట్టణ సీఐ భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.... సోమవారం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో ఓ బాలుడు తన పేరు అర్బజ్ అని, తండ్రి ఆరీఫ్ అని, హైదరాబాద్ మణిగొండ అని తెలుపుతూ బస్ ఎక్కి సంగారెడ్డికి వచ్చినట్టు చెప్పారు. సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి ముందు ఏడుస్తూ కనిపించగా స్థానికులు ఆ బాలున్ని పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. ఆ బాలుడి ఆచూకీ తెలిసిన వారు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ భాస్కర్ కోరారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న బండ్లగూడ ఇన్‌స్పెక్టర్ కె.సత్యనారాయణ

మదీన, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): నగరంలో జరుగుతున్న వరుస హత్యలు, హత్యాయత్నాల నేపథ్యంలో బండ్లగూడ ఇన్‌స్పెక్టర్ కె.సత్యనారాయణ సోమవారం స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్లను స్టేషన్‌కు పిలిపించి నేరాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. అదేవిధంగా వాహనాల తనిఖీలు నిర్వహించి మూడు నెంబర్ ప్లేట్లులేని వాహనాలను సీజ్‌చేశారు. నిర్ణీత సమయం ప్రకారం రాత్రి దుకాణాలను మూసివేయిస్తున్నట్లు ఆయన తెలిపారు.

దోస్త్ ప్రవేశాల్లో సిటీ కళాశాల టాప్

చార్మినార్ జూన్ 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 2024 -25 విద్యాసంవత్సరంలో ప్రవేశం కోసం అత్యధికంగా విద్యార్థులు ప్రభుత్వ సిటీ కళాశాలను ఎంపిక చేసుకున్నారని సిటీ కళాశాల ప్రిన్సిపాల్ బాల భాస్కర్ తెలిపారు. కళాశాలలో ఉన్న అన్ని కోర్సులలో మెరిట్ ప్రకారం 95 శాతం సీట్లు విద్యార్థులకు కేటాయించబడ్డాయని చెప్పారు. ఈసారి కూడా అధికసంఖ్యలో విద్యార్థులు సిటీ కళాశాలను ప్రథమ ప్రాధాన్యతగా ఎంపిక చేసుకున్నారన్నారు. దోస్త్ ప్రవేశాల్లో మూడు సంవత్సరాల నుంచి సిటీ కళాశాల మొదటి స్థానంలో నిలిచి, అరుదైన రికార్డు సృష్టించిందన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కళాశాలలు, యూనివర్సిటీ కళాశాలల కంటే సిటీ కళాశాలలో చదవటానికే మొగ్గు చూపుతున్నట్లు సంబంధిత గణాంకాలు తెలియజేస్తున్నాయని చెప్పారు. ప్రతి సంవత్సరం విద్యార్థుల భవిష్యత్‌కు అవసరమైన కొత్త కోర్సులను కళాశాల ప్రవేశ పెడుతుండటం కూడా గమనార్హం అని ఆయన తెలిపారు.

ఓబీసీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా సత్యనారాయణ

రాజేంద్రనగర్, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా రాజేంద్రనగర్ సర్కిల్ హిమాయత్‌సాగర్ గాంధీనగర్‌కు చెందిన డి.సత్యనారాయణ ముదిరాజ్ నియమితులైనారు. ఈ మేరకు ఆయనకు సోమవారం బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ నియామకపత్రాన్ని అందజేశారు.

రాజేంద్రనగర్ జలమండలి జీఎంగా సాయిలక్ష్మి

రాజేంద్రనగర్, జూన్24(ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ డివిజన్ జలమండలి జనరల్ మేనేజర్‌గా ఎన్.సాయిలక్ష్మి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రాజేంద్రనగర్ డివిజన్‌లో జీఎంగా పనిచేస్తున్న శ్యాంసుందర్ సైదాబాద్ డివిజన్ జీఎంగా బదిలీపై వెళ్లారు. సాయిలక్ష్మిని రాజేంద్రనగర్ డివిజన్ డిప్యూటీ జనరల్‌మేనేజర్ జమీల్ అల్తాప్ హుస్సేన్, మేనేజర్లు రాంనర్సింహ్మారెడ్డి, ఖాదర్, శ్రావ్యరెడ్డి సిబ్బంది సన్మానించారు.

ఐఐఎంఆర్‌లో హిందీ వర్క్‌షాప్

రాజేంద్రనగర్, జూన్24(ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రీసెర్చ్(ఐఐఎంఆర్)లో సోమవారం హిందీ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ హిందీ ట్రైనింగ్ సబ్ ఇనిస్టిట్యూట్ మాజీ ఇన్‌చార్జి, డిప్యూటీ డైరెక్టర్ జయశంకర్ ప్రసాద్‌తివారి హిందీ భాషకున్న ప్రాధాన్యం గురించి వివరించారు. కార్యక్రమంలో ఐఐఎంఆర్ డైరెక్టర్ డాక్టర్ తారా సత్యవతి, హిందీ సెల్ ఇన్‌చార్జి డాక్టర్ జిను జాకబ్, సీనియర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ రీతుదలాల్, అసిస్టెంట్ చీఫ్ టెక్నికల్ ఆఫీసర్ డాక్టర్ మహేశ్ కుమార్ పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణ మహోత్సవం


స్వామిని దర్శించుకుంటున్న శ్రీధర్ తదితరులు

రాజేంద్రనగర్, జూన్ 24(ఆంధ్రజ్యోతి): బుద్వేల్‌లోని శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి మఠం 22వ వార్షికోత్సవ సందర్భంగా సోమవారం స్వామి కల్యాణమహోత్సవం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధానకార్యదర్శి వై.శ్రీధర్ భక్తులు పాల్గొన్నారు.

జన్మభూమి ఎక్స్‌ప్రెస్ యథాతథం

హైదరాబాద్ సిటీ, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ బ్లాక్స్(పట్టాల మరమ్మతు) కారణంగా ఆదివారం నుంచి రద్దయిన జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైళ్లను పునరుద్ధరించినట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. లింగంపల్లి నుంచి విశాఖపట్నం వెళ్లే జన్మభూమి ఎక్స్‌ప్రెస్ మంగళవారం నుంచి, విశాఖపట్నం నుంచి హైదరాబాద్ వచ్చే జన్మభూమి ఎక్స్‌ప్రెస్ బుధవారం నుంచి యథాతథంగా నడుస్తాయని పేర్కొన్నారు.

'పాలిసెట్' వెరిఫికేషన్ నేటితో ఆఖరు

హైదరాబాద్‌సిటీ, జూన్ 24(ఆంధ్రజ్యోతి): పాలిసెట్‌లో ర్యాంకులు పొందిన అభ్యర్థులకు ధ్రువపత్రాల పరిశీలన మంగళవారంతో ముగియనుందని సాంకేతిక విద్యాశాఖ అధికారులు తెలిపారు. నాలుగు రోజులుగా రాష్ట్రంలోని 32 హెల్ప్‌లైన్ సెంటర్లకు ధ్రువపత్రాల పరిశీలన నిమిత్తం 20,535మంది అభ్యర్థులు హాజరయ్యారని, సోమవారం ఒక్కరోజే 6,668మంది అభ్యర్థులు సర్టిఫికేట్ వెరిఫికేషన్ చేయించుకున్నట్లు పేర్కొన్నారు. కాగా, ఇప్పటివరకు 8,090మంది వివిధ పాలిటెక్నిక్‌లలో అడ్మిషన్ల కోసం ఆప్షన్లను ఎంచుకోగా, అత్యధికంగా ఒక అభ్యర్థి 370 ఆప్షన్లు పెట్టుకున్నట్లు వెల్లడించారు.



బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్

'ప్రజావాణి'లో 76 ఫిర్యాదులు

హైదరాబాద్ సిటీ, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమంలో వివిధ సమస్యలపై 76 ఫిర్యాదులు అందాయి. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ఈ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి వారంలోగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అంకిత భావంతో పనిచేసే అధికారులకు గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి, ఆర్డీఓలు మహిపాల్, దశరథ్‌సింగ్, వివిధ శాఖల అధికారులు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిదేళ్ల బాలికకు అరుదైన వైద్యం

- దెబ్బతిన్న లిగమెట్లు
- కొండాపూర్‌లోని కిమ్స్‌లో శస్త్రచికిత్స



డాక్టర్ ప్రతాప్ పర్వతనేని

హైదరాబాద్ సిటీ, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): ఎనిమిదేళ్ల బాలికకు లిగమెంట్లు దెబ్బతినడంతో ఆర్థోస్కోపీ ప్రక్రియ నిర్వహించి కిమ్స్ వైద్యులు సరిచేశారు. ఎనిమిదేళ్ల వయసున్న పిల్లలకు యాంటీరియర్ క్రూషియేట్ లిగమెంట్ శస్త్రచికిత్స చేయడం ఇదే మొదటిసారని వైద్యులు తెలిపారు. స్కూల్లో కుంగ్‌ఫూ నేర్చుకుంటున్న సమయంలోనే కేపీహెచ్‌బీ కాలనీకి చెందిన ఆ పాప (8)కు మోకాలికి దెబ్బ తగిలింది. తల్లిదండ్రులు నాలుగు రోజులపాటు పలు ఆస్పత్రులలో చూపించారు. వైద్యులు ఆ పాపకు ఎంఆర్ఐ తీయించి పరిశీలించారు. అందులో యాంటీరియర్ క్రూషియేట్ లిగమెంట్ (ఏసీఎల్) చిరిగినట్లు గుర్తించి ఆపరేషన్ చేయాలని సూచించారు. చివరకు కొండాపూర్ కిమ్స్‌కు వచ్చారు. ఆమెను ఆర్థోస్కోపి, స్పోర్ట్స్ మెడిసిన్ సర్జన్ డాక్టర్ ప్రతాప్ పర్వతనేని పరిశీలించి మోకాలిలోని ఏసీఎల్ పూర్తిగా దెబ్బతినదని నిర్ధారించారు. దీంతో ఆమెకు ఇటీవల ఆర్థోస్కోపి అనే శస్త్రచికిత్స చేశారు. తర్వాత ఆమెకు పూర్తిస్థాయిలో ఫిజియోథెరపీ సేవలు అందించారు. ప్రస్తుతం పాప కోలుకుందని, ఇంతకు ముందులాగే ఆటల్లో కూడా పాల్గొనగలుగుతోందని డాక్టర్ ప్రతాప్ వివరించారు. ఏడాదికి ఒకటి లేదా రెండు కేసులు మాత్రమే ఇలాంటివి వస్తాయని ఆయన చెప్పారు.

గోర్ బోలి భాషను కాపాడాలి



పద్మశ్రీ కేతావత్ సోమ్‌లాల్

రామంతాపూర్, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): దేశంలో దాదాపు 15 కోట్ల మంది మాట్లాడే గోర్‌బోలి బంజారా భాషను కాపాడాలని, దానిని ఎలా అభివృద్ధి చేసుకోవచ్చో కవులు, కళాకారులు, సాహితీవేత్తలు ఆలోచన చేయాలని పద్మశ్రీ కేతావత్ సోమ్‌లాల్ కోరారు. హబ్సిగూడలోని తన నివాసంలో సోమవారం 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడుతూ గోర్ బంజారాల వేషం దాదాపుగా మరుగున పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. గోర్‌బోలి భాష మరుగున పడిపోతే గోర్ బంజారా జాతి నశించిపోయే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం గిరిజన జానపద సాహిత్య అధ్యయన కేంద్రాన్ని ఏర్పాటు చేసి గోర్‌బోలిని అభివృద్ధి చేయడానికి కృషి చేయాలని కోరారు.



కలెక్టర్‌కు లేఖ అందజేస్తున్న కార్పొరేటర్లు

మీర్‌పేట్ డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాసం

- కలెక్టర్‌కు లేఖ అందజేసిన కార్పొరేటర్లు

సరూర్‌నగర్, జూన్ 24(ఆంధ్రజ్యోతి): మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్‌పేట్ కార్పొరేషన్‌లో డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాసం ప్రవేశపెడుతూ మెజారిటీ కార్పొరేటర్లు సోమవారం రంగారెడ్డి కలెక్టర్ శశాంకకు లేఖ అందజేశారు. గత ఫిబ్రవరి 22న మేయర్ దుర్గాదీప్‌లాల్‌పై అవిశ్వాసం వ్యక్తం చేస్తూ కార్పొరేటర్లు కలెక్టర్‌కు లేఖ ఇవ్వగా, దానిపై మార్చి 11న జరిగిన ప్రత్యేక సమావేశం అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. నాటినుంచి స్తబ్దుగా ఉన్న మీర్‌పేట్ రాజకీయం.. తాజా నోటీసుతో మరోసారి వేడెక్కింది.

అన్ని పార్టీల సభ్యుల సంతకాలతో లేఖ

మీర్‌పేట్ డిప్యూటీ మేయర్‌గా బీఆర్‌ఎస్‌కు చెందిన తీగల విక్రమ్‌రెడ్డి కొనసాగుతున్నారు. ఆయనపై అవిశ్వాసం ప్రకటిస్తూ బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌కు చెందిన సభ్యులు కలిపి మొత్తం 31మంది సోమవారం రంగారెడ్డి కలెక్టర్‌ను కలిసి లేఖ అందజేశారు. అయితే, మేయర్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాసం వీగిపోయిన నేపథ్యంలో ఇప్పటి అవిశ్వాసం అయినా నెగ్గుతుందా లేదా? అన్న చర్చ స్థానికంగా నడుస్తోంది.

26న పాఠశాలల బంద్ : ఏబీవీపీ

పంజాగుట్ట, జూన్24 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల ఫీజుల దోపిడీని అరికట్టడంలో, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ ఈనెల 26న రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల బంద్‌కు ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల ఝాన్సీ పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించాలని, డీఈవో, ఎంఈఓ పోస్టులను భర్తీ చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు లక్షలకు లక్షలు ఫీజులు దండుకుంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆమె విమర్శించారు. అక్రమాలకు పాల్పడిన ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలపైన చర్యలు తీసుకుంటామంటూ, ఫీజు నియంత్రణ చట్టం అమలు చేస్తామంటూ హామీలు ఇస్తున్నారు తప్ప అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఈ నెల 26న ఇచ్చిన పాఠశాలల బంద్‌కు అన్ని పాఠశాలల యాజమాన్యాలు సహకరించి విజయవంతం చేయాలని ఆమె కోరారు.

బస్సు డ్రైవర్‌కు రిమాండ్



గోవిందరెడ్డి

నార్సింగ్, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): ఆదివారం రాత్రి ఔటర్ రింగ్ రోడ్డుపై ప్రైవేట్ టూరిస్టు బస్సు బోల్తాపడిన ఘటనలో బస్సు డ్రైవర్ గోవిందరెడ్డి(39)ని నార్సింగి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న మమత (33) చనిపోగా, మరో 15 మంది గాయపడిన సంగతి తెలిసిందే. హైదరాబాద్ నుంచి చెన్నై వెళుతున్న ఈ బస్సు డ్రైవర్ గుంటూరు జిల్లా చిలకలూరిపేట ప్రాంతానికి చెందిన వ్యక్తి అని, మద్యం సేవించి వాహనాన్ని నడపడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుందని పోలీసులు తెలిపారు.

హత్య కేసులో 12మంది అరెస్ట్

- మరో కేసులో 8మంది..
- హత్యకు దారితీసిన బావ బామ్మర్దుల మధ్య వివాదం
- హత్యకు ఉపయోగించిన కత్తితోనే మరొకరికి బెదిరింపు

చార్మినార్ జూన్ 24 (ఆంధ్రజ్యోతి): డబ్బు కోసం బావ బామ్మర్దుల మధ్య తలెత్తిన వివాదం హింసాత్మకంగా మారి ఒకరి హత్యకు దారితీసిన ఘటనలో 12 మందిని శాలిబండ పోలీసులు అరెస్ట్ చేసి సోమవారం రిమాండ్‌కు తరలించారు. మరో ఘటనలో హత్యకు ఉపయోగించిన కత్తితోనే మరో రౌడీషీటర్‌ను బెదిరించగా, ప్రత్యర్థులు రాళ్లు, కర్రలతో చేసిన దాడిలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. అందుకు కారకులైన మరో 8మందిని కాలాపత్తర్ పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం పురానా హవేలిలోని దక్షిణ మండలం డీసీపీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో సౌత్ జోన్ డీసీపీ స్నేహమెహ్రా వివరాలను వెల్లడించారు. అడిషనల్ డీసీపీ షేక్ జహంగీర్, టాస్క్‌ఫోర్స్ అడిషనల్ డీసీపీ అందె శ్రీనివాస్ రావు, ఛత్రినాక డివిజన్ ఏసీపీ చంద్రశేఖర్, శాలిబండ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.

పాతబస్తీకి చెందిన మజర్, సోహైల్‌లు బావాబామ్మర్దులు. కొంతకాలంగా వీరిద్దరి మధ్య డబ్బులను చేబదులు ఇచ్చుకునే వారు. ఈ నేపథ్యంలోనే సోహైల్ వద్ద మజర్ రూ.9 వేలను అప్పుగా తీసుకుని తిరిగి ఇవ్వలేదు. ఈ క్రమంలో ఈనెల 18న అర్ధరాత్రి పాతబస్తీ మక్కాకాలనీలోని ఓ చికెన్ సెంటర్లో డబ్బుల విషయమై ఇద్దరి మధ్య మాటామాట పెరిగింది. అది చినికి చినికి పెద్దదై హింసాత్మకంగా మారింది. సోహైల్ తరఫున వచ్చిన వాజిద్‌పై మజర్ వర్గీయులు 18మంది కత్తులతో దాడి చేశారు. ఈ విషయం తెలుసుకున్న వాజిద్ సోదరులు సాజిద్, ఖదీర్‌లు అక్కడికి రాగా.. వారిపై కూడా కత్తులతో దాడిచేశారు. గాయపడిన వీరు సమీపంలోని ఓ ఆస్పత్రికి పరుగెత్తగా విషయం తెలుసుకున్న వారి అనుచరుడు సయ్యద్ ఫక్రుద్దీన్ అలియాస్ రఫిక్ అలియాస్ షిమ్లాన్ ఆస్పత్రి వద్దకు వచ్చాడు. అయితే, వెంబడిస్తూ వచ్చిన వారు అతనిపై కూడా కత్తులతో దాడికి తెగబడ్డారు. ఈ ఘటనలో తీవ్ర గాయాలపాలైన సయ్యద్ ఫక్రుద్దీన్ అక్కడికక్కడే మృతిచెందాడు. వాజిద్, సాజిద్, ఖదీర్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కాలాపత్తర్‌కు చెందిన రౌడీషీటర్ మొహమ్మద్ అసద్ (35), హుస్సేన్ పాషా అలియాస్ అషు(23), మొహమ్మద్ సుభాన్‌ఖాన్(20), మొహమ్మద్ అన్వర్ అలియాస్ అన్న (34), మేషాన్ బిన్ సమద్ మిశ్రీ (32), ఇమ్రాన్, గౌస్, మొహ్మద్ అబ్నాన్ ఉద్దీన్ (36), మజర్, సోహైల్, మహమ్మద్ ఇస్మాయిల్ అలియాస్ ఖుర్రం (37), సైఫ్ ఆలీఖాన్ అలియాస్ అర్బాస్ (21), అబ్దుల్లాఖాన్ (18), షేక్ దస్తగిర్ (20), సయ్యద్ యాకుబ్ ఆలీ (19), ఉస్మాన్ బిన్ ఖాలీద్ యమని (22), అమన్ ఆలీ హాష్మి (18), దస్తగిర్.. మొత్తం 18మందిపై శాలిబండ పోలీసులు కేసులు నమోదు చేశారు. వారిలో 12మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.



హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న సౌత్‌జోన్ డీసీపీ స్నేహ మెహ్రా

హత్యకు ఉపయోగించిన కత్తితోనే మరో రౌడీషీటర్‌కు బెదిరింపు

- 8 మంది అరెస్టు.. పరారీలో ఐదుగురు

సయ్యద్ ఫక్రుద్దీన్‌ను హత్య చేసిన అనంతరం మొహమ్మద్ అసద్, హుస్సేన్ పాషా, మొహమ్మద్ సుభాన్ పాషాలు అదే కత్తితో తమ సమాచారాన్ని పోలీసులకు చేరవేస్తున్నాడన్న అనుమానంతో మరో రౌడీషీటర్ అశ్వక్ జాఫర్‌ను బెదిరించి వెళ్లిపోయారు. దీంతో కత్తితో తమను బెదిరిస్తారా అంటూ అశ్వక్ జాఫర్ అనుచరులతో కలిసి యాక్టివా బైక్‌పై వెళుతున్న హుస్సేన్ పాషా సోదరుడు మొహమ్మద్ పాషా (30)పై దాడి చేశారు. కర్రలతో దాడిచేయగా అతని చేతులు, భుజానికి తీవ్ర గాయాలయ్యాయి. రాళ్లతో దాడి చేసి యాక్టివా బైక్‌ను ధ్వంసం చేశారు. పాషా సోదరుడు రుక్నుద్దీన్ ఇంటిపై కూడా రాళ్లు రువ్వారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 8మందిని కాలాపత్తర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మరో ఐదుగురు పరారీలో ఉన్నారు.

బల్దియాకు కొత్త బాస్ వస్తారా..?

- ఆమ్రపాలికి పూర్తి అదనపు బాధ్యతలు మాత్రమే
- త్వరలో మరోసారి ఐఏఎస్‌ల బదిలీలు

హైదరాబాద్ సిటీ, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): భారీ ఎత్తున ఐఏఎస్‌ల బదిలీలు జరిగినా జీహెచ్‌ఎంసీకి రెగ్యులర్ కమిషనర్‌ను నియమించకపోవడం చర్చనీయాంశమైంది. కీలకమైన మహానగర పాలకసంస్థ విషయంలో ప్రభుత్వం ఏం ఆలోచిస్తున్నది..? ఆమ్రపాలిని పూర్తి అదనపు బాధ్యతల్లో(ఎఫ్ఏసీ) కొనసాగించడంలో ఆంతర్యమేంటన్నది ఆసక్తికరంగా మారింది. ఆమ్రపాలిని రెగ్యులర్ కమిషనర్‌గా నియమించని నేపథ్యంలో బల్దియాకు కొత్త బాస్ వస్తారనే ప్రచారం జరుగుతోంది. త్వరలో మరోదఫా ఐఏఎస్‌ల బదిలీలు ఉంటాయని, ఆ ఉత్తర్వుల్లో జీహెచ్‌ఎంసీ కమిషనర్ నియామకంపై స్పష్టత రావొచ్చని ఓ అధికారి తెలిపారు. బల్దియా కమిషనర్ రోనాల్డ్‌రోస్ రెండు వారాల క్రితం వ్యక్తిగత పనుల నివిత్తం విదేశాలకు వెళ్లారు. ఈ క్రమంలోనే ఆమ్రపాలికి ఎఫ్ఏసీ (ఫుల్ అడిషనల్ చార్జి) బాధ్యతలు అప్పగించారు. అదే హోదాలో ఆమెను కొనసాగించారు. సంస్థలో నలుగురు జోనల్ కమిషనర్లను మార్చినా సాధారణ పరిపాలనశాఖ.. కమిషనర్ విషయంలో స్పష్టమైన నిర్ణయం తీసుకోలేదు. ఆమ్రపాలి హెచ్‌ఎండీఏ జాయింట్ కమిషనర్‌గా, హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. ఆమెకు అదనంగా జీహెచ్‌ఎంసీ కమిషనర్ బాధ్యతలు అప్పగించారు. మాన్‌సూన్, పౌర సేవలు, నగర అభివృద్ధి, ఇతర పాలనాపరమైన అంశాల నేపథ్యంలో జీహెచ్‌ఎంసీకి రెగ్యులర్ కమిషనర్ ఉండాల్సిన అవసరముంది. ఈ నేపథ్యంలో ఆ మూడు పోస్టులకు ఇతర అధికారులను నియమిస్తూ ఆమ్రపాలిని బల్దియా కమిషనర్‌గా కొనసాగించడం లేదా మరో ఐఏఎస్ అధికారిని జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా నియమించే యోచనలో సర్కారు ఉన్నట్టు తెలుస్తోంది. తదుపరి ఐఏఎస్ బదిలీ ఉత్తర్వుల్లో దీనిపై స్పష్టత వచ్చే అవకాశముంది.

14న విజయవాడ అమ్మవారికి బోనం



ఏపీ దేవాదాయ శాఖ మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న గాజుల అంజయ్య తదితరులు

చార్మినార్ జూన్ 24 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలను ఈసారి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఘనంగా నిర్వహించడానికి భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ నిర్ణయించింది. జూలై 14న విజయవాడ కనకదుర్గమ్మ తల్లికి బంగారు బోనంతో పాటు ఒడిబియ్యం, పట్టు వస్త్రాలను సమర్పించనున్నారు. బాజా భజంత్రీల నడుమ పోతురాజుల నృత్యాలతో విజయవాడ బ్రాహ్మణ వీధిలోని ఈవో కార్యాలయం నుంచి దుర్గగుడి పైకి భక్తులతో కలిసి వెళ్లి తెలంగాణ బోనాల ఉత్సవాలను నిర్వహించనున్నామని తెలిపారు. ఈ ఉత్సవాల కోసం విజయవాడలో తగిన ఏర్పాట్లు చేయాలని కోరుతూ ఉమ్మడిదేవాలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం సోమవారం విజయవాడలో ఏపీ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రాంనారాయణరెడ్డికి వినతిపత్రం అందజేసింది. బోనాల జాతరకు తప్పనిసరిగా హాజరు కావాలని బృందం సభ్యులు మంత్రిని కోరారు. మంత్రిని కలిసిన వారిలో భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య, ఉపాధ్యక్షులు, జనగామ మధుసూదన్‌గౌడ్, మధుసూదన్ యాదవ్, మాజీ చైర్మన్‌లు పాల్గొన్నారు.

ఆయుష్ కమిటీ ఏర్పాటు తర్వాతే ఆస్పత్రుల

రిజిస్ట్రేషన్లను నిర్వహించాలి

- మంత్రికి తెలంగాణ రాష్ట్ర విశ్వ ఆయుర్వేద పరిషత్ వినతి



మంత్రి దామోదర రాజనర్సింహకు వినతిపత్రం అందజేస్తున్న డాక్టర్ ఎస్.సారంగపాణి తదితరులు

పంజాగుట్ట, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): ఆయుష్ సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసిన తరువాతే ఆస్పత్రుల రిజిస్ట్రేషన్లను నిర్వహించాలని, చిన్నచిన్న క్లినిక్స్‌కు కొన్ని సడలింపులు ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర విశ్వ ఆయుర్వేద పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.సారంగపాణి, కార్యదర్శి డాక్టర్ బి.కిషన్ అన్నారు. ఈ మేరకు వారు సోమవారం రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్యశాఖలో జీవో 64 ద్వారా క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్‌ను అమలు చేస్తున్నదని, జీవో 65 ద్వారా అల్లోపతి, ఆయుష్, పారా మెడికల్ తదితర వైద్య విధానాలకు చెందిన పదకొండు మంది సభ్యులతో రాష్ట్ర క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ కౌన్సిల్‌ను ఏర్పాటు చేసిందని అన్నారు. జీవో66 ద్వారా జిల్లా స్థాయి క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ కమిటీలను ఏర్పాటు చేశారని, ఇందులో కేవలం అల్లోపతి విభాగం, పోలీస్ శాఖలకు చెందిన ఐదుగురితో కమిటీ వేసి ఆయుష్ విభాగం నుంచి సభ్యులను నియమించలేదని అన్నారు. అల్లోపతి వైద్యులు మాత్రమే సభ్యులుగా ఉన్న ప్రస్తుత జిల్లా కమిటీకి ఆయుష్ క్లినిక్‌లపై అవగాహన లేని కారణంగా ఇబ్బందులు వస్తాయని అన్నారు. జిల్లా కమిటీలో ఆయుష్ సభ్యులను తప్పనిసరిగా చేర్చాలని వారు విజ్ఞప్తి చేశారు. ఇండియన్ సిస్టమ్స్ ఆఫ్ మెడిసిన్ బోర్డును పునర్నిర్మాణం చేయాలని కోరారు. తమ విజ్ఞప్తిపై మంత్రి సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు.

హోటల్‌లో డెయిరీఫాం అధినేత ఆత్మహత్య



వంశీ కృష్ణారెడ్డి

బర్కత్‌పుర, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): డెయిరీఫాం అధినేత డి.వంశీ కృష్ణారెడ్డి ఓ హోటల్‌లో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ సంఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. అడ్మిన్ ఎస్ఐ కె. సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం. కరీంనగర్ జిల్లా రేకుర్తి మండలం సాలేనగర్‌కు చెందిన మల్లారెడ్డి కుమారుడు డి.వంశీ కృష్ణారెడ్డి (27) బాలాపూర్‌లో డెయిరీఫాం నిర్వహిస్తున్నారు. కాచిగూడలోని ఓ హోటల్‌లో ఆదివారం ఉదయం ఓ గదిని అద్దెకు తీసుకున్నారు. సోమవారం ఉదయం గదిని ఖాళీ చేయకపోవడంతో హోటల్ సిబ్బంది వంశీ కృష్ణారెడ్డి ఉన్న గది తలుపు తట్టారు. ఎంతకూ తీయకపోవడంతో మేనేజర్ శ్రీరాములుకు, కాచిగూడ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు గది తలుపులు పగులగొట్టి చూడగా వంశీ కృష్ణారెడ్డి చనిపోయి కనిపించారు. పక్కన పురుగుల మందు డబ్బా ఉండడంతో ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు అడ్మిన్ ఎస్ఐ కె. సుభాష్ తెలిపారు.

'మహా' మార్పులు

(5వ పేజీ తరువాయి)

విభాగం అదనపు కమిషనర్‌గా ఉన్న పి. ఉపేందర్‌రెడ్డి(నాన్ కేడర్)ని జోనల్ కమిషనర్‌గా నియమించారు. హైదరాబాద్ జిల్లా అదనపు కమిషనర్ హేమంత కేశవపాటిల్ ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్‌గా బదిలీపై వచ్చారు. ప్రస్తుతం అక్కడ జోనల్ కమిషనర్‌గా ఉన్న ఎస్. పంకజ పోస్టింగ్‌పై స్పష్టత రావాల్సి ఉంది. పారిశుధ్య నిర్వహణ విభాగం అదనపు కమిషనర్ పోస్టు ఖాళీ అయిన నేపథ్యంలో పంకజకు ఆ బాధ్యతలు అప్పగించే అవకాశం ఉండొచ్చని ఓ అధికారి తెలిపారు. జోగులాంబ గద్వాల్ జిల్లా అదనపు కలెక్టర్ అపూర్వ్ చౌహాన్‌ను కూకట్‌పల్లికి కేటాయించారు. అనురాగ్ జయంతిలను ఖైరతాబాద్ జోనల్ కమిషనర్‌గా బదిలీ చేశారు. సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్, చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్న ప్రస్తుతానికి అదే స్థానాల్లో కొనసాగుతున్నారు. మాజీ సీఎం జగన్ నివాసం వద్ద ఆక్రమణల కూల్చివేత నేపథ్యంలో బదిలీ వేటు పడిన హేమంత్ బోర్ఖడేను తెలంగాణ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీఎస్ ఎంఎస్ఐడీసీ) మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరిన అనంతరం జీహెచ్‌ఎంసీలో ఈ స్థాయి బదిలీలు జరగడం మొదటిసారి. కీలకమైన మహానగరంలో మెరుగైన పాలన, వసతుల కల్పన కోసం బాధ్యతలు అప్పగించారని అధికార వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. బదిలీ ఉత్తర్వులు వెలువడిన నేపథ్యంలో అనురాగ్ జయంతి, హేమంత్ కేశవ్ పాటిల్, ఉపేందర్‌రెడ్డిలు జోనల్ కమిషనర్లుగా బాధ్యతలు స్వీకరించారు. అపూర్వ్ చౌహాన్ నేడు బాధ్యతలు తీసుకోనున్నట్లు తెలిసింది.

కరెంట్, మంచినీటి సౌకర్యం కల్పించాలి

- సీపీఎం నేతల డిమాండ్



కరెంట్, మంచినీటి సౌకర్యాలు కల్పించాలని జీహెచ్‌ఎంసీ కార్యాలయం ఎదుట సీపీఎం నేతల ధర్నా

కవాడిగూడ, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులకు వెంటనే కరెంటు, మంచినీటి సౌకర్యం కల్పించాలని సీపీఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ కమిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం ఎదుట సీపీఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీకమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. నిరుపేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపు జరిగి తొమ్మిది నెలలు గడుస్తున్నా నేటికి మంచినీరు, డ్రైనేజీ, కరెంట్, రోడ్లు, లిఫ్టు వంటి సౌకర్యాలను కల్పించలేదని, దీంతో నిరుపేదలు ఇళ్లల్లో ఉండలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా జీహెచ్‌ఎంసీ కమిషనర్, ప్రభుత్వ అధికారులకు వ్యతిరేకంగా నినాదలు చేశారు. 2 బీహెచ్‌కె ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.విజయ్‌కుమార్ మాట్లాడారు. సీపీఎం పార్టీ నాయకులు ఎం.మహేందర్, రాజన్న, నాగలక్ష్మి, కమిటీ సభ్యులు ఆర్.వెంకటేష్, అజయ్‌బాబు, ఆర్.అశోక్, జి.కిరణ్, జి నరేష్‌లతో పాటు డబల్‌బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారులు పాల్గొన్నారు.

వాటర్‌బోర్డు ఎండీగా అశోక్‌రెడ్డి

(5వ పేజీ తరువాయి)

బదిలీ చేసింది. తాజాగా మరోసారి వాటర్‌బోర్డు ఎండీగా నియమించింది.

ఈడీగా వచ్చి నేడు ఎండీగా..

గ్రూప్-1 అధికారి అయిన కె.అశోక్‌రెడ్డి ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో వాటర్‌బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా (ఈడీ) పని చేశారు. అప్పట్లో ఎండీగా ఉన్న ఓ అధికారి ఆయన్ను ప్రత్యేకంగా తీసుకొచ్చారు. కొన్నాళ్ల పాటు కొనసాగిన ఆయన వివిధ శాఖల్లో పని చేశారు. అనంతరం మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఆర్‌డీసీఎల్) ఎండీగా అశోక్‌రెడ్డి కొన్నాళ్ల పాటు కొనసాగారు. ఆ తర్వాత అప్పటి మంత్రిగా ఉన్న హరీశ్‌రావుకు పర్సనల్ సెక్రటరీగా సుదీర్ఘకాలం చేశారు. ఆ సందర్భంలో రాష్ట్ర ప్రభుత్వం ఐదుగురిని కన్ఫర్డ్ ఐఏఎస్ అధికారులుగా నియమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జాబితాను ఇవ్వగా, అందులో 2014 ఐఏఎస్ క్యాడర్ అధికారిగా కె.అశోక్‌రెడ్డి ఎంపికయ్యారు. 15ఏళ్ల క్రితం వాటర్ బోర్డు ఈడీగా బాధ్యతలు చేపట్టిన కె.అశోక్‌రెడ్డి తాజా ఉత్తర్వుల నేపథ్యంలో ఎండీగా రేపో, మాపో బాధ్యతలు చేపట్టనున్నారు.

బంగారం కరిగించి, వెంటనే డబ్బు ఇచ్చేలా..

- వ్యాల్యూగోల్డ్ మొబైల్ వాహనం ప్రారంభం



వాల్యూగోల్డ్ వాహన ప్రారంభ కార్యక్రమంలో నటి అనసూయ తదితరులు

హైదరాబాద్ సిటీ, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): బంగారు విక్రయాల రంగంలో కొత్త ఆవిష్కరణలను వ్యాల్యూగోల్డ్ సంస్థ ప్రారంభించింది. బంగారం విక్రయించాలనుకునే నగరవాసుల కోసం తెలంగాణలోనే మొట్టమొదటి మొబైల్ యూనిట్ వాహనాన్ని ప్రారంభించింది. నగరంలో నిర్వహించిన కార్యక్రమంలో నటి అనసూయాభరద్వాజ్ లాంఛనంగా వాహనాన్ని ప్రారంభించారు. బంగారం విక్రయించాలని భావించే వారు దానికి సంబంధించిన పత్రాలతో వ్యాల్యూగోల్డ్ సంస్థను సంప్రదిస్తే, తక్షణం బంగారాన్ని తనిఖీ చేయడంతో పాటు బంగారాన్ని కరిగించి దానికి తగిన మొత్తాన్ని వెంటనే చెల్లిస్తారు. కస్టమర్ల ముందే ఇలా చేయడం వల్ల బంగారం విక్రయాలపై కస్టమర్లకు ఎలాంటి అనుమానం లేకుండా పారదర్శకంగా ఉంటుందని సంస్థ నిర్వాహకులు తెలిపారు. ఈ మొబైల్ వాహనంలో బంగారాన్ని వెంటనే కరిగించి, తగిన ధర చెల్లిస్తారని సంస్థ డైరెక్టర్ అభిషేక్ చంద్ర తెలిపారు.

హెచ్‌ఎండీఏ కమిషనర్‌గా సర్ఫరాజ్

(5వ పేజీ తరువాయి)

ముఖ్య కార్యదర్శిగా కొనసాగుతున్న అర్వింద్‌కుమార్‌కు హెచ్‌ఎండీఏ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. దాదాపు ఐదేళ్ల పాటు ఆయన అదనపు బాధ్యతలను నిర్వర్తించారు. అనంతరం గతేడాది డిసెంబర్ 18న మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శిగా బాధ్యతలను చేపట్టిన ఎం.దానకిశోర్‌కు హెచ్‌ఎండీఏ కమిషనర్‌గా అదనపు బాధ్యతలను అప్పగించారు. ఏడు నెలల పాటు ఇన్‌చార్జి కమిషనర్‌గా దానకిశోర్ కొనసాగగా ఆ సమయం పూర్తిగా సార్వత్రిక ఎన్నికల నిర్వహణకే సరిపోయింది. తాజాగా హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ బాధ్యతలను స్వీకరించారు.

సర్ఫరాజ్‌కు ప్రత్యేక అవార్డు

2009 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన సర్ఫరాజ్ అహ్మద్ శిక్షణ పూర్తి చేసుకోగానే ఉమ్మడి రాష్ట్రంలో అనంతపురం ట్రైనీ ఐఏఎస్‌గా పని చేశారు. ఆ తర్వాత ములుగు జిల్లా సబ్ కలెక్టర్‌గా తొలి పోస్టింగ్ పొందారు. ఏటూరునాగారం ప్రాజెక్టు ఆఫీసర్‌గా పని చేసిన సర్ఫరాజ్ అహ్మద్ అక్కడి ప్రాంతవాసులకు సంక్షేమ పథకాలు అందించడంలో కీలకంగా పని చేశారు. కరీంనగర్‌లో జాయింట్ కలెక్టర్‌గా కొన్నాళ్ల పాటు పని చేశారు. తెలంగాణ క్యాడర్‌కు చెందిన సర్ఫరాజ్ వరంగల్ మున్సిపల్ కమిషనర్‌గా దాదాపు 19 నెలలు, కరీంనగర్ కలెక్టర్‌గా మూడేళ్లకు పైగా పనిచేసి, ఆ తర్వాత ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్‌లోనూ కమిషనర్‌గా 2020 జనవరి నుంచి 2023 జూలై వరకు కొనసాగారు. జూలై 4వ తేదీ నుంచి రాష్ట్ర ఎన్నికల సంఘం జాయింట్ సీఈఓగా పని చేస్తున్న ఆయన 2023 రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చారు. దాంతో సర్ఫరాజ్ అహ్మద్‌ను భారత ప్రభుత్వం అభినందిస్తూ ఓటర్ దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రత్యేక అవార్డును అందజేశారు.

సైదాబాద్‌లో గాల్లోకి పోలీసుల కాల్పులు

- పోలీసుల అదుపులో చైన్‌స్నాచర్..?

సైదాబాద్, జూన్ 24(ఆంధ్రజ్యోతి): సైదాబాద్‌లో ఆదివారం రాత్రి పోలీసుల కాల్పులు కలకలం రేపాయి. దాడి చేసి పారిపోతున్న చైన్‌స్నాచర్‌ను పట్టుకునేందుకు పోలీసులు గాలిలో కాల్పులు జరిపారు. చివరకు సింగరేణికాలనీలో వెంబడించి చైన్‌స్నాచర్‌ను పట్టుకున్నారు. ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో చైన్‌స్నాచర్ అమీర్ శంకేశ్వర్‌బజార్ పరిసరాలలో అనుమానాస్పదంగా సంచరిస్తున్నట్లు పోలీసులకు సమాచారమందింది దీంతో వెంటనే అలర్ట్ అయిన యాంటీ డెకాయిట్ టీం పోలీసులు శంకేశ్వర్‌బజార్‌కు చేరుకుని టీ స్టాల్ సమీపంలో తచ్చాడుతున్న అమీర్‌ను గుర్తించారు. అతడిని తనిఖీ చేసేందుకు పోలీసులు యత్నించగా దాడి చేసి పరుగులు తీశాడు. సింగరేణికాలనీలో పోలీసులు లొంగిపోవాలని హెచ్చరిస్తూ ఒక రౌండ్ గాలిలో కాల్పులు జరిపారు. అయినా అమీర్ పట్టించుకోకుండా పారిపోతుండగా పోలీసులు వెంబడించి పట్టుకున్నట్లు సమాచారం. సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కేన్సర్ కేర్





గర్భసంచి ముఖద్వార కేన్సర్‌కు సమర్థమైన చికిత్సలు అందుబాటులోకొచ్చాయి. అంతర్గత రేడియేషన్‌తో సర్వైకల్ కేన్సర్‌ను సమూలంగా నయం చేయగలిగే వీలుంది. ఆ చికిత్సా విధానం, ఫలితాల గురించి వైద్యులు ఇలా వివరిస్తున్నారు.

గురి తప్పని రేడియేషన్... బ్రాకీ థెరపీ

సాధారణంగా సర్వైకల్ కేన్సర్ నడివయసులో బయల్పడుతూ ఉంటుంది. దాంతో రక్తస్రావాన్నీ, ఇతరత్రా లక్షణాలనూ పెరిమెనోపాజల్ దశతో ముడిపెడుతూ, ఈ వ్యాధిని నిర్లక్ష్యం చేసి చివరి దశలో వైద్యులను కలిసే మహిళలే ఎక్కువ. ఫలితంగా మూడు, నాల్గో దశ సర్వైకల్ కేన్సర్లతో వైద్యులను కలిసినప్పుడు వ్యాధి చికిత్సకు లొంగని పరిస్థితి తలెత్తుతూ ఉంటుంది. మునుపు అంతర్గతంగా అందించే రేడియేషన్‌తో కేన్సర్ కణితిని కవర్ చేయలేని పరిస్థితి ఉండేది. ఒకవేళ చేసినా దుష్ప్రభావాలు కూడా ఎక్కువగా ఉండేవి. కానీ తాజాగా ఎమ్ఆర్ బ్రాకీ థెరపీ అందుబాటులోకొచ్చింది.

సర్వైకల్ కేన్సర్ చికిత్సలో బాహ్య, అంతర్గత అనే రెండు రకాల రేడియేషన్ చికిత్సలుంటాయి. వాడుక భాషలో ఈ రేడియేషన్ చికిత్సలను పెద్ద కరెంట్, చిన్న కరెంట్ అంటూ ఉంటారు. చిన్న కరెంటులో భాగంగా రేడియేషన్ గదిలో పడుకోబెట్టి, నేరుగా కేన్సర్ సోకిన ప్రదేశానికి రేడియేషన్ ఇస్తారు. దీన్లో నొప్పి, అసౌకర్యం ఏమాత్రం ఉండదు. పెద్ద కరెంటులో, వెజైనా ద్వారా గర్భాశయ ముఖద్వారం దగ్గరకు చేరుకుని, అక్కడ కొన్ని అప్లికేటర్లను అమర్చి, రేడియేషన్‌ను అందిస్తారు. ఇదే బ్రాకీ థెరపీ.

రేడియేషన్‌తో కేన్సర్ సోకిన కణాలతో పాటు ఆ భాగాన్ని ఆవరించి ఉండే ఇతర ఆరోగ్యకరమైన కణాలు కూడా చనిపోయే ప్రమాదం ఉంటుంది. కాబట్టి సూటిగా కేన్సర్ సోకిన కణాలే లక్ష్యంగా, ప్రభావవంతంగా, గరిష్ఠ మోతాదు రేడియేషన్‌ను అందించడం బ్రాకీ థెరపీ ప్రత్యేకత. ఇది నైపుణ్యంతో కూడిన చికిత్సా విధానం. గతంలో కూడా ఈ చికిత్స అందుబాటులో ఉన్నప్పటికీ, అది మహిళలకు చాలా అసౌకర్యంగా, అమానుషంగా ఉండేది. కానీ ఇప్పుడు వైద్యులు, తాజా సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందిన బ్రాకీ థెరపీలో, రోగికి నొప్పి తెలియకుండా, అనస్థీషియా ఇచ్చి, బ్రాకీ థెరపీ చేయగలుగుతున్నారు. ఈ చికిత్సలో ఉపయోగించే పరికరాలు కూడా ఎమ్మారై కంపాటిబుల్‌తో కూడిన ప్రత్యేకమైన అప్లికేటర్లు. వీటి సహాయంతో రేడియేషన్‌ను అందించి, చికిత్స పూర్తయి, రోగి మెలకువలోకి వచ్చిన తర్వాత అప్లికేటర్లను అలాగే శరీరంలోనే ఉంచి, తిరిగి ఎమ్మారై చేయవలసి ఉంటుంది. దాన్లో ట్యూమర్‌ను కరెక్టుగా గుర్తించి, దాన్ని మార్క్ చేసుకుని, ఎంత మోతాదులో రేడియేషన్‌ను ఇవ్వాలో వైద్యులు నిర్ధారించుకుంటారు. ఇలా ప్రణాళికాబద్ధంగా రేడియేషన్‌ను లెక్కించిన తర్వాత తిరిగి రోగిని రేడియేషన్ గదిలోకి తీసుకువెళ్లి, అంతర్గత రేడియేషన్ ఇవ్వడం జరుగుతుంది.

రేడియేషన్ ప్రక్రియ క్లిష్టమైనదిగా కనిపించినా, నిజానికి రేడియేషన్ అందించే సమయం ఎంతో స్వల్పం. అన్ని విధాలా కేన్సర్ గడ్డను అంచనా వేసి, రేడియేషన్ గదిలోకి తీసుకువెళ్లిన తర్వాత, రేడియేషన్‌ను కేవలం రెండు నివిషాల మేరకే అందిస్తారు. ఈ బ్రాకీ థెరపీ నాలుగు ఫ్రాక్షన్లలో సాగుతుంది. ఉదయం, సాయంత్రం రేడియేషన్ ఇచ్చి, తిరిగి వారం తర్వాత ఉదయం, సాయంత్రం ఇవ్వవలసి ఉంటుంది. బ్రాకీ థెరపీ అందించిన తర్వాత సర్జరీ అవసరం కూడా ఉండదు. రెండు, మూడు దశల్లో ఉన్న సర్వైకల్ కేన్సర్‌కు బ్రాకీ థెరపీ (ఇంటర్నల్, ఎక్స్‌టర్నల్) సమర్థమైన ఫలితాన్ని అందిస్తుంది. మొదటి దశలో కేన్సర్‌ను గుర్తించగలిగితే, రేడియేషన్, కీమోథెరపీ అవసరం లేకుండా కేవలం సర్జరీతోనే సమస్యను సరిదిద్దే వీలుంది. చివరి దశ సర్వైకల్ కేన్సర్ స్టేజ్4 ఎ, 4బి. 4ఎ దశలో కేన్సర్ పురీషనాళం, మూత్రాశయంలోకి విస్తరించి ఉంటుంది. ఈ దశలో కూడా బ్రాకీ థెరపీతో చికిత్స తీసుకోవచ్చు. కానీ ఫలితం తక్కువగా ఉంటుంది. స్టేజ్4 బిలో ప్రధాన అంతర్గత అవయవాలకు పాకిపోయి ఉంటుంది. ఈ దశలో వైద్యులు కీమోథెరపీ, ఇమ్యునోథెరపీలనే సూచిస్తూ ఉంటారు.

ప్రయోజనాలు ఇవే!

బ్రాకీ థెరపీతో కేన్సర్ రోగులకు ఒరిగే ప్రయోజనాలు ఇవే!

- సర్జరీ అవసరం ఉండదు
- కేన్సర్ నుంచి పూర్తిగా కోలుకోగలుగుతారు
- దుష్ప్రభావాలు తక్కువ
- నొప్పి ఉండదు
- చికిత్స తదనంతర అసౌకర్యం ఉండదు
- మరే ఇతర చికిత్సలతో పని లేకుండా సాధారణ జీవితాన్ని గడపవచ్చు

లైంగిక సంపర్కం వల్లే హ్యూమన్ పాపిలోమా వైరస్ సోకుతుందంటే, ఆ వైరస్ కేవలం మగవాళ్లకే పరిమితం అనుకుంటే పొరపాటు. ఈ వైరస్ పురుషులతో పాటు మహిళల శరీరాల మీద కూడా ఉంటుంది. అయితే అది చర్మాన్ని దాటి శరీరంలోకి ప్రవేశించనంత వరకూ ఎటువంటి ప్రమాదం ఉండదు. లైంగిక క్రీడ ద్వారా శరీరంలోకి ప్రవేశిస్తే, అది సర్వైకల్ కేన్సర్‌కు దారి తీసే ప్రమాదం ఉంది కాబట్టి ఆ అవకాశం లేకుండా, సురక్షితమైన అలవాట్లను



అలవరుచుకోవాలి. జననావయాలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు లైంగిక చర్య తర్వాత శుభ్రం చేసుకోవం, భాగస్వామి చేత కండోమ్స్ వాడించడం, మల్టిపుల్ పార్ట్‌నర్స్ లేకుండా చూసుకోవడం లాంటి జాగ్రత్తలు పాటించాలి.

కేన్సర్ టీకా

పాతికేళ్ల క్రితం 45, 50, 60 ఏళ్ల మహిళల్లోనే ఈ వ్యాధి కనిపిస్తూ ఉండేది. కానీ ఇప్పుడు 30 ఏళ్ల మహిళల్లో సైతం కనిపిస్తోంది. కేన్సర్ ఉధృతి పెరగడానికీ, చిన్న వయసులోనే దాడి చేయడానికీ నిర్దిష్ట కారణాలు ఇవీ అని స్పష్టంగా చెప్పలేక పోయినప్పటికీ, హెచ్‌పివి వైరస్ (హ్యూమన్ పాపిలోమా వైరస్) చిన్న వయసు మహిళల్లో తీవ్రంగా విజృంభించడాన్ని ప్రధాన కారణంగా చెప్పుకోవచ్చు. గర్భాశయ ముఖద్వార కేన్సర్‌కు ఈ వైరసే ప్రధాన కారణం. ఈ వైరస్ చిన్న వయసులోనే మహిళల శరీరాల్లోకి చొరబడితే, కేన్సర్ కూడా తక్కువ వయసులోనే సోకుతుంది. కాబట్టి సర్వైకల్ కేన్సర్‌కు దారి తీసే హెచ్‌పివి వైరస్‌కు అడ్డుకట్ట వేయడం ద్వారా కేన్సర్ నుంచి రక్షణ పొందాలి. అందుకోసం హెచ్‌పివి వ్యాక్సిన్ వేయించుకోవాలి. ఆడపిల్లలకు ఈ వ్యాక్సిన్ ఇప్పిస్తే, సర్వైకల్ కేన్సర్‌ను 90% నివారించుకోవచ్చు. అందుకోసం లైంగిక జీవితం మొదలుపెట్టని వయసులో, 13, 14 ఏళ్ల వయసులోనే వ్యాక్సిన్ ఇప్పించాలి. ఈ వయసులో



వ్యాక్సిన్ ఇప్పించడం వల్ల, తర్వాతి కాలంలో వైరస్ శరీరంలోకి చొరబడినప్పటికీ, అది కేన్సర్‌గా అభివృద్ధి చెందే అవకాశాలు తక్కువగా ఉంటాయి.

ప్రత్యామ్నాయాలు ఇవే!

చిన్న వయసులో టీకా తీసుకోని మహిళలు, పాప్‌స్మియర్ టెస్ట్‌తో పాటు హెచ్‌పివి డిఎన్ఎ టెస్ట్ క్రమం తప్పకుండా చేయించుకుంటూ ఉండాలి. ఇలా అప్రమత్తంగా ఉండగలిగితే, గర్భాశయ ముఖద్వారంలో ఒకట్రెండు కేన్సర్ కణాలు కనిపించినా, వెంటనే పసిగట్టి, స్వల్ప చికిత్సతో ఆ వ్యాధిని సమూలంగా తొలగించుకోవచ్చు. ఇలాంటి ప్రారంభ దశల్లో సర్జరీ అవసరం కూడా ఉండదు. ఒకవేళ కేన్సర్ కణాలు కాస్త ఎక్కువగా ఉంటే, హిస్ట్రక్టమీ ద్వారా గర్భాశయాన్ని తొలగించుకుంటే సమస్య తొలగిపోతుంది. ఈ చికిత్సతో నూరు శాతం ఫలితం ఉంటుంది.

నియంత్రణ మార్గాలున్నాయి

- 13 ఏళ్ల వయసు ఆడపిల్లలకు హెచ్‌పివి వ్యాక్సిన్ వేయించాలి
- వ్యాక్సిన్ వేయించుకోని వాళ్లు పాప్‌స్మియర్, హెచ్‌పివి డిఎన్ పరీక్షలు చేయించుకోవాలి
- శరీరంలో ఇమ్యూనిటీ తగ్గకుండా చూసుకోవాలి.
- తీవ్ర వ్యాధులున్నవాళ్లు (కేన్సర్, హెచ్ఐవి) క్రమం తప్పకుండా స్క్రీనింగ్ చేయించుకుంటూ ఉండాలి
- వ్యాధుల ఫలితంగా ఇమ్యూనిటీ తగ్గిన మహిళలు, అరక్షిత లైంగిక చర్యల్లో పాల్గొనకూడదు.
- కండోమ్ ఉపయోగించని భాగస్వామితో శారీరక సంపర్కం పెట్టుకోకూడదు
- ఒకరి కంటే ఎక్కువ మందితో లైంగికంగా కలవకూడదు
- ప్రతి మహిళా సురక్షితమైన లైంగిక అలవాట్లను అలవరుచుకోవాలి
- లైంగికంగా కలిసిన వెంటనే, జననాంగాలను శుభ్రం చేసుకోవాలి
- కండోమ్స్‌కు బదులుగా ఐపిల్స్‌లాంటి వాటిని వాడుకోకూడదు
- ధూమపానం, మద్యపానం వల్ల కూడా ఇమ్యూనిటీ తగ్గుతుంది. కాబట్టి ఈ అలవాట్లు మానుకోవాలి

డాక్టర్ ఎం. సునీత
సీనియర్ రేడియేషన్ ఆంకాలజిస్ట్ అండ్ క్లినికల్ డైరెక్టర్,
యశోద హాస్పిటల్స్,
హైటెక్ సిటీ, హైదరాబాద్.



హెల్త్ వెల్త్

రక్తపోటు హఠాత్తుగా పెరుగుతూ, తరుగుతూ ఉంటే, దాన్ని స్థిరంగా ఉంచే మార్గాలను అనుసరించాలి. అందుకోసం తోడ్పడే ఉపాయాలు ఇవి.

రక్తపోటు ఇలా దూరం

పొటాషియం

పొటాషియం ఎక్కువగా దొరికే అరటిపళ్లు, పాలకూర, బ్రొకొలి, టమాటాలు, పళ్లు ఎక్కువగా తినాలి. పాలకూర పచ్చి వాసన వస్తుందని దూరం పెట్టవలసిన అవసరం లేదు. మరిగే నీళ్లలో వేసి, రెండు నిమిషాల పాటు ఉడికించి, స్మూదీల్లో కలుపుకుని తాగవచ్చు. అలాగే సలాడ్‌తో కలిపి తినవచ్చు.



అవిసె గింజలు

వీటిలో ఉండే ఒమేగా3, పీచు రక్తనాళాల ఆరోగ్యానికి తోడ్పడతాయి. మట్టి వాసన వేసే వీటిని ఎలా తినాలబ్బా? అని కంగారు పడకుండా, వీటిని దోరగా వేయించి, పొడి కొట్టుకుని పండ్లరసాల్లో, స్మూదీల్లో కలుపుకుని తాగండి. ఓట్‌మీల్, సలాడ్లలో కూడా కలుపుకోవచ్చు.

ఇవి దూరం

మాంసం, చక్కెర, పాల ఉత్పత్తులు శరీరంలో ఇన్‌ఫ్లమేషన్ కారకాలు. కాబట్టి వీటికి ప్రత్యామ్నాయాలను ఎంచుకోవాలి. మాంసకృత్తుల కోసం అవకాడొ, పప్పులు, పుట్టగొడుగులను తీసుకోవచ్చు. క్యాల్షియం కోసం నువ్వులు, మెంతులు, ఆకుకూరలు వాడుకోవచ్చు. తీపి కోసం ఖర్జూరం, ఇతరత్రా పండ్లు తినవచ్చు.

పీచు

శరీరంలోని బోలెడన్ని జీవక్రియలకు పీచు అవసరం. పోషకాలను శరీరం శోషించుకోవాలన్నా, పేగుల ఆరోగ్యం మెరుగ్గా ఉండాలన్నా, త్వరగా ఆకలి వేయకుండా ఉండాలన్నా పీచు తినాలి. పొట్టు తీయని ధాన్యాలు, అవకాడో, అవిసె గింజలు, షియా విత్తనాలు, యాపిల్స్‌లలో పీచు ఎక్కువ.

సిజేరియన్ తర్వాత తొలి నెలసరి

సిజేరియన్ తర్వాత తొలి నెలసరి శరీర తత్వం, పాలిచ్చే ఫ్రీక్వెన్సీ, హార్మోన్ల స్థితిగతుల మీద ఆధారపడి ఉంటుంది. సాధారణ ప్రసవమైతే త్వరగా నెలసరి మొదలవుతుందనేది అపోహే! సిజేరియన్ చేయించుకున్నా, సాధారణ ప్రసవం ద్వారా బిడ్డను కన్నా, తర్వాత తొలసరి నెలసరి భిన్నమైన అంశాల ఆధారంగా మొదలవుతుంది.

సి సెక్షన్ తర్వాత ఇలా...

ప్రసవం తర్వాత ప్రొజెస్టరాన్, ఈస్ట్రోజన్ హార్మోన్ల మోతాదులు తగ్గుతాయి. పాలిస్తున్నంత కాలం ఇదే పరిస్థితి కొనసాగుతుంది. ఫలితంగా నెలసరి ఆలస్యమవుతుంది. ఒకవేళ బిడ్డకు పాలివ్వకపోతే, సి సెక్షన్ తర్వాత ఐదు నుంచి ఆరు వారాల్లోనే తొలి నెలసరి మొదలవుతుంది.

ప్రభావితం చేసే అంశాలు

కొన్ని ఆరోగ్య పరిస్థితులు నెలసరి మీద ప్రభావం చూపిస్తాయి. మరీ ముఖ్యంగా గర్భధారణకు పూర్వ ఆరోగ్య పరిస్థితులు సి సెక్షన్ తదనంతర నెలసరిని ప్రభావితం చేస్తాయి.

- గర్భధారణకు పూర్వం ఉన్న ఆరోగ్య సమస్యలు
- హార్మోన్ల హెచ్చుతగ్గులు
- గర్భధారణకు పూర్వం నెలసరిలో అవకతవకలు

ఇతరత్రా కారణాలు

- ఒత్తిడి
- బరువు పెరగడం/ తగ్గడం
- థైరాయిడ్ సమస్యలు
- చురుకుదనం మందగించడం

నెలసరి ఇలా...

గర్భధారణకు ముందు నెలసరికీ, తర్వాతి నెలసరికీ తేడా ఉంటుంది. ప్రసవం తర్వాత శరీరం తిరిగి నెలసరికి అడ్జస్ట్ అవుతూ ఉంటుంది. కాబట్టి ప్రసవానికి ముందు నెలసరిలా ప్రసవం తర్వాత ఉండదు.

- **అధిక స్రావం:** సి సెక్షన్ తర్వాత కనిపించే తొలి నెలసరిలో ఎక్కువ రక్తస్రావం కావొచ్చు. సర్జరీ సమయంలో గర్భాశయ గోడలకు కోత పెట్టడమే ఇందుకు కారణం.
- **ముదురు ఎరుపు:** ప్రసవం లేదా సి సెక్షన్ తర్వాత, గర్భాశయంలో తిరిగి తాజా కణజాలం తయారవుతుంది. కాబట్టి స్రావం ముదురు ఎరుపు రంగులో ఉంటుంది.

పాలిచ్చినంత కాలం...

బిడ్డకు పాలిస్తున్నంత కాలం తల్లిలో నెలసరి కనిపించక పోవడానికి కారణం, ఆ సమయంలో శరీరంలో హార్మోన్లు ఉత్పత్తి అవుతూ ఉండడమే! పాల ఉత్పత్తికి తోడ్పడే ప్రొలాక్టిన్ అనే హార్మోన్ పునరుత్పత్తి హార్మోన్ల ఉత్పత్తిని తగ్గిస్తుంది. దాంతో అండాల తయారీ, విడుదల జరగవు. ఫలితంగా బిడ్డకు పాలిచ్చినంత కాలం తల్లుల్లో నెలసరి కనిపించదు.

గైనిక్ కేర్



- **ఎక్కువ రోజులు:** నెలసరి ప్రారంభంలో నాలుగు రోజుల పాటు ఎక్కువ స్రావం కనిపించి, తర్వాత తీవ్రత తగ్గుతుంది.
- **అవకతవకలు:** బరువు పెరగడం, ఒత్తిడి, హార్మోన్ సమస్యల మూలంగా నెలసరిలో అవకతవకలు తలెత్తవచ్చు.
- **రక్తపు గడ్డలు:** ముదురు రంగుతో కూడిన రక్తపు గడ్డలు స్రావంలో కనిపించవచ్చు. మరీ ముఖ్యంగా తొలి నెలసరిలో ఈ పరిస్థితి సర్వసాధారణం. అలాగే థైరాయిడ్ లేదా అడినోమయోసిస్ సమస్యలు ఉన్నవాళ్లలో హెవీ బ్లీడింగ్ కనిపిస్తుంది. ఎండోమెట్రియోసిస్ (గర్భాశయం వెలుపల కణజాలం పెరిగే పరిస్థితి) ఉన్నవాళ్లలో లైట్ బ్లీడింగ్ కనిపిస్తుంది.

నెలసరి నొప్పులు దూరం

సి సెక్షన్ లేదా ప్రసవం తర్వాత నెలసరి నొప్పులు అదుపులోకొస్తాయి. గర్భధారణతో శరీరంలో చోటుచేసుకునే మార్పులే ఇందుకు కారణం.

ప్రమాద సూచనలు

నెలసరి మొదలైన తర్వాత కొన్ని సూచనలను నిర్లక్ష్యం చేయకుండా, వెంటనే అప్రమత్తమై వైద్యులను సంప్రతించాలి. అవేంటంటే...

- ఒకటి రెండు గంటల్లో ప్యాడ్ మార్చవలసి రావడం
- నొప్పితో కూడిన తీవ్ర స్రావం
- హఠాత్తుగా జ్వరం, తలనొప్పి
- అతి పెద్ద రక్తపు గడ్డలు
- మూత్రవిసర్జన సమయంలో నొప్పి
- దుర్వాసనతో కూడిన నెలసరి స్రావం.

యోగా



మోకీళ్ల నొప్పులు మాయం!

మోకాలి నొప్పులుంటే యోగాసనాలు వేయకూడదు అనేది అపోహ. మోకీళ్ల నొప్పులతో వేయదగిన, వేయవలసిన ఆసనాలు ఉన్నాయి. వాటితో నొప్పులు తగ్గడంతో పాటు, కీళ్ల కదలికలు మెరుగవుతాయి.

వీరాసనం

- **ఇలా వేయాలి:** అరికాళ్లు పిరుదులకు ఆనేలా మోకాళ్లను లోపలికి మడిచి నేల మీద కూర్చోవాలి. రెండు అర చేతులను మోకాళ్ల మీద ఉంచాలి. ఈ ఆసనంలో 30 - 60 సెకన్ల పాటు ఉండాలి.
- **ప్రయోజనం:** దీర్ఘ సమయాల పాటు ఒకే ప్రదేశంలో కూర్చుని పని చేయడం వల్ల కీళ్లు బిగుతుగా మారతాయి. వీరాసనం వల్ల కటి ప్రదేశం, మోకీళ్లు వదులై కదలికలు తేలికవుతాయి. ఫలితంగా నొప్పి అదుపులోకి వస్తుంది.

త్రికోణాసనం

- **ఇలా వేయాలి:** కాళ్ల మధ్య 3 అడుగుల దూరం ఉండేలా నిలబడాలి. కుడి పాదం కుడి పక్కకు తిప్పాలి. నడుము కదల్చకుండా, నడుము పైభాగాన్ని కుడి వైపుకు వంచి, కుడి చేతిని కుడి పాదం దగ్గర నేలకు ఆనించాలి. ఇలా చేస్తున్నప్పుడే, ఎడమ చేతిని నిటారుగా గాల్లోకి లేపి ఉంచాలి. ముఖాన్ని పైకి లేపిన చేతి వైపు తిప్పాలి. ఇదే విధంగా ఎడమ వైపు కూడా చేయాలి.
- **ప్రయోజనం:** మోకాలిలోని టెండాన్లు, కండరాలు, లిగమెంట్లు సాగి, కీలుకు అదనపు ఆసరా అందిస్తాయి. దాంతో మోకాళ్ల నొప్పులు అదుపులోకొస్తాయి.

న్యూట్రిషన్

భలే... బయోటిన్

బి విటమిన్లలో కీలకమైన బి7 విటమిన్... బయోటిన్. నీళ్లలో కరిగే ఈ విటమిన్ ఎనర్జీకీ, జీర్ణశక్తికీ అవసరం. ఈ విటమిన్ ఉపయోగాలు ఏవంటే...

- ఆహారం మెరుగ్గా జీర్ణమై, పోషకాల శోషణ సక్రమంగా జరుగుతుంది.
- వెంట్రుకలు, గోళ్లు, చర్మం ఆరోగ్యంగా ఉంటాయి.
- టైప్ 2 మధుమేహం అదుపులో ఉంటుంది.
- నాడీ వ్యవస్థ మెరుగ్గా ఉంటుంది.



బయోటిన్ తగ్గితే?

- చర్మం ఎర్రబడి, దురద పెడుతుంది
- వెంట్రుకలు చిట్లి, రాలిపోతూ ఉంటాయి.
- నీరసం, నిస్సత్తువ ఆవరిస్తుంది
- కండరాలు, ఎముకల నొప్పులు వేధిస్తాయి
- అరికాళ్లలో, అరచేతుల్లో తిమ్మిర్లు మొదలవుతాయి.

వేటిలో దొరుకుతుంది?

- కాలేయం, మూత్రపిండాలు (మాంసాహారం)
- ఈస్ట్
- ఆకుకూరలు
- కాలీఫ్లవర్
- నట్స్, నట్ బటర్
- కోడి గుడ్డు పచ్చ సొన
- పుట్టగొడుగులు

గృహ వైద్యం

అలవోకగా అరుగుదల

భారీ భోజనం బాధ, తిన్న తర్వాత మొదలవుతుంది. వరస వేడుకలతో అజీర్తి ఏర్పడి, పొట్టలో అసౌకర్యం వేధిస్తూ ఉంటే ఈ గృహ వైద్యాలు అనుసరించవచ్చు.

మెంతి లడ్డు: ఉదయం అల్పాహారంతో పాటు బెల్లం, నెయ్యి కలిపి తయారుచేసిన మెంతి లడ్డు ఒకటి తినాలి.

మజ్జిగ: మధ్యాహ్న భోజనం ముగించిన వెంటనే, ఇంగువ, నల్ల ఉప్పు కలిపిన గ్లాసు మజ్జిగ తాగాలి.

చ్యవన్‌ప్రాశ్: రాత్రి నిద్రకు ముందు పాలలో ఒక టీస్పూను చ్యవన్‌ప్రాశ్ కలుపుకుని తాగాలి.



ఆంధ్రజ్యోతి
నవ్య చిత్రజ్యోతి
మంగళవారం • 25 జూన్ 2024
cinema@andhrajyothy.com

ఒకే తెరపై రజనీ, సల్మాన్



'రాజారాణి', 'తెరి', 'మెర్సల్', 'బిగిల్' చిత్రాలతో సూపర్‌హిట్ డైరెక్టర్ అనిపించుకున్న అట్లీ కుమార్.. బాలీవుడ్‌లోకి అడుగుపెట్టి షారుక్ ఖాన్ చిత్రం 'జవాన్' చిత్రంతో బ్లాక్‌బస్టర్ హిట్ కొట్టారు. ఆయన ప్రస్తుతం సల్మాన్ ఖాన్‌తో ఓ చిత్రం చేస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా అందిన సమాచారం మేరకు ఈ సినిమాలో రజనీకాంత్ కూడా నటించనున్నారు. ఇలా ఒకే తెరపై వీరిద్దరూ కనపడితే.. వారి అభిమానుల ఆనందాలకు హద్దులు ఉండకపోవడమే కాకుండా అది బాక్సాఫీస్‌కు కూడా పండుగ వాతావరణాన్ని తెప్పిస్తుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అయితే ఇందులో రజనీ ఏ పాత్రను పోషిస్తున్నారో ఇంకా తెలియాల్సి ఉంది. ఈ చిత్ర నిర్మాత, సన్ పిక్చర్స్ అధినేత కళానిధి మారన్‌కు సూపర్‌స్టార్‌తో ఉన్న సత్సంబంధాల వల్లే ఈ ప్రాజెక్ట్‌లో నటించేందుకు రజనీ పచ్చజెండా ఊపారని తెలుస్తోంది. ప్రస్తుతం 'సికిందర్' షూటింగ్‌లో సల్మాన్, 'కూలీ' చిత్రీకరణలో బిజీగా ఉన్న రజనీ.. ఆ ప్రాజెక్ట్స్ పూర్తి కాగానే ఈ సినిమా సెట్స్‌లోకి అడుగుపెట్టనున్నారు.



పవన్‌కల్యాణ్‌ను కలసిన తెలుగు సినిమా నిర్మాతలు

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను సినీ పరిశ్రమ తరపున అభినందించేందుకు అపాయింట్‌మెంట్ కోరడానికి వచ్చామని నిర్మాత అల్లు అరవింద్ తెలిపారు. సోమవారం మధ్యాహ్నం విజయవాడలోని క్యాంప్ కార్యాలయంలో పలువురు నిర్మాతలు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కీలక అంశాలపై వారు చర్చించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ.. సినీ పరిశ్రమ తరపున పవన్ కల్యాణ్‌ను అభినందించడానికి అపాయింట్‌మెంట్ కోరడానికి వచ్చామన్నారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. అదేవిధంగా సీఎం చంద్రబాబుతో భేటీ కావడానికి అపాయింట్ ఇప్పించాలని కోరినట్టు తెలిపారు. దీనిపై చంద్రబాబుతో మాట్లాడి చెబుతానని పవన్ కల్యాణ్ తెలిపినట్టు వివరించారు. తెలుగు చిత్ర పరిశ్రమలో నెలకొన్న సమస్యలపై పూర్తిస్థాయిలో చర్చించ లేదని, త్వరలోనే మరోసారి కలసి చిత్ర పరిశ్రమ సమస్యలు, రాష్ట్రంలో సినీ రంగం విస్తరణకు ఉన్న అవకాశాలపై చర్చిస్తామని చెప్పారు. సమావేశంలో రాష్ట్ర పర్యాటక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, నిర్మాతలు సి.అశ్వనీదత్, ఎ.ఎం.రత్నం, డి.సురేష్ బాబు, ఎస్.రాధాకృష్ణ(చినబాబు), దిల్‌రాజు, భోగవల్లి ప్రసాద్, డి.వి.వి.దానయ్య, సుప్రియ, ఎస్.వి.ప్రసాద్, బన్నీ వాసు, నవీన్ ఎర్నేని, నాగవంశీ, టి.జి.విశ్వప్రసాద్, వంశీకృష్ణ, వై.రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

- అమరావతి (ఆంధ్రజ్యోతి)



విశ్వంభర సెట్‌కు వినాయక్

మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న తాజా చిత్రం 'విశ్వంభర' షూటింగ్ ప్రస్తుతం అన్నపూర్ణ సెవెన్ ఏకర్స్‌లో వేసిన భారీ సెట్‌లో జరుగుతోంది. దర్శకుడు వి.వి.వి నాయక్ సోమవారం ఈ సెట్‌కు వెళ్లారు. మెగాస్టార్ చిరంజీవిని కలసి కాసేపు ముచ్చటించారు. ఆయనతో తనకున్న ప్రత్యేక అనుబంధాన్ని పంచుకున్నారు. దర్శకుడు వశిష్టకు, చిత్ర నిర్మాతలకు అభినందనలు తెలిపారు వినాయక్. మెగాస్టార్ చిరంజీవి, వినాయక్, వశిష్ట కలసి ఉన్న ఫొటోని చిత్రం టీమ్ సోషల్ మీడియాలో షేర్ చేసింది. యూవీ క్రియేషన్స్ సంస్థ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా 'విశ్వంభర' చిత్రాన్ని నిర్మిస్తోంది. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతి కలిగించడానికి అన్ని జాగ్రత్తలు తీసుకుంటోంది. త్రిష, ఆషికా రంగనాథ్ హీరోయిన్లుగా నటిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది జనవరి 10న విడుదల కానుంది. విక్రమ్, వంశీ, ప్రమోద్, నిర్మిస్తున్నారు.

బాలీవుడ్‌లోకి శ్రీలీల



క్యూట్ బ్యూటీ శ్రీలీల బాలీవుడ్‌లోకి అడుగుపెట్టనున్నారు. డేవిడ్ ధావన్ దర్శకత్వంలో వరుణ్‌ధావన్ నటించబోయే చిత్రానికి శ్రీలీలను ఖరారు చేసినట్లు సమాచారం. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ దశలో ఉన్న ఈ చిత్రాన్ని జూలై నుంచి సెట్స్‌పైకి తీసుకువెళ్లడానికి సన్నాహాలు చేస్తున్నారు. కథాంశంగా ట్రయాంగిల్ లవ్ స్టోరీని ఎంచుకున్నారని.. కన్‌ఫ్యూజన్, కామెడీ కలగలసిన ఈ చిత్రం ప్రేక్షకులని కడుపుబ్బా నవ్వించేలా ఉంటుందట. టైటిల్, ఇతర తారాగణం, సాంకేతిక సిబ్బంది ఇంకా ఖరారు కాని ఈ చిత్రాన్ని రమేశ్ తౌరని నిర్మించనున్నారు. ఇటువంటి క్రేజీ ప్రాజెక్ట్‌తో బాలీవుడ్‌లోకి ఎంటర్ అవుతున్నందున.. ఇక బీ టౌన్‌లో కూడా ఆమె కెరీర్‌కు ఢోకా ఉండదని అంటున్నారు. డేవిడ్ ధావన్, వరుణ్ ధావన్ కలయికలో ఇదివరకు 'మై తేరా హీరో', 'జుడ్వా 2' చిత్రాలు వచ్చి.. బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లను రాబట్టాయి.

28 ఏళ్ల తర్వాత...





సరిగ్గా 28 ఏళ్ల క్రితం 'అక్కడ అమ్మాయి.. ఇక్కడ అబ్బాయి' చిత్రం విడుదలైంది. చిరంజీవి సోదరుడు పవన్‌కల్యాణ్‌కు, ఏయన్నార్ మనవరాలు సుప్రియకు ఇదే తొలి సినిమా. ఈవీవీ సత్యనారాయణ దర్శకుడు , అల్లు అరవింద్ నిర్మాత. ఆ సినిమా తర్వాత హీరోగా ఎదిగి పవన్‌కల్యాణ్ పవర్‌స్టార్ అయ్యారు. సుప్రియ మాత్రం నటనకు క్రమంగా దూరమై, నిర్మాణరంగంలోకి ప్రవేశించి అక్కడే స్థిరపడ్డారు. సోమవారం ఇతర నిర్మాతలతో పాటు సుప్రియ కూడా పవన్‌కల్యాణ్‌ను కలిశారు. ఈ సందర్భంగా వీరిద్దరూ దిగిన ఫొటో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. కొందరైతే 'అక్కడ అమ్మాయి.. ఇక్కడ అబ్బాయి' చిత్రంలోని వీరిద్దరి ఫొటోను.. ఇప్పటి ఫొటోను జతచేసి.. సూపర్ అంటూ కామెంట్లు పెడుతున్నారు.



వైజయంతి పాత్రలో మళ్లీ!

విజయతార విజయశాంతి 34 ఏళ్ల క్రితం 'కర్తవ్యం' చిత్రంలో పోలీస్ ఆఫీసర్ వైజయంతి పాత్రను పోషించారు. ఆ చిత్రం ఆమె నట జీవితాన్ని సరికొత్త మలుపు తిప్పడమే కాకుండా జాతీయ స్థాయిలో ఉత్తమ నటిగా అవార్డు తెచ్చి పెట్టింది. ప్రస్తుతం నందమూరి కల్యాణ్‌రామ్ హీరోగా నటిస్తున్న చిత్రంలో విజయశాంతి 'కర్తవ్యం' తరహాలో పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రను పోషిస్తున్నారు. ఆమె పాత్ర పేరు కూడా వైజయంతి కావడం గమనార్హం. విజయశాంతి పుట్టినరోజు సందర్భంగా ఫస్ట్ లుక్ పోస్టర్ ద్వారా ఆమె గెటప్ రివిల్ చేశారు. ఈ పోస్టర్‌తోనే ఆమె పాత్ర ఎంత పవర్‌ఫుల్‌గా ఉంటుందో తెలియజేశారు. అలాగే గ్లింప్స్‌ను కూడా రిలీజ్ చేశారు. 'వైజయంతి ఐపీఎస్.. తను పట్టుకుంటే పోలీస్ తుపాకీకే ధైర్యం వస్తుంది.. వేసుకుంటే యూనిఫామ్‌కే పౌరుషం వస్తుంది. తనే ఒక యుద్ధం.. నేనే తన సైన్యం' అంటూ కల్యాణ్‌రామ్ వాయిస్ ఓవర్‌తో విజయశాంతి పాత్రను పరిచయం చేశారు. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వంలో అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మిస్తున్నారు.



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టూరిజం, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేశ్‌ను సీనియర్ నిర్మాత కె.ఎస్.రామారావు సోమవారం అమరావతిలో కలసి అభినందించారు. త్వరలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌తో సమావేశమై సినీ రంగ సమస్యలను చర్చిద్దామని దుర్గేశ్ రామారావుకు చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు సినిమా పరిశ్రమ అభివృద్ధి చెందుతుందనీ, అందుకు సహజమైన లొకేషన్లు, ప్రోత్సహించే ప్రభుత్వం ఉన్నాయని రామారావు తెలిపారు. సినిమా పరిశ్రమ పట్ల అవగాహన కలిగిన దుర్గేశ్ మంత్రిగా ఉన్నందుకు ఆయన హర్షం వ్యక్తం చేశారు.



ట్రెండ్‌కు అనుగుణంగా..



'హను-మాన్' చిత్రంతో ఈ ఏడాది ప్రారంభంలో బ్లాక్ బస్టర్ హిట్ సాధించిన చిత్ర నిర్మాణ సంస్థ ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్ ఇప్పుడు ప్రియదర్శి, నభా నటేశ్ జంటగా నిర్మిస్తున్న 'డార్లింగ్' చిత్రం జులై19నవిడుదల కానుంది. అశ్విన్‌రామ్ ఈ చిత్రానికి దర్శకుడు. రోమ్ కామ్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ సినిమాతో మరోసారి హిట్ సాధిస్తామని నిర్మాతలు నిరంజన్‌రెడ్డి, చైతన్య చెబుతున్నారు. ప్రస్తుత ట్రెండ్‌కు అనుగుణమైన అంశాలతో అన్ని వర్గాల ప్రేక్షకుల్ని అలరించడానికి ఈ చిత్రం సిద్ధమవుతోంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, ఫస్ట్ సింగిల్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చిందని తెలిపారు. బ్రహ్మానందం, విష్ణు, కృష్ణతేజ్, అనన్య నాగళ్ల కీలక పాత్రలు పోషించిన ఈ చిత్రానికి నరేశ్ రామదురై సినిమాటోగ్రాఫర్. హేమంత్ సంభాషణలు రాశారు.

ద్విభాషా చిత్రంలో శివరాజ్‌కుమార్



కన్నడ హీరో శివరాజ్‌కుమార్, 'పాయుమ్ ఒలి నీ యెనక్కు' ఫేమ్ కార్తీక్ అద్వైత్ దర్శకత్వంలో ఓ ద్విభాషా చిత్రంలో నటిస్తున్నట్లు ప్రకటించారు. తెలుగు, కన్నడ భాషల్లో తెరకెక్కనున్న ఈ చిత్రాన్ని ఎస్.ఎన్.సుధీర్‌రెడ్డి, పి.సుధీర్ నిర్మించనున్నారు. ఇతర నటీనటుల వివరాలు తెలియాల్సి ఉంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్‌లో ఉన్న ఈ సినిమా షూటింగ్‌ను ఆగస్టులో మొదలుపెట్టనున్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: దీపు.ఎస్.కుమార్, సినిమాటోగ్రఫీ: ఎ.జె.శెట్టి, సంగీతం: సామ్.సీ.ఎస్.



భయపెడుతూ.. నవ్విస్తూ..

ఇప్పుడు హారర్, కామెడీ చిత్రాల ట్రెండ్ నడుస్తోంది. ఆడియన్స్‌ను నవ్విస్తూ, భయపెడుతూ క్యాష్ చేసుకోవడానికి దర్శకనిర్మాతలు ప్రయత్నిస్తున్నారు. ఆ కోవలో వస్తున్న మరో చిత్రం 'మందిర'. 'ఓ మై ఘోస్ట్' చిత్రానికి ఇది తెలుగు అనువాదం.గ్లామర్ సంచలనం సన్నీ లియోన్ ఇందులో ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. ఆర్. యువన్ దర్శకత్వంలో సాయి సుధాకర్ కొమ్మాలపాటి నిర్మిస్తున్నారు. ఈ సినిమాను జులై 19న విడుదల చేయనున్నట్లు నిర్మాత ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన సన్నీ లియోన్ పోస్టర్ అందరినీ ఆకట్టుకుంటోంది.

మన్నారా చోప్రా మాస్ సాంగ్



బాలీవుడ్ సంచలనం మన్నారా చోప్రా 'తిరగబడరా సామీ' చిత్రంలో ఓ విభిన్న పాత్ర పోషిస్తున్నారు. రాజ్‌తరుణ్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో మాల్వి మల్హోత్రా కథానాయిక. ఎ.ఎస్.రవి కుమార్ చౌదరి దర్శకత్వంలో మల్కాపురం శివకుమార్ నిర్మిస్తున్నారు. యూత్‌ని ఆకట్టుకొనే రొమాన్స్‌తో పాటు ఫ్యామిలీ సెంటిమెంట్, హై ఓల్టేజ్ యాక్షన్ ఎలిమెంట్స్‌తో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. తాజాగా మన్నారాపై చిత్రీకరించిన 'రాధాభాయ్' పాటను విడుదల చేశారు. సంగీత దర్శకుడు బోలే షావలి రచించి, స్వరపరిచిన ఈ మాస్ సాంగ్‌ను శ్రావణ భార్గవి పాడారు. ఇందులో మన్నారా డ్యాన్స్ మూమెంట్స్ చూసి ఆడియన్స్ చిందులు వేయడం ఖాయం అంటున్నారు నిర్మాత.



ప్రేమ, పెళ్లి గొప్పతనాన్ని చాటేలా...

సుమన్‌తేజ్, గరిమ చౌహాన్ జంటగా నటించిన చిత్రం 'సీతా కల్యాణ వైభోగమే'. సతీశ్ పరమవేద దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని రాచాల యుగంధర్ నిర్మించారు. ఇటీవలే విడుదలైన ఈ చిత్రం థియేటర్లో అందర్నీ ఆకట్టుకుంటూ.. హిట్ టాక్‌లో దూసుకుపోతోంది. ప్రేమ, పెళ్లి గొప్పతనాన్ని చాటేలా ఉన్న చిత్ర కథాంశం యూత్‌ను, ఫ్యామిలీని విపరీతంగా ఆకట్టుకుంటోందని చిత్ర బృందం ఆనందం వ్యక్తం చేసింది. ఈ సినిమాలో గగన్ విహారి, నాగినీడు, శివాజీ రాజా, ప్రభావతి కీలక పాత్రలు పోషించారు. చిత్రానికి ఎడిటర్: వెంకటప్రభు, కెమెరామెన్: పరశురామ్, సంగీతం: చరణ్‌అర్జున్

ప్రపంచకప్‌లో నేటి మ్యాచ్

అఫ్ఘానిస్థాన్ x బంగ్లాదేశ్ (ఉ.6. గం.)

సెమీస్‌కు సఫారీలు

వెస్టిండీస్ నాకౌట్

చేజ్ శ్రమ వృథా



షంసీ (3/27)

నార్త్‌సౌండ్ (ఆంటిగ్వా): వర్ష ప్రభావిత మ్యాచ్‌లో.. ఉత్కంఠ విజయం సాధించిన దక్షిణాఫ్రికా సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. సూపర్-8లో భాగంగా గ్రూప్-2లో సోమవారం జరిగిన కీలక మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 3 వికెట్ల (డ/లూ పద్ధతి) తేడాతో ఆతిథ్య వెస్టిండీస్‌ను ఓడించింది. ఈ ఓటమితో కరీబియన్ జట్టు టోర్నీ నుంచి నాకౌట్ కాగా.. మొత్తం 6 పాయింట్లతో సఫారీలు గ్రూప్ టాపర్‌గా నిలిచారు. షంసీ 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 135/8 స్కోరు చేసింది. విండీస్ 5/2తో ఇబ్బందుల్లో పడగా, మేయర్స్ (35), రోస్టన్ చేజ్ (52) మూడో వికెట్‌కు 81 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకొన్నారు. ఛేదనలో సౌతాఫ్రికా 16.1 ఓవర్లలో 124/7 స్కోరు చేసి గెలిచింది. సఫారీలు 15/2తో ఉన్నప్పుడు వర్షం ఆటంకం కలిగించడంతో డ/లూ విధానం ప్రకారం లక్ష్యాన్ని 17 ఓవర్లలో 123 పరుగులకు కుదించారు. చేజ్ 3 వికెట్లు తీయగా.. రస్సెల్, జోసెఫ్ చెరో 2 వికెట్లు పడగొట్టారు. ఓపెనర్లు హెండ్రిక్స్ (0), డికాక్ (12)ను అవుట్ చేసిన రస్సెల్ షాకిచ్చాడు. అయితే, ఈ సమయంలో వాన రావడం ఒకరకంగా సఫారీలకు కలిసి వచ్చింది. స్టబ్స్ (29).. క్లాసెన్ (22)తో కలిసి నాలుగో వికెట్‌కు 35 పరుగుల భాగస్వామ్యంతో జట్టును మ్యాచ్‌లో నిలిపాడు. అయితే, మిల్లర్ (4), స్టబ్స్ అవుట్ కావడంతో ఒక్కసారిగా ఉత్కంఠ రేగింది. కానీ, జాన్సెన్ (21 నాటౌట్) మరో 5 బంతులు విగిలుండగానే జట్టుకు విజయాన్ని అందించాడు.

సంక్షిప్త స్కోర్లు

వెస్టిండీస్: 20 ఓవర్లలో 135/8 (చేజ్ 52, మేయర్స్ 35; షంసీ 3/27); **సౌతాఫ్రికా:** 16.1 ఓవర్లలో 124/7 (స్టబ్స్ 29, క్లాసెన్ 22; చేజ్ 3/12, రస్సెల్ 2/19).

పాయింట్ల పట్టిక — గ్రూప్-2

జట్టు	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	రన్‌రేట్
సౌతాఫ్రికా	3	3	0	0	6	0.599
ఇంగ్లండ్	3	2	1	0	4	1.992
వెస్టిండీస్	3	1	2	0	2	0.963
అమెరికా	3	0	3	0	0	-3.906

సూపర్ హిట్‌మ్యాన్

41 బంతుల్లో 92 రన్స్‌తో రోహిత్ హవా

ఆస్ట్రేలియాపై భారత్ గెలుపు

27న ఇంగ్లండ్‌తో సెమీస్ పోరు



గ్రాస్ ఐలెట్: కోట్లాది అభిమానుల ఆశలకు తగ్గట్టే.. అదరగొట్టే ఆటతీరుతో టీమిండియా టీ20 వరల్డ్‌కప్ సెమీస్‌లో ప్రవేశించింది. కెప్టెన్ రోహిత్ శర్మ (41 బంతుల్లో 7 ఫోర్లు, 8 సిక్సర్లతో 92) వీర విహారంతో ప్రత్యర్థి బౌలర్లను కంగారెత్తించాడు. అయితే భారీ లక్ష్యాన్ని కాపాడుకునే క్రమంలో కాస్త ఉత్కంఠ నెలకొన్నా.. భారత బౌలర్లు తమ తడాఖా చూపారు. దీంతో సోమవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ఆసీస్‌పై 24 రన్స్‌తో భారత్ ఘనవిజయం సాధించింది. తద్వారా సూపర్-8 గ్రూప్-1లో ఆరు పాయింట్లతో నాకౌట్‌కు చేరిన తొలి జట్టుగా నిలిచింది. ఇక ఆసీస్ సెమీస్ చేరాలంటే.. మంగళవారం బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌లో అఫ్ఘాన్ ఓడాల్సి ఉంటుంది. ముందుగా భారత్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 205 పరుగులు చేసింది. సూర్యకుమార్ (31), దూబే (28), హార్దిక్ (27 నాటౌట్) రాణించారు. స్టార్క్, స్టొయినిస్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో ఆసీస్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 181 పరుగులు చేసి ఓడింది. హెడ్ (43 బంతుల్లో 9 ఫోర్లు, 4 సిక్సర్లతో 76), మార్ష్ (37) మాత్రమే ఆకట్టుకున్నారు. అర్ష్‌దీప్‌నకు 3, కుల్దీప్‌నకు 2 వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా రోహిత్ నిలిచాడు.

హెడ్ పోరాడినా..: భారీ ఛేదనలో ఆసీస్ తొలి ఓవర్‌లోనే ఓపెనర్ వార్నర్ (6) వికెట్ కోల్పోయినా.. మరో ఓపెనర్ హెడ్ మాత్రం ఎదురుదాడి ఆపలేదు. కెప్టెన్ మార్ష్ కూడా దాటిని చూపడంతో ఆసీస్ ఆత్మవిశ్వాసంతో కనిపించింది. కానీ కీలక సమయాల్లో వికెట్లు తీసిన భారత బౌలర్లు కంగారూల పనిబట్టారు. మూడో ఓవర్‌లో మార్ష్ 4,4,6 బాదగా.. తర్వాతి ఓవర్‌లో హెడ్ 3 ఫోర్లతో పరుగుల వేట ఆరంభమైంది. హార్దిక్ ఓవర్‌లోనూ హెడ్ రెండు సిక్సర్లు సాధించగా పవర్‌ప్లేలో ఆసీస్ 65/1 స్కోరుతో భారత్ శిబిరంలో గుబులు రేపింది. అయితే మార్ష్‌ను కుల్దీప్ అవుట్ చేయడంతో రెండో వికెట్‌కు 81 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అటు పదో ఓవర్‌లో మరో 3 ఫోర్లతో హెడ్ 24 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేశాడు. మ్యాక్స్‌వెల్ (20) తర్వాతి ఓవర్‌లోనే 4,6,4తో బ్యాట్‌కు పనిచెప్పాడు. కానీ అతడిని కూడా కుల్దీప్ బౌల్డ్ చేసి కాస్త రిలీఫ్‌నిచ్చాడు. వీరి మధ్య మూడో వికెట్‌కు 41 రన్స్ వచ్చాయి. ఆ తర్వాత 15వ ఓవర్‌లో స్టొయినిస్ (2)ను అక్షర్ అవుట్ చేశాక పరుగుల వేగం తగ్గింది. దీనికి తోడు 17వ ఓవర్‌లో బుమ్రా కీలక హెడ్ వికెట్ తీయడంతో భారత్ సంబరాల్లో మునిగింది. చివర్లో టెయిలెండర్ల నుంచి కనీస పోరాటం కూడా లేకపోవడంతో వారికి ఓటమి తప్పలేదు.

రోహిత్ ధనాధన్: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ ఇన్నింగ్స్‌లో కెప్టెన్ రోహిత్ విధ్వంసకర ఆటతీరుతో అదరగొట్టాడు. ఆసీస్ బౌలర్లను చెడుగుడు ఆడేశాడు. తొలి 11 ఓవర్లపాటు తన హవా కొనసాగించాడు. బంతి ఎలా వేసినా బౌండరీ బాదడమే లక్ష్యంగా క్రీజులో చెలరేగాడు. హాజెల్‌వుడ్ మాత్రమే పరుగులను కట్టడి చేయగలిగాడు. ఓపెనర్ కోహ్లీ (0) రెండో ఓవర్‌లోనే డకౌట్ అయినా.. మరో ఎండ్‌లో రోహిత్ దూకుడుకు పరుగుల వరద పారింది. స్టార్క్ వేసిన ఇన్నింగ్స్ మూడో ఓవర్‌లోనైతే 6,6,4,6,6తో ఏకంగా 29 పరుగులు రాబట్టాడు. అలాగే ఐదో ఓవర్‌లో వర్షంతో పది నిమిషాలు బ్రేక్ వచ్చినా.. రోహిత్ మాత్రం అదే ఓవర్‌లో 6,4,4తో 19 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేశాడు. ఈ జోరుతో పవర్‌ప్లేలో జట్టు 60/1 స్కోరుతో పటిష్టంగా కనిపించింది. ఆ తర్వాత కూడా ఆసీస్ బౌలర్లను రోహిత్ వదల్లేదు. ఎనిమిదో ఓవర్‌లో 4,6,6తో 17 రన్స్ రాబట్టాడు. కానీ పంత్ (15) వికెట్‌ను కోల్పోవడంతో రెండో వికెట్‌కు 87 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అయితే 8.4 ఓవర్లలోనే స్కోరు 100కి చేరడంతో భారత శిబిరంలో జోష్ కనిపించింది. అటు సూర్యకుమార్ సైతం కమిన్స్ ఓవర్‌లో 4,6తో జోరు చూపాడు. కానీ స్టార్క్ తన రెండో స్పెల్‌లో ఆకట్టుకున్నాడు. సెంచరీకి సమీపంలో ఉన్న రోహిత్‌ను 12వ ఓవర్‌లో యార్కర్‌తో బౌల్డ్ చేసిన స్టార్క్.. కుదురుకున్న సూర్యకుమార్‌ను కూడా తన తర్వాతి ఓవర్‌లోనే పెవిలియన్ చేర్చాడు. దూబే, హార్దిక్ కాస్త నెమ్మదించడంతో చివరి ఐదు ఓవర్లలో భారత్ ఆటతీరులో ఆశించిన వేగం కనిపించలేదు. 19వ ఓవర్‌లో హార్దిక్ రెండు సిక్సర్లు బాదినా.. దూబేను స్టొయినిస్ అవుట్ చేశాడు. వీరి మధ్య ఐదో వికెట్‌కు 35 పరుగులు జత చేరాయి. ఆఖరి ఓవర్‌లో జడేజా (9 నాటౌట్) సిక్సర్‌తో ఈ టోర్నీలో జట్టు స్కోరు తొలిసారి 200 దాటింది.

1 అంతర్జాతీయ టీ20ల్లో 200 సిక్సర్లు బాదిన ఏకైక బ్యాటర్‌గా రోహిత్. అలాగే ఓ టీ20 వరల్డ్‌కప్ మ్యాచ్‌లో భారత్ నుంచి రోహిత్‌వే అధిక సిక్సర్లు (8). యువరాజ్ (7)ను అధిగమించాడు.

ఒకే జట్టు (ఆసీస్)పై టీ20ల్లో ఎక్కువ సిక్సర్లు (132) బాదిన బ్యాటర్‌గా రోహిత్.

2 వరల్డ్ కప్ చరిత్రలో అత్యధిక వ్యక్తిగత స్కోరు (92) సాధించిన రెండో కెప్టెన్‌గా రోహిత్. గేల్ (98) ముందున్నాడు.

3 భారత్ తరపున టీ20ల్లో మూడో ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీ (19 బంతుల్లో) నమోదు చేసిన రోహిత్. గంభీర్‌తో సమంగా నిలిచాడు. యువరాజ్ (12), రాహుల్, సూర్యకుమార్ (18) ముందున్నారు.

స్కోరుబోర్డు

భారత్: రోహిత్ (బి) స్టార్క్ 92, కోహ్లీ (సి) డేవిడ్ (బి) హాజెల్‌వుడ్ 0, పంత్ (సి) హాజెల్‌వుడ్ (బి) స్టొయినిస్ 15, సూర్యకుమార్ (సి) వేడ్ (బి) స్టార్క్ 31, దూబే (సి) వార్నర్ (బి) స్టొయినిస్ 28, హార్దిక్ (నాటౌట్) 27, జడేజా (నాటౌట్) 9, **ఎక్స్‌ట్రాలు: 3; మొత్తం: 20 ఓవర్లలో 205/5; వికెట్ల పతనం:** 1-6, 2-93, 3-127, 4-159, 5-194; **బౌలింగ్:** స్టార్క్ 4-0-45-2, హాజెల్‌వుడ్ 4-0-14-1, కమిన్స్ 4-0-48-0, జంపా 4-0-41-0, స్టొయినిస్ 4-0-56-2.

ఆస్ట్రేలియా: వార్నర్ (సి) సూర్య (బి) అర్ష్‌దీప్ 6, హెడ్ (సి) రోహిత్ (బి) బుమ్రా 76, మార్ష్ (సి) అక్షర్ (బి) కుల్దీప్ 37, మ్యాక్స్‌వెల్ (బి) కుల్దీప్ 20, స్టొయినిస్ (సి) హార్దిక్ (బి) అక్షర్ 2, టిమ్ డేవిడ్ (సి) బుమ్రా (బి) అర్ష్‌దీప్ 15, వేడ్ (సి) కుల్దీప్ (బి) అర్ష్‌దీప్ 1, కమిన్స్ (నాటౌట్) 11, స్టార్క్ (నాటౌట్) 4, **ఎక్స్‌ట్రాలు: 9; మొత్తం: 20 ఓవర్లలో 181/7; వికెట్ల పతనం:** 1-6, 2-87, 3-128, 4-135, 5-150, 6-153, 7-166; **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-37-3, బుమ్రా 4-0-29-1, అక్షర్ 3-0-21-1, హార్దిక్ 4-0-47-0, కుల్దీప్ 4-0-24-2, జడేజా 1-0-17-0.

పాయింట్ల పట్టిక — గ్రూప్-1

జట్టు	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	రన్‌రేట్
భారత్	3	3	0	0	6	2.017
ఆస్ట్రేలియా	3	1	2	0	2	-0.331
అఫ్ఘాన్	2	1	1	0	2	-0.650
బంగ్లాదేశ్	2	0	2	0	0	-2.489

ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; పా: పాయింట్లు

అఫ్ఘాన్‌కు సెమీస్ చాన్స్..

భారత్ చేతిలో ఆసీస్ ఓడడంతో సెమీఫైనల్‌కు చేరే అరుదైన అవకాశం అఫ్ఘానిస్థాన్ ఎదుట నిలిచింది. ప్రస్తుతం ఆస్ట్రేలియా, అఫ్ఘాన్ చెరో రెండు పాయింట్లతో ఉన్నాయి. మంగళవారం బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌లో గెలిస్తే అఫ్ఘాన్ 4 పాయింట్లతో నేరుగా సెమీస్ చేరుతుంది. ఒకవేళ వర్షంతో మ్యాచ్ రద్దయి ఒక పాయింట్ వస్తే..3 పాయింట్లతో అఫ్ఘానిస్థాన్ ముందడుగు వేస్తుంది. కాగా.. బంగ్లాదేశ్‌కు కూడా చాన్సు ఉందండోయ్. ఎలాగంటే..బంగ్లా 160 రన్స్ చేసి, 62 పరుగులతో అఫ్ఘాన్‌పై నెగ్గితేనే.

నితీశ్‌కు పిలుపు



కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్

పరాగ్, అభిషేక్‌లకు చోటు

జింబాబ్వేతో టీ20 సిరీస్‌కు భారత జట్టు

న్యూఢిల్లీ: తాజా వరల్డ్‌కప్ ముగిసిన వెంటనే భారత క్రికెట్ జట్టు ఐదు టీ20ల సిరీస్ కోసం జింబాబ్వే పర్యటనకు వెళ్లనుంది. వచ్చే నెల 6 నుంచి 14 వరకు జరిగే ఈ సిరీస్ కోసం యువ ఆటగాళ్లతో కూడిన 15 మంది సభ్యుల జట్టును ఎంపిక చేశారు. దీనికి శుభ్‌మన్ గిల్ నేతృత్వం వహిస్తుండగా.. తొలిసారిగా ఆంధ్ర ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డికి జాతీయ జట్టులో చోటు దక్కడం విశేషం. ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ తరపున విశేషంగా రాణించి 'ఎమర్జింగ్ ప్లేయర్ ఆఫ్ ద ఇయర్'గా నిలిచాడు. 21 ఏళ్ల నితీశ్ లీగ్‌లో 142.92 స్ట్రయిక్ రేట్‌తో 303 పరుగులు సాధించడంతో పాటు రెండు వికెట్లు కూడా తీశాడు. ఆంధ్ర జట్టు నుంచి అంతర్జాతీయ టీ20లకు ఎంపికైన తొలి ఆటగాడిగా నితీశ్ నిలిచాడు. అలాగే ఐపీఎల్‌లో రాణించిన మిగతా ఆటగాళ్లలో రియాన్ పరాగ్, అభిషేక్ శర్మ, వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్, పేసర్ తుషార్ పాండేలకు తొలిసారి చోటు లభించింది. ప్రస్తుత టీ20 జట్టులో ఉన్న జైస్వాల్, సంజూ శాంసన్ మినహా మిగిలిన సీనియర్ ఆటగాళ్లందరికీ విశ్రాంతినిచ్చారు. రిజర్వ్ ప్లేయర్లు రింకూ, ఖలీల్, అవేశ్ సైతం టూర్‌కు వెళ్లే జట్టులో ఉన్నారు.

నాన్న త్యాగాలకు ప్రతిఫలమిది

భారత్‌కు ప్రాతినిధ్యం వహించాలనే తన కల 50 శాతం నెరవేరగా, మరో 50 శాతం ఇంకా మిగిలే ఉందని జింబాబ్వేతో టీ20 సిరీస్‌కు ఎంపికైన విశాఖ ఆల్‌రౌండర్ నితీశ్ రెడ్డి చెప్పాడు. తన తండ్రి త్యాగాలకు లభించిన ప్రతిఫలమే భారత జట్టుకు తన ఎంపికని నితీశ్ తెలిపాడు.

షెడ్యూల్

తేదీ	మ్యాచ్
జూలై 6	తొలి టీ20
జూలై 7	రెండో టీ20
జూలై 10	మూడో టీ20
జూలై 13	నాలుగో టీ20
జూలై 14	ఐదో టీ20

(మ్యాచ్‌లన్నీ హరారేలో మధ్యాహ్నం 1 గంట నుంచి)

భారత టీ20 జట్టు

గిల్ (కెప్టెన్), జైస్వాల్, రుతురాజ్, అభిషేక్, రింకూ సింగ్, సంజూ శాంసన్, ధ్రువ్ జురెల్, నితీశ్ కుమార్, రియాన్ పరాగ్, వాషింగ్టన్ సుందర్, రవి బిష్ణోయ్, అవేశ్, ఖలీల్, ముకేశ్, తుషార్.

పారిస్ ఒలింపిక్స్‌కు ధీరజ్

న్యూఢిల్లీ: భారత పురుషులు, మహిళల రికర్వ్ ఆర్చరీ జట్లు పారిస్ ఒలింపిక్స్ కోటా దక్కించుకొన్నాయి. సోమవారం తాజాగా విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో అర్హత సాధించని టీమ్‌ల్లో.. భారత జట్లు టాప్‌లో నిలిచి విశ్వక్రీడల బెర్త్‌ను సొంతం చేసుకొన్నాయి. దీంతో పారిస్‌లో జరిగే ఐదు పతక ఈవెంట్లలోనూ మన ఆర్చర్లు బరిలో నిలవనున్నారు. దీంతో తెలుగు ఆర్చర్ ధీరజ్ బొమ్మదేవర, అంకిత భక్త్, భజన్ కౌర్‌లు తొలిసారి ఒలింపిక్స్‌లో ఆడనుండగా.. తరుణ్‌దీప్ రాయ్, దీపిక కుమారిలకు నాలుగోసారి అవకాశం దక్కనుంది.

బిజినెస్

మార్చి త్రైమాసికంలో కరెంట్ ఖాతా మిగులు

570 కోట్ల డాలర్లు



10 త్రైమాసికాల తర్వాత తొలిసారిగా మిగులు నమోదు

ముంబై: దేశంలో 2023-24 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో కరెంట్ ఖాతా మిగులు నమోదైంది. జనవరి-మార్చి త్రైమాసికంలో కరెంట్ ఖాతా (ఎగుమతులు, దిగుమతుల వ్యత్యాసం) మిగులు 570 కోట్ల డాలర్లు లేదా జీడీపీలో 0.6 శాతంగా ఉన్నట్టు ఆర్‌బీఐ ప్రకటించింది. సుమారుగా 10 త్రైమాసికాల తర్వాత దేశంలో కరెంట్ ఖాతా మిగులు నమోదు కావటం విశేషం. ఇదిలా ఉండగా గత ఏడాది ఇదే త్రైమాసికంలో 130 కోట్ల డాలర్ల (0.2 శాతం) కరెంట్ ఖాతా లోటు (క్యాడ్) నమోదైంది. అలాగే డిసెంబరు త్రైమాసికంలో క్యాడ్ 870 కోట్ల డాలర్లుగా (1 శాతం) ఉంది. కాగా 2024 ఆర్థిక సంవత్సరం మొత్తానికి మాత్రం క్యాడ్ జీడీపీలో 0.7 శాతానికి (2320 కోట్ల డాలర్లు) తగ్గింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరం (2022-23)లో క్యాడ్ జీడీపీలో 2 శాతంగా (6,700 కోట్ల డాలర్లు) ఉంది. మరిన్ని వివరాలు..

- ఈ ఏడాది జనవరి - మార్చి త్రైమాసికంలో వాణిజ్య లోటు ముందు ఏడాది ఇదే త్రైమాసికంతో పోల్చితే 5,260 కోట్ల డాలర్ల నుంచి 509 కోట్ల డాలర్లకు తగ్గింది.
- సేవల రంగం ద్వారా ఆదాయం 3,910 కోట్ల డాలర్ల నుంచి 4,270 కోట్ల డాలర్లకు పెరిగింది. ఇది కరెంట్ ఖాతా మిగులులోకి రావడానికి దోహదపడినట్టు ఆర్‌బీఐ తెలిపింది.
- పెట్టుబడి ఆదాయాలకు దర్పణం పట్టే ప్రాథమిక ఆదాయ ఖాతా 1,260 కోట్ల డాలర్ల నుంచి 1,480 కోట్ల డాలర్లకు పెరిగింది.
- మార్చి త్రైమాసికంలో విదేశాల్లోని భారతీయులు బదిలీ చేసిన ప్రైవేట్ నిధులు 1,190 కోట్ల డాలర్ల నుంచి 3,200 కోట్ల డాలర్లకు, ఎన్ఆర్ఐ డిపాజిట్లు 360 కోట్ల డాలర్ల నుంచి 540 కోట్ల డాలర్లకు పెరిగాయి. అయితే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు మాత్రం 640 కోట్ల డాలర్ల నుంచి 200 కోట్ల డాలర్లకు తగ్గాయి.
- ఎఫ్‌పీఐ పెట్టుబడుల విషయానికి వస్తే ముందు ఏడాది నాలుగో త్రైమాసికంలో 170 కోట్లు తరలించుకుపోగా 2023-24 క్యూ4లో నికరంగా 1,140 కోట్ల డాలర్లు ఇన్వెస్ట్ చేశారు. ఇదే కాలంలో విదేశీ వాణిజ్య రుణాల రాక 170 కోట్ల నుంచి 260 కోట్ల డాలర్లకు పెరిగింది.
- ఆర్థిక సంవత్సరం మొత్తాన్ని పరిగణనలోకి తీసుకుంటే 2022-23 ఆర్థిక సంవత్సరంలో 520 కోట్ల డాలర్ల మేరకు పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు తరలిపోగా2023-24 ఆర్థిక సంవత్సరంలో నికరంగా 4,410 కోట్లు దేశంలోకి వచ్చాయి. అయితే ఇదే కాలంలో ఎఫ్‌డీఐలు మాత్రం 2,800 కోట్ల డాలర్ల నుంచి 980 కోట్ల డాలర్లకు తగ్గాయి.

చిక్కుల్లో క్వాంట్ ఎంఎఫ్



సంస్థలో ఫ్రంట్ రన్నింగ్ కార్యకలాపాలు! ● విచారణ ప్రారంభించిన సెబీ

- ముంబై, హైదరాబాద్‌లోని కంపెనీ కార్యాలయాల్లో సోదాలు
- మొబైళ్లు, కంప్యూటర్లతో పాటు ఇతర డిజిటల్ పరికరాల స్వాధీనం
- పూర్తిగా సహకరిస్తామన్న సంస్థ

న్యూఢిల్లీ: గడిచిన కొన్నేళ్లలో శరవేగంగా వృద్ధి చెందుతూ వచ్చిన క్వాంట్ మ్యూచువల్ ఫండ్ (ఎంఎఫ్) ప్రస్తుతం చిక్కుల్లో ఇరుక్కుంది. సంస్థలో ఫ్రంట్ రన్నింగ్ కార్యకలాపాలు జరిగాయన్న అనుమానంతో క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ విచారణ ప్రారంభించింది. అందులో భాగంగా కంపెనీకి చెందిన ముంబై, హైదరాబాద్ కార్యాలయాల్లో సోదాలు నిర్వహించిన సెబీ.. మొబైల్ ఫోన్లు, కంప్యూటర్లు, ఇతర డిజిటల్ పరికరాలను జప్తు చేసింది. స్టాక్ మార్కెట్లో ఈ మ్యూచువల్ ఫండ్ కంపెనీ పెట్టుబడులకు సంబంధించిన గోప్య సమాచారాన్ని లీక్ చేస్తున్నదెవరు, తద్వారా లబ్ది పొందుతున్నది ఎవరనే విషయాన్ని రాబట్టేందుకు వాటిని తన ఆధీనంలోకి తీసుకుంది. క్వాంట్ ఎంఎఫ్‌కు చెందిన డీలర్ లేదా ఏ బ్రోకర్ ద్వారానైతే క్వాంట్ ఈక్విటీ పెట్టుబడులు పెడుతున్నదో వారి నుంచి సమాచారం బయటికి పొక్కి ఉండవచ్చని సెబీ అనుమానిస్తున్నది. ఫ్రంట్ రన్నింగ్ కార్యకలాపాల ఆరోపణలకు సంబంధించిన తమపై సెబీ విచారణ కొనసాగిస్తున్నదని ధ్రువీకరించిన క్వాంట్ ఎంఎఫ్.. ఈ విషయంలో నియంత్రణ మండలికి పూర్తిగా సహకరిస్తామని, అవసరమైన సమాచారాన్ని అందిస్తామని సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. 80 లక్షలకు పైగా కస్టమర్లున్న క్వాంట్ ఎంఎఫ్ నిర్వహణలో ఉన్న ఆస్తుల విలువ (ఏయూఎం) రూ.93,000 కోట్ల పైమాటే.

క్వాంట్‌లో ఏం జరిగింది..?

క్వాంట్ ఎంఎఫ్ ఏయే కంపెనీల షేర్ల క్రయ, విక్రయాలు జరుపబోతోందన్న ముందస్తు సమాచారం ఆధారంగా ఫ్రంట్ రన్నింగ్ కార్యకలాపాలు జరిగినట్లు సెబీ నిఘా వ్యవస్థ సంకేతాలిచ్చింది. క్వాంట్ కొనుగోలు చేయబోయే కంపెనీ షేర్లు, సంఖ్య, సమయానికి సంబంధించిన సమాచారం తెలిసిన మ్యూచువల్ ఫండ్ కంపెనీ ఉద్యోగులే విషయాన్ని లీక్ చేసి ఉంటారని సెబీ అనుమానిస్తోంది. దాంతో సెబీ.. క్వాంట్ ఎంఎఫ్ ఎగ్జిక్యూటివ్‌లు, బ్రోకర్లను ప్రశ్నిస్తున్నట్లు తెలిసింది.

ఎంఎఫ్ రంగంలో ఇదే మొదటి సంఘటనా..?

దేశీయ మ్యూచువల్ ఫండ్ రంగంలో గతంలోనూ ఫ్రంట్ రన్నింగ్ వ్యవహారాలు వెలుగుచూశాయి. 2022లో యాక్సిస్ మ్యూచువల్ ఫండ్ పైనా ఈ విషయంలో విచారణ జరిపి ఫండ్ డీలర్‌తో పాటు మరో 20 సంస్థలను సెక్యూరిటీస్ మార్కెట్ నుంచి మార్కెట్ నియంత్రణ మండలి సెబీ నిషేధించింది. 2007లోనూ హెచ్‌డీఎఫ్‌సీ మ్యూచువల్ ఫండ్‌లో ఫ్రంట్ రన్నింగ్ కార్యకలాపాలు జరిగినట్లు తేలింది.

ఇన్వెస్టర్లపై ప్రభావం ఉంటుందా..?

క్వాంట్ ఎంఎఫ్ ఫండ్ పథకాల్లో పెట్టుబడులు పెట్టిన ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను వెనక్కి తీసుకోవాల్సి రావచ్చు. ఎందుకంటే, తాజా ఘటనతో క్వాంట్ ఎంఎఫ్ పెట్టుబడులు కలిగిన కంపెనీ షేర్లలో అమ్మకాల ఒత్తిడి పెరిగితే, ఇన్వెస్టర్ల నెట్ అసెట్ వాల్యూ (ఎన్‌ఏవీ) తగ్గిపోయే ప్రమాదం ఉంది. క్వాంట్ ఎంఫ్ ప్రధానంగా స్మాల్, మిడ్ క్యాప్ షేర్లలో అధిక పెట్టుబడులను కలిగి ఉంది. అయితే, సంస్థ ఫండ్లలోని పెట్టుబడులు జప్తయ్యే ప్రమాదం లేదని విశ్లేషకులు పేర్కొన్నారు. సంస్థలో ఫ్రంట్ రన్నింగ్ వ్యవహారం జరిగినట్లు సెబీ విచారణలో తేలితే క్వాంట్‌పై క్రమశిక్షణ చర్యలతో పాటు జరిమానా విధించే అవకాశం ఉంది.

ఫ్రంట్ రన్నింగ్ అంటే..?

బ్రోకర్ లేదా మార్కెట్ విశ్లేషకుల నుంచి అందుకున్న ముందస్తు సమాచారం ఆధారంగా వ్యక్తులు లేదా సంస్థ సంబంధిత షేరులో లావాదేవీ నెరపడం ద్వారా అయాచిత లబ్ది పొందడాన్ని ఫ్రంట్ రన్నింగ్ కార్యకలాపాలుగా పరిగణిస్తారు. ఉదాహరణకు, బడా సంస్థ లేదా మ్యూచువల్ ఫండ్ ఏదైనా కంపెనీ షేర్లను భారీ సంఖ్యలో కొనుగోలు చేయబోతున్నదన్న సమాచారం తెలిసిన బ్రోకర్ లేదా బ్రోకింగ్ సంస్థలోని ఉద్యోగి ఆ కంపెనీ షేర్లను ముందుగానే కొనిపెట్టుకోవడం ద్వారా లబ్ధిపొందడమే ఫ్రంట్ రన్నింగ్. ఇది అనైతిక, అక్రమ వ్యవహారం. సెబీ దీన్ని నిషేధించింది కూడా.

జీఐబీ ఎనర్జీఎక్స్‌తో

అమర రాజా జట్టు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): లిథియం అయాన్ సెల్స్ టెక్నాలజీ కోసం స్లోవేకియాకు చెందిన జీఐబీ ఎనర్జీ ఎక్స్ కంపెనీతో అమర రాజా అడ్వాన్స్‌డ్ సెల్ టెక్నాలజీస్ (ఏఆర్ఏసీటీ) లైసెన్సింగ్ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు సోమవారం ఇరు కంపెనీలు ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ఈ ఒప్పందం కింద జీఐబీ ఎనర్జీ ఎక్స్ అనుబంధ కంపెనీ అయిన గోషియాన్ హైటెక్ కో లిమిటెడ్.. లిథియం అయాన్ సెల్స్‌కు చెందిన "ఎల్ఎఫ్‌పీ టెక్నాలజీ" లైసెన్సును తమకు అందిస్తుందని అమరరాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ లిమిటెడ్ (ఏఆర్ఈ అండ్ ఎం) తెలిపింది. ఈ సమగ్ర ఒప్పందం కింద సిలిండ్రికల్, ప్రీస్మాటిక్ ఫ్యాక్టర్లు రెండింటిలోనూ అమరరాజా ప్రపంచ శ్రేణి ఎల్ఎఫ్‌పి సెల్స్ తయారీని చేపడుతుంది. అలాగే గోషియాన్ కంపెనీ అమరరాజాకు సెల్ టెక్నాలజీ ఐపీని అందుబాటులో ఉంచడంతో పాటు కొత్త తరానికి చెందిన ప్రాసెస్ టెక్నాలజీల ఆధారంగా గోషియాన్ ప్రపంచ సరఫరా వ్యవస్థల సమన్వయంతో గిగా ఫ్యాక్టరీ ఏర్పాటుకు అవసరం అయిన మద్దతు, కస్టమర్ సొల్యూషన్లకు టెక్నికల్ మద్దతు అందిస్తుందని పేర్కొంది.

ధరలు పెంచిన హీరో మోటోకార్ప్

హీరో మోటోకార్ప్.. ఎంపిక చేసిన మోటార్ సైకిల్, స్కూటర్ మోడళ్ల ధరలను రూ.1,500 వరకు పెంచినట్టు ప్రకటించింది. ఇన్‌పుట్ వ్యయాలు గణనీయంగా పెరిగిపోవటంతో ధరలు పెంచక తప్పలేదని కంపెనీ పేర్కొంది. పెంచిన ధరలు జూలై 1 నుంచి అమల్లోకి రానున్నాయి.

పామాయిల్ కంటే చౌకగా

సన్‌ఫ్లవర్ ఆయిల్

పోటీపడి ధర తగ్గించిన రష్యా,ఉక్రెయిన్



ముంబై: రష్యా-ఉక్రెయిన్ పోరాటం సన్‌ఫ్లవర్ ఆయిల్‌కీ విస్తరించింది. ఈ రెండు దేశాలు తమ సన్‌ఫ్లవర్ ఆయిల్ నిల్వలను వదిలించుకునేందుకు పోటీ పడి ధరలు తగ్గించాయి. ప్రస్తుతం టన్ను శుద్ధి చేయని సన్‌ఫ్లవర్ ఆయిల్‌ని ఈ రెండు దేశాలు ఇన్సూరెన్స్, రవాణా ఖర్చులతో కలిపి 940 డాలర్లకే (సుమారు రూ.78,452) విక్రయిస్తున్నాయి. ఇదే సమయంలో టన్ను ముడి పామాయిల్ ధర 950 డాలర్లు పలుకుతోంది. బీమా, రవాణా ఖర్చులు దీనికి అదనం. సాధారణంగా ముడి సన్‌ఫ్లవర్ ఆయిల్ ధర పామాయిల్ కంటే 100 డాలర్లు ఎక్కువగా ఉంటుంది.

దిగుమతులు పెంచిన భారత్

ధర తగ్గడంతో భారత కంపెనీలు పెద్ద ఎత్తున సన్‌ఫ్లవర్ ఆయిల్ దిగుమతి చేసుకుంటున్నాయి. ఈ నెలలో రికార్డు స్థాయిలో ఐదు లక్షల టన్నుల ఆయిల్ దిగుమతి కోసం ఆర్డర్ పెట్టాయి. ఇందులో ఇప్పటికే 3.2 లక్షల టన్నులు భారత రేవులకు చేరింది. ప్రస్తుతం రిటైల్ మార్కెట్లో లీటర్ సన్‌ఫ్లవర్ వంట నూనె రూ.110 నుంచి రూ.120 మధ్య పలుకుతోంది. ఈ ధర ఇంకా తగ్గే అవకాశం ఉందని భావిస్తున్నారు.

నేటి నుంచి పదో విడత స్పెక్ట్రమ్ వేలం

న్యూఢిల్లీ: పదవ విడత స్పెక్ట్రమ్ వేలం మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. మొత్తం ఎనిమిది బ్యాండ్లలో కేంద్ర ప్రభుత్వం ఈ వేలం నిర్వహించనుంది. రూ.96,000 కోట్ల విలువైన స్పెక్ట్రమ్ కోసం టెలికాం కంపెనీలైన రిలయన్స్ జియో, భారతి ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా.. ఈ వేలంలో పాల్గొననున్నాయి. ఈసారి వేలంలో కూడా రిలయన్స్ జియో కీలకమైన బిడ్డర్‌గా ఉండే అవకాశం ఉంది. కీలకమైన 5జీ మొబైల్ సర్వీసులను మరింత విస్తృతం చేసేందుకు టెలికాం కంపెనీలు ఈ స్పెక్ట్రమ్‌ను వినియోగించనున్నాయి. మొబైల్ ఫోన్ సర్వీసుల కోసం ఎనిమిది బ్యాండ్లలో వేలం వేయనున్న స్పెక్ట్రమ్ బేస్ ధరను ప్రభుత్వం రూ.96,317 కోట్లుగా ఖరారు చేసింది. పదో విడత స్పెక్ట్రమ్ వేలంలో 800, 900, 1,800, 2,100, 2,300, 2,500, 3,300 మెగా హెట్జ్‌తో పాటు 26 గిగా హెట్జ్ బ్యాండ్‌ను ప్రభుత్వం అందుబాటులో ఉంచింది. ఈ వేలం కోసం రిలయన్స్ జియో ఇప్పటికే బయానా (ఈఎండీ)గా రూ.3,000 కోట్లు, భారతి ఎయిర్‌టెల్ రూ.1,050 కోట్లు, వొడాఫోన్ ఐడియా రూ.300 కోట్లు చెల్లించాయి.

నష్టాల్లోంచి స్వల్ప లాభాల్లోకి..

ముంబై: అంతర్జాతీయ మార్కెట్ల ప్రతికూల సంకేతాల నేపథ్యంలో సోమవారం నష్టాల్లో ప్రారంభమైన ప్రామాణిక ఈక్విటీ సూచీలు.. మళ్లీ తేరుకుని స్వల్ప లాభాల్లో ముగిశాయి. విద్యుత్, వాహన, ఇండస్ట్రియల్ రంగ షేర్లలో కొనుగోళ్లు ఇందుకు దోహదపడ్డాయి. ఐటీ, మెటల్, ఆయిల్ అండ్ గ్యాస్ స్టాక్స్‌లో అమ్మకాలు మార్కెట్ లాభాలను పరిమితం చేశాయి. దాంతో సెన్సెక్స్ 131.18 పాయింట్ల లాభంతో 77,341.08 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 36.75 పాయింట్ల వృద్ధితో 23,537.85 వద్ద క్లోజైంది.

జీపీ ఎకో సొల్యూషన్స్ లిస్టింగ్ అదరహో!

గత వారంలో ఐపీఓ ముగించుకుని, సోమవారం ఎన్ఎస్ఈ ఎమర్జ్ ప్లాట్‌ఫామ్‌లో లిస్టయిన సోలార్ రంగ కంపెనీ జీపీ ఎకో సొల్యూషన్స్ ఇండియాకు మార్కెట్ వర్గాల నుంచి అపూర్వ స్పందన లభించింది. పబ్లిక్ ఇష్యూ ధర రూ.94తో పోలిస్తే, 299 శాతం ప్రీమియంతో లిస్టయిన కంపెనీ షేరు.. తొలి రోజు ట్రేడింగ్ ముగిసేసరికి 304 శాతం లాభంతో రూ.393.75 వద్ద ముగిసింది. జీపీ ఎకో సొల్యూషన్స్ ఐపీఓకు సైతం ఇష్యూ సైజుతో పోలిస్తే ఏకంగా 856.37 రెట్ల సబ్‌స్క్రిప్షన్ లభించింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,230 ▼	66,250 ▼	96,200 ▼
ముంబై	71,615 ▼	65,599 ▼	88,671 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

25వ తేదీ

హైదరాబాద్	515	విజయవాడ	515
వరంగల్	517	గోదావరి	515
చిత్తూరు	573	విశాఖపట్నం	525

డజను గుడ్లు రూ. 72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	119	విజయవాడ	132
వరంగల్	119	గుంటూరు	132
కరీంనగర్	119	ఒంగోలు	132
మహబూబ్‌నగర్	119	చిత్తూరు	126
కర్నూలు	119	నెల్లూరు	126
విశాఖపట్నం	138	అనంతపురం	132
గోదావరి	132		

గనులు, పర్యావరణం రెండు కళ్లు!

» ఖనిజ రంగంలో ఆత్మనిర్భరత సాధిస్తాం: కిషన్ రెడ్డి

న్యూఢిల్లీ, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): గనుల తవ్వకం, పర్యావరణ పరిరక్షణ దేశానికి రెండు కళ్లలాంటివని, వీటికి తాము సమ ప్రాధాన్యమిస్తామని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. సోమవారం ఢిల్లీలో కీలకమైన, తక్కువగా లభించే ఖనిజాల (క్రిటికల్ మినరల్) గనుల నాలుగో విడత వేలాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. 'కొత్త గనుల చట్టం వచ్చాక గనుల వేలానికి తీసుకున్న నిర్ణయంలో భాగంగా.. ఇప్పటివరకు 3 విడతల వేలం పూర్తయింది. నాలుగో విడత వేలం మొదలైంది. ఈ కొత్త చట్టం అమలులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి పనిచేస్తాం. ఈ రంగం ఆర్థికంగా రాష్ట్రాలకు లబ్ధి చేయడంతో పాటు వేలమందికి ఉపాధి కల్పిస్తుంది' అని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఖనిజాల తవ్వకం భారతదేశానికి చాలా కీలకమని, అందుకే ఈ రంగాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కేంద్రం అన్నిరకాలుగా భాగస్వామ్య పక్షాలకు సంపూర్ణ సహకారం అందిస్తుందన్నారు. గనులు తీసుకున్న వారు పనులను వీలైనంత త్వరగా ప్రారంభించాలని, గనుల మంత్రిత్వ శాఖ 24/7 అండగా నిలబడుతుందని తెలిపారు. 'ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా భారతదేశం ఎదిగే క్రమంలో గనుల రంగంలో సాధించనున్న ప్రగతి అత్యంత కీలకం కానుంది. మోదీ వచ్చాకే రాష్ట్రాలకు వాటా సరిగ్గా అందుతోంది. ఉదాహరణకు ఒక్క ఒడిసాలోనే ఏడాదిలో రూ. 40వేల కోట్ల లబ్ధి చేకూరింది. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఈ దిశగా సహకరించాలి. భాగస్వామ్య పక్షాలు సహకరిస్తే, ప్రతి 15 రోజులకో సంస్కరణ తీసుకొస్తాం. అందులో ఎలాంటి సందేహం లేదు' అని వ్యాఖ్యానించారు. అనంతరం 'స్కీమ్ ఫర్ పార్షియల్ రీయింబర్స్‌మెంట్ ఆఫ్ ఎక్స్‌ప్లొరేషన్ ఎక్స్‌పెన్సెస్ ఫర్ హోల్డర్స్ ఆఫ్ ఎక్స్‌ప్లొరేషన్ లైసెన్స్' పుస్తకాన్ని కేంద్రమంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రెండు కంపెనీలకు మైనింగ్ ఎక్స్ ప్లొరేషన్ లైసెన్స్‌లను, ఈ రంగంలో మంచి ఫలితాలు సాధిస్తున్న కంపెనీలు ఆర్అండ్‌డీ సంస్థలకు ప్రోత్సాహకాలను అందజేశారు.

త్వరలో కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ విలీనం!

» బీజేపీ అధికార ప్రతినిధి ఎన్వీ సుభాష్

హైదరాబాద్, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొనసాగుతున్న రాజకీయ పరిణామాలు చూస్తుంటే బీఆర్ఎస్ త్వరలో కాంగ్రెస్‌లో విలీనమయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్వీ సుభాష్ అన్నారు. ఎమ్మెల్యేల ఫిరాయింపులను గతంలో బీఆర్ఎస్ విచ్చలవిడిగా ప్రోత్సహిస్తే, ఇప్పుడు కాంగ్రెస్ అదే బాటన నడుస్తోందని విమర్శించారు. గతంలో తమది ఉద్యమపార్టీ అని ప్రకటించిన కేసీఆర్, ఆ తర్వాత తమది బరాబర్ రాజకీయ పార్టీ అని స్పష్టం చేశారని, తాజా పరిస్థితుల నేపథ్యంలో బీఆర్ఎస్‌ను కాంగ్రెస్‌లో విలీనం చేస్తామన్నా ఆశ్చర్యం లేదని అన్నారు. పార్టీని విలీనం చేసే ముందు కేసీఆర్ పదవీ విరమణ ప్రయోజనాల కోసం తన వారికి కొన్ని పదవులు తీసుకోవచ్చని ఎద్దేవా చేశారు.

ఎమ్మెల్యేల చేరికలపై రాహుల్ స్పందించాలి

» జగిత్యాల జనం కళ్లు పొడిచిన సంజయ్: బీఆర్ఎస్ నేతలు

హైదరాబాద్, జూన్ 24 (ఆంధ్రజ్యోతి) : ఒక పార్టీ నుంచి ఎన్నికైన వారు మరో పార్టీలో చేరితే అనర్హులుగా ప్రకటించేలా చట్టం తెస్తామని ఎన్నికల వేళ ప్రకటించిన రాహుల్‌గాంధీ.. రాష్ట్రంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల చేరికపై స్పందించాలని ఎమ్మెల్సీ ఎల్.రమణ, బీఆర్ఎస్ నేతలు రాజేశం గౌడ్, గెల్లు శ్రీనివాస్‌యాదవ్ డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో వారు మీడియాతో సోమవారం మాట్లాడుతూ పార్టీ ఫిరాయింపులను వ్యతిరేకిస్తున్నట్లు రాహుల్ చెబితే ఇక్కడ రేవంత్ కండువాలు కప్పుతూ పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. జగిత్యాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్ కాంగ్రెస్‌లో చేరడం అనైతిక చర్య అని ఆయన తీరుపై అంతటా నిరసన వ్యక్తమవుతోందన్నారు. ప్రజలకు సేవ చేస్తారని కళ్ల డాక్టర్ సంజయ్‌ను తెచ్చి బీఆర్ఎస్ గెలిపిస్తే.. ఇప్పుడు ప్రజల కళ్లు పొడిచి కాంగ్రెస్‌లో చేరారని బీఆర్ఎస్ నేత మేడే రాజీవ్‌సాగర్ ఆరోపించారు. కాగా, కాంగ్రెస్ పాలన ప్రారంభమైన ఆరు నెలల్లోనే రాష్ట్రంలోని సహజ వనరులను దోచుకునే పని మొదలు పెట్టారని, మంథని నియోజకవర్గంలో మంత్రి శ్రీధర్‌బాబు ఇసుక, మట్టి మాఫియాను ప్రోత్సహిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే పుట్టా మధు ఆరోపించారు. మైనింగ్ ప్రమాణాలు పాటించకుండా మట్టిని, అక్రమంగా ఇసుకను తరలిస్తుంటే.. అక్కడి అధికారులు సైతం పట్టించుకోవడం లేదన్నారు.

సింగరేణి పరిరక్షణకు ఉద్యమం

» ప్రైవేటు పరం చేయొద్దు: కోదండరాం

హైదరాబాద్, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): సింగరేణిని బొగ్గు ఉత్పత్తి చేసే సంస్థగా మాత్రమే చూడకూడదని, తెలంగాణ అస్తిత్వానికి అది ప్రతీక అని టీజేఎస్ అధినేత కోదండరాం అన్నారు. తెలంగాణ అస్తిత్వాన్ని మరిచిపోయి.. సింగరేణి బొగ్గు గనులను ప్రైవేటు పరం చేయవద్దంటూ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి సూచించారు. తాడిచర్ల, కోయగూడెం గనులను సింగరేణికే కేటాయించాలన్నారు. దీనిపై కిషన్‌రెడ్డినీ కలిసి వినతిపత్రం సమర్పిస్తామన్నారు. కేంద్రం సానుకూలంగా స్పందించకుంటే సింగరేణి పరిరక్షణ ఉద్యమాన్ని చేపడతామని స్పష్టం చేశారు. టీజేఎస్ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కోదండరాం మాట్లాడుతూ బొగ్గు గనుల్లో విపరీతమైన దోపిడీ, పర్యావరణ విధ్వంసం జరుగుతుందని గ్రహించే ఇందిరాగాంధీ దేశంలో వాటిని జాతీయం చేశారని గుర్తుచేశారు. బొగ్గు గనుల ప్రైవేటీకరణలో అక్రమాలను నియంత్రించేందుకు మాత్రమే వేలం పద్ధతిని అమలుచేయాలని సుప్రీం కోర్టు చెప్పిందని, అంతేగానీ కచ్చితంగా వేలం వేసి ప్రైవేటీకరించాలని చెప్పలేదన్నారు.

నీట్ నుంచి రాష్ట్రం బయటకు రావాలి

» మాజీ ఎంపీ వినోద్ కుమార్ డిమాండ్

హైదరాబాద్, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): అన్ని రకాల విద్య, వైద్య పరీక్షలనూ కేంద్రం తన గుప్పిట్లో పెట్టుకోవడం ఫెడరలిజాన్ని మంట గలపడమేనని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ విమర్శించారు. రాష్ట్రంలో 60 ఏళ్లపాటు బాగా జరిగిన ఎంసెట్ ద్వారానే మెడికల్ యూజీ సీట్ల భర్తీ ప్రక్రియ జరగాలని డిమాండ్ చేశారు. సోమవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ పదోతరగతి, ఇంటర్ సిలబస్ ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా ఉంటుందని, అలాంటప్పుడు జాతీయ స్థాయిలో ఒకే పరీక్షతో అందరికీ ఎలా న్యాయం జరుగుతుందని ప్రశ్నించారు. తెలంగాణ విద్యార్థులకు న్యాయం జరగాలంటే అవకతవకలకు వేదికగా మారిన నీట్ నుంచి మన రాష్ట్రం బయటకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇందుకుగాను ఢిల్లీలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి సుప్రీంకోర్టులో న్యాయవాదిని నియమించి రాష్ట్రం తరఫున వాదనలు వినిపించాలని డిమాండ్ చేశారు. చిన్న కేసులకే ఈడీని పంపే ప్రధాని మోదీ.. దేశంలోని 24 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుకు ఆటంకం కలిగించిన నీట్ అవకతవకలపై ఈడీతో విచారణ ఎందుకు చేయించడం లేదని ప్రశ్నించారు. గతంలో పదోతరగతి ప్రశ్నాపత్రం లీకేజీ జరిగిందని, ఒక్కో విద్యార్థికి రూ.1లక్ష నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేసిన బండి సంజయ్.. ఇప్పుడు నీట్ అభ్యర్థులకు పరిహారం ఇవ్వాలని కేంద్రాన్ని కోరాలని వినోద్ కుమార్ డిమాండ్ చేశారు.

కొత్త మెడికల్ కాలేజీల్లో ఎన్ఎంసీ తనిఖీలు

» అధ్యాపకుల హాజరు శాతం తగ్గడంపై అభ్యంతరం

» వెంటనే కొత్త వారిని నియమించుకోవాలని సూచన

హైదరాబాద్, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు కానున్న 8 వైద్య కళాశాలలను జాతీయ వైద్య కమిషన్ బృందాలు తనిఖీ చేశాయి. రాష్ట్రానికి సోమవారం ఉదయం 8 బృందాలు రాగా... ఒక్కో బృందంలో నలుగురు సభ్యులు ఉన్నారు. కొత్తగా ఏర్పాటవుతున్న అన్ని కాలేజీల్లోనూ అధ్యాపకుల హాజరు 70శాతం లేకపోవడంపై ఎన్ఎంసీ బృందాలు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలిసింది. తక్షణమే కొత్త అధ్యాపకులను నియమించుకోవాలని సూచించినట్లు సమాచారం. ఈ అంశాన్నే ఎన్ఎంసీకి ఇచ్చే నివేదికలో ప్రస్తావిస్తామని ఆ బృందాలు చెప్పినట్లు సమాచారం. రెండు మూడు రోజుల్లో ఈ బృందాలు వేర్వేరుగా ఎన్ఎంసీకి నివేదికలు ఇస్తాయి. వాటి ఆధారంగా ఏమైనా లోపాలుంటే సరి చేసుకునేందుకు మరో అవకాశం ఇస్తారు. అప్పటికీ మార్పు రాకపోతే సదరు కాలేజీకి అనుమతులు మంజూరు చేయరు. కౌన్సెలింగ్ ప్రారంభమయ్యేలోగా కొత్త కాలేజీలకు కచ్చితంగా అనుమతులు రావాల్సి ఉంటుంది. అప్పుడే ఆయా కాలేజీల్లో చేరికకు ఆప్షన్ పెట్టుకునే ఆస్కారం ఉంటుంది.

కాంగ్రెస్‌లోకి పోచారం

కండువా కప్పి ఆహ్వానించిన ఖర్గే

న్యూఢిల్లీ, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డికి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పోచారం ఇటీవల బీఆర్ఎస్‌ను వీడి కాం గ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే. సీఎం రేవంత్ ఢిల్లీ పర్యటన నేపథ్యంలో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి కూడా ఢిల్లీకి చేరుకున్నారు. తన కుమారుడు భాస్కర్ రెడ్డితో కలిసి సోమవారం రాత్రి ఏఐసీసీ కేంద్ర కార్యాలయంలో ఖర్గేను కలిశారు. ఈ కార్యక్రమంలో రాహుల్, కేసీ వేణుగోపాల్, సీఎం రేవంత్ కూడా పాల్గొన్నారు. మంగళవారం పార్టీ అగ్ర నేతలను కలవనున్న సీఎం రేవంత్.. పోచారం శ్రీనివాస్ రెడ్డిని వారికి పరిచయం చేయనున్నారని తెలిసింది. అనంతరం మీడియాతో మాట్లాడిన పోచారం.. కాంగ్రెస్‌తోనే తన రాజకీయ జీవితం మొదలైందని, చివరికి ముగిసేదీ కాంగ్రెస్‌లోనేనని అన్నారు. ఆరు నెలలుగా ప్రభుత్వ పరిపాలనను గమనిస్తున్నానని, సీఎం రేవంత్ అంకితభావంతో పని చేస్తున్నారని కొనియాడారు. సమర్థవంతమైన పాలనను అందిస్తున్నారని కితాబునిచ్చారు. రైతులకు మంచి జరగాలనే రేవంత్ నాయకత్వాన్ని బలపరుస్తూ తనతోపాటు తన అనుచరులు మొత్తం కాంగ్రెస్‌లో చేరినట్లు తెలిపారు. ఎన్టీఆర్ పిలుపుతో టీడీపీలో చేరానని, పదేళ్లు కేసీఆర్ నాయకత్వంలో పని చేశానని చెప్పారు. తిరిగి కాంగ్రెస్‌లో చేరడం సంతోషంగా ఉందన్నారు.



ఖర్గే, రాహుల్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి, చిత్రంలో సీఎం రేవంత్, వేణుగోపాల్

నీట్‌పై సిటింగ్ జడ్జితో విచారణ జరిపించాలి: సీఎం రేవంత్

నీట్ అవకతవకలపై సిటింగ్ జడ్జితో విచారణ జరిపించాలని సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష నిర్వహణలో కేంద్రం విఫలమైందని, అక్రమాలపై సీబీఐ విచారణ సరిపోదని అన్నారు. పార్టీలోకి పోచారం చేరిక అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కోట్లమంది విద్యార్థుల భవితవ్యానికి సంబంధించిన అంశమైనందున కఠిన చర్యలు తీసుకోవాలని, నీట్ అవకతవకలపై ప్రధాని మౌనం వహించడం సరికాదని తప్పుబట్టారు. ఇప్పటికైనా నీట్‌పై మోదీ న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

ఫిరాయింపులకు కళ్లెం వేద్దాం!

(మొదటి పేజీ తరువాయి)

ఘోర పరాభవంతో నాయకులు పార్టీని వీడుతున్నారు. ఊహించని విధంగా అత్యంత సన్నిహితులు ఒకరి తర్వాత మరొకరు పార్టీని వీడుతుండడంతో బీఆర్ఎస్ అప్రమత్తమైంది. ఎమ్మెల్యేల జంపింగ్‌లను అడ్డుకునే దిశగా పావులు కదుపుతోంది. ఓవైపు అసెంబ్లీ స్పీకర్‌కు వినతి పత్రాలు ఇస్తూనే.. మరోవైపు, హైకోర్టును, సుప్రీం కోర్టును ఆశ్రయించి ఫిరాయింపులను అడ్డుకోవాలని యోచిస్తోంది. పార్టీ ఎమ్మెల్యేల్లో భరోసా నింపాలని, వారు సొంత పార్టీలోనే ఉండేలా చర్చలు జరపాలని భావిస్తోంది. ఇందులో భాగంగా, బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ పార్టీ ఎమ్మెల్యేలు, రాజ్యసభ సభ్యులతో సమావేశం కానున్నట్లు తెలుస్తోంది. వారం రోజుల్లోనే ఈ భేటీ జరగనుందని సమాచారం. ఈ మేరకు తెలంగాణ భవన్‌లో ఈ వారంలో ఒక రోజు నిర్వహించే ప్రత్యేక సమావేశానికి పార్టీ ఎమ్మెల్యేలందరూ విధిగా హాజరు కావాలంటూ గులాబీ బాస్ ఫోన్ ద్వారా ఆదేశించినట్లు తెలుస్తోంది. ఈ కారణంగానే విదేశీ పర్యటనలో ఉన్న మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తమ పర్యటనను ముందుగానే ముగించుకొని రెండు రోజుల్లో రాష్ట్రానికి వస్తున్నారని విశ్వసనీయ సమాచారం. షెడ్యూల్ ప్రకారం ఆ ఇద్దరు నేతలూ జూలై మొదటి వారం వరకు తమ విదేశీ పర్యటన కొనసాగించాల్సి ఉన్నా.. అధినేత ఆదేశించడంతో ముందే రానున్నట్లు తెలుస్తోంది. అయితే, అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో పార్టీ విధానం, రాష్ట్రంలో నెలకొన్న ప్రధాన సమస్యలు, సభలో అధికార కాంగ్రెస్‌ను నిలదీసేందుకు ఏయే అంశాలను లేవనెత్తాలన్న దానిపైనే ఈ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు గులాబీ నేతలు చెబుతున్నారు. కానీ, జంప్ జిలానీలకు కళ్లెం వేసేందుకే పార్టీ అధిష్ఠానం ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసిందని తెలుస్తోంది. అలాగే, ఫిరాయింపులపై సుప్రీం కోర్టును ఆశ్రయించాలని బీఆర్ఎస్ అధి



బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసిన వద్దిరాజు రవిచంద్ర

నాయకత్వం భావిస్తోంది. ఇప్పటికే కాంగ్రెస్‌లో చేరిన ముగ్గురితోపాటు తాజాగా బీఆర్ఎస్‌ను వీడిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు విధించాలంటూ అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించేందుకు సిద్ధమవుతోంది. తద్వారా, కాంగ్రెస్‌లో చేరకుండా అడ్డుకోవచ్చునని అంచనా వేస్తోంది. ఎమ్మెల్యేలపై వచ్చిన అనర్హత పిటిషన్‌పై మూడు నెలల్లోపు స్పీకర్ నిర్ణయం తీసుకోవాలంటూ ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునే అస్త్రంగా చేసుకోవాలని బీఆర్ఎస్ భావిస్తోంది. ఎమ్మెల్యే దానం నాగేందర్ కాంగ్రెస్‌లో చేరి మూడు నెలలు పూర్తయిందని, ఈ విషయంలో తమ పార్టీ నేతలు ఇచ్చిన అనర్హత పిటిషన్‌పై స్పీకర్ ఏ నిర్ణయమూ తీసుకోలేదంటూ సుప్రీంకోర్టును ఆశ్రయిస్తున్నట్లు తెలుస్తోంది.

ఫిరాయింపులు సరికాదు

అధికారంలో ఉన్నామని ఇష్టానుసారం వ్యవహరిస్తే ప్రజల చేతిలో గుణపాఠం తప్పదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. ఎమ్మెల్యేల ఫిరాయింపులను ప్రోత్సహించడం తగదంటూ ఆ పార్టీపై సోమవారం ఎక్స్ వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు. "కాంగ్రెస్ నీతి లేని వ్యవహారాలపై గతంలో తెలంగాణ ప్రజలు ఆందోళనను ఉధృతం చేశారు. ఆ దెబ్బకు ఆ పార్టీ తలవంచక తప్పలేదు. ఇప్పుడు కూడా మా పార్టీ ఎమ్మెల్యేలు ఫిరాయించేందుకు ప్రోత్సహిస్తున్న కాంగ్రెస్‌కు కచ్చితంగా ప్రజలు బుద్ధి చెబుతారు"అని అన్నారు.

రైల్‌రోకోపై ఎలాంటి పిలుపు ఇవ్వలేదు

» 2011 నాటి కేసు కొట్టివేయండి.. హైకోర్టులో కేసీఆర్ పిటిషన్

రైళ్లను నిలిపేయాలని గానీ, రైల్ రోకో చేపట్టాలనిగానీ 2011లో తాను ఎలాంటి పిలుపు ఇవ్వలేదని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హైకోర్టుకు తెలిపారు. ఇప్పటికే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడినందున పాత కేసుకు ఎలాంటి విలువ లేదని, దాన్ని కొట్టివేయాలంటూ క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. 2011 సెప్టెంబరు 15న అప్పటి పొలిటికల్ జేఏసీ నాయకులు కేసీఆర్, కోదండరాం ఇచ్చిన పిలుపు మేరకు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత, మరో 40 మంది మౌలాలి రైల్వేస్టేషన్‌లో రైల్‌రోకో నిర్వహించారు. దీంతో కేసీఆర్ సహా మరికొందరిపై కేసు నమోదయింది. ఈ కేసుపై ఇటీవలే పోలీసులు చార్జిషీట్ దాఖలు చేశారు. కేసీఆర్ ఎమ్మెల్యే కావడంతో ఈ కేసు సికింద్రాబాద్ రైల్వే కోర్టు నుంచి ప్రత్యేక కోర్టు అయిన నాంపల్లి ఎక్సైజ్ కోర్టు (మనోరంజన్ కాంప్లెక్స్)కు బదిలీ అయింది. ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ కేసీఆర్ హైకోర్టును ఆశ్రయించారు. ఘటన జరిగి దాదాపు 13 ఏళ్లు కావస్తోందని, ఈ కేసులో ప్రాసిక్యూట్ చేయడం వల్ల ఎలాంటి ఉపయోగం లేదని తెలిపారు. అప్పటివరకు అన్ని ప్రొసీడింగ్స్‌పై స్టే విధించాలని కోరారు.

రాష్ట్రంలో నూతన ఎంఎస్ఎంఈ పాలసీ

» మహిళలకు అధిక ప్రాధాన్యం: శ్రీధర్‌బాబు

హైదరాబాద్, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం సూక్ష్మ చిన్న, మధ్యతరహా పరిశ్రమల (మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్-ఎంఎస్ఎంఈ పాలసీ)కు సంబంధించి కొత్త విధానాన్ని రూపొందిస్తోందని, అందులో మహిళా పారిశ్రామిక వేత్తలకు తగిన ప్రాధాన్యమిస్తామని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. దీనికి సంబంధించి వచ్చే అసెంబ్లీ సమావేశాల్లోనే బిల్లును ప్రవేశపెడతామని చెప్పారు. దేశంలోనే ఎంఎస్ఎంఈల కోసం ప్రత్యేకంగా పాలసీను తీసుకొస్తున్న మొదటి రాష్ట్రం తెలంగాణేనని చెప్పారు. సోమవారం హైదరాబాద్‌లో ఫిక్కీ లేడిస్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఎల్‌వో) ఆధ్వర్యంలో నిర్వహించిన "సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు- సమ్మిళిత అభివృద్ధి" అనే అంశమ్మీద నిర్వహించిన సదస్సులో శ్రీధర్‌బాబు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వ్యాపారాల్లో మహిళలకు తోడ్పాటును అందిస్తామని, వాళ్లు పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి ప్రభుత్వం తగిన సహకారం అందిస్తుందన్నారు. రాష్ట్రంలోని యువత నైపుణ్యాన్ని మెరుగుపర్చేందుకు త్వరలో స్కిల్ యూనివర్సిటీని తీసుకురాబోతున్నామని చెప్పారు. రీజినల్ రింగ్ రోడ్డుతోపాటు దాని చుట్టూ రింగ్ రైల్వే లైన్‌ను ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఐటీ కంపెనీలకు, ఆర్ఆర్ఆర్ పరిధిలో పరిశ్రమలకు అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు.

85వేల ఎకరాల్లో బిందు సేద్యం

ప్రస్తుత సంవత్సరానికిగాను 85,313 ఎకరాల్లో బిందు సేద్యం ద్వారా పంటలు సాగు చేసేందుకు ప్రణాళిక రూపొందించారు. రాష్ట్రీయ కృషి వికాస్ యోజనలో భాగంగా 'ప్రతి చుక్కకు... ఎక్కువ పంట' నినాదంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకానికి అనుసంధానంగా రాష్ట్ర ప్రభుత్వం సూక్ష్మ నీటిపారుదల పథకాన్ని అమలు చేస్తోంది. మొదటి విడతలో 32 జిల్లాల్లో 50 వేల ఎకరాలకు డ్రిప్ యూనిట్లు మంజూరు చేస్తూ సోమవారం ఉద్యానశాఖ డైరెక్టరేట్ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇతర పంటల్లో 26,563 యూనిట్లకు డ్రిప్, 8,750యూనిట్లకు స్ప్రింక్లర్లు కలిపి... 35,313యూనిట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.



గంజాయి బ్యాచ్.. బాలికపై గ్యాంగ్ రేప్

» కూలీ పనులకు తల్లి.. ఇంట్లో ఆమె ఒక్కతే

» తొలుత ఫోన్ ద్వారా పరిచయమైన ఓ యువకుడు

» తర్వాత మరో నలుగురు.. వీరి ద్వారా ఆమె గంజాయి మత్తులోకి

» పలుమార్లు సామూహిక అత్యాచారం.. గర్భం దాల్చడంతో వెలుగులోకి

» కాచిగూడలో ఘటన.. ఐదుగురిపై పోక్సో కేసు.. అందరూ పరారీలో

బర్కత్‌పుర జూన్ 24 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ద్వారా పరిచయమైన బాలికను గంజాయి మత్తులోకి దింపిన ఓ యువకుడు, తన స్నేహితులతో కలిసి ఆమెపై పలుమార్లు అత్యాచారానికి ఒడిగట్టాడు. బాలిక గర్భం దాల్చడంతో ఈ ఘోరం బయటపడింది. కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసుల వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఒక మహిళ తన 15 ఏళ్ల కూతురుతో కలిసి కాచిగూడ పరిధిలో నివాసం ఉంటూ రోజూ కూలీ పనులకు వెళుతోంది. బాలిక ఆరో తరగతి దాకా చదువుకొని, బడి మానేసి ఇంటి వద్దే ఉంటోంది. తల్లి కూలీ పనులకు వెళ్లాక దగ్గర్లో ఉండే ఓ అమ్మాయి ఇంటికి బాలిక వెళ్లేది. అక్కడ ఇద్దరూ మాట్లాడుకునేవారు. ఒక రోజు బాలిక నుంచి అమ్మాయి సెల్‌ఫోన్ తీసుకొని, తనకు పరిచయం ఉన్న విజయ్ కుమార్ (23) అనే యువకుడితో మాట్లాడింది. ఈ క్రమంలో ఓసారి అతడు ఆ నంబరుకే ఫోన్ చేయగా ఈ బాలికే మాట్లాడటంతో ఇద్దరి మధ్య పరిచయం ఏర్పడి, అది క్రమంతప్పకుండా రోజూ మాట్లాడుకునే దాకా వెళ్లింది. పగలంతా ఇంట్లో బాలిక ఒంటరిగా ఉండటంతో అతనొచ్చి ఆమెను బైక్‌పై ఎక్కించుకొని తానుండే నేరేడ్‌మెట్‌కు తీసుకెళ్లేవాడు. ఈ క్రమంలో తన స్నేహితులైన బాలు (25), కృష్ణ (25), కిరణ్ (24), అజయ్ (25)లకు బాలికను పరిచయం చేశాడు. అప్పటికే గంజాయికి అలవాటు పడిన ఈ యువకులు, బాలికను కూడా ఆ మత్తులోకి దించారు. ఈ క్రమంలో విజయ్, అతడి స్నేహితులు బాలికపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డారు. ఇటీవల బాలిక అనారోగ్యానికి గురవడంతో వైద్య పరీక్షలు చేయించగా గర్భిణి అని తేలింది. బాధితురాలిని తల్లి నిలదీయడంతో జరిగిన ఘోరమంతా ఆమెకు చెప్పింది. బాలికను వెంటబెట్టుకొని తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఐదుగురు నిందితులపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ప్రస్తుతం ఐదుగురూ పరారీలోనే ఉన్నారు.

సంజయ్ చేరికపై జీవన్‌రెడ్డి కినుక

రాజీనామాకు సిద్ధమయ్యారంటూ ప్రచారం.. ఉదయం నుంచి పార్టీ నేతలతో సమాలోచన

» జీవన్‌రెడ్డి ఇంటికి మంత్రి శ్రీధర్‌బాబు

» తొందరపాటు నిర్ణయాలు వద్దని వినతి

» చేరికల్లో సమన్వయ లోపం జరిగింది

» జీవన్‌రెడ్డి ప్రాధాన్యం తగ్గదు: దుద్దిళ్ల

» కార్యకర్తల మనోభావాలు దెబ్బతిన్నాయి

» అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడి ఉంటా: ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



జగిత్యాలలో జీవన్‌రెడ్డితో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు తదితరులు

కరీంనగర్/జగిత్యాల, జూన్ 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బీఆర్ఎస్ నేత, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌ను కాంగ్రెస్‌లో చేర్చుకోవడంపై సీనియర్ కాంగ్రెస్ నేత, ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి కినుక వహించారు. తీవ్ర అసంతృప్తికి గురై రాజీనామాకు సిద్ధమయ్యారు. నాలుగు దశాబ్దాలుగా క్రియాశీల రాజకీయాల్లో ఉన్న తనను మాటమాత్రంగానైనా సంప్రదించకుండా తన సొంత నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేను పార్టీలో చేర్చుకోవడాన్ని ఆయన ఆక్షేపించారు. ఇది తనను అగౌరవపరిచినట్లేనని ఆయన ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. జగిత్యాల కాంగ్రెస్ నాయకులే కాకుండా ఇతర జిల్లాలకు చెందిన వందలాది కాంగ్రెస్ నేతలు, ప్రజాప్రతినిధులు సైతం సోమవారం ఉదయమే జీవన్‌రెడ్డి నివాసానికి చేరుకున్నారు. రాత్రి వరకూ అక్కడే ఉండి జీవన్‌రెడ్డి ఆవేదనలో పాలుపంచుకున్నారు. ఈ క్రమంలోనే ఒకరిద్దరు సీనియర్ నేతలు పార్టీకి రాజీనామా చేస్తూ టీపీసీసీ అధ్యక్షుడికి లేఖలు పంపించినట్లు ప్రకటించారు. దీంతో పార్టీ రాష్ట్ర నాయకత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టి జీవన్‌రెడ్డిని సముదాయించడానికి ప్రయత్నాలు ప్రారంభించింది. సోమవారం మధ్యాహ్నం ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, మరో ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్ జీవన్‌రెడ్డిని కలిసి ఆయనకు నచ్చజెపుతూ తొందరపాటు నిర్ణయం ఏదీ తీసుకోవద్దని కోరినట్లు తెలిసింది. పరిస్థితి తీవ్రతను గుర్తించిన పార్టీ అధినాయకత్వం మంత్రి శ్రీధర్‌బాబును దూతగా పంపగా.. సాయంత్రం 6.30గంటలకు ఆయన జీవన్‌రెడ్డి నివాసానికి వచ్చారు. ఈ సమయంలో కాంగ్రెస్‌శ్రేణులు, నేతలు జీవన్‌రెడ్డికి మద్దతుగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సుమారు రెండు గంటల పాటు మంత్రి శ్రీధర్‌బాబు, ప్రభుత్వ విప్‌లు లక్ష్మణ్‌కుమార్, ఆది శ్రీనివాస్, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు, కోరుట్ల ఇన్‌చార్జి నర్సింగరావు తదితరులు జీవన్‌రెడ్డితో చర్చించి ఆయనకు నచ్చజెప్పారు. వ్యక్తికి గౌరవం లేకపోతే ప్రజా జీవితం ఎందుకు? పదవి ఎందుకు? అని జీవన్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. తాను ఇంతకాలం పార్టీలో గౌరవంగా కొనసాగానని గుర్తు చేసినట్లు సమాచారం.

పార్టీకి పెద్ద దిక్కు జీవన్‌రెడ్డి: దుద్దిళ్ల

చర్చల అనంతరం మంత్రి శ్రీధర్‌బాబు అక్కడే ఉన్న మీడియాతో మాట్లాడుతూ జీవన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీకి పెద్ద దిక్కు అని, చేరికల విషయంలో కొంత సమన్వయ లోపం జరిగిందని తెలిపారు. జీవన్‌రెడ్డి మనోభావాలను పరిగణనలోకి తీసుకుంటామని, ఆయనకు ఏ మాత్రం ప్రాధాన్యం తగ్గకుండా పార్టీ చర్యలు తీసుకుంటుందని తెలిపారు. గతంలో మాదిరిగానే ఆయన పార్టీకి పెద్ద దిక్కుగా ఉండాలని కోరుకుంటున్నామన్నారు. ఈ సంఘటన కారణంగా మనస్తాపానికి గురైనట్లు జీవన్‌రెడ్డి వివరించారని, అన్ని విషయాలను అధిష్ఠానానికి తెలియజేస్తానని తెలిపారు. అనంతరం జీవన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ జరిగిన పరిణామాలపై శ్రీధర్‌బాబుతో చర్చించానన్నారు. కాంగ్రెస్ అభ్యున్నతి కోసం కృషి చేసిన కార్యకర్తల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. కార్యకర్తల మనోభావాలను గౌరవించాల్సిన బాధ్యత పార్టీపై ఉందని అభిప్రాయపడ్డారు. ఈ విషయాన్ని అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తానన్నారు. పార్టీ నిబంధనల్ని పాటిస్తానని, అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్యే చేరిక వెనుక రాజకీయం


పార్లమెంట్ ఎన్నికల్లో నిజామాబాద్ నుంచి పోటీ చేసిన జీవన్‌రెడ్డి పరాజయం పాలయ్యారు. ఆయన్ను గెలిపిస్తే నిజామాబాద్ జిల్లా రాజకీయాల్లోనూ జోక్యం చేసుకుంటారన్న ఉద్దేశంతో అక్కడి నాయకులు ఆయనకు సహకరించలేదన్న ప్రచారం జరుగుతోంది. నిజామాబాద్ నుంచి మంత్రి పదవి ఆశిస్తున్న నాయకుడికి ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌తో సాన్నిహిత్యం ఉంది. కాంగ్రెస్‌లో చేరేలా సంజయ్‌ను ఆయనే ఒప్పించినట్లు తెలిసింది. వచ్చే ఎన్నికల్లోనూ టికెట్ దక్కుతుందని నమ్మబలికినట్లు సమాచారం. సంజయ్‌కుమార్ కూడా అధికార పార్టీలో ఉంటేనే మేలనే భావనకు వచ్చారని తెలిసింది.

నేతన్నలవి ఆత్మహత్యలు కాదు.. ప్రభుత్వ హత్యలు!

» ఉసురు తీసుకుంటున్నా ఆదుకోరా?

» ఆరునెలల్లో 10 మంది ఆత్మహత్య

» సీఎంకు కేటీఆర్ బహిరంగ లేఖ



హైదరాబాద్, జూన్ 24 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్య వైఖరి కారణంగా.. రాష్ట్రంలోని చేనేత కార్మికులు ఉపాధి కోల్పోయి ఆర్థిక ఇబ్బందులు, ఆకలి బాధ తట్టుకోలేక తనువు చాలిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు ఆరోపించారు. వారివి ఆత్మహత్యలు కాదని.. అవి ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వ హత్యలేనని ఆయన ఆరోపించారు. ఈమేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి సోమవారం ఆయన బహిరంగ లేఖ రాశారు. గత కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో వస్త్ర పరిశ్రమ దుర్భర పరిస్థితుల్లో మునిగిపోయిందని, మళ్లీ కాంగ్రెస్ వచ్చిన 6 నెలల్లోనే అలాంటి విషాదకర పరిస్థితిని ఎదుర్కొంటోందని ఆరోపించారు. ఉపాధి లేక ఉసురు తీసుకుంటున్నా... నేతన్నలను ఆదుకోరా అని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ మేనిఫెస్టో ప్రకారం పవర్‌లూమ్‌లు, నేత పరికరాలపై 90 శాతం సబ్సిడీ ఇవ్వాలని, ప్రభుత్వ అధీనంలో ఉండే సంస్థలకు అవసరమైన వస్త్రాల ఉత్పత్తిని నేతన్నలకు అప్పగించి ఉపాధి కల్పిస్తామన్న హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఆరునెలల కాలంలో 10 మంది నేతన్నలు తనువు చాలించడం బాధాకరమని, సిరిసిల్ల, కరీంనగర్‌తో పాటు టెక్స్‌టైల్స్‌శాఖ మంత్రి సొంత జిల్లా ఖమ్మంలోనూ ఇద్దరు కార్మికులు ఆత్మహత్య చేసుకోవడం అత్యంత విషాదకరమన్నారు. పలుచోట్ల ఆత్మహత్యకు పాల్పడిన వారి వివరాలను కేటీఆర్ తన లేఖలో పేర్కొన్నారు. వారి కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని డిమాండ్ చేశారు. నేతన్నల సమస్యలు పరిష్కరించకుంటే వారి తరఫున బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని కేటీఆర్ హెచ్చరించారు.

నేషనల్ డిజాస్టర్ అలయన్సే కారణం!

నీట్‌యూజీ ప్రశ్నాపత్రం ముందుగానే లీక్ అయినట్టు రుజువైనా మోదీ ప్రభుత్వం జూలై ఆరు నుంచి కౌన్సెలింగ్ నిర్వహించేందుకు సిద్ధమవుతోందని, కేంద్ర ప్రభుత్వం అసమర్థత విద్యార్థుల పాలిట శాపంగా మారుతోందని కేటీఆర్ ఆరోపించారు. నీట్, యూజీసీ నెట్ పరీక్షల్లో అవకతవకలపై సోమవారం ఎక్స్ వేదికగా కేంద్ర సర్కారుపై ఆయన విమర్శలు చేశారు. ఎలాంటి కారణాలు చూపకుండా నీట్ పీజీ పరీక్ష ప్రారంభానికి కొన్ని గంటల ముందు వాయిదా వేశారని ఆక్షేపించారు. ఈ నిర్ణయాల వెనుక ఉన్న లాజిక్ ఏమిటని ప్రశ్నించిన కేటీఆర్.. అన్నిటికీ నేషనల్ డిజాస్టర్ అలయన్స్ కారణమంటూ ఎన్డీఏ సర్కారును ఎద్దేవా చేశారు.



కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో భేటీ అయిన మంత్రి కోమటిరెడ్డి

ఉప్పల్ ఫ్లైఓవర్ టెండర్లు రద్దు

- కేంద్ర మంత్రి గడ్కరీ అధికారులకు ఆదేశాలిచ్చారు
- మళ్లీ టెండర్లను పిలవాలని చెప్పారు
- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెల్లడి

న్యూఢిల్లీ, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): గత కేసీఆర్ సర్కార్ నిర్లక్ష్యం వల్ల పెండింగ్‌లో ఉన్న 16 రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా మార్చాలని కేంద్ర రోడ్లు, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి విజ్ఞప్తి చేశారు. నాలుగేళ్లుగా నత్త నడకన సాగుతున్న ఉప్పల్- ఘట్‌కేసర్ ఫ్లైఓవర్ నిర్మాణ పనులపై ఫిర్యాదు చేశారు. ఢిల్లీలో నితిన్ గడ్కరీతో ఆయన నివాసంలో మంత్రి కోమటిరెడ్డి సోమవారం సమావేశమయ్యారు. హైదరాబాద్-విజయవాడ నాలుగు లైన్ల జాతీయ రహదారిని ఆరు లైన్ల రహదారిగా మార్చేందుకు విస్తరణ పనులు చేపట్టాలని కేంద్రమంత్రికి కోమటిరెడ్డి విజ్ఞప్తి చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడిన కోమటిరెడ్డి.. గడ్కరీతో భేటీలో మాట్లాడిన అంశాలను వెల్లడించారు. ఉప్పల్-ఘట్‌కేసర్ ఫ్లైఓవర్ నిర్మాణానికి సంబంధించి మంత్రి గడ్కరీ సదరు కాంట్రాక్ట్ సంస్థను తొలగించి కొత్తగా టెండర్లు పిలిచి పనులు పూర్తిచేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. రీజినల్ రింగ్ రోడ్డు కోసం ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి సమీక్షిస్తానని గడ్కరీ చెప్పారన్నారు. రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా మార్చడంతో పాటు రహదారుల సంఖ్యను భారతమాల కింద మంజూరు చేస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు 17 బ్లాక్ స్పాట్లు గుర్తించి వాటి మరమ్మతుల కోసం కేంద్రం 375 కోట్ల రూపాయలను మంజూరు చేసిందన్నారు. డిసెంబర్‌లోపు తాత్కాలిక పనులు పూర్తిచేస్తామన్నారు. రాష్ట్రంలో ఆర్‌ఆర్‌ఆర్ నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు తమ ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. అలాగే మంత్రి కోమటిరెడ్డి కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ని ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో కలుసుకున్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో 63% ఉత్తీర్ణత!

ములుగు,హైదరాబాద్, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను విద్యాశాఖ బుర్రా వెంకటేశం సోమవారం విడుదల చేశారు. ఫలితాల్లో మొదటి సంవత్సరంలో 63 శాతం, రెండో ఏడాదిలో 43 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. 2,54,498 మంది రెగ్యులర్, 18,913 మంది ఒకేషనల్ విద్యార్థులు ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు రాశారు. వీరిలో 1,62,520 మంది రెగ్యులర్(63.86%), 10,070 మంది ఒకేషనల్(53.24%) విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. అలాగే 1,38,477 మంది రెగ్యులర్, 15,136 మంది ఒకేషనల్ విద్యార్థులు రెండో ఏడాది పరీక్షలు రాశారు. వీరిలో 60,615 మంది రెగ్యులర్ (43.77%) విద్యార్థులు, 7,737 మంది ఒకేషనల్ (51.12%) విద్యార్థులు ఉత్తీర్ణతను సాధించారు. అయితే ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో ములుగు జిల్లా రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిచింది. ములుగు జిల్లా మొదటి సంవత్సరంలో 85.29 శాతం, రెండో సంవత్సరంలో 81.49 శాతం ఉత్తీర్ణతతో ప్రథమ స్థానం సాధించింది. రీవెరిఫికేషన్, రీకౌంటింగ్‌కు ఈనెల 25 నుంచి 29వ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు వెల్లడించారు.

27 నుంచి ఇంజనీరింగ్ కౌన్సెలింగ్

హైదరాబాద్, జూన్ 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇంజనీరింగ్ సీట్ల భర్తీకి ఈనెల 27 నుంచి కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఈ మేరకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎప్‌సెట్‌లో అభ్యర్థులు సాధించిన ర్యాంకుల ఆధారంగా కౌన్సెలింగ్‌ను నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా అభ్యర్థులు ఈనెల 27వ తేదీ నుంచి వచ్చేనెల 5వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో స్లాట్‌లను నమోదు చేసుకుని, ఫీజు చెల్లించాలి. ఈ నెల 29 నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకు ధ్రువపత్రాల పరిశీలన ఉంటుంది. ఈనెల 30 నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకు ఆప్షన్లను నమోదు చేసుకోవాలి. ఆ తర్వాత జూలై 12న ఇంజనీరింగ్ సీట్లను కేటాయిస్తారు. సీట్లు పొందిన అభ్యర్థులు 12 నుంచి 16వ తేదీల మధ్య ట్యూషన్ ఫీజును చెల్లించి, సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలి. అనంతరం జూలై 19 నుంచి రెండవ దశ కౌన్సెలింగ్, జూలై 30 నుంచి తుది దశ కౌన్సెలింగ్ నిర్వహిస్తారు.

భర్తను కోల్పోయిన మహిళను

కోర్టుల చుట్టూ తిప్పిస్తారా?: హైకోర్టు

హైదరాబాద్, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): పిడుగుపాటు కారణంగా మృత్యువాతపడ్డ వ్యక్తి భార్యకు చట్టప్రకారం పరిహారం చెల్లించకపోతే జిల్లా కలెక్టర్, తహసీల్దార్‌లు ప్రత్యక్షంగా హాజరుకావాలని ఆదేశిస్తామని హైకోర్టు అధికారులను హెచ్చరించింది. భర్తను కోల్పోయిన మహిళను కోర్టుల చుట్టూ తిప్పిస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేసింది. పిడుగుపాటు వల్ల తన భర్త చనిపోయాడని, పరిహారం చెల్లించాలని కోరుతూ నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలం అప్పయ్యపల్లె గ్రామానికి చెందిన బన్నె లక్ష్మమ్మ రెవెన్యూ అధికారులను ఆశ్రయించింది. అధికారుల చుట్టూ తిరిగినా లాభం లేకపోవడంతో నాలుగు సంవత్సరాల కింద లోకాయుక్తలో ఫిర్యాదు దాఖలు చేసింది. ఈ విషయమై లోకాయుక్తకు పరిధి లేకపోవడంతో ఫిర్యాదు పెండింగ్‌లో ఉండిపోయింది. దాంతో లోకాయుక్తకు తగిన ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ లక్ష్మమ్మ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. బాధితురాలు విపత్తుల నిర్వహణ శాఖ జీవో నెంబర్ 2 ప్రకారం పరిహారానికి అర్హురాలని పేర్కొంది. పరిహారం చెల్లించకుంటే తహసీల్దార్, కలెక్టర్ ప్రత్యక్షంగా తమ ఎదుట హాజరుకావాలని ఆదేశిస్తామని పేర్కొంది.

ఫీజు బకాయి కారణంతో

టీసీ నిరాకరించలేరు: హైకోర్టు

స్కూల్‌కు చెల్లించాల్సిన ఫీజు బకాయి ఉందనే నెపంతో మరో పాఠశాలలో చేరేందుకు కావాల్సిన ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్ (టీసీ)ని పొందే హక్కును నిరాకరించలేరని హైకోర్టు స్పష్టం చేసింది. పెద్దపల్లి జిల్లా రామగుండం మండలం గోదావరిఖనిలో నిర్వహిస్తున్న సిద్ధార్థ హైస్కూల్ నుంచి బ్రిలియంట్ గ్రామర్ పాఠశాలలో చేరేందుకు తమకు పిల్లలకు టీసీలు ఇవ్వడం లేదని పేర్కొంటూ వైష్ణవ్ దినేశ్ సహా 43 మంది తల్లిదండ్రులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వాదనలు నమోదు చేసుకున్న జస్టిస్ సూరేపల్లి నంద ధర్మాసనం.. కేవలం స్కూల్ ఫీజు పెండింగ్‌లో ఉందన్న కారణంతో ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలలో చేరేందుకు అవసరమైన టీసీని పొందేందుకు విద్యార్థులకు ఉన్న హక్కును నిరాకరించలేరని స్పష్టం చేసింది. నిజంగా పిటిషనర్ తల్లిదండ్రుల నుంచి ఫీజు వసూలు కావాల్సి ఉంటే చట్టప్రకారం కాంపిటెంట్ కోర్టును ఆశ్రయించాల్సి ఉంటుందని పేర్కొంది. యూజీసీ మార్గదర్శకాలు, ఇప్పటికే వెలువడిన వివిధ తీర్పుల ఆధారంగా తల్లిదండ్రుల పిటిషన్ అనుమతిస్తున్నామని పేర్కొంది. రెండు వారాల్లో సర్టిఫికెట్లు జారీచేయాలని తుది తీర్పులో పేర్కొంది.

బీబీనగర్ ఎయిమ్స్‌లో నవజాత శిశువుల వినికిడి లోపాలు గుర్తించే సాంకేతిక పరిజ్ఞానం

బీబీనగర్, జూన్ 24: నవజాత శిశువుల్లో వినికిడి లోపాన్ని గుర్తించే అధునాతన సాంకేతిక పరిజ్ఞానం బీబీనగర్ ఎయిమ్స్‌లో అందుబాటులోకి వచ్చింది. ఎయిమ్స్‌లోని ఈఎన్‌టీ విభాగంలో ఓటో అకౌస్టిక్ ఎబిషన్ (ఓఏఈ)తో పాటు బ్రెయిన్ స్టెమ్ ఆడిటరీ ఎవోక్డ్ రెస్పాన్స్ (బెరా) పరీక్ష కేంద్రాన్ని డైరెక్టర్ భాటియా సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియోనాటల్ హియరింగ్ స్క్రీనింగ్ ప్రోగ్రామ్ ద్వారా నవజాత శిశువు వినికిడి లోపాన్ని ముందుగానే గుర్తించేందుకు అధునాతన సాంకేతికత ఎయిమ్స్‌లో అంటుబాటులోకి వచ్చిందని తెలిపారు. చిన్న పిల్లలకు ఎంతగానో ఉపయోగపడే ఈ సదుపాయాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సాంకేతికత ద్వారా పిల్లల్లో వినికిడి సమస్యను ముందుగా గుర్తించి పరిష్కరించడానికి దోహదపడుతుందని తెలిపారు.

జూలై ఒకటి నుంచే రుణమాఫీకి శ్రీకారం!

ఆగస్టు 15లోపు పూర్తి చేసేలా నిర్ణయం



హైదరాబాద్, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): రుణ మాఫీ పథకం అమలుకు జూలై ఒకటో తేదీ నుంచే సర్కారు శ్రీకారం చుట్టనుంది. ఆగస్టు 15వ తేదీలోపు ప్రక్రియ మొత్తం పూర్తి చేసేలా కసరత్తు చేస్తోంది. ఈ మేరకు నిధులు సమీకరించాలని ఆర్థిక శాఖకు కూడా ఆదేశాలు వెళ్లినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. రుణ మాఫీ అమలుకు దాదాపు రూ.31 వేల కోట్లు అవసరమని సర్కారు అంచనా వేస్తున్న సంగతి తెలిసిందే. ఇందుకు ఆదాయ మార్గాలను ప్రభుత్వం అన్వేషిస్తోంది. రిజర్వు బ్యాంకు నుంచి అప్పులు తీసుకోవటం, కేంద్రం నుంచి రావాల్సిన బకాయిలను వసూలు చేసుకోవటం, 'ఆదాయ శాఖల' నుంచి నిధులను సర్దుబాటు చేసుకోవాలని కసరత్తు చేస్తోంది. కాగా, రుణమాఫీ పథకం అమలుకు గతంలో అనుసరించిన విధానాలనే పాటించాలనే నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. అసలు, వడ్డీ కలిపి ఒక్కో కుటుంబానికి రూ.2 లక్షల వరకు మాఫీ చేయనున్నారు. రైతు కుటుంబం అంటే.. భార్య, భర్త, వారిపై ఆధారపడి ఉన్న పిల్లలను పరిగణనలోకి తీసుకుంటారు. ఒకటి కంటే ఎక్కువ బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకుంటే.. వాటిని ఒకే గొడుగు కిందకు తీసుకు రానున్నారు.

అగ్రి- గోల్డ్ రుణాలూ మాఫీ

బంగారం తాకట్టు పెట్టి పంట రుణాలు తీసుకున్న రైతులకు కూడా రుణమాఫీ పథకాన్ని వర్తింపజేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. గ్రామీణ బ్యాంకుల్లో పట్టాదారు పాస్ పుస్తకాన్ని జత చేసి తీసుకున్న బంగారం రుణాలనే పథకం పరిధిలోకి తీసుకురావాలని భావిస్తోంది. పట్టణ ప్రాంతాల్లో తీసుకున్న బంగారు రుణాలను మినహాయించాలని యోచిస్తోంది. గతంలో ఈ తరహా నిబంధనలనే అమలు చేశారు. ఇప్పుడు కూడా వాటినే అమలు చేయనున్నారు. అలాగే, నిర్ణీత వ్యవధిలో కటాఫ్ తేదీలోపు తీసుకున్న రుణాలతోపాటు రెన్యువల్ చేసుకున్న పంట రుణాలు కూడా రుణమాఫీ పథకంలోకి వస్తాయి.

'రక్షణ' భూములివ్వండి!

(మొదటిపేజీ తరువాయి)

భేటీ అయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం, రక్షణ శాఖ భూముల పరస్పర బదిలీకి అంగీకరించాలని కోరారు. వరంగల్‌కు సైనిక్ స్కూల్‌ను గతంలోనే కేంద్రం మంజూరు చేసినా.. అప్పటి కేసీఆర్ సర్కారు నిర్లక్ష్యం వహించందని, స్కూల్ నిర్మాణానికి ఎటువంటి చర్యలు తీసుకోలేదని కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం ఆ అనుమతుల గడువు ముగిసినందున వాటిని పునరుద్ధరించాలని, లేదంటే తాజాగా మంజూరు చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీఎం వెంట కాంగ్రెస్ ఎంపీలు కడియం కావ్య, గడ్డం వంశీ, మల్లు రవి, రఘురామిరెడ్డి, బలరాం నాయక్, సురేష్ షెట్కార్, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, కుందూరు రఘువీర్ రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్ ఉన్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికిగాను బీఎల్‌సీ మోడల్‌లో తెలంగాణకు 2.70 లక్షల ఇళ్లు మంజూరు చేయాలని కేంద్ర గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. నిరుపేదలకు వారి సొంత స్థలాల్లో 25 లక్షల ఇళ్లు నిర్మించాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించిందని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రాజ్‌నాథ్‌సింగ్‌తో భేటీ అనంతరం ఖట్టర్‌ను ఆయన నివాసంలో రేవంత్ కలిశారు. తమ ప్రభుత్వం నిర్మించాలని భావిస్తున్న 25 లక్షల ఇళ్లలో 15 లక్షలు ఇళ్లు పట్టణాభివృద్ధి సంస్థల పరిధిలోకి వస్తాయని, వాటిని లబ్ధిదారు ఆధ్వర్యంలోని వ్యక్తిగత ఇళ్ల నిర్మాణం (బీఎల్‌సీ) పద్ధతిలో నిర్మించనున్నట్లు కేంద్ర మంత్రికి వివరించారు. ప్రధానమంత్రి ఆవాస యోజన (పట్టణ) పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నందున 2024-25 సంవత్సరానికి ఈ పథకం కింద మంజూరు చేసే ఇంటి నిర్మాణ వ్యయం నిధులు పెంచాలని కోరారు. రాష్ట్రంలో తాము నిర్మించే ఇళ్లను పీఎంఏవై(యు) మార్గదర్శకాల ప్రకారం నిర్మించనున్నట్లు తెలిపారు. దీని కింద ఇప్పటివరకు తెలంగాణకు 1,59,372 ఇళ్లు మంజూరు చేసి రూ.2,390.58 కోట్లు గ్రాంటు కింద ప్రకటించారని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. అయితే ఇందులో ఇప్పటివరకు కేవలం రూ.1,605.70 కోట్లు మాత్రమే విడుదల చేశారని, మిగతా నిధులు విడుదల చేయాలని ఖట్టర్‌కు విజ్ఞప్తి చేశారు. స్మార్ట్ సిటీ మిషన్ కింద చేపట్టే పనులు పూర్తి కానుందున.. మిషన్ కాలపరిమితిని వచ్చే ఏడాది జూన్ వరకు పొడిగించాలని కోరారు. స్మార్ట్ సిటీ మిషన్ కింద వరంగల్, కరీంనగర్‌లో పనులు చేపట్టినట్లు తెలిపారు. వరంగల్‌లో ఇవి 45 పనులు పూర్తయ్యాయని, రూ.518 కోట్ల వ్యయంతో చేపట్టిన మరో 66 పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. ఇక కరీంనగర్‌లో 25 పనులు పూర్తయ్యాయని, రూ.287 కోట్ల వ్యయంతో చేపట్టిన 22 పనులు కొనసాగుతున్నాయని వివరించారు.



ఢిల్లీలో కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు జ్ఞాపికను బహుకరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. చిత్రంలో రాష్ట్ర ఎంపీలు బలరాం నాయక్, కడియం కావ్య తదితరులు

నేడు కాంగ్రెస్ అగ్రనేతలతో భేటీ

సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం కాంగ్రెస్ అగ్రనేతలతో భేటీ కానున్నట్లు తెలిసింది. సోనియా, రాహుల్, కేసీ వేణుగోపాల్‌తో సమావేశమై.. పీసీసీకి నూతన అధ్యక్షుడి ఎంపిక, నామినేటెడ్ పదవుల భర్తీ, మంత్రివర్గ విస్తరణ తదితర అంశాలపై చర్చించనున్నట్లు సమాచారం. తెలంగాణలో లోక్‌సభ సీట్లు ఆశించిన దానికన్నా తక్కువ రావడంపై ఇటీవల పార్టీ కమిటీని ఏర్పాటు చేసిన దృష్ట్యా.. ఆ అంశంపైనా చర్చిస్తారని తెలిసింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల చేరిక అంశాన్ని సైతం అధినాయకత్వం దృష్టికి రేవంత్ తీసుకెళ్లనున్నారు. మరో 13 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరే అంశాన్ని అగ్రనేతల వద్ద ప్రస్తావిస్తారని తెలిసింది. కాగా.. కాంగ్రెస్ ఎంపీల ప్రమాణస్వీకారానికి కూడా సీఎం రేవంత్ హాజరుకానున్నారు. తెలంగాణ ఎంపీలు మంగళవారం మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల మధ్య ప్రమాణం చేయనున్నారు. రాహుల్ ప్రమాణ కార్యక్రమం సమయంలో కూడా రేవంత్ ఉండే అవకాశాలున్నాయి. కాగా, సోమవారం మధ్యాహ్నం హైదరాబాద్ నుంచి ఢిల్లీ చేరుకున్న సీఎం రేవంత్ నేరుగా తుగ్లక్‌రోడ్‌లోని తన నివాసానికి వెళ్లారు. కాంగ్రెస్ తరఫున గెలుపొందిన ఎంపీలతోపాటు మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సీతక్కతో సీఎం సమావేశమయ్యారు.

మారుమూల ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి నిధులివ్వండి: సీతక్క

న్యూఢిల్లీ, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో రోడ్డు సౌకర్యం లేని మారుమూల ప్రాంతాలు, ఏజెన్సీ గ్రామాల్లో రోడ్ల నిర్మాణం కోసం నిధులు కేటాయించాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క విజ్ఞప్తి చేశారు. ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన కింద రోడ్డు సౌకర్యం లేని 1270 ఆవాసాలకు, పీఎం జన్‌మన్ స్కీం కింద 164 ఏజెన్సీ గ్రామాలకు రహదారుల నిర్మాణం చేపట్టాలని కోరుతూ వినతి పత్రాలు సమర్పించారు. ఈ మేరకు సోమవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి శివరాజ్‌తో ఆయన కార్యాలయంలో సీతక్క భేటీ అయ్యారు. తెలంగాణలో రోడ్డు మార్గానికి నోచుకోని వందకుపైగా జనాబా ఉన్న మారుమూల ప్రాంతాలు, ఏజెన్సీ గ్రామాల జాబితాను కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖకు గతంలోనే సమర్పించినట్టు సీతక్క గుర్తు చేశారు. మొదటి దశ కింద ఏజెన్సీ గ్రామాల్లో చేపట్టబోయే రోడ్ల నిర్మాణానికిగాను రూ.66.85 కోట్ల నిధులు విడుదల చేయడానికి పరిపాలనపరమైన అనుమతులివ్వాలని కోరారు. కాగా, రోడ్ల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసి నిర్మాణ పనులు పూర్తి చేస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారని మంత్రి సీతక్క తెలిపారు.

బదిలీ అయిన ఐఏఎస్ అధికారుల జాబితా

అధికారి పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ అయిన స్థానం
సవ్యసాచి ఘోష్	యువజన సేవల ముఖ్యకార్యదర్శి	పశు సంవర్ధక శాఖ ముఖ్యకార్యదర్శి
సంజయ్ కుమార్	వెయిటింగ్	కార్మిక ఉపాధి కల్పనా శాఖ ముఖ్య కార్యదర్శి
వాణీ ప్రసాద్	అటవీ శాఖ ముఖ్యకార్యదర్శి	యువజన, పర్యాటక, సాంస్కృతిక శాఖ ముఖ్యకార్యదర్శి
శైలజా రామయ్యర్	యువజన సేవలు, పర్యాటకం, సాంస్కృతిక శాఖ ముఖ్యకార్యదర్శి	దేవాదాయ, చేనేత, జౌళి శాఖల ముఖ్యకార్యదర్శి. చేనేత, జౌళి శాఖ డైరెక్టర్, టీజీ హ్యాండ్లూమ్ కార్పొరేషన్ వీసీ అండ్ ఎండీగా అదనపు బాధ్యతలు
అహ్మద్ నదీం	ప్రణాళిక శాఖ ముఖ్యకార్యదర్శి	అటవీ ముఖ్యకార్యదర్శి. ఈపీటీఆర్ఐ డీజీ అదనం
సందీప్‌కుమార్ సుల్తానియా	పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి	ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి. ప్రణాళిక, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు అదనం
సయ్యద్ అలీ ముర్తజా రిజ్వీ	విద్యుత్తు శాఖ ముఖ్యకార్యదర్శి	వాణిజ్య పన్నులు, ఎక్సైజ్ శాఖ ముఖ్యకార్యదర్శి
సి.సుదర్శన్‌రెడ్డి	వాటర్ బోర్డు ఎండీ	జీఏడీ కార్యదర్శి
జ్యోతి బుద్ధప్రకాశ్	రవాణా శాఖ కమిషనర్	రిజిస్ట్రేషన్ల శాఖ కార్యదర్శి. రిజిస్ట్రేషన్ల ఇన్‌స్పెక్టర్ జనరల్, ల్యాండ్ రికార్డ్స్ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు
సోని బాలాదేవి(ఐఎఫ్ఎస్)	వైద్య ఆరోగ్య శాఖ స్పెషల్ సెక్రటరీ	స్పోర్ట్స్ అథారిటీ ఎండీ
ఇళంబర్తి	కేంద్ర సర్వీసులు	రవాణా శాఖ కమిషనర్
రోనాల్డ్ రోస్	జీహెచ్ఎంసీ కమిషనర్	విద్యుత్తు శాఖ కార్యదర్శి. జెన్‌కో, ట్రాన్స్‌కోల సీఎండీగా అదనపు బాధ్యతలు
ఏవీ రంగనాథ్(ఐపీఎస్)	హైదరాబాద్ మల్టీ జోన్-1 ఇన్‌స్పెక్టర్ జనరల్	జీహెచ్ఎంసీ ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కమిషనర్
ఎ.శ్రీదేవసేన	పాఠశాల విద్యా కమిషనర్	కాలేజియేట్, సాంకేతిక విద్యా కమిషనర్
సర్ఫరాజ్ అహ్మద్	జాయింట్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్	హెచ్ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్
డి.దివ్య	పురపాలక శాఖ డైరెక్టర్	సెర్ప్ సీఈవో. ప్రజావాణి నోడల్ ఆఫీసర్
ఆమ్రపాలి కాట	హెచ్ఎండీఏ జాయింట్ మెట్రోపాలిటన్ కమిషనర్	జీహెచ్ఎంసీ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు
హరిచందన దాసరి	వెయిటింగ్	రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి
న్యాలకొండ ప్రకాష్‌రెడ్డి	జీహెచ్ఎంసీ విజిలెన్స్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్	రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ
అలగు వర్షిణి	టీజీసీఓ ఎండీ	తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి
వీపీ గౌతమ్	వెయిటింగ్	హౌజింగ్ స్పెషల్ సెక్రటరీ. పురపాలక డైరెక్టర్‌గా, హౌజింగ్ కార్పొరేషన్ ఎండీ, దిల్ సీఈవో, హౌజింగ్ బోర్డు కమిషనర్, రాజీవ్ స్వగృహ ఎండీగా అదనపు బాధ్యతలు
కృష్ణ ఆదిత్య	కార్మిక శాఖ డైరెక్టర్	ఉపాధి, శిక్షణ శాఖ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు
కె.అశోక్‌రెడ్డి	ఉద్యానవన శాఖ డైరెక్టర్	వాటర్ బోర్డు ఎండీ
అనురాగ్ జయంతి	వెయిటింగ్	జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్
పమేలా సత్పతి	కరీంనగర్ కలెక్టర్‌గా ఇటీవలే బదిలీ	మళ్లీ కరీంనగర్ కలెక్టర్‌గానే కొనసాగింపు
భవేశ్ మిశ్రా	వెయిటింగ్	ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ డిప్యూటీ సెక్రటరీ
జి.రవి	వెయిటింగ్	కాలుష్య నియంత్రణ మండలి మెంబర్ సెక్రటరీ
కె.నిఖిల	పర్యాటక శాఖ డైరెక్టర్	తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ సీఈవో
ఎస్‌కే యాస్మిన్ బాషా	వెయిటింగ్	ఉద్యానవన శాఖ డైరెక్టర్. ఆయిల్‌ఫెడ్ ఎండీగా అదనపు బాధ్యతలు
ఎస్.వెంకటరావు	వెయిటింగ్	జీఏడీ జాయింట్ సెక్రటరీ(ప్రోటోకాల్)
పి.ఉదయ్‌కుమార్	వెయిటింగ్	వ్యవసాయ శాఖ జాయింట్ సెక్రటరీ
బి.గోపి	వ్యవసాయ శాఖ డైరెక్టర్	పశు సంవర్ధక శాఖ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు
ఆల ప్రియాంక	వెయిటింగ్	ఫిషరీస్ డైరెక్టర్
ఇలా త్రిపాఠి	వెయిటింగ్	పర్యాటక శాఖ డైరెక్టర్
స్నేహ శబరీష్	శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్	జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్
కాత్యాయనీ దేవి	టూరిజం డైరెక్టర్, టీజీఐఆర్‌డీ సీఈఓ	స్టేట్ ఫైనాన్స్ కమిషన్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్
ఈవీ నర్సింహారెడ్డి	గిరిజన సంక్షేమ డైరెక్టర్	పాఠశాల విద్య డైరెక్టర్. తెలంగాణ విద్య, సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ఎండీగా, సమగ్ర శిక్షా అభియాన్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు
హేమంత్ సహదేవ్‌రావు	వెయిటింగ్	టీజీ వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ఎండీ
హేమంత కేశవ్ పాటిల్	హైదరాబాద్ అదనపు కలెక్టర్	జీహెచ్ఎంసీ ఎల్బీ నగర్ జోనల్ కమిషనర్
అపూర్వ్ చౌహాన్	జోగులాంబ-గద్వాల అదనపు కలెక్టర్	జీహెచ్ఎంసీ కూకట్‌పల్లి జోనల్ కమిషనర్
అభిషేక్ అగస్త్య	మేడ్చల్-మల్కాజిగిరి అదనపు కలెక్టర్	ఖమ్మం మున్సిపల్ కమిషనర్
బి.రాహుల్	మంచిర్యాల్ అదనపు కలెక్టర్	భద్రాచలం ఐటీడీఏ పీఓ
పి.గౌతమి	రాజన్న-సిరిసిల్ల అదనపు కలెక్టర్	మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ జేఎండీ
పి.ఉపేందర్‌రెడ్డి(నాన్ కేడర్)	జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్	జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్
నిఖిల్ చక్రవర్తి	కేంద్ర సర్వీసులు	టీజీఐఐసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్



శ్రీశైలం భూగర్భ జలవిద్యుత్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న భట్టి, జూపల్లి

శ్రీశైలం విద్యుత్ కేంద్రం నాలుగో యూనిట్‌కు

టెండర్లు పిలవాలి

- నిధులు ఎన్నయినా కేటాయిస్తాం, ప్రతిపాదనలు పంపండి: భట్టి

నాగర్‌కర్నూల్/దోమలపెంట, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ప్రాజెక్టు ఎడమ జల విద్యుత్ కేంద్రంలోని నాలుగో యూనిట్‌కు టెండర్లు పిలవాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అధికారులను ఆదేశించారు. రూ. 60 కోట్ల విలువైన హైడల్ పవర్ కోసం రూ. 2కోట్ల ఖర్చుకు వెనుకాడొద్దని హితవు పలికారు. నిధులు ఎన్నయినా కేటాయిస్తామని, ప్రతిపాదనలు పంపాలని చెప్పారు. సోమవారం ఆయన నాగర్‌కర్నూలు జిల్లా అమ్రాబాద్ మండలంలోని శ్రీశైలం భూగర్భ జలవిద్యుత్ కేంద్రాన్ని ఎక్సైజ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణతో కలిసి పరిశీలించారు. అనంతరం సమీక్షా సమావేశంలో భట్టి మాట్లాడుతూ, విద్యుత్ పవర్ హౌస్‌లో తక్కువ ఖర్చుతో ఎక్కువ విద్యుత్ ఉత్పత్తి చేసే హైడల్ పవర్ ఉత్పత్తిని పెంచుదామని అన్నారు. శ్రీశైలం డ్యాంకు దిగువన 16 కిలోమీటర్ల దూరంలో 10 సంవత్సరాల క్రితం నిర్మించిన సపోర్టు డ్యాంకు గండి పడటంతో ఎటువంటి ఉపయోగం లేకుండా పోయిందని, పునరుద్ధరణకు త్వరలోనే నివేదిక తయారు చేయాలని సూచించారు. దీని వల్ల నిరంతర విద్యుత్ ఉత్పాదన జరుగుతుందని అన్నారు. రానున్న మూడు నెలల్లో వరద నీటితో 60 కోట్ల విద్యుత్ ఉత్పత్తిని తయారు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని భట్టి ఆదేశించారు.

సమస్యలపై సర్కారు ఆటలాడుతోంది

- మా సమ్మె కొనసాగుతుంది: జూడాలు



గాంధీలో సమ్మె చేస్తున్న జూడాలు

హైదరాబాద్/సిటీ/అడ్డగుట్ట, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ డాక్టర్ (జూడా)లతో జరిపిన చర్చలు విఫలమయ్యాయి. సోమవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, డీఎంఈ డాక్టర్ వాణి జూడాలతో చర్చలు జరిపారు. ఈ చర్చలు విఫలమయ్యాయని జూడాలు ప్రకటించారు. సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. ప్రతి నెలా ఒకటో తేదీనే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్న జూడాలు.. తమ డిమాండ్లను నెరవేర్చకపోతే వైద్య సేవలు నిలిపివేస్తామని హెచ్చరించారు. తమ సమస్యలపై సర్కారు ఆటలాడుతోందని, ప్రతిసారి మోసం చేస్తోందని జూడాలు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం ఆగదని, సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేదంటే అన్ని బోధనాస్పత్రుల్లో అత్యవసర సేవలు కూడా నిలిపివేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే ఓపీ, ఎలక్టివ్ సర్జరీలు, వార్డ్ విధులను పూర్తిగా బహిష్కరించామని, ఒకటి రెండు రోజుల్లో అత్యవసర సేవలనూ నిలిపివేస్తామని తెలిపారు. గ్రీన్ చానల్‌తో సకాలంలో స్టైపెండ్‌ల విడుదల, సూపర్ స్పెషాలిటీ, సీనియర్ రెసిడెంట్‌లకు సరైన గౌరవ వేతనం, వివిధ ప్రభుత్వ ఆస్పత్రుల్లో భద్రతా సమస్యలను పరిష్కరించడం, హాస్టళ్ల సౌకర్యం కల్పించడం వంటి అంశాలను వెంటనే పరిష్కరించకుంటే సచివాలయాన్ని ముట్టడించేందుకు కూడా వెనకాడబోమని జూడాలు వెల్లడించారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో వైద్యాధికారులు

హైదరాబాద్‌లోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో జూడాలు సోమవారం అత్యవసర సేవలు మినహా విధులను బహిష్కరించి సమ్మెలో పాల్గొన్నారు. తమ డిమాండ్లను పరిష్కరించే వరకు రోజూ సమ్మెలో పాల్గొంటామని తెలిపారు. జూడాల ఆందోళనతో ఆయా ఆస్పత్రుల సూపరింటెండెంట్లు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. గాంధీ ఆస్పత్రిలో రోగులకు పీజీ వైద్యులు చికిత్స చేస్తున్నారని, రోగులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకుంటున్నామని సూపరింటెండెంట్ రాజారావు తెలిపారు. ఉస్మానియా ఆస్పత్రి సూపరింటెండెంట్ నాగేందర్, గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజారావు, గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ రమేష్‌రెడ్డి తమ ఆస్పత్రుల్లోని వివిధ విభాగాల అధిపతుల (హెచ్‌వోడీ)తో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఎప్పటికప్పుడు రోగులను పర్యవేక్షించాలని, 24 గంటలు ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, పీజీ వైద్యులు అందుబాటులో ఉండాలని సూచించారు.

డీఎంఈ విభాగానికి 406 కోట్లు విడుదల

హైదరాబాద్, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్య విద్యా సంచాలకుల(డీఎంఈ) విభాగానికి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సోమవారం రూ.406.75 కోట్లను విడుదల చేశారు. ఈ నిధులకు సంబంధించి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, తాను అందరం కలిసి ఈ నిధుల విడుదల నిర్ణయాన్ని తీసుకున్నట్లు ఆయన తెలిపారు.

తాగుడు గొడవకు
తండ్రి, కూతురి ప్రాణాలు బలి!

- ఎందుకు తాగొచ్చావంటూ ప్రశ్నించిన కూతురు
- ఇద్దరి మధ్య వాగ్వాదం.. బావిలోకి దూకిన కుమార్తె
- కాపాడేందుకు దూకిన తండ్రి.. ఇద్దరూ మృతి


సిరాజ్, రేష్మా (ఫైల్)

గజ్వేల్, జూన్ 24: తండ్రి మద్యం అలవాటు.. కూతురు ప్రాణాన్ని, ఆయన ప్రాణాన్నీ తీసింది. సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలంలోని మక్త మాసాన్‌పల్లి మధిరలో ఈ విషాదం జరిగింది. గ్రామానికి చెందిన షేక్ సిరాజ్(46) సోమవారం రాత్రి మద్యం తాగి ఇంటికొచ్చాడు. ఎందుకు తాగొచ్చావంటూ అతడిని కూతురు షేక్ రేష్మా (16) ప్రశ్నించింది. ఆయన నిర్లక్ష్యంగా మాట్లాడటంతో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి గొడవకు దారితీసింది. తీవ్ర మనస్తాపానికి గురైన రేష్మా, ఇంటి పక్కనే ఉన్న పొలంలోని బావిలో దూకింది. గమనించిన సిరాజ్, ఆమెను కాపాడేందుకు నీళ్లలోకి దూకాడు. స్థానికులొచ్చి గంటన్నర పాటు శ్రమించి మృతదేహాలను వెలికితీశారు.

ఇద్దరు ఇంటర్ విద్యార్థుల ఆత్మహత్య

తంగళ్లపల్లి, ఇబ్రహీంపట్నం, జూన్ 24(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల్లో ఫెయిలవడంతో మనస్తాపానికి గురై ఇద్దరు విద్యార్థులు బలవన్మరణానికి పాల్పడ్డారు. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లికి చెందిన తోకల సాక్షి(18) మండలంలోని మండెపల్లి మోడల్ స్కూల్‌లో ఇంటర్ చదివింది. ఫలితాల్లో గణితం సబ్జెక్టులో ఫెయిల్ అయిన సాక్షి.. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీతో పాటు ఎంసెట్ రాసింది. ఎంసెట్‌లో అర్హత సాధించిన ఆమె సప్లిమెంటరీ ఫలితాల్లో ఫెయిల్ అయింది. దాంతో ఇంజనీరింగ్ చేయాలనే తన కల నెరవేరడం లేదన్న మనస్తాపంతో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మరోవైపు రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని తులేకలాన్‌కు చెందిన కలకొండ జంగయ్య కుమారుడు అఖిల్(17) ఇంటర్ రెండో సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షలు రాశాడు. ఫెయిల్ అవడంతో తట్టుకోలేక వ్యవసాయ పొలం వద్ద కోళ్ల ఫాం షెడ్డులో రాడ్డుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

సీఎం అంటే.. కరెక్టింగ్ మాస్టర్!

- కేటీఆర్ ట్వీట్‌కు మంత్రి తుమ్మల కౌంటర్
- కేటీఆరే కోతల మాస్టర్: కోదండరెడ్డి
- మీరు చేర్చుకున్నప్పుడు ఏమైంది?: షబ్బీర్

హైదరాబాద్, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): సీఎం అంటే కటింగ్ మాస్టర్ కాదు.. కరెక్టింగ్ మాస్టర్ అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్‌ను విమర్శిస్తూ కేటీఆర్ చేసిన ట్వీట్‌పై ఆయన స్పందించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో నిరుపేదలు, అర్హులకే సంక్షేమ పథకాలు అమలు చేస్తామని తెలిపారు. దుబారాకు దూరంగా పథకాల అమలు ఉంటుందన్నారు. రైతు భరోసా పథకాన్ని జాప్యం చేయట్లేదని.. ఆదర్శంగా అమలు చేయడానికే క్యాబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేశామని వెల్లడించారు. మంగళవారం నిర్వహించే రైతు నేస్తం కార్యక్రమంలో రైతుభరోసా పథకం అమలుకు ఉపయోగపడేలా సలహాలు, సూచనలు అందించాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. రైతులకు రుణమాఫీ చేయడం కేసీఆర్, కేటీఆర్‌లకు ఇష్టం లేనట్టుందని కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి అన్నారు. గాంధీభవన్‌లో ఆయన మాట్లాడుతూ.. అసలైన కోతల మాస్టర్ కేటీఆరేనని.. ఆయన ఐటీ మంత్రిగా ఉన్నప్పుడే ధరణి పోర్టల్‌లో అవకతవకలతో లక్షల కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆరోపించారు. 'ఆనాడు కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బీఆర్‌ఎస్‌లో చేర్చుకుని శాసనసభలో భట్టి విక్రమార్కకు ప్రధాన ప్రతిపక్ష నేత హోదా లేకుండా చేసింది.. శాసనమండలిలో నన్ను ప్రతిపక్ష నేత హోదా నుంచి తొలగించింది మీరు కాదా?' అంటూ బీఆర్ఎస్ నేతలను ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ నిలదీశారు. అధికారంలో ఉన్నప్పుడు ఇతర పార్టీల ప్రజాప్రతినిధులను చేర్చుకొని.. ఇప్పుడు అనర్హత వేటు గురించి మాట్లాడుతున్నారా? అంటూ మండిపడ్డారు. లోక్‌సభ ఎన్నికల్లో 8 సీట్లలో డిపాజిట్లు కోల్పోయిన బీఆర్ఎస్‌కు కోకాపేటలో కార్యాలయ నిర్మాణానికి స్థలం ఎందుకని.. ప్రభుత్వ భూములను వెనక్కి తీసుకోని వేలం వేసి వచ్చిన డబ్బులను రుణమాఫీకి వాడాలని కోరారు. బలహీన వర్గాలకు న్యాయం రాహుల్ గాంధీతోనే సాధ్యమని కాంగ్రెస్ నేత వి.హన్మంతరావు వ్యాఖ్యానించారు.

27న పార్లమెంటు ముట్టడి: యూత్ కాంగ్రెస్

నీట్ అక్రమాలను నిరసిస్తూ ఈ నెల 27న యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఢిల్లీలో పెద్ద ఎత్తున పార్లమెంటు ముట్టడి నిర్వహించనున్నట్లు యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి వెల్లడించారు. నీట్ అక్రమాలపై చర్యలు తీసుకుని విద్యార్థులకు న్యాయం చేయాలని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావ్ డిమాండ్ చేశారు. నీట్ అక్రమాలను నిరసిస్తూ బీజేపీ కార్యాలయాన్ని ముట్టడించేందుకు బయలు దేరిన మహిళా కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు.

తెలుగు భాషకు పట్టం

- కిషన్‌రెడ్డి, సంజయ్ సహా మాతృభాషలో 17 మంది తెలుగు ఎంపీల ప్రమాణం
- పంచెకట్టుతో హాజరైన కిషన్‌రెడ్డి
- సంస్కృతంలో బాపట్ల ఎంపీ ప్రమాణం

న్యూఢిల్లీ/విజయనగరం, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటులో తెలుగు భాష పరిమళించింది. తెలుగు సంప్రదాయం ఉట్టిపడింది. తెలంగాణ, ఏపీకి చెందిన పలువురు ఎంపీలు మాతృభాషలో ప్రమాణం చేశారు. మరికొందరు సంప్రదాయ దుస్తుల్లో మెరిసి లోక్‌సభకు వన్నె తెచ్చారు. సోమవారం కొలువుదీరిన పార్లమెంటులో ప్రొటెం స్పీకర్ ఇటీవల జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన ఎంపీలతో ప్రమాణం చేయించారు. తొలుత ప్రధాని, కేంద్రమంత్రులు ఎంపీలుగా ప్రమాణం చేశారు. అనంతరం వరుసక్రమాన్ని అనుసరించి అరుణాచల్ ప్రదేశ్ తర్వాత ఆంధ్రప్రదేశ్ ఎంపీల ప్రమాణ స్వీకారం జరిగింది. తెలంగాణ నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ తొలిరోజు ప్రమాణం చేశారు. వీరిద్దరూ తెలుగులో ప్రమాణం చేశారు. వీరితోపాటు ఏపీకి చెందిన 15 మంది తెలుగులోనే ప్రమాణం చేశారు. వీరిలో రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, బైరెడ్డి శబరి, బస్తిపాటి నాగరాజు, లక్ష్మీనారాయణ, కేశినేని శివనాథ్, బీకే పార్థసారథి, శ్రీభరత్, కలిశెట్టి అప్పలనాయుడు, లావు శ్రీకృష్ణదేవరాయలు, దగ్గుమళ్ల ప్రసాద్‌రావు, గురుమూర్తి(వైసీపీ), భూపతిరాజు శ్రీనివాసవర్మ(బీజేపీ) పురందేశ్వరి(బీజేపీ), బాలశౌరి(జనసేన) ఉన్నారు. ఇక గంటి హరీశ్, మాగుంట శ్రీనివాసులరెడ్డి, పుట్టా మహేశ్ యాదవ్, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, సీఎం రమేశ్, మిథున్‌రెడ్డి(వైసీపీ), ఉదయ్ శ్రీనివాస్(జనసేన) ఇంగ్లీషులో ప్రమాణం చేశారు. బాపట్ల టీడీపీ ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ సంస్కృతంలో, వైసీపీ ఎంపీ తనూజా రాణి హిందీలో ప్రమాణ స్వీకారం చేశారు. కాగా, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పంచెకట్టులో పార్లమెంటుకు హాజరై ఆకట్టుకున్నారు. విజయనగరం ఎంపీ, టీడీపీ నేత కలిశెట్టి అప్పలనాయుడు పార్లమెంటుకు సైకిల్‌పై వెళ్లి పార్టీపై అభిమానం చాటుకున్నారు. వైసీపీ ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి ప్రమాణస్వీకారానికి గైర్హాజరయ్యారు. ఇక తెలంగాణకు చెందిన మిగతా 15 మంది ఎంపీలు మంగళవారం ప్రమాణం చేయనున్నారు.కాగా ప్రమాణ స్వీకారం అనంతరం కిషన్‌రెడ్డి ఎక్స్ వేదికగా తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. "సికింద్రాబాద్ ప్రజల ఆశీర్వాదంతో, బీజేపీ ఆశీస్సులతో రెండోసారి లోక్‌సభ సభ్యుడిగా ప్రమాణం చేయడం ఆనందాన్నిచ్చింది. వచ్చే ఐదేళ్లు చిత్తశుద్ధి, నిబద్ధతతో సికింద్రాబాద్ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తాను." అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.


సైకిల్‌పై పార్లమెంట్‌కు వెళ్తున్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

ఏపీలో హామీల అమలుకు శ్రీకారం

(మొదటి పేజీ తరువాయి)

ఆంధ్రప్రదేశ్‌పై 'గంజాయి రాజధాని'గా పడిన ముద్రను తొలగించాలని ప్రభుత్వం సంకల్పించింది. గంజాయితోపాటు మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం మోపాలని మంత్రివర్గం నిర్ణయించింది. దీనికోసం ఐదుగురు మంత్రులతో కమిటీని నియమించింది. పెంచిన వృద్ధాప్య పింఛన్లను జూలై 1 నుంచి సచివాలయ ఉద్యోగుల ద్వారా ఇంటి వద్దే పంపిణీ చేయించాలని నిర్ణయం తీసుకుంది. పోలవరం, అమరావతి సహా ఏడు అంశాలపై వేర్వేరుగా శ్వేతపత్రాలను విడుదల చేయాలని నిశ్చయించింది. క్యాబినెట్ నిర్ణయాలను సమాచారశాఖ మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వివరించారు. ఏపీ ప్రభుత్వం 'ఆంధ్రప్రదేశ్ నైపుణ్య సెన్సెస్-2024' నిర్వహణకు సిద్ధమవుతోందని ఆయన తెలిపారు. దీనిపై కేబినెట్ ఆమోదం లభించిందన్నారు. గత ప్రభుత్వం అన్న క్యాంటీన్లను కక్షపూరితంగా మూసేసి నిరుపేదల నోటి దగ్గర ముద్ద తీసేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. "పేదవాడి ఆకలి తీర్చేందుకు సీఎం చంద్రబాబు బాధ్యతలను స్వీకరించిన రోజునే అన్న క్యాంటీన్‌లను పునరుద్ధరిస్తూ సంతకం పెట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్న క్యాంటీన్‌లను పునఃప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం. రాష్ట్ర వ్యాప్తంగా 203 అన్న క్యాంటీన్ల పునరుద్ధరణకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. తొలిదశలో 183 క్యాంటీన్లను ఒకేసారి ప్రారంభించాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. మిగిలిన 20 క్యాంటీన్లు తదుపరి దశలో ప్రారంభం అవుతాయి. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజనం సబ్సిడీ ధరకు రూ.5 లకే అన్న క్యాంటీన్లలో అందుతుంది" అని కొలుసు తెలిపారు. కాగా పూర్వ అడ్వకేట్ జనరల్ ఎస్.శ్రీరామ్, అదనపు అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్ రెడ్డి రాజీనామాలను ఆమోదిస్తూ, అడ్వకేట్ జనరల్‌గా దమ్మాలపాటి శ్రీనివాస్‌ను నియమిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకున్న నిర్ణయాన్ని కేబినెట్ ఆమోదించింది. ఇక గత ప్రభుత్వ అవినీతిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు 7 శ్వేతపత్రాలను విడుదల చేస్తారు. పోలవరం, అమరావతి, విద్యుత్తు, పర్యావరణం(ల్యాండ్, శాండ్, మైన్స్, జియాలజీ మొదలైనవి) మద్యం, శాంతిభద్రతలు, ఆర్థిక రంగంపై ఈ శ్వేతపత్రాలు ఈ నెల 28 నుంచి జూలై 18 వరకు విడుదల అవుతాయి.


సమావేశంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు, మంత్రులు

రేపటి నుంచి పవన్ వారాహి దీక్ష

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ బుధవారం (ఈ నెల 26) నుంచి వారాహి అమ్మవారి దీక్ష చేపట్టనున్నారు. 11 రోజుల పాటు.. వచ్చే నెల 6వ తేదీ వరకూ ఆయన దీక్ష కొనసాగనున్నారు. దీక్ష సమయంలో కేవలం పాలు, పండ్లు, ద్రవ ఆహారం మాత్రమే తీసుకుంటారు. గత ఏడాది జూన్‌లో కూడా ఆయన వారాహి విజయ యాత్ర చేపట్టారు. ఆయాత్ర సందర్భంలోనూ వారాహి అమ్మ వారికి పూజలు నిర్వహించి దీక్ష చేపట్టారు.


కళాశాల వద్ద అభ్యర్థుల తల్లిదండ్రుల ధర్నా

సాంకేతిక లోపంతో నిలిచిన హెచ్‌డబ్ల్యూవో పరీక్ష

- పరీక్షాకేంద్రం ముందు తల్లిదండ్రులు, బీజేవైఎం ధర్నా
- పరీక్షను రీషెడ్యూల్ చేస్తూ టీజీపీఎస్సీ ప్రకటన
- మరో కేంద్రంలో ఆలస్యంగా జరిగిన పరీక్షలు

సైదాబాద్, మేడ్చల్ టౌన్, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమీషన్(టీజీపీఎస్సీ) సోమవారం ఆన్‌లైన్ ద్వారా నిర్వహించ తలపెట్టిన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్(హెచ్‌డబ్ల్యూవో) నియామకాల పరీక్ష సాంకేతిక లోపం కారణంగా ఓ పరీక్షా కేంద్రంలో నిలిచిపోగా మరోచోట పరీక్ష జరిగింది. సైదాబాద్ మాతృశ్రీ ఇంజనీరింగ్ కళాశాల కేంద్రంలో పరీక్ష నిలిచిపోయింది. రంగారెడ్డి జిల్లా మైసమ్మగూడ మల్లారెడ్డి కళాశాల కేంద్రంలో పరీక్ష ఆలస్యమైంది. సోమవారం మొదటి పేపర్ ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, రెండో పేపర్ మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5.30 గంట వరకు జరగాలి. అయితే ఉదయం సైదాబాద్ మాతృశ్రీ ఇంజనీరింగ్ కళాశాల కేంద్రంలో 234 మంది అభ్యర్థులు పరీక్ష రాసి ఉండగా సమయం మించిపోతున్నా సైట్ తెరుచుకోక పరీక్ష ప్రారంభం కాలేదు. చివరికి ఇక్కడ పరీక్ష నిలిచిపోయింది. దాంతో అభ్యర్థుల తల్లిదండ్రులు పరీక్షాకేంద్రం ఎదుట ధర్నాకు దిగారు. బీజేవైఎం నాయకులు మద్దతుగా వచ్చి కళాశాల లోపలికి చొచ్చుకెళ్ళేందుకు ప్రయత్నించగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అభ్యర్థుల ఆందోళన నేపథ్యంలో మాతృశ్రీ ఇంజనీరింగ్ కళాశాల కేంద్రంలోని అభ్యర్థులకు టీజీపీఎస్సీ అధికారులు పరీక్షను రీషెడ్యూల్ చేశారు. మరోవైపు మల్లారెడ్డి కళాశాల కేంద్రంలో కూడా పరీక్ష సమయానికి వెబ్‌సైట్ తెరుకోలేదు. చివరికి గంట ఆలస్యంగా పరీక్ష ప్రారంభమై ఆలస్యంగా ముగిసింది. దాంతో మధ్యాహ్న భోజనానికి సమయం లేక రెండో పేపర్ పరీక్ష కోసం అభ్యర్థులు పరీక్ష కేంద్రంలో ఉండిపోయారు. మధ్యాహ్నం పరీక్ష కూడా ఆలస్యంగానే ప్రారంభమైంది. విసుగెత్తిపోయిన అభ్యర్థులు పరీక్ష కేంద్రం నుంచి బయకొచ్చి కేంద్రం ఎదుట బైఠాయించారు. పోలీసులు అభ్యర్థులతో మాట్లాడి సముదాయించి పరీక్ష కేంద్రంలోకి పంపారు. టీజీపీఎస్సీ నిర్లక్ష్యం వల్లే తాము మధ్యాహ్నం భోజనం చేయకుండా సాయంత్రం వరకు ఆలస్యంగా పరీక్ష రాయాల్సి వచ్చిందని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

బెంగళూరు వెళ్లినా.. బిల్లుల గోలే!

జగన్‌కు చుక్కలు చూపుతున్న వైసీపీ కార్యకర్తలు

- యలహంక ప్యాలెస్ వద్ద శ్రేణుల ఆందోళన
- లోపలకు రాకుండా గేట్లు మూసేసిన సిబ్బంది



బెంగళూరు/అమరావతి-ఆంధ్రజ్యోతి/పులివెందుల, జూన్ 24: పెండింగ్ బిల్లుల కోసం వైసీపీ నేతలు, కార్యకర్తలు చేస్తున్న ఆందోళనలతో ఏపీ మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. పనులు చేసినవారు పులివెందులలో ఆయన సమక్షంలోనే ఆందోళనకు దిగారు. శనివారం నుంచి సోమవారం వరకు మూడ్రోజులపాటు నిరసన తెలిపారు. ఆయన బెంగళూరు వెళ్లినా అక్కడకు వెళ్లి ఆగ్రహంతో నినాదాలు చేశారు. పులివెందుల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (పాడా) పనులు చేపట్టిన స్థానిక ఛోటామోటా నేతల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇప్పుడు వైసీపీ ఓడిపోవడం.. జగన్ మాజీ అవడంతో తమ పరిస్థితేంటని శని, ఆదివారాల్లో ఆయన్ను నిలదీశారు. సోమవారం కూడా పలువురు ఆయన్ను కలిశారు. బిల్లులు ఆగిపోతే తమ పరిస్థితి దయనీయంగా మారుతుందని వాపోయారు జగన్ స్పందిస్తూ ఎవరు అధైర్యపడొద్దని.. అందరికీ బిల్లులు వచ్చేలా కోర్టు ద్వారా సాధించుకుందామని సూచించారు. తర్వాత ప్రత్యేక హెలికాప్టర్లో భార్యాసమేతంగా బెంగళూరు యలహంక ప్యాలెస్‌కు వెళ్లారు. అయితే పులివెందులకు చెందిన వైసీపీ అభిమానులు, కార్యకర్తలు అక్కడకు కూడా పెద్దసంఖ్యలో చేరుకున్నారు. పెండింగ్ బిల్లులకు నిధులు విడుదల చేయించాలంటూ ఆయన్ను ఘెరావ్ చేసినట్లు తెలిసింది. అయితే జగన్‌ను కలిసేందుకు వీలులేకుండా సిబ్బంది ప్యాలెస్ గేట్లు మూసివేయడంతో కార్యకర్తలు మండిపడ్డారు. 'సైకో జగన్ డౌన్‌డౌన్' అంటూ వారు నినాదాలు చేసిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

పదేళ్ల తర్వాత బెంగళూరు ప్యాలెస్‌కు జగన్!

బెంగళూరులోని తన యలహంక ప్యాలెస్‌కు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పదేళ్ల తర్వాత వచ్చారు. ఇక్కడ ఆరు రోజులపాటు బస చేస్తారని వైసీపీ వర్గాలు తెలిపాయి. సీఎంగా వైఎస్ రాజశేఖరరెడ్డి ఉన్నప్పుడు జగన్ యలహంకలో ప్రత్యేక ఆసక్తితో సుమారు 23 ఎకరాల విస్తీర్ణంలో సకల సదుపాయాలతో ప్యాలెస్‌ను నిర్మించుకున్నారు. లోపల హెలిప్యాడ్‌తోపాటు వివిధ సౌలభ్యాలు ఉన్నాయి. వైసీపీ ఏర్పాటుకు ముందు జగన్ ఎక్కువగా ఇక్కడే గడిపేవారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
హైదరాబాద్ ● మంగళవారం 25 జూన్ 2024



హైదరాబాద్‌లోని ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ(ఇఫ్లూ-సెంట్రల్ యూనివర్సిటీ)- పార్ట్ టైమ్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. పలు ఫారిన్ లాంగ్వేజీల్లో సర్టిఫికెట్ ఆఫ్ ప్రొఫిషియెన్సీ, డిప్లొమా, అడ్వాన్స్‌డ్ డిప్లొమా ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండు సెమిస్టర్లు. ఆగస్టు నుంచి తరగతులు ప్రారంభమౌతాయి. సోమ, బుధ, శుక్రవారాల్లో కోర్సుకు నిర్దేశించిన ప్రకారం ఉదయం, సాయంత్రం సమయాల్లో ఆఫ్‌లైన్ మోడ్‌లో తరగతులు ఉంటాయి. పదోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులైన అభ్యర్థులు అప్లయ్ చేసుకోవచ్చు. ఒక ప్రోగ్రామ్‌నకు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. ఎంట్రెన్స్ టెస్ట్, సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

ఇఫ్లూలో పార్ట్ టైమ్ ప్రోగ్రామ్‌లు

సర్టిఫికెట్ ఆఫ్ ప్రొఫిషియెన్సీ కోర్సు: ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 310 సీట్లు ఉన్నాయి. ఫ్రెంచ్‌లో 50, జర్మన్‌లో 50, స్పానిష్‌లో 50, పర్షియన్‌లో 30, పోర్చుగీస్‌లో 50, రష్యన్‌లో 20, అరబిక్‌లో 20 సీట్లు ఉన్నాయి. అరబిక్‌లో ఆన్‌లైన్ మోడ్‌లో మరో 40 సీట్లు కూడా ఉన్నాయి. ఈ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి ఎంట్రెన్స్ టెస్ట్ రాయనవసరం లేదు.

డిప్లొమా: ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 110 సీట్లు ఉన్నాయి. ఫ్రెంచ్‌లో 30, స్పానిష్‌లో 20, పోర్చుగీస్‌లో 20, రష్యన్‌లో 20, ఇటాలియన్‌లో 20 సీట్లు ఉన్నాయి.

- ఇఫ్లూ నుంచి 'సి' లేదా ఆపై గ్రేడ్‌లో సర్టిఫికెట్ ఆఫ్ ప్రొఫిషియెన్సీ కోర్సు /బీఏ (ఆనర్స్/రీసెర్చ్) ఇంగ్లీష్‌లో రెండు సెమిస్టర్లు(మొదటి ఏడాది) పూర్తిచేసినవారు ఎంట్రెన్స్ టెస్ట్ రాయనవసరం లేదు. వీరికి నేరుగా అడ్మిషన్ ఇస్తారు.

అడ్వాన్స్‌డ్ డిప్లొమా: స్పానిష్‌లో 20 సీట్లు ఉన్నాయి.

- ఇఫ్లూ నుంచి 'సి'/ఆపై గ్రేడ్‌లో డిప్లొమా కోర్సు/బీఏ ఆనర్స్ ఇంగ్లీష్‌లో నాలుగు సెమిస్టరు (రెండో ఏడాది) పూర్తిచేసినవారు నేరుగా ప్రవేశాలు పొందవచ్చు.

డిప్లొమా ఇన్ ట్రాన్స్‌లేషన్: ఈ ప్రోగ్రామ్‌లో అరబిక్ నుంచి ఇంగ్లీష్, ఇంగ్లీష్ నుంచి అరబిక్ ట్రాన్స్‌లేషన్ నేర్పిస్తారు. మొత్తం 32 సీట్లు ఉన్నాయి. సోమ, మంగళ, బుధ, గురువారాల్లో ఉదయం ఏడు నుంచి తొమ్మిది వరకు తరగతులు ఉంటాయి.

ఎంట్రెన్స్ టెస్ట్: ఇఫ్లూలో చదవని అభ్యర్థులు; ఇఫ్లూ నుంచి సర్టిఫికెట్ ఆఫ్ ప్రొఫిషియెన్సీ /డిప్లొమా/బీఏ(ఆనర్స్/రీసెర్చ్)ఇంగ్లీష్ మొదటి/రెండో ఏడాది ప్రోగ్రామ్‌లను 'డి' గ్రేడ్‌లో పూర్తిచేసినవారు; ఏడాది కిందట ఇఫ్లూలో చదివినవారు తప్పనిసరిగా ఎంట్రెన్స్ టెస్ట్ రాయాల్సి ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.100; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.50; దివ్యాంగులకు ఫీజు మినహాయింపు వర్తిస్తుంది.
- **ఎంట్రెన్స్ టెస్ట్ ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.200; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.100; దివ్యాంగులకు ఫీజు మినహాయింపు వర్తిస్తుంది.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 1
- **ప్రొఫిషియెన్సీ కోర్సుకు ఎంపికైన అభ్యర్థుల జాబితాలు విడుదల:** జూలై 8, 23
- **ప్రొఫిషియెన్సీ కోర్సు అభ్యర్థులకు డాక్యుమెంట్స్ వెరిఫికేషన్:** జూలై 15, 25
- **ఎంట్రెన్స్ టెస్ట్‌కు అర్హులైన అభ్యర్థుల జాబితా విడుదల:** జూలై 8
- **ఎంట్రెన్స్ టెస్ట్ తేదీ:** ఆగస్టు 1
- **డిప్లొమా, అడ్వాన్స్‌డ్ డిప్లొమా ప్రోగ్రామ్‌లకు ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** ఆగస్టు 5
- **డిప్లొమా, అడ్వాన్స్‌డ్ డిప్లొమా అభ్యర్థులకు డాక్యుమెంట్స్ వెరిఫికేషన్:** ఆగస్టు 6
- **డాక్యుమెంట్స్ వెరిఫికేషన్‌కు తీసుకురావాల్సినవి:** పదోతరగతి/ప్రొఫిషియెన్సీ కోర్సు/డిప్లొమా/బీఏ ఇంగ్లీష్ ఒరిజినల్ సర్టిఫికెట్లు; కుల ధ్రువీకరణ పత్రాలు
- **ప్రోగ్రామ్‌లు ప్రారంభం:** ప్రొఫిషియెన్సీ కోర్సు ఆగస్టు 1 నుంచి; డిప్లొమా, అడ్వాన్స్‌డ్ డిప్లొమాలు ఆగస్టు 6 నుంచి
- **వెబ్‌సైట్:** www.efluniversity.ac.in

ఎన్ఐహెచ్ఎఫ్‌డబ్ల్యూలో

మాస్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్

న్యూఢిల్లీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్(ఎన్ఐహెచ్ఎఫ్‌డబ్ల్యూ)- 'మాస్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్(ఎంపీహెచ్)' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది రెండేళ్ల వ్యవధి గల ఫుల్ టైమ్ ప్రోగ్రామ్. గరిష్ఠంగా నాలుగేళ్లలో పూర్తి చేయాలి. ఈ ప్రోగ్రామ్‌ను యూనివర్సిటీ ఆఫ్ ఢిల్లీ సహకారంతో నిర్వహిస్తున్నారు. ఇందులో పబ్లిక్ హెల్త్‌కు సంబంధించిన రీసెర్చ్, మేనేజ్‌మెంట్, ప్రాబ్లమ్ సాల్వింగ్, క్రిటికల్ థింకింగ్, కంప్యూటర్ అప్లికేషన్స్, స్టాటిస్టికల్ సాఫ్ట్‌వేర్ అంశాల్లో శిక్షణ ఇస్తారు. అభ్యర్థులు 15 కోర్ మాడ్యూల్స్, ఎంచుకొన్న విభాగానికి సంబంధించి 5 ఎలక్టివ్ మాడ్యూల్స్ పూర్తిచేయాల్సి ఉంటుంది. ప్రోగ్రామ్‌లో భాగంగా ఆడియో- విజువల్ ఎయిడ్స్ ద్వారా లెక్చర్స్, డిమాన్‌స్ట్రేషన్స్, గ్రూప్ డిస్కషన్స్, ప్రజంటేషన్స్, రెండు నెలల ఇంటర్న్‌షిప్, డిజర్టేషన్ ఉంటాయి. ప్రోగ్రామ్ మొత్తానికి 50 క్రెడిట్లు నిర్దేశించారు. ఈ ప్రోగ్రామ్‌లో 20 సీట్లు ఉన్నాయి. ఎన్‌టీఏ నిర్వహించే సీయూఈటీ-పీజీ ఎగ్జామ్ స్కోర్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

ఎలక్టివ్ విభాగాలు: ఎపిడిమియాలజీ, ప్రోగ్రామ్ పాలసీ అండ్ ప్లానింగ్, హెల్త్ మేనేజ్‌మెంట్, ఆర్ఎంఎన్‌సీహెచ్+ఎ

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో డిగ్రీ(మెడిసిన్/ఆయుష్/డెంటిస్ట్రీ/నర్సింగ్/ఫార్మసీ/వెటర్నరీ సైన్స్/ఫిజియోథెరపీ/ఆక్యుపేషనల్ థెరపీ/న్యూట్రిషన్/ఫార్మకాలజీ/అలైడ్ అండ్ హెల్త్ సైన్సెస్/లైఫ్ సైన్సెస్/బయోటెక్నాలజీ/స్టాటిస్టిక్స్/బయోస్టాటిస్టిక్స్/మేనేజ్‌మెంట్/ఇంజనీరింగ్/డెమోగ్రఫీ/పాపులేషన్ స్టడీస్/సోషియాలజీ/సైకాలజీ/ఆంత్రోపాలజీ/సోషల్ వర్క్/ ఎకనామిక్స్/లా) ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 9
- **వెబ్‌సైట్:** www.nihfw.ac.in





ధర్మారాయుడి తీర్పు

ఒక ఊరిలో ధర్మారాయుడు అనే గ్రామాధికారి ఉండేవాడు గ్రామంలో వచ్చే చిన్నా పెద్దా తగాదాలలో అతను మంచి న్యాయమైన తీర్పులు చెబుతాడని చుట్టుపక్కల అతనికి మంచి పేరుండేది. ఆ గ్రామంలో ఒక వర్తకుడు రామయ్య అనే రైతుకు తన పొలంలోని బావిని అమ్మాడు. కానీ రామయ్య ఆ బావిలోని నీళ్లు వాడుకోబోతుండగా వర్తకుడు రామయ్యతో 'నేనునీకు బావి మాత్రమే అమ్మాను కానీ అందులోని నీళ్లు కాదు.ఆ నీళ్లు ఇంకా నావే. కాబట్టినువ్వు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ బావిలోని నీళ్లు వాడుకోకూడదు అని షరతు పెట్టాడు. ఈ




మాటలు విన్న రామయ్యకు ఏం చేయాలో పాలుపోక, ధర్మారాయుడికి ఫిర్యాదు చేశాడు. గ్రామంలోని మిగతా వారందరికీ వర్తకుడు పెట్టిన షరతు అన్యాయంగా అనిపించినా ఎవరూ ఏమీ చేయలేక ఊరుకున్నారు.విషయం తెలుసుకున్న ధర్మారాయుడు వర్తకుడిని పిలిచి, నువ్వు రామయ్యకు బావిని మాత్రమే అమ్మావు కనుక అతని బావిలో నీ నీళ్లు ఉండటం న్యాయ సమ్మతం కాదు, నీ నీళ్లు అన్నిటినీ తీసుకెళ్లి మరెక్కడైనా దాచుకో లేదా నీళ బావిలో ఉంచినందుకు, రామయ్యకు అద్దెచెల్లించు అని తీర్పు ఇచ్చాడు. అందరూ వర్తకుడి మోసపు బుద్ధికి మంచి గుణపాఠం నేర్పాడని ధర్మారాయుడిని పొగిడారు.


దారి కనుక్కోండి



ఎన్ని సింహాలు ఉన్నాయి?



10 తేడాలు గుర్తించండి!



సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 341

		3			4		1	
8								
	4		8			7		2
				3	2			6
	3	2		7		4	8	
4			1	5				
2		4			9		3	
								4
	8		7			1		

సుడోకు - 340 సమాధానం

7	2	8	4	9	5	1	6	3
9	3	1	8	6	7	5	4	2
5	6	4	3	1	2	7	9	8
4	9	5	2	3	6	8	7	1
6	7	2	1	8	4	9	3	5
1	8	3	5	7	9	6	2	4
8	5	6	9	4	3	2	1	7
2	4	9	7	5	1	3	8	6
3	1	7	6	2	8	4	5	9

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

50వ జీ-7 సమావేశం

ఆహ్వానిత దేశంగా భారత్

(నిన్నటి దిక్సూచి తరువాయి)

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

జీ-7 విశిష్టత

- జీ-7 దేశాలన్నీ పారిశ్రామికంగా, ఆర్థికంగా, శాస్త్ర సాంకేతికపరంగా ప్రపంచంలోనే అభివృద్ధి చెందిన దేశాలుగా ఉన్నాయి.
- అంతేకాక ఇవి ప్రపంచంలోనే అత్యధిక బంగారం నిల్వలు, అణుశక్తి ఉత్పత్తి కలిగిన దేశాలు. అధిక ఎగుమతులు కలిగిన దేశాలు.
- ఐక్యరాజ్య సమితికి నిధుల వితరణపరంగా శక్తిమంతమైన దేశాలు.
- ప్రపంచ జనాభాలో పదిశాతం మాత్రమే కలిగి ప్రపంచ నికర సంపదలో మాత్రం 60 శాతం మూటగట్టుకున్న ధనిక దేశాలు.

జీ-7 లక్ష్యం: ప్రాథమికంగా జీ-7 లక్ష్యం ఆర్థిక, రాజకీయపరమైన అంతర్జాతీయ అంశాలపరంగా సభ్యదేశాలకు సంబంధించి ఉమ్మడి వ్యూహాలను రచించడమే అయినప్పటికీ కాలక్రమంలో ఈ లక్ష్యాల పరిధి విస్తరించి అంతర్జాతీయ ఆర్థిక స్థిరత్వం, ప్రపంచ భద్రత, శక్తి/ఇంధన వనరుల సంబంధిత అంశాలు, పర్యావరణం, సామాజిక భద్రత వంటి అనేక కీలక అంశాలకు స్థానం లభిస్తోంది.

జీ-7 భారతదేశం: కొంతకాలంగా వరుసగా ఈ సమావేశాలకు ఆహ్వానాన్ని అందుకుంటున్న భారత్ జీ-7 యవనికపై తన ముద్రను వేస్తూనే ఉంది. కొవిడ్ మహమ్మారి విజృంభణను అరికట్టేందుకు భారత్ జీ-7 47వ సమావేశంలో 'వన్ ఎర్త్, వన్ హెల్త్' అనే నినాదంతో 'సమష్టి కృషి' ఆవశ్యకతను చాటిచెప్పింది. కొవిడ్ టీకా పరిశోధనల్లో, ముడి పదార్థాల అందుబాటులో దేశాల మధ్య సహకారాన్ని పెంచేందుకు కృషిచేసింది. అదేవిధంగా టీకాల అందుబాటు పెంచేందుకు అడ్డంకిగా ఉన్న ట్రిప్స్ నిబంధనలను తొలగించాలని డబ్ల్యూటీఓ(ప్రపంచ వాణిజ్య సంస్థ)లో దక్షిణాఫ్రికాతో కలిసి దాఖలు చేసిన విజ్ఞప్తిని జీ-7 దేశాల మద్దతుకు కృషి చేసింది. అదేవిధంగా 2023లో జపాన్‌లోని హిరోషిమాలో జరిగిన గత సదస్సులో ప్రధాని మోదీ మూడు ప్లీనరీ సమావేశాల్లో పాల్గొని ప్రపంచశాంతి, వాతావరణ మార్పుల నిరోధం, ఇతరత్రా బహుముఖ సంక్షోభాలపరంగా భారతవాణిని వినిపించారు. ఈ సమావేశంలో భారత్ కొన్ని అంతర్జాతీయ చొరవలకు మార్గదర్శనం చేసింది. భారత్ ప్రతిపాదించిన లైఫ్ స్టయిల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్, ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ మిల్లెట్స్, మిల్లెట్స్ అండ్ అదర్ ఏన్షియంట్ గ్రైన్స్ ఇంటర్నేషనల్ రీసెర్చ్ ఇనీషియేటివ్ వంటి చొరవలు 'హిరోషిమా యాక్షన్ ప్లాన్ ఫర్ రిసైలియంట్ గ్లోబల్ ఫుడ్ సెక్యూరిటీ'లో గుర్తించారు.

జీ-7 భారత్ మధ్య పరస్పర అవసరాలు

- భారతదేశం ప్రస్తుతం ప్రపంచంలోనే అయిదో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా అవతరించింది. జీ-7లోని సగం దేశాలకు పైగా(కెనడా, ఇటలీ, జర్మనీ, ఫ్రాన్స్‌ల కన్నా కూడా) పెద్ద ఆర్థికవ్యవస్థ అయినందున జీ-7, భారత్ మధ్య సంబంధం పరస్పర లాభదాయకంగానే ఉంటుంది.
- ప్రస్తుతం ప్రాధాన్యం పొందుతున్న హిందూ-పసిఫిక్ ప్రాంత భౌగోళిక రాజకీయాల్లో గ్లోబల్ సౌత్‌కు ప్రాతినిధ్యం వహించే భారత్ భాగస్వామ్యం వ్యూహాత్మకంగా చాలా కీలకం. హిందూ-పసిఫిక్ ప్రాంతంలో విస్తరిస్తున్న చైనా ఆధిపత్యాన్ని నిలువరించడానికి జీ-7 కూటమికి భారత్ అవసరం ఉండగా, చైనాను దీటుగా ఎదుర్కోడానికి బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్‌కు ప్రత్యామ్నాయాలు తీసుకువచ్చేందుకు కృషిచేస్తున్న జీ-7 మద్దతు భారత్‌కు అంతే అవసరం ఉంది.
- శాస్త్ర సాంకేతికరంగాల్లో, క్లీన్ ఎనర్జీ/పునరుత్పాదక శక్తిరంగం, డిజిటల్ టెక్నాలజీ వంటి రంగాల్లో ముందు వరుసలో ఉన్న జీ-7 దేశాలకు మద్దతు భారత్‌కు అవసరం. అదేవిధంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న భారతదేశం అత్యధిక జనాభాతో కూడిన అతిపెద్ద మార్కెట్‌ను జీ-7 దేశాలకు అందిస్తోంది.
- ప్రపంచ శాంతి సామరస్యాలు కాపాడటానికి, వాతావరణ మార్పుల కట్టడి చర్యలకు, ఆర్థిక నేరాలు, ఉగ్రవాదం, సముద్ర మార్గాల రక్షణ వంటి అనేక ఉమ్మడి సమస్యలపై పోరాడటానికి అభివృద్ధి చెందిన జీ-7 దేశాల కూటమికి, అభివృద్ధి చెందుతున్న గ్లోబల్ సౌత్ దేశాల ప్రతినిధిగా భారత్‌కు మధ్య సమన్వయానికి దోహదపడుతుంది.
- జీ-7 సమావేశాల నేపథ్యంలో జరిగే వివిధ దేశాలతో భారత్ ద్వైపాక్షిక సమావేశాలు భారత్‌కు పలు దేశాలకు మధ్య వాణిజ్య, రక్షణ, దౌత్య సంబంధాలను బలపర్చడానికి ఒక చక్కని అవకాశం.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

భారత వాయుసేనలో

అగ్నివీరులు

భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వశాఖకు చెందిన భారత వాయుసేన అగ్నిపథ్ స్కీంలో భాగంగా అగ్నివీర్ వాయు నియామకాలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదలైంది.

పోస్టు: ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ - అగ్నివీర్ వాయు

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో మేథమెటిక్స్ ఫిజిక్స్, ఇంగ్లీష్ సబ్జెక్టులతో ఇంటర్మీడియట్(10+2)/ఇంటర్మీడియట్ (సైన్స్ కాని ఇతర సబ్జెక్టులు) లేదా మూడేళ్ల ఇంజనీరింగ్ డిప్లొమా(మెకానికల్/ఎలక్ట్రికల్/ ఎలక్ట్రానిక్స్/ ఆటోమొబైల్/ కంప్యూటర్ సైన్స్/ఇన్‌స్ట్రుమెంటేషన్ టెక్నాలజీ/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) తత్సమాన ఉత్తీర్ణత. నిర్దిష్ట శారీరక దారుఢ్య/వైద్య ప్రమాణాలు కలిగి ఉండాలి.



వయోపరిమితి: 2004 జూలై 3 నుంచి 2008 జనవరి 3 మధ్య జన్మించి ఉండాలి.

ఎత్తు: పురుషులు 152.5 సెం.మి.; మహిళలు 152 సెం.మీ. ఉండాలి.

ఎంపిక ప్రక్రియ: ఫేజ్-1(ఆన్‌లైన్ రాత పరీక్ష), ఫేజ్-2(ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, అడాప్టబిలిటీ టెస్ట్-1, అడాప్టబిలిటీ టెస్ట్-2), ఫేజ్-3(మెడికల్ ఫిట్‌నెస్ టెస్ట్), ధ్రువపత్రాల పరిశీలన తదితరాల ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి

పరీక్ష ఫీజు: రూ.550

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభం: జూలై 8

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: జూలై 28

ఆన్‌లైన్ పరీక్షలు ప్రారంభం: అక్టోబరు 18

వెబ్‌సైట్: https://agnipathvayu.cdac.in/AV/

జాబ్ కార్నర్

ఆర్ఎంఎల్‌హెచ్‌లో సీనియర్ రెసిడెంట్స్

న్యూఢిల్లీలోని అటల్ బిహారీ వాజ్‌పేయీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, డాక్టర్ రామ్ మనోహర్ లోహియా హాస్పిటల్.... రెగ్యులర్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 140

విభాగాలు: ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్, కార్డియాక్ అనస్థీషియా, ఎండోక్రైనాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, గ్యాస్ట్రోఎంటరాలజీ, ఓ అండ్ జీ, మెడిసిన్, మైక్రోబయాలజీ, నియోనాటాలజీ, ఆప్తాల్మాలజీ, ఆర్థోపెడిక్స్, పీడియాట్రిక్స్, పాథాలజీ, పీఎంఆర్, రేడియాలజీ, సర్జరీ, అనాటమీ, కమ్యూనిటీ మెడిసిన్, ఫిజియాలజీ, ఫార్మకాలజీ.

అర్హత: సంబంధిత విభాగాల్లో ఎంబీబీఎస్, పీజీ డిగ్రీ/డిప్లొమా/డీఎన్‌బీ ఉత్తీర్ణులై ఉండాలి.

జీతం: నెలకు రూ.67,700 - రూ.2,08,700

వయోపరిమితి: 45 ఏళ్లు మించకూడదు

ఎంపిక విధానం: స్ర్కీనింగ్ టెస్ట్/రాత పరీక్ష ఆధారంగా

దరఖాస్తు ఫీజు: రూ.800. ఎస్సీ/ఎస్టీ/ఈడబ్ల్యూఎస్/దివ్యాంగ అభ్యర్థులకు ఫీజు నుంచి మినహాయింపు ఉంటుంది.

దరఖాస్తు: ఆఫ్‌లైన్ దరఖాస్తులను సెంట్రల్ డైరీ డిస్పాచ్ సెక్షన్, గేట్ నెం.3 దగ్గర, ఏబీవీఐఎంఎస్ అండ్ డాక్టర్ రామ్ మనోహర్ లోహియా హాస్పిటల్, న్యూఢిల్లీ చిరునామాకు పంపాలి.

దరఖాస్తుకు చివరి తేదీ: జూన్ 29

రాత పరీక్ష తేదీ: జూలై 28

వెబ్‌సైట్: https://rmlh.nic.in/

ఎస్‌బీఐలో స్పెషలిస్ట్ పోస్టులు

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ), సెంట్రల్ రిక్రూట్‌మెంట్ అండ్ ప్రమోషన్ డిపార్ట్‌మెంట్, కార్పొరేట్ సెంటర్...రెగ్యులర్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం పోస్టుల సంఖ్య: 5

1. క్లయిమేట్ రిస్క్ స్పెషలిస్ట్(ఎంఎంజీఎస్-3)- మిడిల్ మేనేజ్‌మెంట్ గ్రేడ్-3: **2 పోస్టులు**
2. మార్కెట్ రిస్క్ స్పెషలిస్ట్(ఎంఎంజీఎస్-3)- మిడిల్ మేనేజ్‌మెంట్ గ్రేడ్-స్కేల్ 3: **3 పోస్టులు**

అర్హతలు: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో సీఏ/ఐసీడబ్ల్యూఏఐ, ఎంబీఏ(బ్యాంకింగ్/ఫైనాన్స్), పీజీ ఉత్తీర్ణతతోపాటు రెండు నుంచి మూడేళ్ల పని అనుభవం ఉండాలి.

పే స్కేల్: నెలకు రూ.63,840 - రూ.78,230

పోస్టింగ్ ప్రదేశం: ముంబయి

దరఖాస్తు రుసుము: రూ.750. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

ఎంపిక: అప్లికేషన్ షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూన్ 27

వెబ్‌సైట్: https://sbi.co.in/

ఏఈఈఎస్‌లో స్పెషల్ ఎడ్యుకేటర్ ఖాళీలు

దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న అటామిక్ ఎనర్జీ కేంద్రీయ విద్యాలయాలు/జూనియర్ కాలేజీల్లో ఉన్న టీచింగ్ ఖాళీల భర్తీకి ముంబయిలోని అటామిక్ ఎనర్జీ ఎడ్యుకేషన్ సొసైటీ దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 9

1. ప్రిన్సిపాల్: **6 పోస్టులు**
2. స్పెషల్ ఎడ్యుకేటర్: **3 పోస్టులు**

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగాల్లో కనీసం 50 శాతం మార్కులతో డిగ్రీ, బీఎడ్, డిప్లొమా, పీజీ, సర్టిఫికెట్ కోర్సు, సీటెట్ స్కోరు, ఇంగ్లీష్ మీడియంలో టీచింగ్ అనుభవం ఉండాలి.

వయోపరిమితి: ప్రిన్సిపాల్ పోస్టుకు 35 నుంచి 50 ఏళ్లు, స్పెషల్ ఎడ్యుకేటర్ పోస్టుకు 18 నుంచి 35 ఏళ్లు మించకూడదు

దరఖాస్తు ఫీజు: ప్రిన్సిపాల్, స్పెషల్ ఎడ్యుకేటర్ పోస్టుకు రూ.750. ఎస్సీ/ఎస్టీ/మహిళలు/దివ్యాంగులకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.

ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా

దరఖాస్తు: గూగుల్ ఫాం ద్వారా

దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 12

వెబ్‌సైట్: https://www.aees.gov.in/